'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 237

మంగళవారం 18-11-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మూడో స్థానంతో ముగింపు

చివరిరోజు రజతం గెలిచిన భారత షూటర్ గుర్‌ప్రీత్ సింగ్

12 లో

26,000 స్థాయిపైకి నిఫ్టీ

సెన్సెక్స్ 388 పాయింట్లు ప్లస్ సూచీలకు ఆరోరోజూ లాభాలే

13 లో

ఆత్మాహుతి బాంబర్ అరెస్ట్!

ఎర్రకోట వద్ద కారుబాంబుతో ఆత్మాహుతి దాడి ఉదంతంలో మరో కీలక ఉగ్రవాదిని ఎన్‌ఐఏ సోమవారం అరెస్ట్ చేసింది.

వివరాలు 6లో ▶



50 శాతానికి మించొద్దు

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల మొత్తం 50 శాతానికి మించి ఉండరాదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

వివరాలు 6లో ▶

సీఎంగా పదోసారి ప్రమాణం

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రికార్డు స్థాయిలో పదోసారి సీఎంగా ఈ నెల 20న ప్రమాణం చేయబోతున్నారు.

వివరాలు 6లో ▶



25న అయోధ్యలో ధ్వజారోహణం

అయోధ్య రామాలయంలో ఈ నెల 25వ తేదీన చేపట్టే ధ్వజా రోహణ కార్యక్రమానికి భారీగా ఏర్పాట్లు సాగుతున్నాయి.

వివరాలు 6లో ▶

సౌదీలో మృత్యు ఘోష

43 మంది హైదరాబాదీ ఉమ్రా యాత్రికుల సజీవ దహనం

మరో ఇద్దరు కర్ణాటక వాసులు మృత్యువాత

బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం

మక్కాను సందర్శించుకుని మదీనా వెళ్తుండగా దుర్ఘటన

మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది

ఈ నెల 9న నగరం నుంచి వెళ్లిన 54 మంది

బస్సులో మక్కాకు బయలుదేరిన 46 మంది.. ఒక్కరు మినహా మిగతా వారంతా మృత్యువాత..

ఘోర ప్రమాదంతో హైదరాబాద్‌లో విషాదం

ప్రధాని మోదీ, ఉప రాష్ట్రపతి, తెలంగాణ సీఎం రేవంత్, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ తదితర ప్రముఖుల సంతాపం

తెలంగాణ సచివాలయంలో 79979 59754, 99129 19545 టోల్ ఫ్రీ నంబర్లతో కంట్రోల్ రూమ్

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం

జెడ్డాలో, ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోనూ కంట్రోల్ రూమ్‌లు

2 లో

బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న మంటలు

'అన్నదాతా'.. మళ్లీ కోత!

తొలి ఏడాది రూ.10,716 కోట్ల పెట్టుబడి సాయానికి బాబు సర్కారు ఎగనామం

- రైతన్నలకు రెండేళ్లలో ఇవ్వాల్సింది రూ.21,432 కోట్లు.. ఇస్తున్నది రూ.6,309 కోట్లే
- ఇప్పుడు రెండో విడతలో 46.85 లక్షల మందికే 'సుఖీభవ'
- దాదాపు ఏడు లక్షల మంది భూ యజమానుల ఏరివేత
- కౌలు రైతులకు రెండో విడతలోనూ మొండిచెయ్యే
- 'పీఎం కిసాన్' కాకుండా.. తాము సొంతంగానే ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేల చొప్పున ఇస్తామన్న చంద్రబాబు

- అదునుకు పెట్టుబడి సాయం అందక అన్నదాతల హాహాకారాలు
- వైఎస్ జగన్ హయాంలో ఏటా సీజన్‌కు ముందే తొలివిడత పెట్టుబడి సాయం
- 'వైఎస్సార్ రైతు భరోసా'తో ఐదేళ్లలో రూ.34,288.17 కోట్ల మేర రైతన్నలకు లబ్ధి

సాక్షి, అమరావతి: అన్నదాతా సుఖీభవ పథకం కింద తొలి ఏడాది రూ.10,716 కోట్ల పెట్టుబడి సాయానికి ఎగనామం పెట్టిన చంద్రబాబు సర్కారు.. ఇప్పుడు రెండో విడతలోనూ మరో సారి రైతన్నలను వంచించేందుకు సిద్ధమైంది! ఓవైపు భూ యజమానులకు అడ్డగోలుగా కోతలు పెడుతూ మరోవైపు కౌలు రైతులకు మొండిచెయ్యి చూపుతోంది. సూపర్ సిక్స్ హామీ మేరకు ఈ పథకం కింద పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా, ఏటా ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు నమ్మబలికారు. ఆ లెక్కన అర్హులైన 53.58 లక్షల మందికి రూ.10,716 కోట్లు ఇవ్వాల్సి ఉండగా తొలి ఏడాది నిస్సిగ్గుగా

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ప్రపంచస్థాయికి సత్యసాయి శత జయంతి ఉత్సవాలు

భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ప్రపంచ స్థాయికి వెళ్లడం గర్వంగా ఉందని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు తెలిపారు. మంగళవారం సత్యసాయి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

వివరాలు 5లో ▶

చిత్తూరు కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

తమ పొలానికి దారి ఇవ్వడంలేదని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని చిత్తూరు కలెక్టరేట్‌లో సోమవారం ఒక మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు అడ్డుకోవడంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది.

వివరాలు 10లో ▶

బాలికపై ఇద్దరు లైంగిక దాడి

తిరుపతి జిల్లాలో బాలిక (12)పై ఇద్దరు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితులైన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు.

వివరాలు 14లో ▶

అనురాధ చాకలికి జాతీయ గోపాల రత్న అవార్డు

పశువులు, పాడి పరిశ్రమ రంగంలో అందించిన ఉత్తమ సేవలకుగాను నంద్యాలకు చెందిన అనురాధ చాకలికి 'జాతీయ గోపాల రత్న' అవార్డు దక్కింది. ఈ అవార్డును ఆమె ఈ నెల 26న ఢిల్లీలో అందుకోనున్నారు.

వివరాలు 5లో ▶

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹84

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 115 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో 206 కిలో

రిటైల్ లైవ్ బర్డ్ 142 కిలో | స్కిన్ లెస్ 234 కిలో

Conditions Apply

వినియోగదారులు శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

కొనలేం.. తినలేం

కొండెక్కిన కూరగాయల ధరలు

సామాన్య, మధ్యతరగతి ప్రజలు విలవిల

ధరలు పెరిగిపోతున్నా పట్టించుకోని పాలకులు

వంకాయలు కిలో రూ.80 నుంచి రూ.100

చిక్కుడు కాయలు రూ.100 నుంచి రూ.160

3 లో

దొండ, బెండకాయలు రూ.70 నుంచి రూ.80

టమాటా రూ.60 నుంచి రూ.70

ఒక్కో మునక్కాయ రూ.20

కూరగాయల ధరలు కొండెక్కాయి. కార్తీక మాసం చివరికి వచ్చినా ధరల మోత తగ్గలేదు. మొంథా తుపాను సాకుతో రైతుబజార్లతో పాటు బహిరంగ మార్కెట్‌లోనూ రేట్లు భారీగా పెంచేశారు. దళారులు ఆడిందే ఆట.. నిర్ణయించిందే రేటుగా సాగుతోంది. కార్తీక మాసం ఆరంభానికి ముందు రైతు బజారులో కిలో కూరగాయలు రూ.20 నుంచి రూ.30కి లభించేవి. మార్కెట్‌లోనూ రూ.40 నుంచి రూ.50కి దొరికేవి. ప్రస్తుతం రైతుబజారులో కూడా ధరలు భారీగా పెరిగిపోయాయి. బయటి మార్కెట్‌లో డబుల్ చేశారు. వీటి ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందనంత ఎత్తులో ఉన్నాయి.



బాబు మాటలు.. ఆరని మంటలు

- విశాఖ ఉక్కు ఉద్యోగులపై వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాల్సిందే
- నిప్పులు చెరిగిన స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాలు
- దమ్ముంటే ప్లాంట్‌పై చర్చకు రావాలంటూ చంద్రబాబుకు సవాల్
- మిట్టల్ కోసం మాట్లాడతారు కానీ, మా కోసం గొంతువిప్పరా?
- ఇదేనా ఆంధ్రుల హక్కుపై మీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి??
- తక్షణమే చంద్రబాబు మాటలు, సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలి.. ఉక్కు పరిశ్రమ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఆందోళన

10 లో

షేక్ హసీనాకు మరణశిక్ష

తీర్పు వెలువరించిన బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్

మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌కూ మరణశిక్ష

విద్యార్థిసంఘాల ఉద్యమాన్ని అణిచివేసి వందల మందిని చంపేశారని ఆరోపణ

మాజీ ఐజీ చౌదరి అబ్దుల్లా అల్‌మమూన్‌కు ఐదేళ్ల శిక్ష

తీర్పును రాజకీయ కుట్రగా అభివర్ణించిన పదవీచ్యుత ప్రధాని

బంగ్లాదేశ్ విమోచన పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర్యసమరయోధుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కేటాయింపుతో మొదలైన విద్యార్థుల ఉద్యమం చివరకు పదవీచ్యుత మహిళా ప్రధాని షేక్ హసీనాకు అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ మరణశిక్ష విధింపునకు దారి తీసింది. 2024 జూలై 15న విద్యార్థుల సారథ్యంలో ఉవ్వెత్తున ఎగసిన ఆందోళనలను ఉక్కుపాదంతో అణచివేసి 1,400 మంది మరణాలకు హసీనా కారణమయ్యారంటూ దాఖలైన కేసులో ఆమెకు మరణశిక్ష విధిస్తూ ట్రిబ్యునల్ సంచలన తీర్పు వెలువరించింది. ఈ మేరకు సోమవారం జస్టిస్ మొహమ్మద్ గులామ్ మోర్తుజా మజుందార్ సారథ్యంలోని ముగ్గురు సభ్యుల ప్రత్యేక ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది.

వివరాలు 6లో

పార్కు స్థలంలో పాగా

రూ.5 కోట్ల విలువైన స్థలంపై అధికార పార్టీ నేతల కన్ను

నాగలకట్ట, రావిచెట్టు, వేపచెట్టును తొలగించిన దృశ్యాలు

గత వైఎస్సార్‌సీపీ హయాంలో పారని వీరి పాచిక

- సర్కారు మారడంతో చెలరేగిపోతున్న కబ్జాదారులు
- జేసీబీతో 44 సెంట్ల స్థలం చదును..
- రాప్తాడు నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుడి అండ
- దురాక్రమణను అడ్డుకుంటున్న స్థానికులు, మాజీ ప్రజాప్రతినిధులు
- ఆక్రమణదారుపై ఫిర్యాదు నమోదుకు పోలీసుల వెనకడుగు
- ముఖ్యమైన వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో సైలెంట్
- మరోవైపు ఈ జాగా విక్రయానికి అక్రమార్కుల బేరం

14 లో

ప్రత్యక్షంగా పైరసీ.. పరోక్షంగా బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్

రెండు రకాలుగా దందా చేసిన 'ఐ బొమ్మ'రవి

విలేకరులతో మాట్లాడుతున్న చిరంజీవి. చిత్రంలో రాజమౌళి, సజ్జనార్, దిల్‌రాజు, నాగార్జున

అతడి హార్డ్‌డిస్క్‌ల్లో 21 వేలకు పైగా చిత్రాలు

1972 నాటి గాడ్‌ఫాదర్ నుంచి ఓజీ వరకు...

వెబ్‌సైట్స్ హోస్టింగ్ కోసం 110 డొమైన్స్ ఖరీదు

ఐదు దేశాల నుంచి సాగిన కార్యకలాపాలు

విదేశాల్లో ఉన్న భాగస్వాముల వివరాల కోసం ఆరా

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడి

14 లో

తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు 'షాక్'

ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోకపోవడంపై సీజేఐ ఆగ్రహం



- న్యూ ఇయర్ ఎక్కడ జరుపుకుంటారో మీ ఇష్టం!
- నిర్ణయం తీసుకుంటారా? ధిక్కరణ చర్యలు ఎదుర్కొంటారా? అని మండిపాటు
- ఈ అంశంలో రాజ్యాంగ రక్షణ స్పీకర్‌కు వర్తించదని స్పష్టీకరణ
- వచ్చే వారంలోగా అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలి
- స్పీకర్‌కు సుప్రీంకోర్టు అల్టిమేటం జారీ
- నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలని నోటీసులు

3లో

సౌదీలో మృత్యు ఘోష

బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం.. 45 మంది సజీవ దహనం

మృతుల్లో 43 మంది హైదరాబాదీలే... ఇద్దరిది కర్ణాటక

మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది

ఉమ్రా యాత్ర సందర్భంగా ఎయిర్‌పోర్ట్‌లో ఒకే కుటుంబంలోని 18 మంది గ్రూప్ ఫొటో

సాక్షి నెట్‌వర్క్/ న్యూఢిల్లీ / సాక్షి, న్యూఢిల్లీ: సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మక్కా, మదీనా సందర్శించుకోవాలనే తమ చిరకాల వాంఛను తీర్చుకునేందుకు హైదరాబాద్ నుంచి వెళ్లిన 45 మంది ఉమ్రా యాత్రికులు దుర్మరణం పాలయ్యారు. వీరిలో 43 మంది హైదరాబాద్ నగరానికే చెందిన వారు కాగా, ఇద్దరు కర్ణాటక వాసులు అని తెలిసింది. వారు ప్రయాణిస్తున్న బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టగా మంటలు చెలరేగడంతో అంతా సజీవ దహనమయ్యారు. మక్కా నుంచి మదీనా వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున మదీనాకు సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. ఉదయాన్నే అందిన పిడుగుపాటు లాంటి వార్త హైదరాబాద్ వాసుల్ని కలచివేసింది. ఈ ప్రమాదంలో తల్లిదండ్రులు, వారి కుమారులు, కుమార్తెలు, వారి పిల్లలు సహా ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. మొత్తం 46 మంది బస్సులో ప్రయాణిస్తుండగా, ఒక్కరు మాత్రం ఈ ప్రమాదం నుంచి బయటపడినట్లు సమాచారం. మరణించిన నగర వాసుల్లో 17 మంది పురుషులు, 26 మంది మహిళలు, వీరిలో 10 మంది చిన్నారులు ఉన్నారు. వీరి మృతదేహాలను జెడ్డాలోని కింగ్ ఫహద్, కింగ్ సల్మాన్, అల్ మిఖత్ ఆస్పత్రులకు తరలించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. జెడ్డాలోని భారత రాయబార కార్యాలయ అధికారులు అక్కడి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మృతదేహాలను మదీనాలోనే స్థానిక సంప్రదాయాల ప్రకారం ఖననం చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారు. కాగా, ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, హైదరాబాద్ సమీపంలోని చేవెళ్ల వద్ద జరిగిన రెండు ఘోర బస్సు ప్రమాదాలను మరిచిపోక ముందే మరో దుర్ఘటన జరగడం, ఏకంగా 44 మంది హైదరాబాదీలు మరణించడం నగరాన్ని కుదిపేసింది.

మొత్తం 54 మంది యాత్రికులు

ఉమ్రా యాత్ర కోసం నగరంలోని వివిధ ట్రావెల్ ఏజెన్సీల నుంచి మొత్తం 54 మంది ఈ నెల 9న బయలుదేరి వెళ్లారు. మక్కా సందర్శన అనంతరం నలుగురు అక్కడే ఆగిపోగా.. మరో నలుగురు కారులో మదీనాకు వెళ్లారు. మిగిలిన 46 మంది బస్సులో మదీనా వెళ్తుండగా గమ్య స్థానానికి 25 కి.మీ. దూరంలో, భారత కాలమానం ప్రకారం ఉదయం 1.30 గంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. బస్సు రోడ్డు పక్కన ఆగి ఉండగా, ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో పేలుడు సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. అయితే ప్రమాదానికి కారణాలను సౌదీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. జెడ్డాలో ఉన్న భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. 8002440003 (టోల్ ఫ్రీ), 00966122614093, 00966126614276, 00966556122301 (వాట్సాప్) హెల్ప్ లైన్ నంబర్లను ప్రకటించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జెడ్డా నుంచి అధికారుల బృందం ఘటనా స్థలికి, ఆస్పత్రులకు వెళ్లినట్లు అక్కడి కార్యాలయ వర్గాలు తెలిపాయి. రియాద్‌లోని ఎంబసీ కార్యాలయం కూడా సౌదీ అధికారులతో కలిసి పని చేస్తోంది. సౌదీ ప్రమాదం నేపథ్యంలో న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కూడా అధికారులు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. (కాంటాక్ట్ నంబర్లు.. వందన, పీఎస్ టు రెసిడెంట్ కమిషనర్, లైజన్ హెడ్–+91 98719 99044, సీహెచ్.చక్రవర్తి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్–+91 99583 22143, రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్–+91 96437 23157). ఇలావుండగా షెడ్యూల్ ప్రకారం యాత్రికుల బృందం ఈ నెల 23న జెడ్డా నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాల్సి ఉంది. ఈ మేరకు వీరికి విమాన టికెట్లు సైతం బుక్ అయ్యాయి.


సౌదీ ప్రమాదంలో బతికి బయటపడింది ఇతను ఒక్కడే.. ప్రయాణంలో డ్రైవర్ పక్కన కూర్చున్న అబ్దుల్ షోయబ్

ప్రధాని మోదీ సంతాపం

ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. 'నేను తీవ్ర విచారంలో మునిగిపోయా. నా ఆలోచనలన్నీ ఆప్తుల్ని కోల్పోయిన వారి చుట్టూనే ఉన్నాయి. జెడ్డాలోని మన కాన్సులేట్, రియాద్‌లోని ఎంబసీ అవసరమైన సహాయ కార్యక్రమాలన్నీ చేపడుతున్నాయి. ఇక్కడి మన అధికారులు కూడా సౌదీ అధికారులతో కలిసి పని చేస్తున్నారు..' అంటూ మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రష్యా పర్యటనలో ఉన్న కేంద్రమంత్రి జైశంకర్ ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సౌదీ ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం తెలిపారు.

రూ.5లక్షలు చొప్పన పరిహారం

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ నేతృత్వంలో ఎంఐఎం ఎమ్మెల్యే, మైనారిటీ శాఖ అధికారితో కూడిన ప్రతినిధి బృందం తక్షణమే సౌదీ అరేబియాకు బయలుదేరి వెళ్లనుంది. మృతులకు అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని, వారి కుటుంబాల నుంచి ఇద్దరిని అక్కడికి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎస్ ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్‌తో మాట్లాడి తగిన ఆదేశాలిచ్చారు. రాష్ట్ర సచివాలయంలో 79979 59754, 99129 19545 టోల్ ఫ్రీ నంబర్లతో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రమాదానికి సంబంధించిన సహాయ సహకారాల కోసం పోలీసు విభాగం తరఫున సంయుక్త పోలీసు కమిషనర్ (శాంతిభద్రతలు) తఫ్సీర్ ఇక్బాల్ పని చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు.

సౌదీ ప్రమాదంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: సౌదీ అరేబియాలో జరిగిన ప్రమాదంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో బాధితులకు అందరూ అండగా నిలవాలని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఎప్పుడూ ప్రమాదకరమే..

సౌదీ అరేబియాలోని పవిత్ర స్థలాల నుంచి యాత్రికుల తరలింపు కొన్నిసార్లు ప్రమాదకరంగా మారుతోంది. ముఖ్యంగా హజ్ యాత్ర సమయంలో రోడ్లన్నీ బస్సులతో కిటకిటలాడుతుంటాయి. ట్రాఫిక్ జామ్‌లు ఎక్కువగా ఉంటాయి. 2023లో మక్కా నుంచి వెళ్తున్న ఓ బస్సు బ్రిడ్జిని ఢీకొట్టి మంటల్లో చిక్కుకోవడంతో 20 మంది మృత్యువాత పడ్డారు. సుమారు 25 మంది గాయపడ్డారు. 2019లో ఓ బస్సు మరో భారీ వాహనాన్ని ఢీకొట్టడంతో 35 మంది చనిపోయారు.

మృతులు వీరే..

1. మరియం ఫాతిమా, విద్యానగర్
2. సారా బేగం, కాలాపత్తర్
3. షహనాజ్ బేగం, కార్వాన్
4. షౌకత్‌బేగం కిషన్‌నగర్, జిర్రా
5. మహ్మద్ మౌలానా, నటరాజ్‌నగర్, జిర్రా
6. సారా మహమూద్ అల్ అమోదీ, మురాద్‌నగర్
7. షాజహాన్‌బేగం, మురాద్‌నగర్
8. సలావుద్దీన్ షేక్, రాంనగర్, ముషీరాబాద్
9. మస్తాన్ మహ్మద్, ఫరూఖ్‌నగర్, ఫలక్‌నుమా
10. జకియా బేగం, ఫరూఖ్‌నగర్, ఫలక్‌నుమా
11. మహ్మద్ అలీ, జిర్రా
12. రహీమున్నీసా, పద్మావతినగర్, బోరబండ
13. గౌసియాబేగం, నటరాజ్‌నగర్, జిర్రా
14. అక్తర్ బేగం, విద్యానగర్
15. నసీరుద్దీన్ షేక్, విద్యానగర్
16. అబ్దుల్ ఖదీర్ మహమూద్, నటరాజ్‌నగర్, జిర్రా
17. ఉమేరా నాజ్‌నీన్, మొఘల్‌నగర్, లంగర్‌హౌస్
18. సబీహా సుల్తానా, మొఘల్‌నగర్, లంగర్‌హౌస్
19. మహ్మద్ షోయెబుర్ రహ్మాన్, మీరాజ్ కాలనీ, టోలిచౌకి
20. రయిస్ బేగం, మీరాజ్‌కాలనీ, టోలిచౌకి
21. ఉమేజా ఫాతిమా, నల్లకుంట, విద్యానగర్
22. సనా సుల్తానా, విద్యానగర్, నల్లకుంట
23. ఉజైరుద్దీన్ షేక్, విద్యానగర్, నల్లకుంట
24. మెహ్రీస్ ఫాతిమా, విద్యానగర్, నల్లకుంట
25. రిజ్వానాబేగం, విద్యానగర్, నల్లకుంట
26. ఇర్ఫాన్ అహ్మద్, మొఘల్‌నగర్, లంగర్‌హౌస్
27. పర్వీన్‌బేగం,చింతల్‌మెట్, సులేమాన్‌నగర్
28. సొహైల్ మహ్మద్, ఫాతిమానగర్, ఫలక్‌నుమా
29. షేక్ జైనుద్దీన్, విద్యానగర్, నల్లకుంట
30. ఫర్హానా సుల్తానా, విద్యానగర్, నల్లకుంట
31. రిదా తజీన్, విద్యానగర్, నల్లకుంట
32. ఫర్హీన్ బేగం, కిషన్‌నగర్, ఆసిఫ్‌నగర్
33. తస్మియా టెహ్రీ, విద్యానగర్, నల్లకుంట
34. మహ్మద్ మంజూర్, కిషన్‌నగర్, ఆసిఫ్‌నగర్
35. మహ్మద్ షాజయిన్ అహ్మద్, విద్యానగర్
36. ఇజాన్ అహ్మద్, మొఘల్‌నగర్, లంగర్‌హౌస్
37. అమ్దాన్ అహ్మద్, మొఘల్‌నగర్, లంగర్‌హౌస్
38. హుజేఫా జఫర్ సయ్యద్, నారాయణగూడ
39. జహీన్‌బేగం, కిషన్‌నగర్, ఆసిఫ్‌నగర్
40. షబానాబేగం, హిమాయత్‌నగర్
41. అనీస్ ఫాతిమా, మూసారాంబాగ్
42. అమీనాబేగం, మూసారాంబాగ్
43. సలీంఖాన్, మిస్రీగంజ్
44. హుబ్లీకి చెందిన షరాహతీ అబ్దుల్ ఘనీ అహ్మద్ సాహెబ్ (దుబాయ్‌లో డ్రైవర్)
45. బీదర్‌కు చెందిన రహ్మాదాబీ

సౌదీ ప్రమాదంపై సీఎం చంద్రబాబు విచారం

సాక్షి, అమరావతి: సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉమ్రా యాత్రకు వెళ్లిన వారు మరణించడం విచారకరమన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలన్నారు. వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

45 మంది మృతి బాధాకరం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది భారతీయులు దుర్మరణం చెందడం బాధాకరమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'మృతిచెందిన వారిలో అత్యధిక మంది హైదరాబాద్‌కు చెందిన ముస్లిం యాత్రికులు ఉన్నట్లు తెలిసింది. వారి మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు.

దిగ్భ్రాంతికి గురి చేసింది

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భారతీయ కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఉమ్రా యాత్రలో దుర్ఘటన దురదృష్టకరం

రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్

సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాద దుర్ఘటనపై రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఉమ్రా యాత్రలో భాగంగా సౌది అరేబియాలోని అల్ ముఫ్రిహాత్ ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీ కొట్టడంతో బస్సులోని 45 మంది దుర్మరణం చెందడం బాధాకరమన్నారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబాలకు మనోస్థైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, సౌదీ అరేబియా ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబసభ్యులకు ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అదేవిధంగా సౌదీ అరేబియాలో జరిగిన ప్రమాదంలో 45 మంది మృతి చెందడం బాధాకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

ఎకరాకు రూ.40వేల పరిహారం ఇవ్వాలి

నీటిపారుదల శాఖ మంత్రికి ఏపీ రైతు సంఘం నేతల వినతి

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలో దాదాపు 10 గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల పంట భూములు బ్రహ్మ సాగర్ జలాశయం నీటితో ముంపునకు గురై దెబ్బతింటున్నాయని, బాధిత రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. అధికారుల ముందుచూపులేని చర్యల వలన వరి, మొక్కజొన్న, సజ్జ, కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40వేల మేర పెట్టుబడులు కోల్పోయారని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును సోమవారం రైతు సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ బద్వేల్‌తోపాటు దిగువనున్న చెరువులకు నీళ్లు ఇచ్చేందుకు తెలుగుగంగ అధికారులు పోరుమామిళ్ల చెరువులో సామర్థ్యానికి మించి నీరు నిల్వ చేశారని, దీనివల్ల వందలాది ఎకరాల రైతుల పట్టా భూములు మునిగిపోతున్నాయన్నారు. ఈ ఏడాది పంటలు కోల్పోయిన రైతులకు తక్షణ సహాయంగా ఎకరాకు రూ.40 వేల నష్టపరిహారం ఇవ్వాలని మంత్రికి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు.

మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మొక్కజొన్న, ధాన్యం సేకరణకు తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. నిల్వ ఉన్న శనగలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరింది. మద్దతు ధర దక్కక గగ్గోలు పెడుతున్న పత్తి, మొక్కజొన్న, ధాన్యం, శనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది.

'అన్నదాతా'.. మళ్లీ కోత!

▶ మొదటి పేజీ తరువాయి

ఎగ్గొట్టారు. 2024–25 తొలి బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.1,000 కోట్లు విదిల్చిన చంద్రబాబు ప్రభుత్వం పైసా కూడా ఖర్చు చేయలేదు. సామాజిక వర్గాలకు అతీతంగా భూ యజమానులతో పాటు కౌలు రైతులకూ రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామన్న హామీని చంద్రబాబు అటకెక్కించారు. బకాయిలతో కలిపి అన్నదాతా సుఖీభవకు ఈ ఏడాది రూ.21,432 కోట్లు జమ చేయాలి. కానీ 2025–26 బడ్జెట్‌లో ఆ మేరకు నిధులు ఇవ్వకుండా కేవలం రూ.6,300 కోట్ల కేటాయింపులతో సరిపెట్టారు. 2024–25 ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన రెండు నెలల తర్వాత పీఎం కిసాన్‌తో ముడిపెట్టి తొలివిడత సాయం అంటూ మభ్యపుచ్చారు. వాస్తవానికి 53.58 లక్షల మందికి జమ చేయాల్సి ఉండగా, చివరికి 46.86 లక్షల మందికి సరిపెట్టారు. దాదాపు 7 లక్షల మందికి పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టారు. తొలి ఏడాది సీసీఆర్సీ కార్డులు పొందిన 9.25 లక్షల మంది కౌలు దారులకు సైతం మొండిచెయ్యి చూపారు.

రెండో విడతలోనూ కోతలే లక్ష్యంగా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా 2023–24 సీజన్‌లో 53.58 లక్షల మందికి వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని అందించింది. ఇలా ఐదేళ్లలో రూ.34,288.17 కోట్ల మేర లబ్ధి చేకూర్చింది. చంద్రబాబు ప్రభుత్వం ఆరు దశల వడపోతల అనంతరం అన్నదాతా సుఖీభవ తొలిదశ లబ్ధిదారులను 46.86 లక్షలకు కుదించింది. ఆధార్ రాంగ్ సీడింగ్, రికార్డులు సరిగా లేకపోవడం, ఎన్‌పీసీఐలో ఇన్ యాక్టివ్ ఖాతాలు అంటూ రకరకాల సాకులతో లక్షల మందిని సాయానికి దూరం చేసింది. చనిపోయిన రైతుల స్థానంలో అర్హులైన వారి వారసులను మ్యుటేషన్ ద్వారా గుర్తించి గత ప్రభుత్వంలో పెట్టుబడి సాయం అందించగా ఇప్పుడు చంద్రబాబు సర్కారు దీనికి మోకాలడ్డుతోంది. వాస్తవానికి ఏటా భూ యజమానులతో పాటు కౌలుదారుల సంఖ్య పెరుగుతూ వస్తుంది. గతంతో పోలిస్తే భూ యజమానుల సంఖ్య పెరగాల్సి ఉండగా, ఇప్పుడు రెండో విడతలో 46,85,838 మంది మాత్రమే అన్నదాతా సుఖీభవకు అర్హత పొందినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

కోతలే కోతలు..

తొలి విడతలో పీఎం కిసాన్ కింద రూ.831.51 కోట్లు, అన్నదాత సుఖీభవ కింద రూ.2,342.92 కోట్లు కలిపి రూ.3,174.43 కోట్లు జమ చేసినట్లు చంద్రబాబు ప్రభుత్వం పేర్కొంది. ఇప్పుడు రెండో విడతలో లబ్ధిదారులను కుదించడంతో ఆమేరకు పెట్టుబడి సాయంలో కోత పడింది. రెండో విడతలో 46.85 లక్షల మందికి రూ.3,135 కోట్లు మాత్రమే జమ చేయనుంది. ప్రభుత్వం ప్రతిదఫాలో సాయం అందించే మొత్తం పెరగాల్సింది పోయి కోతలు విధించడం పట్ల అన్నదాతల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కౌలు రైతులకు మళ్లీ నిరాశే..

సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులందరికీ అన్నదాతా సుఖీభవ సాయాన్ని అందిస్తామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. తీరా ఈ–క్రాప్ అంటూ మెలిక పెట్టారు. రాష్ట్రంలో 16 లక్షల మంది కౌలు రైతులుంటారని అంచనా. వారిలో సెంటు భూమి కూడా లేని సాగుదారులు 10 లక్షల మందికి పైనే ఉన్నారు. గతేడాది 9.25 లక్షల మందికి సీసీఆర్సీలు జారీ చేసినా పెట్టుబడి సాయం అందించిన పాపాన పోలేదు. ఈ ఏడాది 10 లక్షల మందికి సీసీఆర్సీ కార్డులు జారీ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 7.92 లక్షల మందికి కార్డులు జారీ చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది. చంద్రబాబు ప్రభుత్వం రెండేళ్లుగా కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఊసెత్తడం లేదు. తొలి ఏడాది సీసీఆర్సీ కార్డులు పొందిన వారిని పరిగణనలోకి తీసుకున్నా ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.1,850 కోట్లు జమ చేయాల్సి ఉండగా ఇవ్వకుండా ఎగ్గొట్టింది. ఇక ఈ ఏడాది ఇప్పటి వరకు సీసీఆర్సీలు పొందిన వారితోపాటు ఈ–క్రాప్‌లో నమోదైన వాస్తవ సాగుదారులను లెక్కలోకి తీసుకుంటే కనీసం 10 లక్షల మందికిపైగా కౌలుదారులకు రూ.రెండు వేల కోట్ల మేర పెట్టుబడి సాయాన్ని అందించాలి. కానీ, ఆ ఊసే లేదు. కౌలు రైతులకు రెండోసారి కూడా మొండిచెయ్యి చూపేందుకు సిద్ధమవడం పట్ల కౌలు రైతుల సంఘాలు మండిపడుతున్నాయి.

పత్తి రైతు 'ఫైర్'

పత్తిని పీకేసి నిప్పు పెట్టిన దృశ్యం(ఇన్‌సెట్) రైతు సురేష్‌బాబు

- పంట పీకేసి నిప్పుపెట్టి ఆగ్రహం
- మొంథా తుపానుకు దెబ్బతిన్నా ఆదుకోని సర్కారు
- నేనూ టీడీపీ మనిషినే
- 30 ఏళ్లుగా ఆ పార్టీ సభ్యత్వం ఉంది
- పరిహారంపై న్యాయంచేయని చంద్రబాబు సర్కారు
- తగలబడిపోతున్న పంటకు ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది
- నిగ్గదీసి అడిగిన కర్షకుడు

ప్రత్తిపాడు: మొంథా తుపాను పత్తి రైతును ఆగమాగం చేసేసింది. పైకి పైరు పచ్చగా కళకళలాడుతున్నట్లు కనిపిస్తున్నా, భూమి లోపల మొక్కల వేర్లు కుళ్లి పోవడంతో క్రమేపీ మొక్క నశించిపోతోంది. అయినా ప్రభుత్వం కన్నెత్తి చూడలేదు. కడుపు మండిన కర్షకుడు సాగు చేసిన పత్తి పైరును పీకేసి నిప్పు పెడుతున్నాడు. గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం నాగులపాడుకు చెందిన కమ్మ సురేష్‌బాబు ఏడు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. తుపాను తరువాత వేర్లు కుళ్లిపోయి పంట కృశించిపోయింది. పత్తి తీతలు తీస్తే ఎకరాకు 50 నుంచి 60 కిలోలు మాత్రమే వచ్చింది. దీంతో ఇక లాభం లేదనుకున్న రైతు సోమవారం కూలీలను పెట్టి పత్తి మొక్కలను పీకేశాడు. వాటిని కుప్పలుగా పోసి పొలంలోనే నిప్పు పెట్టాడు. తానూ టీడీపీ మనిషినేనని, 30 ఏళ్లుగా సభ్యత్వం ఉందని, అయినా చంద్రబాబు సర్కారు పంట నష్టపరిహారం అందించడం లేదని విమర్శించాడు. ఏ అధికారీ పొలాన్ని పరిశీలించలేదని, పరిహారం ఇస్తున్నామంటూ టీవీల్లో ఘనంగా చెప్పుకుంటున్న సర్కారు పొలంలోనే తగలబడిపోతున్న ఈ పత్తి పంటకు ఏం సమాధానం చెబుతుందని నిలదీశాడు. కనీసం సగం రాయితీపైన అయినా విత్తనాలను అందించాలని డిమాండ్ చేశాడు. తమ గ్రామంలో అందరూ దాదాపుగా పంటను పీకేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.

మద్దతు లేక మొక్కజొన్న రైతులకు రూ.400 కోట్ల నష్టం

- కొనుగోలు కేంద్రాల ఊసెత్తని చంద్రబాబు సర్కారు
- తక్కువ ధరకే అమ్ముకుంటున్న రైతులు
- తెలంగాణలో 120 కేంద్రాల్లో 8 లక్షల టన్నుల కొనుగోలు
- ఏపీ వ్యవసాయ మిషన్ మాజీ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చంద్రబాబు సర్కారు మీనమేషాలు లెక్కిస్తోందని ఏపీ వ్యవసాయ మిషన్ మాజీ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మద్దతు ధర దక్కక రైతులు కన్నీరు పెడుతున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రైతులు మొక్కజొన్నను తక్కువ ధరకు అమ్ముకుంటున్నా కొనుగోలు కేంద్రాలు తెరవకుండా... రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం ధరలు పడిపోయినప్పుడు రైతుల వద్ద కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్న కనీస బాధ్యతను చంద్రబాబు ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. మొక్కజొన్నకు కేంద్రం కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,400 ప్రకటించగా.. రాష్ట్రంలో రైతులు క్వింటా రూ.1,700 నుంచి రూ.1,900కు అమ్ముకుంటున్న దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే మొక్కజొన్న రైతులు రూ.400 కోట్లకుపైగా నష్టపోతారని ఆందోళన వ్యక్తంచేశారు. పొరుగున ఉన్న తెలంగాణలో 120 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి, ఎకరాకు 25 క్వింటాళ్ల వంతున కనీస మద్దతు ధరకు ఇప్పటికే ఎనిమిది లక్షల టన్నులకుపైగా మొక్కజొన్న కొనుగోలు చేశారని తెలిపారు.

పత్తి రైతులదీ ఇదే దుస్థితి

రాష్ట్రంలో పత్తి రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉందని నాగిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 11.27 లక్షల ఎకరాల్లో పత్తి సాగైందని, దీనిలో 50 శాతం కర్నూలు జిల్లాలో, 20 శాతం పల్నాడు జిల్లాలో సాగైందని వివరించారు. పత్తి మద్దతు ధర క్వింటా రూ.8,110 కాగా, రైతులకు అతి తక్కువ ధర ఇస్తున్నారని ఆయన తెలిపారు.

రైతుల ఫిర్యాదులు పరిశీలించండి

అన్నదాత సుఖీభవ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి/ టెక్కలి: తొలివిడతలో జమకానివి, రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి అర్హత ఉన్న వారికి రెండో విడత అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకంలో లబ్ధిచేకూర్చాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులకు చెప్పారు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, 26 జిల్లాల జేడీలతో ఆయన సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్‌పీసీఏ (జాతీయ చెల్లింపుల సంస్థ)లో ఇన్‌యాక్టివ్‌గా ఉన్న ఖాతాలను యాక్టివేట్ చేయించాలన్నారు. అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు డెత్ మ్యుటేషన్ చేసి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులో ఉంచాలన్నారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

కొనలేం.. తినలేం

కొండెక్కిన కూరగాయల ధరలు

సామాన్య, మధ్యతరగతి ప్రజలు విలవిల

సాక్షి, అమరావతి: కూరగాయల ధరలు కొండెక్కాయి. కార్తీక మాసం చివరికి వచ్చినా ధరల మోత తగ్గలేదు. మొంథా తుపాను సాకుతో రైతు బజార్లతోపాటు బహిరంగ మార్కెట్‌లోనూ రేట్లు భారీగా పెంచేశారు. దళారులు ఆడిందే ఆట.. నిర్ణయించిందే రేటుగా సాగుతోంది. కార్తీక మాసం ఆరంభానికి ముందు రైతు బజారులో కిలో కూరగాయలు రూ.20 నుంచి రూ.30కి లభించేవి. మార్కెట్‌లోనూ రూ.40 నుంచి రూ.50కి దొరికేవి. ప్రస్తుతం రైతుబజారులో కూడా ధరలు భారీగా పెరిగిపోయాయి. బయటి మార్కెట్‌లో డబుల్ చేశారు. వీటి ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందనంత ఎత్తులో ఉన్నాయి. దినసరి కూలీలు, చిరుద్యోగులు మార్కెట్ వైపు చూడాలంటే హడలిపోతున్నారు. మొంథా తుపాను వల్ల పంట నష్టం వాటిల్లి దిగుబడులు కొంత తగ్గాయి. దీనికి తోడు భవానీ భక్తులు, అయ్యప్ప మాల ధారులు, కార్తీక మాసంలో మాంసాహారానికి దూరంగా ఉండటాన్ని దృష్టిలో పెట్టుకుని దళారులు వెరైటీగా పెంచేశారు. వారికి నచ్చినట్లు ధరలు నిర్ణయిస్తున్నారు. తామేమీ తక్కువ కాదన్నట్లు బయట వ్యాపారులు సైతం సిండికేట్ అయి ధరలు పెంచి విక్రయిస్తున్నారు.

పట్టించుకోండి బాబూ!

కూరగాయల ధరలు మండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ధరల నియంత్రణ తమ పని కాదన్నట్టు వ్యవహరిస్తోంది. ఫలితంగా వినియోగదారులు దోపిడీకి గురవుతున్నారు. పిల్లల్కి పస్తులు ఉంచలేక వ్యాపారులు చెప్పిన ధరలకే కొద్దోగొప్పో కూరగాయలు కొనుగోలు చేస్తూ వారి కడుపునింపుతున్నారు. ధరల పెరుగుదల మూడు నెలలుగా కొనసాగుతున్నా ప్రభుత్వం కనీసం నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని వినియోగదారులు మండిపడుతున్నారు. మరోవైపు పెరిగిన ధరలు ఇప్పట్లో తగ్గే పరిస్థితి లేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తుపానుకు పంటలు దెబ్బ తిన్నాయని, ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు దిగుబడి వచ్చే సరికి డిసెంబర్ ఆఖరు అవుతుందని రైతులు చెబుతున్నారు. అప్పటివరకు కొంచెం ఇటు అటుగా ఇదే ధరలు కొనసాగుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

రైతుకు దక్కేది అరకొరే

మార్కెట్‌లో కూరగాయల ధరలు భారీగా పెరిగినా వాటిని పండించే రైతులకు మాత్రం ప్రయోజనం లేకుండాపోయింది. రైతులకు పాత ధరలే చెల్లిస్తూ దళారులు, హోల్‌సేల్ వ్యాపారులు లాభాలు దండుకుంటున్నారు. కాగా.. ధరలు భారీగా పెరగడంతో కూరగాయలు కొనలేక ప్రజలు జంకుతున్నారని, దీనివల్ల తాము తెచ్చిన కూరగాయలు అమ్ముడుపోవడం లేదని విజయవాడ జీఎస్ రోడ్‌లో కూరగాయలు విక్రయించే రిటైల్ వ్యాపారి కొలుసు సత్యవతి చెప్పారు. సరుకు తక్కువగానే తెచ్చినా అమ్ముడవకపోవడంతో పాడైపోతున్నాయని తెలిపారు. హోల్‌సేల్ మార్కెట్‌లో ధరలు పెరిగిపోవడంతో తాము పెంచకతప్పడం లేదని సత్యవతి వాపోయారు.

సోమవారం విజయవాడలో ధరలు ఇలా..

కూరగాయ రకం	బహిరంగ మార్కెట్ (ధర కిలోకు)
టమాటా	రూ.60/70
వంకాయ (గులాబీ)	రూ.80
గుత్తి వంకాయ	రూ.100
దొండ	రూ.80
బెండ	రూ.70
బీర	రూ.80
గోరుచిక్కుళ్లు	రూ.80/100
క్యారెట్	రూ.120
బీట్‌రూట్	రూ.80
ఆగాకర	రూ.140
స్కార్ కాకర	రూ.60/80
క్యాప్సికం	రూ.100
చిక్కుడు (నాటు)	రూ.160
చిక్కుడు (హైబ్రిడ్)	రూ.120
కంద	రూ.65
ఫ్రెంచ్ బీన్స్	రూ.120

ఏమీ కొనలేని పరిస్థితి

కార్తీక మాసం ఆరంభం నుంచి కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఏ కూరగాయ కొనాలన్నా కనీసం రూ.80 చెల్లించాల్సి వస్తోంది. వంకాయలు కిలో రూ.100 చెబుతున్నారు. ఏమీ తినలేక పోతున్నాం. ఇలా అయితే ఎలా బతకాలి.
– మీసాల దమయంతి, వంగపల్లిపేట, చీపురుపల్లి, విజయనగరం జిల్లా

అందనంత ఎత్తులో కూరగాయల ధరలు

మార్కెట్‌లో కిలో వంకాయలు రూ.80 వరకు పలుకుతున్నాయి. బెండకాయలు, దొండకాయల ధరలు ఇందుకు భిన్నంగా ఏమీ లేవు. బీరకాయలు కిలో రూ.40 నుంచి రూ.80 వరకూ పలుకుతున్నాయి. రైతుబజార్లలో ధరలు ఇలా ఉంటే బహిరంగ మార్కెట్‌లో మరీ దారుణం.
– తంగుడు నాగమణి, మండలవీధి, గుజిరీ, శ్రీకాకుళం నగరం.

రూ.500 తీసుకెళ్లినా..

చిన్న ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. గతంలో రూ.200 తీసుకెళ్తే సంచి నిండా కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు రూ.500 తీసుకెళ్లినా సగం సంచి కూడా నిండటం లేదు. కిలో కొనాల్సిన చోట అరకిలోతో సరిపెట్టుకుంటున్నాం.
– కెల్లి పూర్ణమ్మ, పాత్రునివలస, జగనన్నకాలనీ, శ్రీకాకుళం.

క్లుప్తంగా...

ఆస్పత్రుల్లో వైద్యులు ఉండటం లేదు
మంత్రి సత్యకుమార్

సాక్షి, అమరావతి: ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. ఈ ఫిర్యాదులు రోజూ తన దృష్టికి వస్తున్నాయన్నారు. సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు రోజూ ఎంత మంది రోగులకు వైద్యం చేస్తున్నారో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. బోధనాస్పత్రుల్లో అడ్మినిస్ట్రేటర్‌ల పనితీరు సంతృప్తికరంగా లేదన్నారు. సమీక్షలో వైద్యశాఖ కార్యదర్శి సౌరబ్‌గౌర్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్‌బాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ గిరీశ, ఆరోగ్యశ్రీ సీఈవో దినేష్ పాల్గొన్నారు.

అనకాపల్లి వద్ద టాయ్స్ పార్క్
ఉపమాక, సీహెచ్ లక్ష్మీపురం వద్ద 581.39 ఎకరాలు కేటాయింపు

సాక్షి, అమరావతి: మేడిన్ ఆంధ్ర బొమ్మలను ప్రోత్సహించడంలో భాగంగా అనకాపల్లి వద్ద గ్లోబల్ టాయ్స్ (బొమ్మల తయారీ) పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక, సీహెచ్ లక్ష్మీపురం గ్రామాల్లో విస్తరించి ఉన్న 581.39 ఎకరాల్లో పాల్స్ ప్లష్‌తో కలిసి ఏపీఐఐసీ గ్లోబల్ టాయ్ పార్క్‌ను అభివృద్ధి చేయనుంది. ఈ పార్కులో సబ్‌పార్క్ కింద భూములను అభివృద్ధి చేసుకోవడానికి ఇతర సంస్థలకు కూడా కేటాయించనున్నారు. ఉపాధి కల్పనలో బొమ్మల తయారీ పరిశ్రమలు కూడా కీలకమని నీతి ఆయోగ్ పేర్కొనడంతో పాటు దిగుమతులను తగ్గించుకొని మేడిన్ ఇండియా బ్రాండ్ బొమ్మలను ప్రోత్సహించాలన్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి అనుగుణంగా ఈ గ్లోబల్ టాయ్ పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

తయారీ రంగం బలోపేతానికి కట్టుబడి ఉన్నాం
మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సాక్షి, అమరావతి: తయారీ రంగ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. న్యూఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంఎస్ఎంఈ) సహకారంతో సోమవారం నిర్వహించిన 22వ సీఐఐ గ్లోబల్ ఎంఎస్ఎంఈ బిజినెస్ సమ్మిట్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా రంగంలో బలంగా ఉన్న భారతదేశం ఇప్పుడు అంతర్జాతీయంగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగ మార్కెట్లలో భారత్ ఒకటని.. దేశంలోని వినియోగదారుల అవసరాలను పరిశ్రమలు తీర్చగలిగితే ప్రపంచస్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎంఎస్ఎంఈ స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు.

చిన్న అప్పన్నను విచారించిన 'సిట్'

తిరుపతి క్రైమ్: టీటీడీలో నెయ్యి కల్తీ ఆరోపణల నేపథ్యంలో రిమాండ్ ఖైదీగా ఉన్న చిన్న అప్పన్నను తిరుపతిలో సిట్ సోమవారం విచారించింది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఆయనను సిట్ తమ కస్టడీలోకి తీసుకొని విచారించనుంది. తొలిరోజు ఆయనను సీబీఐ అధికారులు.. నెయ్యి కేసులో ఎవరికి సంబంధాలు ఉన్నాయి? ఎవరెవరికి ఎంత ముడుపులు వచ్చాయి? అని ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే ఇందులో ఎవరూ లేరని ఎక్కడి నుంచి కూడా డబ్బులు రాలేదని అప్పన్న సమాధానం ఇచ్చినట్లు తెలిసింది.

వైద్య విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలు

- ఎంబీబీఎస్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియలో గందరగోళం
- రెండో విడత నుంచి స్ట్రే వెకెన్సీ వరకు వరుస తప్పిదాలు

సాక్షి, అమరావతి: మెరిట్ లిస్ట్‌లో ముందున్న విద్యార్థులను తప్పించి వెనకున్న వారికి సీట్‌లు కేటాయించడం.. రూల్ ఆఫ్ రిజర్వేషన్ (ఆర్‌వోఆర్)కు విరుద్ధంగా సీట్లు భర్తీ చేయడం.. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తిన తర్వాత.. 'అయ్యో... సాంకేతిక తప్పులు దొర్లాయి. సరిచేస్తున్నాం' అంటూ బుకాయించడం.. ఇలా రాష్ట్రంలో ఎంబీబీఎస్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియను చంద్రబాబు ప్రభుత్వం ఎన్నడూ లేనంత గందరగోళంగా మార్చేసింది. ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా స్ట్రే వేకెన్సీ (మిగిలిపోయిన సీట్ల భర్తీ) సీట్ల కేటాయింపు జాబితా ఆదివారం రాత్రి హెల్త్ వర్సిటీ ప్రకటించింది. ఈ కేటాయింపులను నిలిపేస్తున్నట్టు సోమవారం ఉదయం వర్సిటీ స్పష్టం చేసింది. స్ట్రే వేకెన్సీ రౌండ్‌లో ఎనిమిది సీట్లను భర్తీ చేస్తే, అన్ని సీట్లు మెరిట్‌కు విరుద్ధంగా ఉండటం కౌన్సెలింగ్ ప్రక్రియలో వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది. రెండు, మూడో విడతలోనూ ఇదే తంతు చోటుచేసుకోవడం గమనార్హం.

స్ట్రే వేకెన్సీ రౌండ్‌లో అవకతవకల తీరిది..

- స్ట్రే వేకెన్సీ రౌండ్‌లో తొలుత మెరిట్‌లో ముందున్న విద్యార్థులకు అన్యాయం చేస్తూ వెనకున్న విద్యార్థులకు వర్సిటీ సీట్లను కేటాయించింది.
- ఆదివారం ప్రకటించిన జాబితాలో నీట్‌లో 486 మార్కులు వచ్చిన విద్యార్థికి ఓసీ జనరల్ విభాగంలో విశాఖ ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీల్లో సీట్లు కేటాయించారు. వాస్తవానికి ఓయూ రీజియన్‌కు చెందిన ఓ విద్యార్థి 487 మార్కులతో మెరిట్ లిస్ట్‌లో ముందు ఉన్నారు. సదరు విద్యార్థిని సైతం పక్కనపెట్టడమే కాకుండా మరో ఆరుగురు విద్యార్థులకు తరువాత ఉన్న 486 మార్కులు వచ్చిన వారికి ఎన్ఆర్ఐ సీట్ కేటాయించారు.
- చిత్తూరు జిల్లా అన్నాగౌరి కళాశాలలో సీట్‌ను 486 మార్కులు వచ్చిన విద్యార్థికి కట్టబెట్టేశారు. సదరు విద్యార్థి కంటే మెరిట్ లిస్ట్‌లో 37 మందికంటే ముందు ఉండే 487 స్కోర్ చేసిన విద్యార్థికి దక్కాల్సి ఉండగా వర్సిటీ ఇందుకు విరుద్ధంగా కేటాయించింది.
- అన్యాయానికి గురైన పలువురు విద్యార్థులు సీట్ల కేటాయింపులో తప్పులు దొర్లాయంటూ ఆదివారం రాత్రి వర్సిటీ ప్రతినిధులను ఫోన్‌లలో సంప్రదించగా కేటాయింపులన్నీ పక్కాగా జరిగాయని, ఇక మార్పులేమీ ఉండబోవని బదులిచ్చినట్టు పలువురు విద్యార్థులు వెల్లడించారు.
- అయితే ఎనిమిది సీట్లు నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారని విద్యార్థుల నుంచి ఫిర్యాదులు పోటెత్తడంతో 'సాంకేతికంగా పొరపాట్లు జరిగాయంటూ' వర్సిటీ సోమవారం ఉదయానికి ఒక ప్రకటన విడుదల చేసింది. తప్పులను సవరించుకుని రివైజ్డ్ జాబితాను విడుదల చేశారు.

రెండు, మూడో దశల్లోనూ ఇదే తంతు

ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు ప్రక్రియలో ఇంత గందరగోళం ఎన్నడూ లేదని వర్సిటీ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. రెండు, మూడో దశ కౌన్సెలింగ్‌లోనూ తప్పులు దొర్లాయి. ఈ నెల తొమ్మిదిన మూడో విడత సీట్లు కేటాయిస్తూ వర్సిటీ ప్రకటన విడుదల చేసింది. ఇందులో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రెండో విడత కేటాయింపుల్లో లోపాలు బయటపడ్డాయి. దీంతో 'ఎన్‌సీసీ విభాగంలో సాంకేతిక తప్పిదాలు తలెత్తాయి. వాటిని సరిచేస్తాం'అంటూ తొలుత చేపట్టిన కేటాయింపులను నిలిపేశారు. మరుసటి రోజు సవరించిన సీట్ల కేటాయింపు జాబితాను వర్సిటీ విడుదల చేసింది.

విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అసహనం, అనుమానం

వరుసగా లోపాలు వెలుగు చూడటంతో కౌన్సెలింగ్ ప్రక్రియపైనే విద్యార్థులు, తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మెడిసిన్ వార్షిక పరీక్షల నిర్వహణలోనే కాకుండా ప్రవేశాల కౌన్సెలింగ్‌లోనూ బాబు సర్కార్ విఫలమయ్యిందని విమర్శలు వస్తున్నాయి. ఎంబీబీఎస్ వార్షిక పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌తో పాటు, మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్ (ఎంసీక్యూ)ల్లో పెద్ద ఎత్తున గోల్‌మాల్ చోటు చేసుకుంది. గద్దెనెక్కిన వెంటనే వర్సిటీకి పేరు మార్పు.. పీపీపీలో సర్కార్ వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టడంలో చూపిన శ్రద్ధ పాలనపై ప్రభుత్వ పెద్దలు చూపడం లేదు. దీంతో వైద్య విద్య వ్యవస్థ గాడి తప్పుతోందని ఆరోపణలు వస్తున్నాయి.

సీఐ సతీష్‌కుమార్ భద్రతపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- సతీష్‌కుమార్ సోదరుడు హరికుమార్
- ముప్పు ఉందని తెలిసీ రక్షణ కల్పించలేదని ఆవేదన

కర్నూలు (సెంట్రల్): టీటీడీ పూర్వ ఏవీఎస్‌వో, రైల్వే సీఐ సానా సతీష్‌కుమార్ భద్రతపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించిందని, ఆయన ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా రక్షణ కల్పించకపోవడం వెనుక మతలబు ఏమిటో చెప్పాలని ఆయన తమ్ముడు హరికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తామున్నామంటూ అందరూ వచ్చి సానుభూతి వ్యక్తం చేస్తున్నారని పరోక్షంగా టీడీపీ నాయకులను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. ఆయన బతికుండగా సరైన భద్రతా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహించిందో ఎవరూ చెప్పడం లేదన్నారు. సోమవారం శాలివాహన (కుమ్మర) సంఘం ఆధ్వర్యంలో సీఐ సతీష్‌కుమార్ మృతిని నిరసిస్తూ కర్నూలు రాజ్‌విహార్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం ఎదుట జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన శాలివాహనులు ధర్నా చేశారు.

దర్యాప్తును సీబీఐకి అప్పగించండి

ఈ సందర్భంగా సతీష్‌కుమార్ తమ్ముడు హరికుమార్ మాట్లాడుతూ.. ఈ కేసును ప్రభుత్వం సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. టీటీడీ పరకామణి కేసులో సాక్షిగా ఉన్న సీఐ సతీష్ కుమార్ భద్రతపై ఇంటెలిజెన్స్ నిఘా ఎందుకు విఫలమైందని ప్రశ్నించారు. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. శాలివాహన సంఘ నాయకుడు జి.పుల్లయ్య మాట్లాడుతూ.. సీఐ రక్షణపై ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో ఆయన దారుణ మరణాన్ని చూస్తే అర్థమవుతోందన్నారు. ఈ ఉదంతాన్ని సీఐలందరూ ఖండించాలని, ఆయన కుటుంబానికి మద్దతుగా నిలవాలని కోరారు. ప్రభుత్వం ఎక్కడైనా చిన్న ప్రమాదం జరిగి ఎవరైనా చనిపోతే వెంటనే ఆ కుటుంబాలను ఆదుకోవడానికి చర్యలు తీసుకుంటుందని, అయితే సీఐ సతీష్ కేసు విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందో అర్థం కావడం లేదన్నారు. ఇంతవరకు బాధిత కుటుంబానికి కనీస పరిహారం ప్రకటించలేదని, ప్రభుత్వం తరపున ఆదుకుంటామని చెప్పలేదని తప్పు బట్టారు. కేసును సీబీఐకి అప్పగించాలని, బాధిత కుటుంబానికి రూ.2 కోట్ల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, భార్య లేదా ఆయన తమ్ముళ్లకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పీబీవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న శాలివాహనులు

అంగన్‌వాడీ కేంద్రాల విలీనం

- ప్రతిపాదనలు సిద్ధం చేసిన చంద్రబాబు సర్కారు
- రాష్ట్రంలోని 6,837 కేంద్రాల్లో పిల్లల వివరాల సేకరణ
- తొలిదశలో 340 కేంద్రాల విలీనం
- ఇప్పుడు మెర్జింగ్.. తర్వాత వర్కర్లు, హెల్పర్లను కుదించే ప్రమాదం

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం (మెర్జింగ్) చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. రాష్ట్రంలో ఇప్పటివరకు మినీ కేంద్రాలుగా ఉన్న 6,837 సెంటర్లలో కొన్ని ఎంపికచేసి సమీపంలోని కేంద్రాలలో కలిపేస్తారు. దీనివల్ల రికార్డుల్లో అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య తగ్గకుండా చూపినప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఒకదాన్లో మరొకటి కలిపేయడం వల్ల సెంటర్లు తగ్గిపోతాయనేది వాస్తవం. అదే జరిగితే విలీనం అయిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని వర్కర్లు, హెల్పర్లను కూడా కుదించే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

అప్‌గ్రేడ్ చేసి.. విలీనంతో కుదింపు..

రాష్ట్రంలో మొత్తం 55,607 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 6,837 ఇప్పటివరకు మినీ కేంద్రాలు. మెయిన్ కేంద్రాల్లో ఒక వర్కర్, ఒక హెల్పర్ ఉంటే.. మినీ సెంటర్లలో ఒక్కరే ఉంటారు. ఇటీవల కేంద్రప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రంలోని మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా స్థాయిపెంచారు. మినీ సెంటర్లలో పనిచేసే ఒక హెల్పర్‌కు పదోతరగతి విద్యార్హత ఉంటే వర్కర్‌గా అవకాశం ఇచ్చి మరో హెల్పర్‌ను నియమించుకోనున్నారు. ఇలా 4,687 మినీ అంగన్‌వాడీల్లో పనిచేస్తున్న వారికి మెయిన్ వర్కర్‌గా అవకాశం వచ్చి వేతనం పెరగనుంది. మరోవైపు అప్‌గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేస్తుండటాన్ని అంగన్‌వాడీ యూనియన్ నేతలు తప్పుబడుతున్నారు.

తొలిదశలో 340 కేంద్రాల విలీనం

రాష్ట్రంలో తొలిదశలో విలీనం చేసే అంగన్‌వాడీ కేంద్రాల జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. 340 కేంద్రాలకుపైగా సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మెర్జింగ్ అయ్యే అవకాశం ఉందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. వాస్తవానికి ప్రతి వెయ్యి మందికి ఒక అంగన్‌వాడీ కేంద్రం ఉండాలి. ప్రస్తుతం రాష్ట్రంలో రెండువేల నుంచి మూడువేలకు పైగా జనాభాకు ఒక అంగన్‌వాడీ కేంద్రం ఉంది.

అంగన్‌వాడీల్లోనే ప్రీ స్కూల్ బలోపేతం చేయాలి

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల విలీనం ప్రతిపాదనను విరమించుకుని వాటిని బలోపేతం చేయాలి. రాష్ట్రంలో మూడు నుంచి ఆరేళ్లలోపు బాలలు 13 లక్షల మందికిపైగా ఉన్నారు. వారిలో ఎనిమిది లక్షల మంది అంగన్‌వాడీ కేంద్రాల్లోను, మూడులక్షల మంది ప్రైవేట్ స్కూల్స్‌లో ఉన్నారు. మిగిలిన రెండు లక్షలమంది పిల్లలు అటు అంగన్‌వాడీ కేంద్రాల్లోను, ఇటు ప్రైవేట్ స్కూళ్లలోను నమోదు కాలేదని అంగన్‌వాడీలపై ఒత్తిడి పెంచడం సరికాదు. ప్రైవేట్ స్కూల్‌తో నిమిత్తం లేకుండా ఐదేళ్లలోపు చిన్నారులంతా అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లో ఉండాలనే ఉత్తర్వులు ఇవ్వాలి. ఆ పిల్లలకు తల్లికి వందనం, యూనిఫాం, బెల్ట్, బూట్లు ఇవ్వాలని ఈ నెల 14న బాలల దినోత్సవం రోజు సచివాలయాల్లో వినతిపత్రాలు అందించాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రమే ప్రీ స్కూల్ పెడితే పిల్లల హాజరు పెరిగి అవి బలోపేతం అవుతాయి. వాటిని విలీనం చేయాల్సిన అవసరం ఉండదు.
– కె.సుబ్బరావమ్మ, ప్రధాన కార్యదర్శి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు 'షాక్'

ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోకపోవడంపై సీజేఐ ఆగ్రహం

సాక్షి, న్యూఢిల్లీ: పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత వేటు విషయంలో తాత్సారం చేస్తున్నారంటూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై సుప్రీంకోర్టు తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారంటూ సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మండిపడింది. 'అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకుంటారా? లేక కోర్టు ధిక్కరణ చర్యలు ఎదుర్కొంటారా? అనేది స్పీకరే తేల్చుకోవాలి. వచ్చే వారంలోగా అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోండి. లేదంటే కోర్టు ధిక్కరణ చర్యలు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండండి'అని అల్టిమేటం జారీ చేసింది. ఈ వ్యవహారంలో నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని స్పీకర్ కార్యాలయానికి నోటీసులు జారీ చేసింది.

కచ్చితంగా కోర్టు ధిక్కరణే.. రక్షణ ఉండదు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. మూడు నెలల్లోగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు జూలై 31న స్పీకర్‌ను ఆదేశించింది. అయితే ఆ గడువు ముగిసినా ఎటువంటి నిర్ణయం వెలువడలేదు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. 'అనర్హత పిటిషన్లను విచారించేటప్పుడు స్పీకర్ ఒక 'ట్రిబ్యునల్'గా వ్యవహరిస్తారు. ఆ సమయంలో ఆయనకు ఎటువంటి రాజ్యాంగపరమైన మినహాయింపులు వర్తించవు. కోర్టు ఆదేశాలను పాటించకపోవడం స్పష్టంగా తీవ్రమైన ధిక్కరణ కిందకే వస్తుంది'అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

న్యూ ఇయర్ ఎక్కడ జరుపుకుంటారు?

విచారణ సందర్భంగా సీజేఐ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. స్పీకర్ తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ.. 'వచ్చే కొత్త సంవత్సరాన్ని ఎక్కడ జరుపుకోవాలనుకుంటున్నారో ఆయనే (స్పీకర్) నిర్ణయించుకోవాలి'అని హెచ్చరించారు. కాగా నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేస్తామని స్పీకర్ తరపు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, అభిషేక్ మను సింఘ్వీలు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అంతేగాక తాము ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడం లేదని, హైకోర్టు, సుప్రీంకోర్టు మధ్య పిటిషనర్ తిరుగుతుండటం వల్ల ఏర్పడిన న్యాయపరమైన సందిగ్ధత వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వారు సమర్థించుకునే ప్రయత్నం చేశారు.

నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలి..

ఈ కేసులో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం, సమాధానం చెప్పడానికి నాలుగు వారాల సమయం ఇచ్చింది. ప్రస్తుతానికి స్పీకర్ వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చినప్పటికీ, తదుపరి విచారణ నాటికి కచ్చితమైన పురోగతి ఉండాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ధర్మాసనం సంకేతాలు ఇచ్చింది.

రెన్యూవబుల్ స్టోరేజీ ప్రాజెక్టులకు ఆర్థికసాయం

పాణ్యం: రెన్యూవబుల్ స్టోరేజీ ప్రాజెక్టుల కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని కేంద్ర విద్యుత్, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ తెలిపారు. సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పిన్నాపురంలో ఏర్పాటైన గ్రీన్‌కోలో 6వ విద్యుత్ శాఖ పార్లమెంటరీ కన్సల్టేటివ్ సమావేశం నిర్వహించారు. కేంద్రమంత్రితో పాటు కేంద్ర విద్యుత్ రెన్యూవబుల్ ఎనర్జీ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ నిల్వల సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం జాతీయ ప్రాధాన్యతగా మారిందన్నారు. ఇప్పటికే విద్యుత్ మంత్రిత్వశాఖ అనేక స్టోరేజ్ ప్రాజెక్టులను ప్రారంభించిందని తెలిపారు. 200 మెగావాట్ల వరకు సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులకు ప్రతి మెగావాట్‌కు రూ.75లక్షల రాయితీ అందిస్తున్నామన్నారు.

జోగి రమేష్ కస్టడీ పిటిషన్‌పై విచారణ వాయిదా

విజయవాడలీగల్: నకిలీ మద్యం కేసులో అక్రమ ఆరోపణలపై జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న జోగి రమేష్, జోగి రామును పది రోజులపాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఎక్సైజ్ పోలీసులు 6వ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ ఈనెల 20కి వాయిదా పడింది. ఇక ఇదే కేసులో ఏ–1 అద్దేపల్లి జనార్దనరావు, ఏ–2 అద్దేపల్లి జగన్మోహనరావును ఈ నెల 19 నుంచి నాలుగు రోజులపాటు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ కేసులో చక్కా సతీష్‌కుమార్ రిమాండ్‌ను ఈ నెల 25 వరకూ పొడిగిస్తూ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కాగా, ఈ కేసులో నిందితునిగా ఉన్న తలారి రంగయ్య ముందస్తు బెయిల్ పిటిషన్‌పై కౌంటర్‌కు ఆదేశిస్తూ 8వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు తదుపరి విచారణను ఈనెల 19కి వాయిదా వేసింది.

ఓసారి భూమి తీసుకున్న తరువాత కౌలు చెల్లించాల్సిందే

సీఆర్‌డీఏకి తేల్చి చెప్పిన హైకోర్టు

సాక్షి, అమరావతి: భూ సమీకరణ కింద ఓసారి భూములు తీసుకున్న తరువాత వాటిని ఉపయోగించినా లేకున్నా ఆ యజమానులకు చెప్పిన ప్రకారం కౌలు చెల్లించి తీరాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. పిటిషనర్లకు కౌలు చెల్లింపు విషయంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని సీఆర్‌డీఏ అధికారులను ఆదేశిస్తూ విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. గన్నవరం విమానాశ్రయం కోసం భూ సమీకరణ కింద భూములు తీసుకున్న అధికారులు తమకు వార్షిక కౌలు చెల్లించడం లేదంటూ కృష్ణా జిల్లా, అజ్జంపూడి గ్రామానికి చెందిన మన్నం కృష్ణమూర్తి, వేమూరి వెంకట కోటేశ్వరరావు, కేశబోయిన రాం ప్రసాద్, వీరమాచినేని శ్రీధర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ సోమవారం విచారణ జరిపారు. పిటిషనర్ల తరపు న్యాయవాది పీవీజీ ఉమేష్ వాదనలు వినిపించారు. పిటిషనర్లకు చెందిన 59.18 ఎకరాల భూమి గన్నవరం విమానాశ్రయ విస్తరణ కోసం భూ సమీకరణ కింద తీసుకున్నారని తెలిపారు. భూ సమీకరణ నిబంధనలను మాత్రం అమలు చేయడం లేదన్నారు. చట్ట ప్రకారం చెల్లించాల్సిన వార్షిక కౌలును చెల్లించడం లేదని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి పైవిధంగా ఆదేశాలిచ్చారు.

ఉక్కు రంగంలో రాష్ట్రానికి పెద్దపీట
కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: ఉక్కు రంగంలో రాష్ట్రానికి పెద్దపీట లభించిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాట పట్టించేందుకు కేంద్రం నుంచి భారీ ప్యాకేజీ సాధించగా, కొత్తగా ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా అనకాపల్లి జిల్లా ముతుకూరు వద్ద సుమారు రూ.1.40 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. విజయనగరం జిల్లా గుర్ల మండలం కెల్లా గ్రామంలో రూ.8,570 కోట్ల వ్యయంతో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ నిర్మించేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. దేశ జీడీపీలో ఉక్కు ఉత్పత్తి కీలకంగా ఉంటుందని, ప్రధాని మోదీ దేశంలో ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం పెంచేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు.

ధైర్యం అంటే కేవలం తెగింపు కాదు.
త్యాగం కూడా! మీకెవ్వరూ మద్దతు ఇవ్వకపోయినా,
సరైన దాని కోసం ధైర్యంగా నిలబడండి.
– బటుకేశ్వర్ దత్

సాక్షి
మంగళవారం, 18 నవంబర్ 2025

విశ్వసనీయత లేని విచారణ!

అందరూ అనుకున్నట్టే బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆ దేశంలోని 'అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్' సోమవారం మరణశిక్ష విధించింది. ఆమెతోపాటు అప్పటి హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌కు సైతం ఇదే శిక్ష పడింది. నిరుడు ఆగస్టులో విద్యార్థి ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడ్డాక ఆమె బంగ్లా వదిలి మన దేశంలో ఆశ్రయం పొందుతున్నారు. ఇప్పుడామెను తమకు అప్పగించాలంటూ తాత్కాలిక ప్రభుత్వం మన ప్రభుత్వాన్ని కోరింది. అధికారంలో కొనసాగాలన్న లక్ష్యంతో హసీనా అనేక అవకతవకలకు పాల్పడటం, వ్యతిరేకుల్ని జైలుపాలు చేయటం, న్యాయమైన ఉద్యమాలను సైతం ఉక్కుపాదంతో అణిచేయటం వాస్తవం. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్నవారి తీరుతెన్నులు కూడా ఏమంత మెరుగ్గా లేవు. 'పేదవాళ్ల బ్యాంకర్'గా పేరు తెచ్చుకుని 2006లో నోబెల్ బహుమతి సాధించిన ఆర్థికవేత్త మహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధాన సలహాదారుగా ఉంటున్నారు. కానీ ప్రభుత్వ పగ్గాలు ఆయన చేతుల్లో ఉన్న దాఖలా కనబడదు. తాత్కాలిక ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వంలో మతతత్వవాదుల ప్రాబల్యం పెరిగింది. మైనారిటీ హిందువులకూ, మహిళలకూ, హసీనా హయాంలో బాధ్యతలు నిర్వర్తించిన నేతలకూ, ఉన్నతాధికారులకూ గడ్డు పరిస్థితులేర్పడ్డాయి. ఆఖరికి న్యాయమూర్తులుగా పనిచేసినవారిని సైతం వేధించి, రాజీనామాలు చేయించారు. ఆరోపణలొచ్చినప్పుడల్లా అవి అవాస్తమని ప్రకటించటం తప్ప యూనస్ చేసిందేమీ లేదు. బహుశా ఇలాంటి పరిణామాల వల్ల కావొచ్చు... యూనస్‌కు హోంశాఖ ప్రత్యేక సహాయకుడిగా ఉన్న ఖుదాబక్ష్ చౌధురి సెలవు పేరిట ఇటీవల దేశం వదిలిపోయారు.

హసీనాకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంపై జరిగిన కాల్పుల్లో ఐక్యరాజ్యసమితి లెక్క ప్రకారమే 1,400 మంది మరణించారు. వేలాదిమంది గాయపడ్డారు. కానీ వాటిపై విచారణ జరిపి శిక్షించటానికి తాత్కాలిక ప్రభుత్వానికి హక్కూ, అధికారం ఉన్నాయా? బంగ్లా రాజ్యాంగంలో తాత్కాలిక ప్రభుత్వం అనే ఏర్పాటే లేదు. పోనీ హఠాత్తుగా ప్రధాని దేశం విడిచిపోయారు గనుక ఆపద్ధర్మంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారనుకున్నా, ఏడాదిలోగా ఎన్నికలు ఎందుకు జరపలేకపోయారు? అసలు హసీనాపై తీర్పు సందర్భమే కక్షపూరితమైనది. ఈ నెల 14న తీర్పు ఇవ్వబోతున్నట్టు పక్షం రోజుల క్రితం 'ట్రిబ్యునల్' ప్రకటించింది. తర్వాత దాన్ని 17కు మార్చారు. ఆ తేదీ ఆమె పెళ్లి రోజు కావటం తప్ప మరేమీ కారణం లేదు. ఇలాంటి చౌకబారు ఎత్తుగడలతో సాధించదల్చుకున్నదేమిటో?!

తూర్పు పాకిస్తాన్... బంగ్లాదేశ్‌గా ఏర్పడి 54 ఏళ్లవుతోంది. ఆ సందర్భంగా పాక్ పాలకులపై సాగిన పోరాటంలో పాలుపంచుకుని, బంగ్లాదేశ్ ఆవిర్భావ అనంతరం తొలి ప్రధాని ముజిబుర్ రెహ్మాన్‌తో సన్నిహితంగా పనిచేసిన యూనస్ ఇప్పుడు పాక్ అనుకూల శక్తులతో చేతులు కలిపారు. పాక్ నేతలకూ, సైనికాధికారులకూ రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. అచ్చం వారిలానే మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నారు. నిజానికి హసీనా, యూనస్ 2007 వరకూ కలిసి పనిచేశారు. ఆ సంవత్సరం అప్పటి అధ్యక్షుడు లాజుద్దీన్ అహ్మద్ ఆత్యయిక స్థితి ప్రకటించినప్పుడు సైన్యం తిరగబడి ఆయన్ను తొలగించింది. ఆ తర్వాత అవినీతిపై పోరాటం చేస్తామన్న సైనిక పాలకులకు యూనస్ మద్దతు పలకటంతో ఇద్దరి మధ్యా చెడింది. అటు తర్వాత ఏర్పడిన హసీనా ప్రభుత్వం యూనస్‌ను ఇబ్బందుల పాలు చేసింది. 172 కేసుల్లో విచారణను ఎదుర్కొనటం, ఒక కేసులో శిక్ష కూడా పడి బెయిల్‌పై ఉండటం వగైరాలు సాగాయి.

పదవీ భ్రష్టత్వం ప్రాప్తించింది గనుక హసీనా ప్రభుత్వ అణచివేత చర్యలన్నీ ఆమెకు చుట్టుకున్నాయి. ఆ ఉద్యమం విఫలమైతే ఇవాళ విద్యార్థి నాయకులు, కొందరు రాజకీయ నాయకులు దోషులుగా నిలబడవలసి వచ్చేది. బంగ్లాలో అవామీ లీగ్ ప్రాబల్యం తగ్గినట్టు లేదు. తీర్పు వెలువడటానికి ముందే అక్కడక్కడ హింస చోటుచేసుకుంది. సోమవారం ఢాకా పూర్తిగా స్తంభించింది. హసీనాపై వచ్చిన ఆరోపణల విషయంలో విచారణ జరగాల్సిందే. కానీ ఆ పని ప్రజలెన్నుకున్న ప్రభుత్వం ద్వారా జరగాలి. దేశంలో ప్రజాస్వామిక వాతావరణం ఏర్పడాలి. ఇవేమీ లేని విచారణలు, శిక్షలు ప్రజల్లో విశ్వసనీయత కలిగించలేవు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తిక మాసం, **తిథి:** బ.త్రయోదశి ఉ.6.40 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** స్వాతి పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.11.38 నుండి 1.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.24 నుండి 9.09 వరకు, తదుపరి రా.10.27 నుండి 11.18 వరకు, **అమృత ఘడియలు:** రా.10.11 నుండి 11.56 వరకు, **మాస శివరాత్రి.**

సూర్యోదయం : 6.10
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

మౌన విద్య

మౌనంగా ఉండటం పెద్ద విద్య. అది సాధనతో వచ్చేది కాదు. పరిస్థితులు నేర్పించవలసిందే. గలగలా మాట్లాడే నన్ను, నా మనసును నొప్పించిన చాలా విషయాలు మౌనిలా మార్చేశాయి. ఎవరి మాటలకూ మనం ప్రభావితం కాకూడదు. మౌనంగా ముందుకు సాగిపోవాలి.

– నయనతార, నటి

స్వయం కాంతి

ఇప్పటివరకు నేను సాధించిన వాటిలో అత్యుత్తమమైన విజయం నన్ను నేను ప్రేమించుకోగలగటం! మనపై మనకు మొదలైన ప్రేమ, మన నుండి స్వచ్ఛమైన తెల్లని కాంతిలా వ్యాపించి ప్రపంచాన్ని వెలిగిస్తుంది. ఆ వెలుగులో ద్వేషం, అసూయ అనే చీకట్లకు స్థానం ఉండదు.

– నేహా భాసిన్, నేపథ్య గాయని

విధేయత

అత్యున్నత స్థాయిని చేరుకోవడానికి వినయం ముఖ్యం. వినయ విధేయతలు గల వ్యక్తులు మాత్రమే నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతారు. ఎందుకంటే, తమకు పెద్దగా ఏమీ తెలియదని వారికి తెలిసే ఉంటుంది కాబట్టి! వినయం సకల సుగుణాల సమ్మిళితం.

– విజయ్ వర్ధన్, ఐఏఎస్

ప్రజల కోసం



ప్రజల అవసరాలే సామాజిక ఆవిష్కరణలకు దారి తీస్తాయి. అయితే ప్రజల అవసరాల పట్ల సానుభూతి, ప్రజల కోసం పని చేయాలన్న ఆశయం, అందుకు అవసరమైన తెలివితేటలు, దృఢ సంకల్పం లేకుంటే మన ప్రయత్నాలేవీ ప్రజలకు ఉపయోగం అయ్యేలా ఫలించవు.

– ఫిర్దౌజ్ ఖరస్, గ్లోబల్ థాట్ లీడర్

మాయాజాలం

వేణుగానం ఒక మాయాజాలం. నమ్మశక్యం కాని అద్భుతాలు చేస్తుంది. ఆత్మను ప్రతిఫలిస్తుంది. ఆధ్యాత్మికతను ప్రతిధ్వనిస్తుంది. ఔన్నత్యానికి సోపానాలు వేస్తుంది. శాంతి సామరస్యాలను ప్రేరేపిస్తుంది. ప్రతి మనిషీ వేణువులా ఉండాలి. ప్రతి మాటా వేణుగానమవ్వాలి.

– బాపూ పద్మనాభ, వేణుగాన విద్వాంసుడు

పరిపూర్ణత

జీవితం ఒక పాఠశాల. ప్రతి రోజూ ఒక తరగతి. మీరు కలిసిన ప్రతి వ్యక్తీ ఒక గురువు. నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండండి. అనుభవాలు మీ జీవితాన్ని మెరుగు పరుస్తాయి. మిమ్మల్ని పరిపూర్ణమైన వ్యక్తులుగా మలుస్తాయి. 'మనిషి'గా మీరు పట్టభద్రులు అవుతారు. మరొకరికి నేర్పించేవారవుతారు.

– పీయూష్ మిశ్రా, కవి–గాయకుడు

ప్రాధాన్యాలను గుర్తించడమే గెలుపు

విశ్వ గురు

ఐదు ట్రిలియన్ డాలర్ల విలువైన తొలి, ఏకైక కంపెనీగా 'ఎన్విడియా' ఇటీవలే చరిత్ర సృష్టించింది. ఎన్విడియా సహ–వ్యవస్థాపకుడు, సీఈఓ అయిన తైవానీస్–అమెరికన్ వ్యాపారవేత్త **జెన్‌సెన్ హువాంగ్** కాలిఫోర్నియాలోని 'క్యాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (కాల్‌టెక్) పట్టభద్రులను ఉద్దేశించి చేసిన ప్రసంగ సంక్షిప్త పాఠం:

ఇది నిజంగా సంతోషకరమైన రోజు. మీరంతా 'కాల్‌టెక్' నుంచి పట్టభద్రులవుతున్నారు. ఈ విద్యాలయంలో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరిన వారిలో కొందరు నన్నూ, మా సంస్థనూ ఎంతో ప్రభావితం చేశారు. 'ఎన్విడియా'లోని ఇద్దరు చీఫ్ సైంటిస్టులు ఇక్కడి నుంచి వచ్చినవారే. నిజానికి, సలహాలు ఇవ్వడమంటే నాకు ఇష్టం ఉండదు. నేను ఇష్టపడిన ఉదంతాలను, జీవితాను భవాలను కొన్ని చెబుతాను. సలహాలు వాటిలోనే అంతర్లీనంగా ఉంటాయి.

ప్రపంచంలో ఒక టెక్ కంపెనీకి ఇంత సుదీర్ఘ కాలంగా సీఈఓగా ఉన్నది బహుశా నేనే అనుకుంటా. నేను ఈ 31 ఏళ్ళ వృత్తి జీవితంలో ఎంచుకున్న రంగం నుంచి బయటపడకుండా చూసుకున్నాను. విసుగు చెందలేదు. ఉద్వాసనకు గురయ్యే పరిస్థితులు తెచ్చుకోలేదు. మేధాపరమైన నిజాయతీ, ఒదిగి ఉండటం మా కంపెనీని కాపాడాయని చెప్పగలను.

ఏఐ వెంట పరుగెత్తాలి!

'కుడా' అనే ప్రోగ్రామింగ్ మోడల్ తయారు చేసేందుకు మాకు 20 ఏళ్ళకు పైగా పట్టింది. అది నేడు కంప్యూటింగ్ రంగాన్ని విప్లవాత్మకంగా మారుస్తోంది. టెక్నాలజీ పరంగా ఎన్నో పర్యవసానాలకు దారితీయగల కృత్రిమ మేధ (ఏఐ) రంగంలోకి దిగాల్సిందిగా నేను గ్రాడ్యుయేట్లను ప్రోత్సహిస్తాను. ఏకకాలంలో, బహు ముఖాలుగా వికసనం పొందుతూ ముందుకు సాగుతున్న టెక్నాలజీ అదొక్కటే!

ఏఐ వెంట నడవడం కాదు పరుగెత్తండని నేను 'తైవాన్ యూనివర్సిటీ' విద్యార్థులకు సూచించాను. ఏఐ విప్లవంతో మమేకం కండని చెప్పాను. ఆ తర్వాత, ఒక ఏడాది గడిచేటప్పటికే అది నమ్మలేనంతగా మారిపోయింది. ఈ అసాధారణ పరిణామాలను మీరు అంతర్ దృష్టితో అవగాహన చేసుకోవాలి. మీ ముందున్న ఈ అవకాశాన్ని అడ్వాంటేజ్‌గా తీసుకుని ముందుకు సాగండి.

> నేను చేయవలసిన పనుల ప్రాధాన్య క్రమాన్ని రాసుకుని, ప్రతి రోజూ ఉదయం, ఆ జాబితాలోని మొదటి పనితో ప్రారంభిస్తా. ఏ పని తర్వాత ఏ పని చేయాలన్న విషయంలో చాలా స్పష్టతతో ఉంటాను.

ఆధునిక కంప్యూటింగ్ మూలాలు ఐబీఎం సిస్టమ్ 360లో ఉన్నాయి. నేను పుట్టిన ఏడాది తర్వాత, అది మార్కెట్లోకి వచ్చింది. చిప్‌ల రూపకల్పన నేర్చుకున్న 1980లలోని తొలి తరం వి.ఎల్.ఎస్.ఐ. ఇంజినీర్లలో నేనొకడిని. అప్పటి పాఠ్య పుస్తకాన్ని కాల్‌టెక్‌లో చదివినవారే తయారు చేశారు. ఆ పుస్తకం ఐసీ డిజైన్‌ను విప్లవీకరించింది. మా తరం సూపర్ జైంట్ చిప్‌లు డిజైన్ చేసేందుకు, అంతిమంగా సీపీయూ తయారీకి వీలు కల్పించింది.

కంప్యూటింగ్‌లో బ్రహ్మాండమైన వృద్ధికి సీపీయూ బాటలు పరచింది. ప్రపంచం అంతకు ముందెన్నడూ చూడనంత సామూహిక ఉత్పత్తి మొదలైంది. అది పైకి కనిపించనిది. తేలిగ్గా కాపీ చేయదగినది. అదే సాఫ్ట్‌వేర్. నేను మీలాగా విద్యార్థిగా ఉన్నప్పుడు అది చాలా స్వల్ప స్థాయిలో ఉంది. సాఫ్ట్‌వేర్‌ను విక్రయించి సొమ్ము చేసుకోవచ్చుననే భావన అప్పట్లో ఒక స్వైర కల్పన మాత్రమే. నేడు అది అత్యంత ముఖ్యమైన వస్తువు అయిపోయింది. ఎన్విడియా తీసుకొచ్చిన 'కుడా' ఫలితంగా కంప్యూటింగ్‌లో వచ్చిన వేగం మరింత ముందుకు సాగేందుకు తోవ చూపింది.

అలెక్స్ నెట్‌కు శిక్షణ ఇచ్చేందుకు కొందరు ఎన్విడియాకు చెందిన 'కుడా జీపీయూ'లను ఉపయోగించుకున్నారు. డీప్ లెర్నింగ్ ఆవిర్భవించింది. ఆ కీలక పరిణామం ఏఐ విప్లవానికి నాంది పలికింది. భారీ జీపీయూ క్లస్టర్లను నిర్మించకుండా డీప్ లెర్నింగ్‌కు ఉన్న పరిమితులను అన్వేషించేదెట్లా? వాటిని నిర్మించడానికి కోట్లాది డాలర్లు అవసరం. అంత ఖర్చు పెట్టినా ఫలితం ఉంటుందా? క్లస్టర్లను నిర్మించకపోతే, అది ఎప్పటికీ మనకు తెలియదు. వేలాది ఇంజినీర్లు డీప్ లెర్నింగ్ పైన, అడ్వాన్సింగ్, స్కేలింగ్ డీప్ లెర్నింగ్ పైన పదేళ్ళపాటు కృషి చేశారు. మా మొదటి ఏఐ సూపర్ కంప్యూటర్ డీజీఎక్స్–1ను శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఒక స్టార్టప్‌కు 2016లో అందించాం. ఏఐపై పనిచేస్తున్న నా స్నేహితుల బృందం 'ఓపెన్ ఏఐ' పేరుతో ఆ కంపెనీని నెలకొల్పింది. వాళ్లే 'చాట్‌జీపీటీ' తెచ్చారు.

తోటమాలి నేర్పిన పాఠం

ఏఐలో తదుపరి అల రోబోటిక్స్ కాబోతోంది. రోబోలు, రోబోటిక్ వాహనాలు, హ్యూమనాయిడ్ రోబోలు, చివరకు రోబోలు కాపలాగా ఉండి నడిపించే భారీ గిడ్డంగులను నిర్మించే వందలాది కంపెనీలతో మేం కలసి పనిచేస్తున్నాం. కానీ, మా రోబోటిక్స్ పయనంలో చాలా ఎదురుదెబ్బలు తిన్నాం. డీప్ లెర్నింగ్ అంటే ఎవరికీ అర్థం కాని సమయంలో కలన గణితాన్ని ప్రాసెసింగ్ చేసే ప్రపంచపు మొదటి రోబోటిక్ కంప్యూటర్‌ను నిర్మించాం. మేం పరిస్థితులకు తగ్గట్లుగా ఒదిగిపోయే, మార్పు చెందే, చతికిల పడినా తిరిగి లేవగలిగిన శక్తిని అభివృద్ధి చేసుకున్నాం.

మా పిల్లలు చిన్న వయసులో ఉండగా, ఒక వేసవిని జపాన్‌లో గడిపాం. ఒక వారాంతంలో క్యోటో వెళ్ళి, సిల్వర్ టెంపుల్ చూశాం. అది ఆకర్షణీయమైన మోస్ గార్డెన్‌కు ప్రసిద్ధి. అక్కడ ఒక ఒంటరి తోటమాలిని గమనించాను.

అక్కడ ప్రపంచంలో దాదాపు ప్రతి రకం నాచునూ పెంచుతారు. దగ్గరికి వెళ్ళి ఏం చేస్తున్నావు అని ప్రశ్నించాను. 'నిర్జీవంగా మారిన నాచును తొలగిస్తున్నాను' అని జవాబిచ్చాడు. 'కానీ మీ గార్డెన్ చాలా పెద్దది కదా!' అన్నాను. 'నేను 25 ఏళ్ళుగా ఈ తోట ఆలనాపాలనా చూస్తున్నాను. నాకు కావలసినంత సమయం ఉంది' అని జవాబిచ్చాడు. జీవితంలో నేను నేర్చుకున్న అత్యంత సునిశితమైన పాఠాలలో అదొకటి. ఈ తోటమాలి తనకు వచ్చిన కళకు అంకితమయ్యాడు. మనమూ అదే బాటలో నడిస్తే, మనకు కావాల్సినంత సమయం ఉంటుంది.

నేను చేయవలసిన పనుల ప్రాధాన్య క్రమాన్ని రాసుకుని, ప్రతి రోజూ ఉదయం, ఆ జాబితాలోని మొదటి పనితో ప్రారంభిస్తా. ఏ పని తర్వాత ఏ పని చేయాలన్న విషయంలో చాలా స్పష్టతతో ఉంటాను. నేను పనిలో ఉండగా ఎవరన్నా వచ్చి ఏదో చెప్పి లేదా అడిగి అవాంతరం కల్పించినా 'నాకు చాలా సమయం ఉంది. నా పని పూర్తి చేసుకోగలను' అని చెబుతాను.

సూపర్ పవర్స్

మనం పడే వేదనలు, కష్టాలు మన వ్యక్తిత్వాన్ని పటిష్ఠ పరుస్తాయి. ఒకటి కాకపోతే మరొకటి ప్రయత్నించి చూద్దామనే లక్షణం అలవడుతుంది. నా సామర్థ్యాలలో నేను ఎక్కువ విలువ ఇచ్చుకునేది నా ఇంటెలిజెన్స్‌కు కాదు. కష్టనష్టాలను భరించగల నా సహనశీలతకు; ఒకదాన్ని ఎంచుకున్న తర్వాత, ఆ పనిపై సుదీర్ఘమైన కాలం పనిచేయగల నా పట్టుదలకు; ఎదురు దెబ్బలను తట్టుకుని నిలబడగల శక్తికి; త్వరలోనే మరో అవకాశం రాబోతోందనే నా ఆశాభావానికి! వాటినే నేను నా 'సూపర్ పవర్లు'గా పరిగణిస్తాను.

> నా సామర్థ్యాల్లో నేను ఎక్కువ విలువ ఇచ్చుకునేది ఇంటెలిజెన్స్‌కు కాదు. కష్టాలను భరించగల నా సహనశీలత, ఒక పనిపై సుదీర్ఘ కాలం పనిచేయగల నా పట్టుదల, మరో అవకాశం వస్తుందనే ఆశాభావం... ఇవే నా సూపర్ పవర్లు.

మీకు కావాల్సింది కనుగొనగలరని భావిస్తున్నాను. మొదటి రోజునే ఒక నిర్ణయానికి వచ్చేయాలని అనుకోవద్దు. తక్కువ కాలంలోనే దాన్ని కనుగొనగలగడం కూడా ముఖ్యం కాదు. కానీ, మీ జీవిత కాలాన్ని అంకితం చేయడానికి ఒక పనిని మీరు కనుగొనగలరని ఆశిస్తున్నాను. మీ నైపుణ్యాలకు దానిలో పదును పెట్టుకోండి. అది మీ జీవితకాల కృషి కావాలి.

చివరగా, చెప్పేది ఒక్కటే. జీవితంలో దేని తర్వాత ఏమిటో నిర్ణయించుకోవాలి. జీవితంలో అనేక సంఘటనలు చోటుచేసుకుంటూ ఉంటాయి. చేయవలసిన పనులు అనేకం ఉంటాయి. కానీ, ప్రాధాన్య క్రమాన్ని ఏర్పరచుకోండి. ముఖ్యమైన పనులు చేసేందుకు కావలసినంత సమయం చిక్కుతుంది. ◆

'శ్రీబాగ్' అమలుతోనే సీమాభివృద్ధి

> ◆ శ్రీబాగ్ ఒప్పందం అంటే రాయలసీమకు రాజధాని మాత్రమే అన్న ప్రచారం జరుగుతోంది. రాజధాని అంశం ఉన్నా... కృష్ణా, తుంగభద్రల జలాల్లో రాష్ట్రానికి లభించే నీటి వాటాలో ప్రథమ ప్రాథమ్యం సీమకు అందించడం అంతకంటే ముఖ్యం.

'శ్రీబాగ్ అవగాహన'కు 88 ఏళ్లు వచ్చినా తీరుతాయనుకున్న రాయలసీమ కష్టాలు అలాగే ఉన్నాయి. భాషాభిమానం, రాజకీయ కారణాలతో మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి తెలుగువారు ఒక రాష్ట్రంగా విడిపోవాలని మధ్యకోస్తా ఆంధ్ర పెద్దలలో ఒక ఆలోచన వచ్చింది. అయితే రాయలసీమకు అత్యంత సమీపంలో ఉన్న మద్రాసు నగరాన్ని వదులుకుని అప్పటికే అభివృద్ధిలో మెరుగ్గా ఉన్న కోస్తా ఆంధ్రతో కలిసి రాష్ట్రంగా ఏర్పడటం సీమ పెద్దలకు ఇష్టం లేదు. ఆంధ్రా యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియలో జరిగిన అనుభవాలతో అనుమానాలు పెరిగాయి. 1926 ఆంధ్ర మహాసభ... ఆంధ్రా యూనివర్సిటీనీ వెనుకబడిన అనంతపురంలో ఏర్పాటు చేయాలని తీర్మానం చేసింది. ఆంధ్ర మహాసభ తీర్మానానికి భిన్నంగా నాటి ప్రజా ప్రతినిధులు నాటి మద్రాసు అసెంబ్లీలో వ్యవహరించారు. ఈ పరిణామంతో పప్పూరి రామాచర్యులు, టీఎన్ రామకృష్ణా రెడ్డి లాంటి వారు ఉంటే మద్రాసుతో కలిసి ఉందాము, లేకపోతే రాయలసీమ రాష్ట్రంగా విడిపోవాలని ప్రతిపాదన చేశారు.

మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి తెలుగు రాష్ట్రం విడిపోతే ఆంధ్ర, సీమ ప్రాంతాల పాలన, అభివృద్ధికి ఏమేమి చేయాలో అందులో ఇరు ప్రాంతాల నాయకుల మధ్య కుదిరినదే 'శ్రీబాగ్ ఒప్పందం' (1937 నవంబర్ 16).

అయితే శ్రీబాగ్ ఒప్పందానికి చట్టబద్ధత లేదనీ, ఇది కాంగ్రెస్ పార్టీలోని రెండు గ్రూపుల మధ్య కుదిరిన ఒప్పందమనీ నేటికీ తప్పుడు ప్రచారం జరుగుతోంది. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం... రాజధాని, హైకోర్టుల్లో తమకు ఏమి కావాలో ఎంపిక చేసుకునే అవకాశం సీమకు ఇచ్చారు. సీమలోని కర్నూలును రాజధానిగా చేశారు. గుంటూరులో హైకోర్టును ఏర్పాటు చేశారు. తరువాతి కాలంలో 'ఆంధ్రప్రదేశ్' ఏర్పడి రాజధాని, హైకోర్టులు హైదరాబాద్‌కు చేరడం తెలిసిందే.

రాష్ట్రంలోని రాజకీయ వాతావరణం కారణంగా శ్రీబాగ్ ఒప్పందం అంటే రాయలసీమకు రాజధాని మాత్రమే అన్న ప్రచారం జరుగుతోంది. ఒప్పందంలో రాజధాని అంశం ఉన్నా, అంతకన్నా ముఖ్యమైన అంశం... కృష్ణా, తుంగభద్రల జలాల్లో రాష్ట్రానికి లభించే నీటి వాటాలో ప్రథమ ప్రాథమ్యం సీమకు అందించడం! ఇందుకోసం ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి. నిజానికి రాయలసీమ సమగ్రాభివృద్ధి జరగాలి అంటే కోటి ఎకరాల వ్యవసాయ యోగ్య భూమికి నీటి సౌకర్యం కల్పించాలి. కృష్ణా – తుంగభద్రలకు ముఖద్వారం రాయలసీమ అయినప్పటికీ సీమకు నీరు అందించడానికి అనుగుణంగా ప్రాజెక్టుల నిర్మాణం జరగలేదు. ఫలితంగా సీమ వెనుకబడిన ప్రాంతంగా మిగిలింది.

శ్రీశైలం నీటిని సత్వరం అందిపుచ్చుకునే విధంగా సిద్దేశ్వరం అలుగు, పోతిరెడ్డిపాడు వెడల్పు, రాయలసీమ ఎత్తిపోతల పథకం, తుంగభద్ర నీటిని ఉపయోగించుకునే విధంగా గుండ్రేవుల, కుందూపై రిజర్వాయర్లు; గాలేరు నగరి, హంద్రీ–నీవా, చెరువుల పునరుద్ధరణ జరిగితేనే రాయలసీమ కరువుకు శాశ్వత పరిష్కారం.

– మాకిరెడ్డి పురుషోత్తమ రెడ్డి,
రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయ కర్త

సీసీఐ నిబంధనల్ని తొలగించాలి!

రెండు తెలుగు రాష్ట్రాల్లో పత్తి రైతులు సంక్షోభంలో ఉన్నారు. సేద్యపు ఖర్చులు పెరుగుతూ ఉండటం, న్యాయమైన ధర లభించక పోవటం, ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోవడం, పత్తి దిగుమతులు పెరుగుతూ ఉండటం ఇందుకు కారణాలు.

తెలంగాణలో ఎకరాకు సగటున 11.74 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగా, ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తామని సీసీఐ చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో 4.56 లక్షల హెక్టార్లలో రైతాంగం పత్తి సేద్యం చేశారు. సుమారు 8 లక్షల టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో భారీ వర్షాలకు అపార నష్టం జరిగింది. ఎకరం సేద్యంపై 40 వేలకు పైగా రైతు పెట్టుబడి పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎటువంటి వంకలూ పెట్టకుండా రైతుల వద్ద ఉన్న పత్తిని పూర్తిగా కొనుగోలు చేయాల్సిన బాధ్యత సీసీఐ చేపట్టే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

సంక్షోభంలో ఉన్న పత్తి రైతుల వద్ద నుంచి పత్తి సేకరణకు చాలా ఆలస్యంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ప్రకటన వచ్చింది. రెండు రాష్ట్రాల్లో ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తానని చెప్పి 7 క్వింటాళ్లకు తగ్గించారు. పత్తికి 8,110 రూపాయల మద్దతు ధర ఇవ్వాలంటే తేమ 12% మించరాదని నిబంధన పెట్టారు. రైతు సీసీఐ కేంద్రాల్లో అమ్ముకోవాలంటే ముందుగా రైతు సేవా కేంద్రాల్లో పేరు నమోదు చేసుకున్న తర్వాత, కేంద్రం పెట్టిన 'కిపాస్ కిసాన్ స్లాట్'లో 24 గంటల ముందు బుక్ చేసుకోవాలి. దీనిపై 70% మంది రైతులకు అవగాహన లేదు. సీసీఐ నిబంధనలు రైతుల నుంచి పత్తి కొనుగోళ్లను తగ్గించుకోవటానికే! రెండు రాష్ట్రాల్లో తుపాన్, భారీ వర్షాల వల్ల పత్తికి నష్టం జరిగి ఎకరాకు దిగుబడి 5 నుండి 7 క్వింటాళ్లకు మించి రాదనీ, అందుకే సేకరణ ఎకరాకు 12 నుండి 7 క్వింటాళ్లకు తగ్గించడం జరిగిందనీ సీసీఐ చెప్పటం మోసమే! ఎటువంటి ఆంక్షలూ లేకుండా పత్తి మద్దతు ధరను 10 వేలుగా ప్రకటించాలనీ, పత్తి దిగుమతులపై 30% సుంకం విధించాలనీ, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పత్తి కొనుగోలు చేయాలనీ... రైతాంగం ఆందోళన బాట పట్టాలి.

– బొల్లిముంత సాంబశివరావు
రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

పాదచారులకు ప్రాణాంతకమే!

డేటా పాయింట్

మన దేశంలో 2023లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.7 లక్షల మంది మరణిస్తే, అందులో అత్యధికులు ద్విచక్ర వాహన ప్రమాదాల్లోనే ప్రాణాలు కోల్పోయారు. రెండో స్థానంలో పాదచారులు ఉన్నారు.



జ్ఞాన ప్రదాత

జ్యోతిర్మయం

లౌకిక జీవితంలో బుద్ధిని వికసింపజేసే విద్యలను అనుగ్రహించే గురువు, పారమార్థికంగా తత్వజ్ఞానాన్ని ప్రసాదించే జ్ఞాన ప్రదాత దక్షిణామూర్తి అంటారు. దాక్షిణ్యం అంటే దయ. ఆ దాక్షిణ్య భావాన్ని ప్రకటించే రూపమే దక్షిణామూర్తి. అజ్ఞానం వల్లనే దుఃఖాలన్నీ! దుఃఖం జీవితంలో అంధకారాన్ని నింపుతుంది. అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించుకోవటానికి దక్షిణామూర్తిని సేవిస్తారు.

బ్రహ్మ మానస పుత్రులైన సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు... బాల్యంలోనే వైరాగ్య భావనతో 'ఏ జ్ఞానంతో సంశయాలన్నీ తొలగి శాంతి లభిస్తుందో, అటువంటి జ్ఞానాన్ని అందించేవారు ఎవరు?' అని అన్వేషణ ప్రారంభించారు. వారికి నారద మహర్షి తారసపడ్డాడు. వారు జ్ఞానప్రదాతను చూపమని కోరారు. నారదుడు వారిని బ్రహ్మ లోకానికి మొదట తీసుకెళ్లాడు. అక్కడ సరస్వతి వీణా గానానికి తాళం వేస్తున్న బ్రహ్మను చూసి ఈయన తమకు బోధ చేయలేడని వెనుదిరిగారు. వైకుంఠానికి వెళ్లారు. అక్కడ శేష పాన్పుపై శయనించి ఉన్న విష్ణువు పాదాలు ఒత్తుతున్న లక్ష్మీదేవిని చూశారు. ఆ అంతఃపుర వైభవం చూస్తే ఆధ్యాత్మిక జ్ఞానం కలిగించేట్లు లేదు. విష్ణువు జ్ఞానబోధ చేయలేడని అనుకున్నారు. కైలాస పర్వతానికి వెళ్లారు. అక్కడ ఆది దంపతులు మమేకమై నృత్యం చేస్తున్నారు. సనకాదులు ఇంక ఎవరున్నారని ఆలోచనలో పడ్డారు.

పరమ శివుడు వీరిని ఉద్ధరించటానికి ఒక్కడే బయలుదేరి వారి మనోభావానికి తగిన రూపధారణ చేశాడు. వారు వస్తున్న తోవలో ఒక విశాల వటవృక్ష నీడలో దక్షిణాభిముఖుడై కూర్చుని ఉన్నాడు. ఆ మూర్తిని చూసి వారు ప్రశాంతత పొందారు. ఆయన పాదాల వద్ద కూర్చున్నారు. వీరు ఏమీ అడగలేదు. ఆయన ఏమీ చెప్పలేదు. అయినా సంశయాలన్నీ తీరిపోయాయి. ఆత్మ సాక్షాత్కారం పొందారు. గురు సాన్నిధ్యమే గొప్ప బోధ.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

దేదీప్యమానంగా శైవక్షేత్రాలు

ప్రమదగణాలన్నీ జయజయధ్వానాలు చేసినట్టు.. నందీశ్వరుడు రంకెలేస్తూ ఆనంద తాండవం ఆడినట్టు.. హరహరమహాదేవ నినాదమే డమరుకనాదమై మార్మోగినట్టు.. గుడిగంటలే ప్రణవ మంత్రమై లయకారుడిని కీర్తించినట్టు.. మనో'హరుడే' ఇల దిగివచ్చినట్టు రాష్ట్రంలోని శైవక్షేత్రాలు దేదీప్యమానమై మెరిశాయి. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో భక్తులతో పోటెత్తాయి.

ప్రకాశించిన శ్రీశైలం

శ్రీశైల మహా క్షేత్రం కాశీ క్షేత్రం వల్లే ప్రభాసించింది. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా నిర్వహించిన లక్ష దీపోత్సవంతో పుష్కరిణి కాంతులీనింది. పుష్కరిణి హారతి దేదీప్యమానమై సాగింది. భక్తులను ఆధ్యాత్మిక సాగరంలో ఓలలాడించింది. - శ్రీశైలం టెంపుల్

శ్రీకాళహస్తి.. దీప హరవిల్లు

శ్రీకాళహస్తీశ్వరాలయం దీపోత్సవాలతో దేదీప్యమానమైంది. 'హర'విల్లై విరాజిల్లింది. భక్తులు భారీగా తరలివచ్చి రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇదిలా ఉంటే ఈ నెల 19న నిర్వహించే స్వర్ణముఖి నది హారతులకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. - శ్రీకాళహస్తి

తమసోమా జ్యోతిర్గమయ

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని సోమారామక్షేత్రం తమసోమా జ్యోతిర్గమయ అంటూ నినదించింది. శ్రీ ఉమాసోమేశ్వర స్వామి సేవలో భక్తజనం పులకించింది. సుమారు 20 వేల మంది భక్తులను స్వామి కటాక్షించినట్టు అంచనా. - భీమవరం(ప్రకాశం చౌక్)

క్షీరాభిషేకం

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని క్షీరారామం అభిషేకాలతో ఉప్పొంగింది. సుమారు 50 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు అంచనా. - పాలకొల్లు సెంట్రల్

అమరధామంలా శోభిల్లే

పల్నాడు జిల్లా అమరావతిలోని శ్రీబాలచాముండికా సమేత అమ రేశ్వరాలయం అమరధామంలా ప్రకాశించింది. భక్తులతో కళకళలాడింది. స్వామికి అభిషేకాలతోపాటు అమ్మవారికి కుంకుమార్చనలు నేత్రపర్వంగా సాగాయి. - అమరావతి

ఆరామాల్లో ఆధ్యాత్మిక పరవశం

ద్రాక్షారామం, సామర్లకోటలు కార్తీక మాసం చివరి సోమవారం భక్తులతో కళకళలాడాయి. ద్రాక్షారామలో కొలువైన మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామి, సామర్లకోటలోని బాలా త్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి భక్తుల పూజలందుకున్నారు. - ద్రాక్షారామం/సామర్లకోట

మరో 19 మంది బాలికలకు అస్వస్థత

41కి చేరిన బాధితుల సంఖ్య

కొయ్యూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలంలోని రాజేంద్రపాలెం బాలికల వసతి గృహంలో మరో 19 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం రాత్రి, ఆదివారం ఈ వసతిగృహానికి చెందిన 22 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై విశాఖ కేజీహెచ్, రాజేంద్రపాలెం పీహెచ్సీలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకూ మరో 19 మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో బాధిత బాలికల సంఖ్య 41కి పెరిగింది. బాలికలు అస్వస్థతకు గురవడానికి తాగునీరు కలుషితం కావడమే కారణమని భావిస్తున్నారు. వసతిగృహంలో తాగునీటి ట్యాప్ పక్కనే మురుగునీరు ప్రవహిస్తోంది. ఆ నీరు ట్యాప్ నీటిలో కలిసే అవకాశం ఉంది. పాడేరు నుంచి వచ్చిన ఆహార తనిఖీ ఇన్స్పెక్టర్ గ్రీష్మ శ్రీ తాగునీటి శాంపిళ్లను సేకరించి, పరీక్షల కోసం విశాఖపట్నం పంపారు.

అనురాధ చాకలికి జాతీయ గోపాల రత్న అవార్డు

సాక్షి, న్యూఢిల్లీ: పశువులు, పాడి పరిశ్రమ రంగంలో అందించిన ఉత్తమ సేవలకుగాను నంద్యాలకు చెందిన అనురాధ చాకలికి 'జాతీయ గోపాల రత్న' అవార్డు దక్కింది. ఉత్తమ కృత్రిమ గర్భధారణ సాంకేతిక నిపుణులు(ఏఐటీ) కేటగిరిలోని నాన్–ఎన్ఈఆర్ విభాగంలో ఆమె రెండో స్థానంలో నిలిచి ఈ అవార్డు పొందింది. అలాగే, దేశీయ పశువులు, గేదె జాతుల పెంపకంలో ఉత్తమ పాడి రైతు కేటగిరీ కింద నాన్– ఎన్ఈఆర్ (ఈశాన్య ప్రాంతం కాని) విభాగంలో తెలంగాణలోని హైదరాబాద్కు చెందిన డాక్టర్ కంకణాల కృష్ణారెడ్డికి కూడా ఈ అవార్డు దక్కింది. అవార్డుల వివరాలను కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది. అవార్డులను ఈ నెల 26న జాతీయ పాల దినోత్సవం రోజు ఢిల్లీలో కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రదానం చేయనున్నారు.

కుప్పం చేరుకున్న కుంకీ ఏనుగులు

కుంకీ ఏనుగులు జయంత్, వినాయక్

కుప్పం రూరల్: అటవీ అధికారులు ప్రత్యేక శిక్షణ నిమిత్తం చిత్తూరు జిల్లాలోని పలమనేరు ఎలిఫెంట్ శాంచరీకి తరలించిన జయంత్, వినాయక్ కుంకీ ఏనుగులను మళ్లీ కుప్పం తీసుకొచ్చారు. ఇటీవల తమిళనాడు నుంచి తరచూ కుప్పం వైపు ఏనుగులు వస్తుండడంతో వాటిని అడవిలోకి తరమేందుకు ఈ కుంకీ ఏనుగులను తెప్పించారు. ప్రస్తుతం నడుమూరు అటవీక్షేత్రంలో ఏనుగులు సేద తీరుతున్నాయి.

భక్తులతో కిక్కిరిసిన సత్యదేవుని ఆలయం

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి ఆలయం సోమవారం వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కిక్కిరిసింది. కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా సుమారు 90 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆదివారం రాత్రి నుంచి భక్తులు సత్యదేవుని ఆలయానికి చేరుకోవడం ప్రారంభించారు. దీంతో సోమవారం వేకువ జామున ఒంటి గంట నుంచి సత్యదేవుని వ్రతాలు ప్రారంభించి స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. రికార్డు స్థాయిలో సుమారు తొమ్మిదివేల సత్యదేవుని వ్రతాలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.కోటి ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

మహిళా వైస్ ఎంపీపీపై కక్షసాధింపు

వైఎస్సార్సీపీ సానుభూతిపరులను టార్గెట్ చేస్తూ దౌర్జన్యాలు

చంద్రగిరి: టీడీపీ నేతల ప్రోద్బలంతో ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నాయకులపై అధికారులు కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. ప్రజాప్రతినిధులన్న సంగతి కూడా మరచి ఇష్టానుసారంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం తిరుపతి రూరల్ మహిళా వైస్ ఎంపీపీ యశోదపై టీడీపీ నేతలు అధికారులను అడ్డంపెట్టుకుని కక్షసాధింపులకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. దామినేడుకు చెందిన వైస్ ఎంపీపీ యశోదకు తిరుచానూరు ఘంటసాల విగ్రహం సమీపంలో గత 50 ఏళ్లకుపైగా దుకాణాలు ఉన్నాయి. దుకాణం ముందు మూడు అడుగుల వరకు యాత్రికుల సౌకర్యార్థం పదేళ్ల క్రితం రేకుల షెల్టర్ను ఏర్పాటు చేశారు. ఆమెతోపాటు ఇతర దుకాణాదారులూ షెల్టర్లను నిర్మించుకున్నారు. అయితే సోమవారం టీడీపీ నాయకుల ఆదేశాలతో పంచాయతీ ఈఓ మణి మందీమార్బలంతో యశోద దుకాణం వద్దకు చేరుకున్నారు. వెంటనే ఎలాంటి సమాచారం అందించకుండా జేసీబీ సాయంతో రేకుల షెల్టర్ను కూలదోశారు. సమాచారం అందుకున్న వైస్ ఎంపీపీ యశోద ఘటన స్థలానికి చేరుకుని అధికారుల తీరును ఎండగట్టారు. కనీసం నోటీసు ఇవ్వకుండా దౌర్జన్యంగా షెల్టర్ను ఎలా కూలదోస్తారంటూ మండిపడ్డారు. ఈ క్రమంలో పంచాయతీ ఈఓ మణి, ఒక మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా ఆమెపై అమర్యాదగా ప్రవర్తించడంతో స్థానికులు మండిపడ్డారు. రోడ్డుకు రెండు వైపులా పదుల సంఖ్యలో దుకాణాలు ఉన్నాయని, ఏ దుకాణం వద్దకు వెళ్లకుండా కేవలం వైఎస్సార్సీపీ మద్దతుదారు కావడంతో తన దుకాణం షెల్టర్ను నేలమట్టం చేశారంటూ యశోద ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.1.5లక్షల విలువైన బోర్డులనూ పాడుచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుచానూరులో పెద్ద ఎత్తున జరుగుతున్న ఆక్రమణలు, కబ్జాలు ఈ అధికారులకు కనిపించడం లేదా అంటూ ఆమె మండిపడ్డారు. సమాచారం ఇవ్వకుండా, నోటీసులు జారీ చేయకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వారికి కాలమే సరైన సమాధానం చెబుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే చంద్రబాబు సర్కారుపై ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని, రానున్న రోజుల్లో సరైన బుద్ధి చెబుతారని అన్నారు.

ఘంటసాల కూడలి సమీపంలోని దుకాణం వద్ద దౌర్జన్యంగా షెల్టర్ను తొలగించిన దృశ్యం

17 గ్రాముల ఎండీఎంతో ఆరుగురి అరెస్ట్

బెంగళూరులో కొనుక్కొచ్చిన గుంటూరు యువకులు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): గుంటూరులో పోలీసులు అత్యంత ప్రమాదకరమైన మత్తుపదార్థం ఎండీఎంను స్వాధీనం చేసుకుని ఆరుగురు యువకులను అరెస్టు చేశారు. గుంటూరులో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ ఈ కేసు వివరాలు తెలిపారు. ఎస్పీ తెలిపిన మేరకు.. బుడంపాడు అన్నపూర్ణ కాంప్లెక్స్ సమీపంలోని ఓపెన్ ప్లాట్స్లో ఆదివారం పాత గుంటూరు పోలీసులు తనిఖీలు చేశారు. అక్కడ గుంటూరుకు చెందిన ఆళ్ల అనిల్కుమార్, చింతల శ్రావణచంద్రప్రసాద్ అలియాస్ బెంజిమెన్, మానిగినేటి గురుమహారాజు అలియాస్ గురు, మెడ రితేష్, ఏటీ అగ్రహారం 4వ వీధిలో ఉంటున్న షేక్ రోషన్, షేక్ నవీద్సల్మాన్ అలియాస్ నవీద్ను పట్టుకున్నారని, వారి నుంచి 17 గ్రాముల ఎండీఎంను స్వాధీనం చేసుకున్నారు. అనిల్, శ్రావణచంద్రప్రసాద్కు రోషన్, నవీద్సల్మాన్ల ద్వారా బెంగళూరులో మత్తుమందులు విక్రయించే ఫరాజ్ఖాన్ పరిచయమయ్యాడు. అనిల్, శ్రావణచంద్రప్రసాద్ బెంగళూరు వెళ్లి ఫరాజ్ఖాన్కు ఆన్లైన్లో రూ.34 వేలు చెల్లించి ఎండీఎం కొని గుంటూరు తీసుకొచ్చారు. ఈ మత్తుపదార్థాన్ని వినియోగించేందుకు అనిల్, శ్రావణచంద్రప్రసాద్, రోషన్, నవీద్సల్మాన్, గురుమహారాజు, రితేష్ బుడంపాడు అన్నపూర్ణ కాంప్లెక్స్ వెనుక ఓపెన్ ప్లాట్స్లోకి వెళ్లారు. ముందస్తు సమాచారంతో పాతగుంటూరు పోలీస్ స్టేషన్ సీఐ వెంకటప్రసాద్ అక్కడికి వెళ్లి ఆరుగురిని అరెస్ట్ చేశారు. బెంగళూరు వాసి ఫరాజ్ఖాన్ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని పంపుతున్నట్లు ఎస్పీ చెప్పారు. తూర్పు డీఎస్పీ అబ్దుల్అజీజ్, పాతగుంటూరు సీఐ వెంకటప్రసాద్, ఎస్ఐలు ప్రసాద్, రెహమాన్, సిబ్బంది నూరుద్దీన్, మురళీలను ఆయన అభినందించారు.

మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గతంలోనూ అవే కేసులు

ఈ ఆరుగురు నిందితులు 31 ఏళ్ల లోపువారే. 23 ఏళ్ల రోషన్పై నగరంపాలెం పీఎస్లోను, గుంటూరు–1 ఎక్సైజ్స్టేషన్లోను ఎండీఎం, ఎన్డీపీఎస్ కేసులు, 24 ఏళ్ల నవీద్పై నగరంపాలెం పీఎస్లో, శ్రావణచంద్రప్రసాద్పై పెదకాకాని పీఎస్లో ఎండీఎం, ఎన్డీపీఎస్ కేసులు ఉన్నాయని ఎస్పీ వివరించారు. తరుచూ పట్టుబడేవారిపై పీడీ చట్టం ప్రయోగించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

బాబు 'రెడ్బుక్ 'పాలనకు పరాకాష్ట

తిరుపతిలో వైఎస్సార్సీపీ శ్రేణుల నిరసన

తిరుపతి మంగళం : చంద్రబాబు ప్రభుత్వ రెడ్ బుక్ పాలనకు హిందూపురం దాడి ఘటన పరాకాష్ట అని తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష ధ్వజమెత్తారు. హిందూపురంలో వైఎస్సార్సీపీ కార్యాలయంపై టీడీపీ గూండాల దాడిని ఖండిస్తూ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ దేశ అభ్యున్నతి కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచిస్తే, వైఎస్సార్సీపీపై కక్ష సాధింపుల కోసం చంద్రబాబు, లోకేశ్, పవన్కళ్యాణ్ రెడ్బుక్ను రచించారన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్సీపీ కార్యాలయాలపై దాడులు చేయడం, పార్టీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపడం, పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ 'సాక్షి' ఎడిటర్పై కూడా కేసులు పెడుతూ రెడ్ బుక్ పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, వారే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ హిందూపురంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంపై టీడీపీ గూండాలు చేసిన దాడి హేయమైన చర్య అన్నారు. రాష్ట్రంలో ఇంతగా టీడీపీ గూండాలు విధ్వంసాలు సృష్టిస్తుంటే చంద్రబాబు కళ్లకు గంతలు కట్టుకున్నారా.. అని ప్రశ్నించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కేతం జయచంద్రారెడ్డి, అజయ్కుమార్ మాట్లాడుతూ హిందూపురంలో వైఎస్సార్సీపీ కార్యాలయంపై దాడి మెంటల్ బాలకృష్ణకు తెలియకుండా జరుగుతుందా? అని ప్రశ్నించారు. పార్టీ కార్యాలయాలపై, సాక్షి కార్యాలయాలపై టీడీపీ గూండాలు ఇష్టమొచ్చినట్లు రెచ్చిపోయి దాడులు చేస్తున్నా చంద్రబాబు పట్టించుకోవడంపై ఆయనే దాడులను ప్రేరేపిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. టీడీపీ మూకలు వైఎస్సార్సీపీ కార్యాలయంపై దాడి చేసి ధ్వంసం చేస్తే తిరిగి తమ పార్టీ శ్రేణులపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టడం చంద్రబాబు నీచతత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రపంచస్థాయికి సత్యసాయి శత జయంతి ఉత్సవాలు

శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్

సాక్షి, పుట్టపర్తి: భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ప్రపంచ స్థాయికి వెళ్లడం గర్వంగా ఉందని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ రాజు తెలిపారు. సోమవారం ఆయన ప్రశాంతి నిలయంలోని మీడియా పాయింట్లో విలేకరులతో మాట్లాడారు. పుట్టపర్తి మొదలుకుని దేశ వ్యాప్తంగా పలు చోట్ల ఉత్సవాలు చేస్తున్నారని, పలు దేశాల్లో కూడా సత్యసాయి చిత్రపటం ఉంచి 'హ్యాపీ బర్త్ డే సత్యసాయి' అంటూ వేడుకలు చేస్తున్నారని చెప్పారు. న్యూయార్క్ లోని ప్రధాన కూడలిలో సత్యసాయి ప్రవచనాలు ఉంచడం గర్వంగా ఉందన్నారు. అభిమానులు, భక్తులు స్వచ్ఛందంగా తరలివచ్చి, విరాళాలిచ్చి శత జయంతి ఉత్సవాలకు సహకరిస్తున్నారని చెప్పారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏడాది వ్యవధిలో 220పైగా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వలంటీర్లు, సత్యసాయి విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు స్వచ్ఛందంగా సేవలో పాల్గొంటున్నట్లు తెలిపారు. మంగళవారం (నేడు) సత్యసాయి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. 19న ప్రధాని మోదీ, 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్తో పాటు పలువురు గవర్నర్లు, సీఎంలు పుట్టపర్తిలో నిర్వహిస్తోన్న బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు.

'కుటుంబం' కల చెదిరింది..

కళ్లు తెరవకుండానే కడుపులో కవలల మృతి / చికిత్స పొందుతూ చనిపోయిన భార్య / తట్టుకోలేక తనువు చాలించిన భర్త / శంషాబాద్లో విషాదకర ఘటన

హైదరాబాద్ (శంషాబాద్): మరికొద్ది రోజుల్లో ఓ అందమైన కుటుంబం ఆ తల్లిదండ్రుల ముందున్న కల.. కడుపులో ఉన్న కవలలు మరికొద్ది రోజుల్లో తమ కుటుంబానికి కళ తీసుకొస్తారని ఆశించారు. అయితే వారి కల అంతా కొన్ని గంటల్లోనే చెదిరిపోయింది. కడుపులో ఉన్నకవలలు కళ్లు తెరవకుండానే చనిపోయారు... ఆపై చికిత్స పొందుతూ భార్య మృతిచెందడంతో.. తీవ్ర ఆవేదనకు గురైన భర్త కూడా ఆత్మహత్యతో తనువు చాలించడంతో ఆ కల పీడకలగా ముగిసింది.

కడప జిల్లా రైల్వేకోడూరుకు చెందిన ముత్యాల విజయ్ (40) శంషాబాద్ ఎయిర్పోర్టులో ఉద్యోగం చేస్తూ భార్య శ్రావ్యతో కలిసి పట్టణంలోని సామ ఎన్క్లేవ్లోని ఓ గదిలో నివాసముంటున్నాడు. ఏడేళ్ల కిందటే వివాహం జరిగినా పిల్లలు కలగకపోవడంతో ఐవీఎఫ్ ద్వారా సంతాన భాగ్యానికి బాటలు వేసుకున్నారు. ఆదివారం రాత్రి 8 నెలల కడుపుతో ఉన్న శ్రావ్యకు కడుపునొప్పి రావడంతో ఆమె తల్లితో కలిసి అత్తాపూర్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ కడుపులో ఉన్న కవలలు చనిపోయారని తెలిపారు. దీంతో మనస్తాపానికి గురైన విజయ్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మరికొద్ది సమయం తర్వాత శ్రావ్యకు కూడా మెరుగైన చికిత్స చేయాల్సిందిగా సూచించడంతో గుడిమల్కాపూర్లోని మైత్రి ఆస్పత్రికి తీసుకెళ్తున్నట్లు అత్త సరోజిని విజయ్కు ఫోన్ చేసింది. విజయ్ అక్కడికి వెళ్లిన కొద్ది సమయంలోనే చికిత్స పొందుతూ శ్రావ్య కూడా మృతిచెందడంతో తీవ్ర మనస్తాపంతో శంషాబాద్లోని తన ఇంటికి వచ్చేశాడు. సోమవారం ఉదయం భార్యను తీసుకెళ్లడానికి భర్త సంతకం కావాలని ఆస్పత్రి యాజమాన్యం కోరడంతో వారి బంధువులు విజయ్కు ఫోన్ చేశారు. స్పందించకపోవడంతో ఇంటికి వచ్చి గది తెరిచి చూసేసరికి విజయ్ ఫ్యాన్కు ఉరేసుకుని విగత జీవిగా కనిపించాడు. మనస్తాపంతోనే తన తమ్ముడు ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని విజయ్ సోదరుడు ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతిచెందిన దంపతులు విజయ్, శ్రావ్య

వైభవంగా అలమేలు మంగమ్మ కార్తీక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాత్రి చిన్నశేష వాహనంపై దర్శనమిచ్చిన అమ్మవారు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈనెల 25 వరకు జరగనున్నాయి. సోమవారం అమ్మవారికి నిత్య కై ంకర్యాల అనంతరం.. చక్రతాళ్వార్, అమ్మవార్లతో పాటు గజ చిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. 9.15 గంటలకు ధనుర్లగ్నంలో గజ చిత్రపటాన్ని ధ్వజస్తంభంపై ఎగురవేసి ధ్వజారోహణం చేయడంతో తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో శ్రీకృష్ణ ముఖమండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం విద్యుత్కాంతుల మధ్య శ్రీవారి దేవేరికి ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. అనంతరం.. సర్వాలంకారభూషితురాలైన శ్రీవారి పట్టపురాణి రాత్రి 7 గంటలకు చిన్నశేష వాహనంపై పరమ వాసుదేవుడు అలంకారంలో ఆసీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వాహన సేవలో భాగంగా మంగళవారం ఉదయం పెద్దశేష వాహనం, రాత్రి హంస వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈఓ అనిల్కుమార్ సింఘాల్, జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్ఓ మురళీకృష్ణ, డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, కంకణ భట్టార్ శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగవద్దు అన్నందుకు ఆత్మహత్య

బుచ్చినాయుడుకండ్రిగ: మద్యం తాగవద్దని భార్య మందలించడంతో ఓ భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం కాటూరు గ్రామంలోని ఎస్టీ కాలనీలో సోమవారం జరిగింది. కాటూరు గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన కొట్లపాటి వెంకటయ్య (45) భార్య సిమ్రాన్తో కలసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరికీ రెండో పెళ్లి. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఏడాదిగా వెంకటయ్య మద్యానికి బానిస కావడంతో భార్య సిమ్రాన్ మద్యం తాగొద్దని పలుమార్లు వేడుకుంది. మూడు రోజులుగా వెంకటయ్య కూలీ పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటూ మద్యం తాగుతూ ఉండడంతో సోమవారం ఉదయం సిమ్రాన్ గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో వెంకటయ్య సిమ్రాన్ పుట్టింటికి వెళ్లి పురుగుల మందు తాగానని తెలపడంతో హుటాహుటిన శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఎ.పి.స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్
నిర్మాణ్ భవన్, ప్లాట్ నం. 11 & 12, ఆటోనగర్, విజయవాడ-520007, ఆం.ప్ర.
టెండర్లు కోరుతూ ప్రకటన
NIT No.605/E&P/APSHCL/R&R Balance Works/2025, తేది: 17.11.2025
R&R, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ క్రింద ASR జిల్లాలోని ఇందుకూరు–I లే అవుట్, దేవీపట్నం మండలంలో ఇన్ఫ్రా నిర్మాణ పని కోసం టెండర్లు కోరబడుతున్నవి. (3వ పిలుపు). ECV: రూ. 15.03 లక్షలు. వివరాలను www.apeprocurement.gov.in వెబ్సైట్ నుండి 18.11.2025న ఉ.11.00 గం.ల నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చును.
DIPR RO No.4578PP/CL/Advt/1/1/2021-22, Dt: 17.11.2025 సం/– చీఫ్ ఇంజినీర్

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దు

- లేకుంటే ఎన్నికలను నిలిపివేస్తాం
- మహారాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అంశంపై అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలను జారీ చేసింది. రిజర్వేషన్ల మొత్తం 50 శాతానికి మించి ఉండరాదని తేల్చి చెప్పింది. ఒకవేళ ఉల్లంఘన జరిగిందని తేలితే, ఎన్నికలను నిలిపివేయాలని ఆదేశిస్తామని ప్రకటించింది. ఇతర వెనుకబడిన తరగతుల(ఓబీసీ)కు రిజర్వేషన్లు 27 శాతం మేర రిజర్వేషన్లు కల్పించాలంటూ 2022లో జేకే బంథియా కమిషన్ సిఫారసు చేసినప్పటి పరిస్థితులకు అనుగుణంగానే మహారాష్ట్రలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిల ధర్మాసనం ఆదేశించింది. ఈ విషయమై తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీన చేపడతామంది. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్ సీలింగ్‌కు కట్టుబడి ఉండాల్సిందేనని పేర్కొంది. అంతకుమించితే మాత్రం ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ మొదలైందంటూ సాకులు చెప్పినా వినిపించుకోమని, తమ అధికారాలను పరీక్షించవద్దని హెచ్చరించింది. కొన్ని చోట్ల రిజర్వేషన్లు 70 శాతం వరకు ఉన్నాయంటూ సీనియర్ న్యాయవాదులు వికాస్ సింగ్, నరేంద్ర హూడా తెలపడంతో స్పందించిన ధర్మాసనం.. దీనిపై ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. గతంలో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. డిసెంబర్ 2వ తేదీన మున్సిపల్ కౌన్సిళ్లు, నగర పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 17 ఆఖరి తేదీ.

విమాన చార్జీల అడ్డగోలు పెంపు

కేంద్రం స్పందన కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: దేశంలో ప్రైవేట్ విమానయాన సంస్థలు ఆకస్మికంగా ప్రయాణ ఛార్జీలను, ఇతర రుసుములను పెంచకుండా నిబంధనలు పాటించేలా చూడాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసు జారీ చేసింది. సామాజిక కార్యకర్త ఎస్.లక్ష్మీనారాయణన్ వేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎకానమీ తరగతి ప్రయాణికులకు 25 కిలోల వరకు లగేజీ ఉచిత సౌకర్యం ఉండగా, దానిని ప్రైవేట్ విమానయాన సంస్థలు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా దీనిని 15 కిలోలకు తగ్గించాయని పేర్కొన్నారు.అదేవిధంగా, విమాన ప్రయాణ చార్జీలు, అనుబంధ ఫీజులను నియంత్రించే వ్యవస్థంటూ ఏదీ లేకుండా పోయిందన్నారు. ఇదే అదనుగా విమానయాన సంస్థలు ఇష్టారాజ్యంగా ఛార్జీలు పెంచుతున్నాయని, ముఖ్యంగా పండగలు, అననుకూల వాతావరణ పరిస్థితుల్లో మరీ హద్దుమీరుతున్నాయన్నారు. పౌర విమానయాన రంగంలో ప్రయాణికులకు భద్రతతోపాటు పారదర్శకత ఉండేలా సమర్థమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి, డీజీసీఏకి, ఎయిర్‌పోర్టు నియంత్రణ ప్రాధికార సంస్థకు నోటీసులు జారీ చేసి..తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

25న అయోధ్యలో ధ్వజారోహణం

60 చార్టెర్డ్ విమానాల్లో తరలిరానున్న ప్రముఖులు

అయోధ్య: అయోధ్య రామాలయంలో ఈ నెల 25వ తేదీన చేపట్టే ధ్వజా రోహణ కార్యక్రమానికి భారీగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు సుమారు 60 చార్టెర్డ్ విమానాల్లో తరలిరానున్నారు. వీరికోసం అయోధ్య విమానాశ్రయంలో అదనంగా 100 మంది సీఐఎస్ఎఫ్ జవాన్లను నియమిస్తామని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ధీరేంద్ర సింగ్ వెల్లడించారు. సుమారు 60 చార్టర్డ్ విమానాలు వచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ విమానాల కోసం సమీప ఎయిర్‌పోర్టుల్లో పార్కింగ్ వసతులను కల్పించామన్నారు. విమానాశ్రయంలో ప్రధాని మోదీ కోసం స్పెషల్ లాంజ్ ఉంటుందని, సీఎం, గవర్నర్ తదితరుల కోసం మరో ఆరు వీఐపీ లాంజ్‌లను సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రముఖులందరినీ ఈ నెల 24వ తేదీనే రావాల్సిందిగా ఆహ్వానాలు పంపామని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది. 25వ తేదీ ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకే వీరిని లోపలికి అనుమతిస్తామన్నారు. వీరి కోసం అయోధ్యలోని హోటళ్లలో 1,600 గదులను బుక్ చేశారు.

నైజీరియాలో 25 మంది బాలికల అపహరణ

అబుజా: నైజీరియాలో స్కూలు విద్యార్థినుల అపహరణ ఉదంతం మరోసారి వెలుగుచూసింది. కెబ్బి రాష్ట్రం డాంకో–వసాగు ప్రాంతంలోని మాగా బోర్డింగ్ స్కూల్‌లో సోమవారం వేకువజామున ఘటన చోటుచేసుకుంది. సాయుధులైన దుండగులు వేకువజామున 4 గంటల సమయంలో పెద్దగా భద్రతా ఏర్పాట్లు లేని స్కూలులోకి చొరబడి 25 మంది బాలికలను అపహరించుకుపోయారు. అడ్డగించిన సిబ్బందిపై కాల్పులు జరపగా ఒకరు చనిపోగా మరొకరు గాయపడ్డారు. దుండగుల వద్ద అత్యాధునిక ఆయుధాలున్నట్లు చెబుతున్నారు. దుండగులు, బాలికల ఆచూకీ కోసం పోలీసులు చుట్టుపక్కల అటవీ ప్రాంతాల్లో భారీ ఎత్తున గాలింపు చేపట్టారు. 2014లో బోర్నో రాష్ట్రం చిబోక్‌లోని బోర్డింగ్ స్కూలుపై దాడి చేసిన బోకో హరామ్ మిలిటెంట్లు 276 మంది విద్యార్థినులను అపహరించుకు వెళ్లిన ఘటన అప్పట్లో ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆ తర్వాత దేశ ఉత్తర ప్రాంతంలో అటువంటి ఘటన జరగడం ఇదే మొదటిసారి. అప్పటి బాధితుల్లో కొందరికి విముక్తి లభించగా, 100 మంది వరకు మిలిటెంట్ల చెరలో ఉన్నారని అంచనా.

షేక్ హసీనాకు మరణశిక్ష

తీర్పు వెలువరించిన బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్

- మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌కూ మరణశిక్ష
- విద్యార్థిసంఘాల ఉద్యమాన్ని అణిచివేసి వందల మందిని చంపేశారని ఆరోపణ
- మాజీ ఐజీ చౌదరి అబ్దుల్లా అల్‌మమూన్‌కు ఐదేళ్ల శిక్ష
- తీర్పును రాజకీయకుట్రగా అభివర్ణించిన పదవీచ్యుత ప్రధాని

ఢాకా/న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ విమోచన పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర్యసమరయోధుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కేటాయింపుతో మొదలైన విద్యార్థుల ఉద్యమం చివరకు పదవీచ్యుత మహిళా ప్రధాని షేక్ హసీనాకు అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ మరణశిక్ష విధింపునకు దారితీసింది. జూలై 15న విద్యార్థుల సారథ్యంలో ఉవ్వెత్తున ఎగసిన ఆందోళనలను ఉక్కుపాదంతో అణిచివేసి 1,400 మంది మరణాలకు హసీనా కారణమయ్యారంటూ దాఖలైన కేసులో ఆమెకు మరణశిక్ష విధిస్తూ ట్రిబ్యునల్ సంచలన తీర్పు వెలువరించింది. ఈ మేరకు సోమవారం జస్టిస్ మొహమ్మద్ గులామ్ మోర్తుజా మజుందార్ సారథ్యంలోని ముగ్గురు సభ్యుల ప్రత్యేక ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. కోర్టు గతంలోనే ఆమె పారిపోయిన నేరుస్తురాలిగా ప్రకటించింది. మానవత్వానికి వ్యతిరేకంగా ఆమె నిర్దయగా ఆదేశాలు జారీచేసి భద్రతబలగాల సాయంతో ఉద్యమాన్ని అణిచివేశారని, వందల మంది మరణాలకు ప్రధాన బాధ్యురాలు అని ప్రభుత్వం అందించిన సాక్ష్యాధారాలతో రూఢీ అయిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ''వందల మరణాలకు, ఉద్యమాన్ని అణిచివేత వ్యూహాలకు కర్త, కర్మ, క్రియ హసీనాయే. ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం చేస్తున్న విద్యార్థులపైకి ఆమెకు చెందిన పార్టీ కార్యకర్తలు విచక్షణారహితంగా దాడులకు తెగబడేలా ఆమె రెచ్చగొట్టే ప్రకటనలు ఇచ్చారు. దాడులు చేస్తున్న వారిని ఏమాత్రం కట్టడిచేయకుండా ఆమె మానవత్వానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారు. నిరసనబాటపట్టిన వేలాది మంది విద్యార్థులపై మారణాయుధాలు, హెలికాప్టర్లతో దాడులు చేయించారు'' అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. ఉద్యమకారులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం వంటి ఘటనలతో ప్రత్యక్ష సంబంధం ఉన్న నాటి హసీనా ప్రభుత్వంలో హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌కు సైతం కోర్టు మరణశిక్షను ఖరారుచేసింది. మాజీ పోలీస్ ఉన్నతాధికారి, ఇన్‌స్పెక్టర్ జనరల్ చౌదరి అబ్దుల్లా అల్–మమూన్‌కు ఐదేళ్ల శిక్ష విధించింది.

ఆమెను అప్పగించాలన్న తాత్కాలిక సర్కార్

గత ఏడాది ఆగస్ట్ 5న దేశం నుంచి పారిపోయి ఢిల్లీలో ఆశ్రయం పొందుతున్న అవామీ లీగ్ పార్టీ అధినేత్రి హసీనాను తమకు అప్పగించాలని భారత్‌ను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం కోరింది. ఈ మేరకు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సోమవారం ఒక ప్రకటన విడుదలచేసింది. ''భారత్‌కు పారిపోయిన హసీనా, అసదుజ్జమాన్ ఖాన్ కమాల్‌లను వెంటనే బంగ్లాదేశ్ ఉన్నతాధికారులకు అప్పగించండి. గతంలో మన రెండు శాల మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒడంబడికను గౌరవించాల్సిందే. కోర్టు తీర్పుతో దోషులుగా నిర్ధారణ అయిన ఖైదీలను మాకు భారత ప్రభుత్వం అప్పగించాలి. దోషులు అని తేలాకకూడా వాళ్లను ఆశ్రయం కల్పించడం స్నేహపూర్వక చర్య అనిపించుకోదు. ఇలాంటి ధోరణి న్యాయబద్ధంకాదు'' అని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ ఆ ప్రకటనలో పేర్కొంది. ''ఈ మేరకు మరోసారి భారత్‌కు అధికారికంగ లేఖ రాస్తాం. ఊచకోత కారకులకు ఇంకా ఆశ్రయం కల్పిస్తామని భారత్ మొండికేస్తే రెండుదేశాల మధ్య విరోధం పెరుగుతుంది'' అని ప్రభుత్వ న్యాయ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ స్పష్టంచేశారు. దీనిపై భారత్ స్పందించింది. బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదలచేసింది.

తీర్పు తర్వాత పలు చోట్ల ఘర్షణలు

తమ పార్టీ చీఫ్ హసీనాకు మరణశిక్ష ఖరారుచేస్తూ తీర్పు వెలువడటంతో అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలు రెచ్చిపోయారు. దేశవ్యాప్తంగా కీలక నగరాలు, పట్టణాల్లో ఆందోళనకు దిగారు. దీంతో పలు చోట్ల ఘర్షణలు జరిగాయి. ఆపద్ధర్మ ప్రభుత్వ అనుకూల వర్గాలు సైతం రోడ్లమీదకొచ్చాయి. ఢాకాలో హసీనా తండ్రికి చెందిన భవనాన్ని కూల్చేందుకు యత్నించగా పోలీసులు బాష్పవాయుగోళాలు ప్రయోగించారు. లాఠీచార్జ్ చేసి నిరసనకారులను చెదరగొట్టారు.

హసీనాపై మోపిన కీలక ఆరోపణలు

1. హత్య, హత్యాయత్నం, నిరసనకారులను చిత్రహింసలకు గురి చేయడం. విద్యార్థులపై దాడులను ప్రోత్సహించడం, దాడులను ఏమాత్రం అడ్డుకోకపోవడం
2. హెలికాప్టర్లు, డ్రోన్ల సాయంతో నిరాయుధ విద్యార్థులపైకి మారణాయుధాలతో సైన్యం దాడిచేసేలా ఆదేశాలు ఇవ్వడం
3. రంగ్‌పూర్‌లో బేగమ్ వర్సిటీ విద్యార్థి అబూ సయీద్‌ను అత్యంత దారుణంగా చంపేయడం
4. ఆగస్ట్ 5న ఛంకార్‌పూర్‌లో ఆరుగురిని హత్యచేయడం, విద్యార్థులపై దాడి చేయాలని ప్రసంగాలు ఇవ్వడం
5. ఆగస్ట్ 5న అషులియాలో ఆరుగురు విద్యార్థులపై బుల్లెట్ల వర్షం కురిపించడం, తర్వాత ఆధారాల్లేకుండా తగలబెట్టడం

రాజకీయ ప్రేరేపిత తీర్పు ఇది

తీర్పుపై ఘాటుగా స్పందించిన హసీనా

తీర్పుపై 78 ఏళ్ల హసీనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ''ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపిత తీర్పు. ప్రజాతీర్పు పొందని ఎన్నికల్లో గెలవని ఒక అనామిక ప్రభుత్వం ఒత్తిడితో వెల్లడైన తీర్పు ఇది. ప్రస్తుత ప్రభుత్వంలో తీవ్రస్థాయి భావజాలం ఏ స్థాయిలో తీర్పు కళ్లకుకడుతోంది. తీర్పు పూర్తిగా పక్షపాతధోరణితో, రాజకీయ కక్షతో వెలువర్చారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రధానిగా ఎన్నికైన నన్ను, అవామీ లీగ్ రాజకీయశక్తిని నిర్వీర్యంచేసే కుట్ర ఇది. పారదర్శకంగా కేసు నడవని, సాక్ష్యాధారాలను పరిశీలించని ఇలాంటి ట్రిబ్యునళ్లు ఇచ్చిన తీర్పులకు నేను అస్సలు భయపడను. మొహమ్మద్ యూనుస్ తాత్కాలిక ప్రభుత్వం తమ చేతగానితనాన్ని ఈ తీర్పును సాకుగా చూపి అస్తవ్యస్తపాలనను అద్భుతంగా ఉందని చెప్పుకునే దుస్సాహసంచేస్తోంది'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉక్కు మహిళ నుంచి మరణశిక్ష దాకా..

1947 సెప్టెంబర్ 28వ తేదీన నాటి తూర్పు పాకిస్తాన్‌లో హసీనా జన్మించారు. ఈమె తండ్రి షేక్ ముజిబుర్ రెహ్మాన్ 1971లో బంగ్లాదేశ్ విమోచన కోసం పోరాడి తర్వాత బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం సిద్ధించేలా కృషిచేశారు. తర్వాత బంగ్లాప్రజలు ఆయనను జాతిపితగా కీర్తించారు. ఢాకా యూనివర్సిటీలో ఈమె చదువుకున్నారు. 1968లో అణుశాస్త్రవేత్త ఎంఏ వాజెద్ మియాను పెళ్లాడారు. 1975లో సైనిక తిరుగుబాటు వేళ తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులు, ఇతర కుటుంబసభ్యులు హత్యకు గురయ్యారు. ఈ హత్యోదంతం తర్వాత ఈమె దేశ రాజకీయాల్లో అడుగుపెట్టారు. అప్పటికే దివంగత దేశాధ్యక్షుడు జియావుర్ రెహ్మాన్ భార్య ఖలీదా జియా రాజకీయ ప్రత్యర్థిగా ఉన్నారు. వీరిద్దరినీ బంగ్లాదేశ్ రాజకీయాల్లో పోరాడే బేగమ్‌లు అని పిలిచేవారు. 1996లో హసీనా తొలిసారిగా ప్రధానమంత్రి అయ్యారు. 2001లో ఓడినా 2008లో మళ్లీ పీఠం అధిరోహించారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటా అంశం గతేడాది చిలికిచిలికి గాలివానగా, విద్యార్థి మహోద్యమంగా మారడంతో హసీనా ప్రభుత్వం కూలిపోయింది. అప్పటి నుంచి ఆమె ఢిల్లీలోనే రహస్య జీవితం గడుపుతున్నారు.

చట్టానికి ఎవరూ అతీతులు కారు

తీర్పును స్వాగతిస్తూ యూనుస్ వ్యాఖ్య

ఢాకా: హసీనాకు పడిన మరణశిక్షను ముహమ్మద్ యూనుస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం గట్టిగా సమర్థించింది. తీర్పును స్వాగతిస్తున్నట్లు యూనుస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ''ఈరోజు బంగ్లాదేశ్ వ్యాప్తంగా, దేశానికి ఆవల సైతం ప్రతిధ్వనించేలా దేశ న్యాయస్థానాలు అత్యంత స్పష్టమైన సందేశానిచ్చాయి. అధికారంలో ఉన్నా, లేకున్నా చట్టానికి ఎవరూ అతీతులు కారు అనే ప్రాథమిక సూత్రం ఇక్కడ వర్తిస్తుందని న్యాయస్థానం మరోసారి గుర్తుచేసింది. గత జూలై, ఆగస్ట్‌లో ఉద్యమం వేళ ప్రాణాలు కోల్పోయిన, వేధింపులకు గురైన, ఇప్పటికీ మనోవ్యథను భరిస్తున్న విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరిగేలా కోర్టు తీర్పు వెలువడింది. ఏళ్ల తరబడి కొనసాగిన అణిచివేతతో పెళుసుబారిన ప్రజాస్వామ్య పునాదుల పునరుద్ధరణకు మేం కృషిచేస్తాం'' అని యూనుస్ వ్యాఖ్యానించారు.

సీఎంగా పదోసారి

- రికార్డ్ నెలకొల్పనున్న నితీశ్ కుమార్
- 19న అధికార పక్ష నేతగాఎన్నిక
- 20న ముఖ్యమంత్రిగా ప్రమాణం!

ప్రభుత్వం రద్దు కోరుతూ గవర్నర్ ఆరిఫ్ ఖాన్‌కు సిఫారసు అందజేస్తున్న సీఎం నితీశ్

పట్నా: అన్ని వర్గాల ఓటర్ల ఆశీస్సులు పొందిన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రికార్డుస్థాయిలో పదోసారి సీఎంగా ప్రమాణం చేయబోతున్నారు. ఈ ప్రక్రియకు సోమవారం తొలి అడుగు పడింది. కొత్త ప్రభుత్వ ఏర్పాటులోభాగంగా పట్నాలో రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌ను నితీశ్ కలిసి తన రాజీనామా లేఖను అందించారు. బుధవారం మళ్లీ కలిసి తనకు మద్దతుగా నిలిచిన ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యేల జాబితాను అందజేయనున్నారు. నవంబర్ 19వ తేదీన నితీశ్‌ను అధికార పక్ష నేతగా ఎన్నుకోబోతున్నట్లు జనతాదళ్(యునైటెడ్) పార్టీ వర్గాలు సోమవారం వెల్లడించాయి. పట్నాలో నవంబర్ 20వ తేదీన గాంధీమైదాన్‌లో జరిగిన భారీ ప్రమాణస్వీకారోత్సవంలో నితీశ్ కుమార్ పదోసారి సీఎంగా ప్రమాణంచేయబోతున్నట్లు పార్టీలోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అదే వేదికపై మరి కొందమంది నేతలు సైతం కేబినెట్ మంత్రులుగా ప్రమాణంచేయనున్నారు. ప్రధాని మోదీ, పలువురు ఎన్‌డీఏ కూటమి కీలక నేతలు, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు ప్రమాణస్వీకార కార్యక్రమానికి విచ్చేయనున్నారు. కేబినెట్ మంత్రులుగా తమకు అవకాశం ఇవ్వాలని బీజేపీ, జేడీయూసహా ఎన్‌డీఏలోని కీలక భాగస్వామ్య పార్టీల ముఖ్యనేతల నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. లాబీయింగ్ బెడద హఠాత్తుగా పెరిగిందని జేడీయూ వర్గాలు తెలిపాయి. తొలిరోజు నితీశ్‌తోపాటు ఐదారు మంది నేతలు మంత్రులుగా ప్రమాణంచేసే అవకాశముంది. కొత్త కేబినెట్‌లో మహ్నార్ నియోజకవర్గంలో గెలిచిన జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుష్వాహ చేరే వీలుంది. లోక్‌జనశక్తి(ఆర్‌వీ) చీఫ్ చిరాగ్ పాశ్వాన్, హెచ్ఏఎంఎస్ చీఫ్ జితన్ రాం మాంఝీ, ఆర్ఎల్ఎం నేత ఉపేంద్ర కుష్వాహాల కేబినెట్ బెర్త్ ఖరారైందని తెలుస్తోంది. ఎల్‌జేపీ(ఆర్‌వీ)కి మూడు, హెచ్ఏఎంఎస్, ఆర్ఎల్ఎంకు చెరొకటి మంత్రి పదవి దక్కొచ్చు. బీజేపీ నుంచి 16, జేడీయూ నుంచి 14 మంది మంత్రులుగా ప్రమాణంచేసే అవకాశముంది. మరోవైపు రాష్ట్రీయలోక్‌దళ్(ఆర్జేడీ), కాంగ్రెస్ తదితర విపక్ష పార్టీల మహాగఠ్‌బంధన్ తరఫున బిహార్ అసెంబ్లీలో విపక్షనేతగా ఆర్జేడీ యువనేత తేజస్వీ యాదవ్ సోమవారం ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆర్జేడీ అధికార ప్రతినిధి శక్తి సింగ్ చెప్పారు. ఎన్‌డీఏ కూటమి తర్వాత రాష్ట్రంలో ఆర్జేడీ మాత్రమే చెప్పుకోదగ్గ స్థాయిలో 25 చోట్ల గెలిచింది. ఫలితాల్లో ప్రజల మనోగతం ప్రతిబింబించట్లేదని ఆర్జేడీ వ్యాఖ్యానించింది. దీంతో ఈవీఎంలలో అవకతవకల అంశాన్ని కోర్టులో సవాల్‌చేసే వీలుంది.

మళ్లీ జైలుకు ఆజం ఖాన్

- ఆయనతోపాటు కుమారుడికి ఏడేళ్ల జైలు
- పాన్ కార్డు కేసులో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు

రాంపూర్(యూపీ): సీతాపూర్ జైలు నుంచి విడుదలై రెండు నెలలయినా కాకమునుపే సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత మహ్మద్ ఆజం ఖాన్ మళ్లీ జైలుకు వెళ్లారు. రెండు వేర్వేరు పుట్టిన తేదీలతో రెండు పాన్ కార్డులను కలిగి ఉన్నట్లు నమోదైన 2019నాటి కేసులో సోమవారం కోర్టు ఆయనకు ఏడేళ్ల జైలు శిక్ష విధించడంతో ఊచలు లెక్కబెట్టక ఆయనకు తప్పింది కాదు. రాంపూర్‌లోని ఎంపీ/ఎమ్మెల్యే ప్రత్యేక న్యాయస్థానం ఆజం ఖాన్ కుమారుడు, ఎమ్మెల్యే అబ్దుల్లా ఖాన్‌కు కూడా ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ఆజం ఖాన్, అబ్దుల్లా ఖాన్‌లు తప్పు చేసినట్లు ఆధారాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు ఉన్నాయని తీర్పు వెలువరించిన స్పెషల్ మేజిస్ట్రేట్ శోభిత్ బన్సాల్ పేర్కొన్నారు. తీర్పు అనంతరం పోలీసులు ఇద్దరినీ పటిష్ట బందోబస్తు నడుమ రాంపూర్ కోర్టు నుంచి జిల్లా జైలుకు తీసుకెళ్లారు. 'ఇందులో చెప్పడానికి ఏముంటుంది? ఇది న్యాయస్థానం నిర్ణయం. తప్పుచేసినట్లు న్యాయమూర్తులు భావిస్తే జైలు శిక్ష వేస్తారు'అని ఆయన మీడియాతో వ్యాఖ్యానించారు. కాగా, జ్యుడిషియల్ కస్టడీలో ఇప్పటికే ఆజం ఖాన్ చాలా సమయం గడిపినందున శిక్షా కాలం తగ్గొచ్చని లాయర్లు తెలిపారు. ఆయనకు అప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఉంటుందన్నారు. భూ ఆక్రమణ, లంచం, మోసం తదితర ఆరోపణలపై ఆజం ఖాన్‌పై మొత్తం 84 కేసులున్నాయి. ఆయన దోషిగా నిరూపితమైన నాలుగో కేసు ఇది. నాలుగు కేసుల్లో ఆయనకు విముక్తి లభించింది. మిగతా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఓ కేసులో 23 నెలలు జైలు జీవితం గడిపిన ఆజం ఖాన్ సెప్టెంబర్ 23వ తేదీన విడుదలయ్యారు. అంతకుముందు కూడా ఆయన 27 నెలలు జైలులోనే ఉన్నారు. పాన్ కార్డ్ కేసులో తమ పార్టీ సీనియర్ నేత ఆజం ఖాన్, ఆయన కుమారుడికి ప్రత్యేక కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించడంపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ స్పందించారు. బీజేపీ పాలనలో అణచివేత, అన్యాయాలకు ఇది పరాకాష్ట అని ఆయన పేర్కొన్నారు. అధికారముందనే అహంకారంతో విర్రవీగే వారికి చివరికి దుర్గతే పడుతుందని, ప్రజలు అంతా గమనిస్తూనే ఉంటారని వ్యాఖ్యానించారు.

ఆత్మాహుతి బాంబర్ అరెస్ట్!

- శ్రీనగర్‌లో జసీర్ బిలాల్ వానీని అరెస్ట్‌చేసిన ఎన్ఐఏ
- తోటి ఉగ్రవాదులకు డ్రోన్లతో దాడులు చేసేలా సాంకేతిక సాయం
- బిలాల్‌ను ఆత్మాహుతి బాంబర్‌గా మారేలా ఉగ్రభావజాలం తలకెక్కించిన డాక్టర్ ఉమర్
- దర్యాప్తులో కొత్త విషయాలు
- అమీర్ రషీద్‌ను 10 రోజులపాటు ఎన్ఐఏ కస్టడీకి అప్పగించిన కోర్టు

న్యూఢిల్లీ/ఫరీదాబాద్: ఎర్రకోట వద్ద కారుబాంబుతో ఆత్మాహుతి దాడి ఉదంతంలో మరో కీలక ఉగ్రవాదిని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) సోమవారం అరెస్ట్‌చేసింది. ఢిల్లీలో కారుపేలుడులో తునాతునకలైన ఉగ్రవాది, డాక్టర్ ఉమర్ ఉన్ నబీ ప్రోద్బలంతో ఆత్మాహుతి బాంబర్‌గా మారేందుకు సిద్ధమైన కశ్మీర్ వాసి జసీర్ బిలాల్ వానీ అలియాస్ డ్యానిష్‌ను ఎన్ఐఏ బృందం సోమవారం అరెస్ట్‌చేసింది. జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా ఖ్వాజీగండ్ ప్రాంతం బిలాల్ స్వస్థలం. రాజనీతిశాస్త్రంలో డిగ్రీపట్టా పుచ్చుకున్న బిలాల్ ఢిల్లీలో ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్‌కు సాంకేతిక సాయం చేసేవాడు. డ్రోన్లలో మార్పులుచేసి అవి పేలుడుపదార్థాలను మోసుకెళ్లేలా ప్రమాదకరంగా మార్చేందుకు ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్‌కు బిలాల్ సాయపడ్డాడు. చిన్నపాటి రాకెట్‌లను సైతం తయారుచేసేందుకు ప్రయత్నించాడు. నవంబర్ 10న ఢిల్లీలో పేలుడు వెనుక ఉన్న వ్యూహరచన, సూత్రధారుల వివరాలను రాబట్టేందుకు బిలాల్‌ను ఎన్ఐఏ అధికారులు ప్రశ్నిస్తున్నారు. డాక్టర్ ఉమర్‌తో బిలాల్ తరచూ సంప్రతింపులు జరిపేవాడని దర్యాప్తులో తేలిందని ఎన్ఐఏ ఒక ప్రకటనలో పేర్కొంది. మరోవైపు కారు బాంబు ఘటనలో గాయపడిన మరో ఇద్దరు చనిపోవడంతో ఈ ఘటనలో మొత్తం మరణాల సంఖ్య సోమవారం 15కు పెరిగింది.

నెలల తరబడి బ్రెయిన్‌వాష్

విచారణలో బిలాల్ పలు కొత్త విషయాలు వెల్లడించాడు. ''నువ్వు కూడా ఆత్మాహుతి బాంబర్‌లా మారితే తమ మిషన్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తరచూ డాక్టర్ ఉమర్ సలహాలిచ్చేవాడు. ఉగ్రభావజాలాన్ని నెలల తరబడి నాకు నూరిపోశాడు. గత ఏడాది అక్టోబర్‌లో కుల్గామ్‌లోని ఒక మసీదులో ఫరీదాబాద్ వైద్యుల ఉగ్రనెట్‌వర్క్ సభ్యులను తొలిసారిగా కలిశా. ఆత్మాహుతికి సిద్ధమని చెప్పాను. తర్వాత నన్ను అల్–ఫలాహ్ వర్సిటీ పరిధిలోని అద్దె ఇంట్లోకి మార్చారు. వాస్తవానికి నన్ను జైషే మొహమ్మద్ ఉగ్రసంస్థ కోసం క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. కానీ డాక్టర్ నన్ను సూసైడ్‌బాంబర్‌గా మారితే ఇంకా బాగుంటుందని ఎగదోశాడు. అయితే సొంతంగా ఖర్చుపెట్టి వీళ్ల కోసం పనిచేసేంత స్తోమత నాకు లేదు. దీంతో కలిసిపనిచేయలేనని చెప్పి ఈ ఏడాది ఏప్రిల్ నుంచి దూరంగా ఉంటున్నా. అదీకాకుండా ఇస్లామ్ మతాచారాల ప్రకారం ఆత్మాహుతి అనేది మహాపాపం'' అని బిలాల్ కశ్మీర్ పోలీసు విచారణలో చెప్పాడు.

ఉమర్‌కు రవాణా సాయం అందించిన రషీద్

ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్‌కు ఢిల్లీలో సురక్షిత స్థావరంతోపాటు రవాణా ఏర్పాట్లను అమీర్ రషీద్ అలీ చూసుకున్నాడని దర్యాప్తులే తేలింది. ఢిల్లీలోని పటియాలా కోర్టుల ప్రాంగణంలోని ప్రిన్స్‌పల్ జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి అంజూ బజాజ్ ఛాంద్నా వద్ద రషీద్‌ను సోమవారం హాజరుపరిచారు. ఈ సందర్భంగా రిమాండ్ పత్రంలో పలు అంశాలను ఎన్ఏఐ ప్రస్తావించింది. ''ఢిల్లీలో పేలిన కారు రషీద్ పేరిటే ఉంది. ఉమర్‌కు ఢిల్లీ సురక్షిత స్థావరంతోపాటు పేలుడుపదార్థాలు ఇతరత్రాల రవాణా సదుపాయాలు కల్పించాడు. ఢిల్లీలో అలజడి సృష్టించడంతోపాటు ప్రజల్లో భయాందోళనలు పెంచడం ఈ బాంబుపేలుడు మరో ఉద్దేశం. రషీద్‌ను తమ కస్టడీకి అప్పగిస్తే ఈ కుట్రలోని మరిన్ని వివరాలు రాబట్టేందుకు అవకాశం దక్కుతుంది'' అని ఎన్ఐఏ పేర్కొంది. దీంతో రషీద్‌ను 10 రోజులపాటు ఎన్ఐఏ కస్టడీకి అప్పగిస్తూ జడ్జి ఉత్తర్వులు జారీచేశారు. రషీద్‌ను కోర్టుకు తీసుకురావడంతో భద్రత దృష్ట్యా కోర్టుహాల్‌లోకి ఎవరినీ రానివ్వలేదు. కోర్టు బయట సైతం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేశారు.

పాతాళంలో దాక్కున్నా పట్టుకొస్తాం: అమిత్ షా

ఢిల్లీలో పేలుడు, దేశంలో విద్రోహచర్యకు దు స్సాహసం చేసిన దోషులు పాతాళంలో దాక్కున్నాసరే వెతికి పట్టుకొచ్చి చట్టం ముందు నిలబెడతామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రతిజ్ఞచేశారు. ఈశాన్యరాష్ట్రాల జోనల్ మండలి 32వ సమావేశంలో అమిత్‌షా పాల్గొని ప్రసంగించారు. ''మోదీ సారథ్యంలో ప్రభుత్వం ఎన్నో విజయవంతమైన పనులుచేసింది. ఇప్పుడు కూడా ఉగ్రవాదులు పాతాళంలో నక్కినాసరే చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షిస్తాం'' అని అన్నారు.

ఆశలు నెరవేర్చే పార్టీలనే నమ్ముతారు

ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: సదుద్దేశంతో ముందడుగు వేసి, తమ ఆశయాలను నెరవేర్చే రాజకీయ పార్టీలనే ప్రజలు విశ్వసిస్తారని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. సోమవారం ఢిల్లీలో ఆరో రామ్‌నాథ్ గోయంకా స్మారకోపన్యాస కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. ''రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న వామపక్ష పార్టీనా, మితవాద పార్టీనా అనేది ముఖ్యంకాదు. అభివృద్ధి విధానాలతో ఏ పార్టీ అయితే ముందుకెళ్తుందో ఆ పార్టీలకు మాత్రమే భవిష్యత్తు ఉంటుందని బిహార్‌లో తాజా శాసనసభ ఎన్నికల ఫలితాలు రుజువుచేశాయి. ప్రాంతీయ పార్టీల సారథ్యంలో కేంద్రంలో లేదా రాష్ట్రంలో ఏర్పడే ప్రభుత్వాల దృష్టి మొత్తం అభివృద్ధి మీదనే ఉండాలి. భారతదేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు పెద్దగానే ఉంటాయని బిహార్ ఎన్నికలు నిరూపించాయి. అధికారం చేపట్టి సదుద్దేశంతో సత్కార్యాలు చేసే రాజకీయ పక్షాల వెంటే ప్రజలు నడుస్తారు. మళ్లీ వాళ్లకే ఓటేస్తారు. అద్భుతమైన మెజారిటీతో గెలిపించుకుంటారు. విదేశాల నుంచి తమ రాష్ట్రానికే భారీ పెట్టుబడులు వచ్చేలా బడా కంపెనీలను ఆకర్షిస్తూ, రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే రాష్ట్ర ప్రభుత్వాలను ఎప్పుడూ నా పూర్తి మద్దతు ఉంటుంది'' అని అన్నారు.

ఎలక్షన్ మోడ్ కాదు ఎమోషనల్ మోడ్

''బీజేపీ ఎప్పుడూ ఎన్నికల మీదే దృష్టిపెడుతుందని కొందరు అభాండాలు వేస్తున్నారు. నిజానికి మేం ఎలక్షన్ మోడ్‌లో ఉండబోం. ఎన్నికల ప్రచారంవేళ ప్రజలతో మమేకమయ్యే ఎమోషనల్ మోడ్‌లో ఉంటాం. రోజూ 24 గంటలూ అభివృద్ధి, ప్రజల భావోద్వేగాల గురించే పట్టించుకుంటాం. అందుకే ప్రతిసారి మాకు విజయం దక్కుతోంది'' అని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ విమర్శలు గుప్పించారు. ''నక్సలిజం, మావోయిస్ట్ టెర్రరిజంకు కొమ్ముకాస్తున్న కాంగ్రెస్ దేశంలో ఉనికిని కోల్పోతోంది. కేవలం విపక్షపార్టీగా మాత్రమే మిగిలిపోతోంది. గత ఐదు దశాబ్దాల్లో దేశంలో ప్రతి రాష్ట్రం మావోయిస్టుల దురాగతాలను చవిచూసింది. దేశ రాజ్యాంగాన్ని నమ్మని అలాంటి వాళ్లను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోంది'' అని మోదీ ఆరోపించారు.

సాక్షి గుంటూరు

మంగళవారం । 18 । నవంబర్ । 2025

నిత్యాన్నదానానికి విరాళం

నరసరావుపేటరూరల్: త్రికోటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నరసరావుపేటకి చెందిన పొందూరు సాంబశివరావు రూ.2,11,000 విరాళంగా అందజేశారు.

ప్రసాదాలు పంపిణీ

మంగళగిరి టౌన్: భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని పినాకిల్ విద్యాసంస్థల(చెన్నై) ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కేదారేశ్వరునికి విశేష అభిషేకాలు



నరసరావుపేట రూరల్: వల్లప్పచెరువులోని కేదారేశ్వర స్వామికి సోమ వారం విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

న్యూస్‌రీల్

వైభవంగా నీలేశ్వరపాలెం తిరునాళ్ల మహోత్సవం

అచ్చంపేట: మండలంలోని నీలేశ్వరపాలెంలో స్వయంభుగా వెలసిన శ్రీ గిరిజా సమేత నీలకంఠేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తిక మాసంలో వచ్చే చివరి సోమవారం నాడు తిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ పూజారులు వేకువ జాము నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ముందున్న నందీశ్వరుని వద్ద, ధ్వజ స్తంభం వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. పొంగళ్లు పొంగించి మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని జ్యోతిర్లింగాలకు, కొండ దిగువన ఉన్న ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

భూములిచ్చిన రైతుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరుమెడికల్: రాజధానికి భూములు ఇచ్చిన రైతుల సమస్యలపై అమరావతి ఐక్య కార్యాచరణ సమితి గుంటూరు చంద్రమౌళి నగర్‌లోని కార్యాలయంలో సోమవారం చర్చ నిర్వహించారు. సమావేశంలో ఐకాస నేత జమ్ముల శ్యామ్‌కిశోర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాజధానికి భూములు ఇచ్చిన రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటినా రాజధాని రైతుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సమస్యలు చెప్పడానికి సీఆర్డీఏ అధికారులు అవకాశం ఇవ్వడం లేదన్నారు. అనుమోలు బాలమురళీ మాట్లాడుతూ సమస్యల జాబితాను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సమావేశంలో ఇందుర్తి నరసింహారావు, జి. స్వరాజ్యరావు, కొమ్మినేని సత్యనారాయణ, జమ్ముల అనిల్, గోవిందమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మట్టి శివలింగానికి మహాభిషేకం

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరంలోని దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం వద్ద మట్టి శివలింగాన్ని ఏర్పాటు చేసిన మహాభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గాజుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా దేవాలయం వద్ద దీపారాధనతో పాటు మట్టితో శివలింగాన్ని ఏర్పాటు చేసి మహాభిషేకాలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్, బాబీ, తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు

నరసరావుపేట టౌన్: నరసరావుపేట–చిలకలూరిపేట రోడ్డులోని అమ్మానాన్నల వృద్ధాశ్రమంలో సోమవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి వృద్ధుల పోషణ, సంక్షేమం, తల్లిదండ్రులు సీనియర్ సిటిజెన్లకు చట్టం ద్వారా లభించే న్యాయ సేవలు, లోక్ అదాలత్ చట్టం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు, ప్యానల్ న్యాయవాదులు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల ముసుగులో తెలుగు తమ్ముళ్ల

మాయా‘గాలం’

- పాల్గొన్నట్లు నకిలీ డాక్యుమెంట్లు
- సాక్షి కథనంపై స్పందించిన కమిషనర్
- యూఓ నోట్ జారీ
- పనుల వివరాలు ఇవ్వాలని ఆదేశం
- ఎందుకు బ్లాక్ లిస్ట్‌లో పెట్టకూడదంటూ ఇంజినీరింగ్ అధికారుల నోటీసులు
- దీనిపై హైకోర్టును ఆశ్రయించిన కాంట్రాక్టర్లు
- కౌంటర్ కూడా వేయని అధికారులు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): కాంట్రాక్టర్ల ముసుగులో తెలుగు తమ్ముళ్లు దొంగ టెండర్లు వేసి గుంటూరు నగరపాలక సంస్థ ఆదాయానికి గండి కొట్టారు. రూ. 10 కోట్లను దోచుకోవడానికి స్కెచ్ వేశారు. తెలుగు తమ్ముళ్లపై ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదంటే అధికారులు ఎంత నిద్రావస్థలో ఉన్నారో స్పష్టంగా తేటతెల్లమవుతోంది. కార్యాలయంలో ఉద్యోగులు ఏదైనా చిన్న తప్పు చేస్తే సస్పెన్షన్‌తో పాటు వారి మీద కేసులు పెట్టి జైలులో వేయిస్తారు. మరి కోట్ల రూపాయలను లూటీ చేసిన వారిని ఎందుకు పట్టించుకోవడం లేదని కొంతమంది అధికారులు, కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు.

ఇదీ విషయం

గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు తమకే దక్కాలని ఉద్దేశంతో నగరపాలక సంస్థ కార్యాలయంలోని కొంత మంది ఉద్యోగుల అండతో తెలుగు తమ్ముళ్లు చక్రం తిప్పారు. ఈ– ప్రొక్యూర్‌మెంట్ (టెండర్)లో పాల్గొనకుండానే వేసినట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. దానికి నగర కమిషనర్ నుంచి ఆమోదం కూడా పొందారు. వర్క్ ఆర్డర్ కూడా తీసేసుకున్నారు. వర్కులు చేసుకుని బిల్లులు కూడా ప్రాసెస్ చేయించుకున్న విషయంపై సాక్షి దినపత్రికలో ఆగస్టు నెల 22వ తేదీన ''రూ.కోట్లలో తమ్ముళ్ల లూటీ!'' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన నగర కమిషనర్ పులి శ్రీనివాసులు వెంటనే యూఓ (అర్జెంట్ ఆఫీస్) నోట్ ఇచ్చారు. ఇంత వరకు చేసిన వర్కుల వివరాలు, ఎంబుక్ వివరాలు, బిల్ పేమెంట్ వివరాలు 24 గంటల్లో తమకు సమర్పించాలని ఆగస్టు 23న ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీనిపై అధికారులు పూర్తి వివరాలతో కమిషనర్‌కు నివేదించారు.

టెండర్‌లలో వండర్‌లు

నగరపాలక సంస్థ కార్యాలయం



టెండర్‌లో పాల్గొనవద్దంటూ కాంట్రాక్టర్ల గ్రూప్‌లో పెట్టిన వాట్సాప్ మేసేజ్

చలనం లేని అధికారులు

తప్పు చేసిన కాంట్రాక్టర్లకు ''మీ మీద ఎందుకు చర్యలు తీసుకోకూడదు..ఎందుకు బ్లాక్ లిస్ట్‌లో పెట్టకూడదంటూ''ఇంజినీరింగ్ అధికారులు నోటీసులు ఇచ్చారు. దీనిపై వారు హైకోర్టును ఆశ్రయించారు. స్టే విధించి నెలలు గడుస్తున్నా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల్లో చలనం లేదు. కనీసం కౌంటర్ వేయలేదని సమాచారం. దీంతో తెలుగు తమ్ముళ్లు తమను ఎవరూ ఆపలేరంటూ రెచ్చిపోతున్నారు.

తప్పును రైట్ చేసేందుకు అధికారుల కుస్తీ

అడ్డదారిలో టెండర్లు దక్కించుకుని నగరపాలక సంస్థకు కోట్ల రూపాయలు నష్టం వాటిల్లింపజేసిన కాంట్రాక్టర్లకు సాక్షిలో వచ్చిన కథనంలో మింగుపడటం లేదనే చెప్పుకోవచ్చు. తప్పును రైట్ చేసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు కూడా గత్యంతరం లేక చేసిన పనికే మళ్లీ టెండర్లు పిలిచారు. వాటిల్లో ఎవరూ పాల్గొన వద్దంటూ వాట్సాప్ గ్రూప్‌లో కాంట్రాక్టర్లు మేసేజ్‌లు పెడుతూ అడ్డంగా దొరికిపోతున్నారు. ఇంత జరుగుతున్నా ఇంజినీరింగ్ అధికారులు, నగరపాలక సంస్థ పాలక వర్గంలో చలనం లేదు. కాంట్రాక్టర్లను కావాలనే కాపాడుతున్నారని వాదనలు మిగిలిన కాంట్రాక్టర్ల నుంచి వినిపిస్తున్నాయి. అధికారుల ప్రమేయం లేకుండా ఇంత జరగదని చెబుతున్నారు. అవినీతికి పాల్పడిన అధికారులు, తెలుగు తమ్ముళ్లపై ఎప్పటికి చర్యలు తీసుకుంటారో అని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

బాధితుల సమస్యలు వింటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పద్ధతి మార్చుకోండి !

- అధికారులకు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సూచన
- ఎన్నిసార్లు చెప్పినా మార్పు లేకపోతే ఎలా ?
- సమస్యలపై దృష్టి సారించాలి
- ప్రజలతో మర్యాదగా ప్రవర్తించండి

గుంటూరు వెస్ట్ : ''ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ప్రజలకు ఎంతో ఉపయోపడేది.. వారి సమస్యల పరిష్కారంపై కొందరు అధికారులు, సిబ్బంది పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.. ఇది మంచి పద్ధతి కాదు.. ప్రజలతో మర్యాదగా మసలుకోండి.. వారితో అమర్యాదగా మాట్లాడవదు.. ఎన్నిసారు చెప్పినా మార్పు లేకపోతే ఇక చర్యలకు వెనుకాడన''ని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, అధికారులతో కలసి నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ మాట్లాడారు. కొన్ని అర్జీలు కోర్టు పరిధిలో ఉండడంతో పాటు వ్యక్తిగత కక్షలతో కొందరు వస్తున్నారని, వారికి అర్థమయ్యేట్లు చెప్పి పంపాలని ఆదేశించారు. నెల రోజుల సమయం మాత్రమే ఉందని, అర్జీలను పెండింగ్‌లో పెట్టుకోవద్దని ఆదేశించారు. అనంతరం వచ్చిన 247 అర్జీలను అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కల్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయి కుమార్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భవనాన్ని పూర్తి చేయాలి

స్థానిక ఏజీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పునర్మించడంతో పాటు అక్కడ దళిత విద్యార్థుల కోసం రీడింగ్ రూమ్, లైబ్రరీని ఏర్పాటు చేయాలి. ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు.

–దళిత సంఘ నాయకులు

చంపుతామని బెదిరిస్తున్నారు

నేను గోరంట్ల సమీపంలోని ఏసన్న మందిరం వద్ద 425 చ.గ. కొనుగోలు చేసి హక్కుదారుల నుంచి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నా. టీడీపీ, జనసేన పార్టీకి చెందిన కొందరు గూండాలు వచ్చి స్థలంలో నాపై దాడి చేశారు. నా ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. మళ్లీ వచ్చి ''ప్రభుత్వం మాది.. మమ్మల్ని ఏమీ చేయలేరు.. ఖాళీ చేసి వెళ్లకపోతే చంపుతామ''ని బెదిరిస్తున్నారు. గూండా గిరి చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని, నాకు న్యాయం చేయాలి.

–డి.వెంకటరెడ్డి, గోరంట్ల

మరణంపై విచారణ జరపాలి

తిరుమలలోని పరకామణిలో అవినీతిపై ఫిర్యాదు చేసిన బీసీ కులానికి చెందిన టీటీడీ అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కె.సతీష్ కుమార్ మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. ఆయన మరణంలో కుట్ర కోణం ఉంది. ప్రభుత్వం నిష్పక్షపాతమైన విచారణ జరిపి, బీసీలకు వివరాలు బహిర్గితం చేయాలి.

–ఏపీ కుమ్మరి సంఘం నాయకులు

కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం

ర్యాలీలో జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, నగర అధ్యక్షులు నూరిఫాతిమా, సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ, దొంతిరెడ్డి వేమారెడ్డి, వనమా బాలవజ్రబాబు తదితరులు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు
- హిందూపురంలో దాడిన ఖండిస్తూ నిరసన
- ఎమ్మెల్యే బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : హిందూపురంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంపై టీడీపీ గూండాలు అందరూ చూస్తుండగానే దాడికి తెగబడటం అప్రజాస్వామికమని పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. దాడిని ఖండిస్తూ సోమవారం లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ముందుగా నల్ల కండువాలు, జెండాలు పట్టుకుని విగ్రహం చుట్టూ తిరుగుతూ, చంద్రబాబు ప్రభుత్వం ఆరాచకాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ కార్యాలయంపై దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించే వారి మీద కూడా టీడీపీ గూండాలు దాడి చేయడంతో పాటు అక్రమ అరెస్టులు చేయడం దారుణమైన సంఘటనగా పేర్కొన్నారు. పోలీసు డిపార్ట్‌మెంట్ కేవలం టీడీపీ తొత్తులాగా పని చేస్తుందని మండిపడ్డారు. హిందూపురంలో తమ పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణపై రాజకీయ విమర్శలు చేసినందుకు కార్యాలయంపై దాడి చేశారన్నారు. మరి బాలకృష్ణ అప్రజాస్వామికంగా మందు తాగి ఇష్టానుసారంగా శాసన సభలో మాట్లాడారని ఆరోపించారు. బాలకృష్ణ ఎన్టీఆర్ కొడుకైనా, సీఎం బావమరిది అయినప్పటికీ వెంటనే వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ కార్యాలయంపై దాడి చేసినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పార్టీ నగర అధ్యక్షురాలు, షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ దాడులు చేయడం మంచి పద్ధతి కాదని మండిపడ్డారు. బాలకృష్ణ 50 మందికి పైకి పైగా టీడీపీ గూండాలను పంపించి వైఎస్సార్ సీపీ కార్యాలయంపై దాడి చేయించడం చూస్తుంటే ఆయనకు భయం పుట్టుకుందేమోనని అనుమానంగా ఉందన్నారు. టీడీపీ నేతలు చేస్తున్న ప్రతి ఆరాచకాన్ని గుర్తు పెట్టుకుంటున్నాం ..సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, తాడికొండ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, పార్టీ ముఖ్య నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాకీలకు నిలువ నీడ కరువు

- ప్రశ్నార్థకంలో పోలీసులకు రక్షణ
- దాతల కోసం నిరీక్షణ
- త్వరలో కూల్చివేయనున్న ఓపీ పీఎస్
- ఇప్పటికీ అద్దె భవనంలో కొత్తపేట పోలీస్‌స్టేషన్

జీజీహెచ్ ఎమర్జెన్సీ విభాగం ఎదుట ఔట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్ పరిస్థితి

గుంట గ్రౌండ్స్ సమీపాన నిరుపయోగంగా కొత్తపేట పోలీస్‌స్టేషన్ స్థలం

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): గుంటూరు జీజీహెచ్‌కు రక్షణ కవచమైన ఔట్‌పోస్ట్ పోలీస్ స్టేషన్ (ఓపీ పీఎస్)ను త్వరలో కూల్చివేయనున్నారు. రోజూ ఇక్కడకు వేలల్లో రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. వీరితో పాటు వైద్యులు, సిబ్బంది రక్షణ నిమిత్తం పోలీసులకు చిన్న గదిని మాత్రమే కేటాయించారు. అత్యవసర సేవల చికిత్సా విభాగం ఎదురున్న ఖాళీ స్థలాన్ని కేటాయించేందుకు ఆసుపత్రి వర్గాలు సిద్ధంగా ఉన్నాయని తెలుస్తోంది. అయితే, అందులో ఓపీ పీఎస్ నిర్మాణం కోసం దాతల సహాయం తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. దీంతో పోలీసులు దాతల కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రహరీ కూల్చివేత

ఇటీవల శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పునః నిర్మాణ పనులు ప్రారంభించారు. విస్తరణలో భాగంగా జీజీహెచ్ అత్యవసర సేవల చికిత్సా విభాగం దగ్గరలోని ప్రహరీని కూల్చి నూతన నిర్మాణం చేపట్టారు. దీంతో అడ్డుగా మారిన ఓపీ పీఎస్‌ను తొలగించేందుకు జీఎంసీ అధికారులు సిద్ధమయ్యారు. పోలీసుల నుంచి అంగీకారం రాగానే క్షణాల్లో నేలమట్టం చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే, ఓపీ పీఎస్‌లో క్రైం రికార్డులు, బీరువాలు, బెంచీలు, కమ్యూనికేషన్ విభాగపు సెట్ ఉందని, ఇటీవల కూల్చి వేసేందుకు వచ్చిన జీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయమై నగర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, కాస్త ఊరట లభించినట్లు తెలుస్తోంది. అయితే, పోలీసులకు ఇక్కడే పెద్ద చిక్కు వచ్చింది. దాతలు దొరక్క అవస్థలు పడుతున్నారు.

గతంలో దాతల సాయంతో నిర్మాణం

ప్రస్తుతం ఉన్న ఓపీ పీఎస్‌ను డాక్టర్ అలపర్తి లక్ష్మయ్య జ్ఞాపకార్థం 2021లో నిర్మాణం ప్రారంభించారు. అప్పటి జిల్లా ఎస్పీ అమ్మిరెడ్డి 2021 మే 29న ప్రారంభించారు. లోపల మౌలిక సౌకర్యాలను కల్పించారు. దీంతో పోలీసులకు అనువుగా ఉండేది. రోడ్డు ప్రమాదాలు, హత్యలు, ఇతరత్రా నేరాలకు సంబంధించి క్షతగాత్రులు, మృతుల బంధువుల వద్ద వివరాల కోసం సుదూర ప్రాంతాల నుంచి పోలీసులు వస్తుంటారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే పోలీస్ ఉన్నతాధికారులు, పాలకులు సైతం వస్తారు. రోగులు, బాధితుల నుంచి ప్రమాద వివరాలను నమోదు చేసుకుంటారు. నేరాలకు సంబంధించి ప్రాథమిక నివేదిక రాసుకుంటారు. ఏలూరు, తూ.గో, ప.గో, వైజాగ్, కోస్తా, ఉమ్మడి జిల్లాల నుంచి పోలీసులు ఎమ్మెల్సీ కేసుల నిమిత్తం వస్తారు. ఈ సమయాల్లో ఇక్కడ ఓపీలోనే ఉంటారు. ఇక రాత్రివేళల్లో వచ్చే పోలీసులకు కాస్తంత సేద తీరేందుకు వెసులుబాటుగా ఉండేది. మళ్లీ ఓపీ పీఎస్‌ను కూల్చివేస్తే దాతల కోసం ఎదురు చూపులు చూడాల్సిందేనని పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

కిక్కిరిసిపోతున్న ఆస్పత్రి

వేల మంది రోగులతో ఆసుపత్రి వార్డులు కిక్కిరిసిపోతున్నాయి. సోమవారం నుంచి గురువారం వరకు ఓపీ, ఐపీ విభాగాలు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు మరింత రద్దీగా మా రతాయి. ఇక వైద్యాధికారులు, వైద్యులు, నర్సింగ్, ప్రైవేటు ఏజెన్సీల సిబ్బందితో కిటకిటలాడుతుంది. వేలాదిగా వచ్చే పోయే వారికి రక్షణగా, భద్రతగా కొత్తపేట స్టేషన్ పోలీసులు ఓపీ పీఎస్‌లో ఉంటున్నారు. మృతుల బంధువుల ఆందోళనలు, వార్డుల్లో మొబైల్ ఫోన్లు, నగదు, ఇతరత్రా చోరీలు, ప్రసూతి, పిల్లల విభాగాల్లో శిశువుల అపహరణ తదితర నేరాలను ఇక్కడ పోలీసుల అడ్డుకుంటారు. ఇటీవల ఎమర్జెనీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులపై దాడులకు ప్రయత్నించగా ఇక్కడ పోలీసులే కట్టడి చేశారు.

అద్దె భవనంలో అగచాట్లు

ఇప్పటికీ తూర్పు సబ్ డివిజన్‌లోని కొత్తపేట పోలీస్‌స్టేషన్ అద్దె భవనంలో కొనసాగుతోంది. భాస్కర్ డీలక్స్ థియేటర్ రోడ్డులోని ఓ కాంప్లెక్స్‌లో సుమారు ఆరేళ్లుగా నడుస్తోంది. నెలనెలా అద్దె రూపేణా వేల రూపాయలు చెల్లిస్తున్నారు. అయితే, కొత్తపేట పోలీస్‌స్టేషన్‌కు గుంట గ్రౌండ్స్ సమీపాన సుమారు ఐదు వందల గజాల స్థలం ఉంది. అయితే, చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు గడిచినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పాత స్థలంలో చెట్లు మొలిచాయి. ఇటీవల కొందరు పాత సామాన్లతో అక్రమించగా, వారిని ఖాళీ చేయించారు. పీఎస్, జీజీహెచ్ ఓపీ పోలీస్‌స్టేషన్ల నిర్మాణాలపై కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు తుళ్లూరులో ‘సంకల్పం’ ప్రారంభం

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : జిల్లాలో మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ‘సంకల్పం’ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమాశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 18న తుళ్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీఐటీ విశ్వ విద్యాలయ ఆవరణలో ‘సంకల్పం’ ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని కళాశాలల విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడితే కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇటీవల కొందరు కళాశాల విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి, భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, వారిపై కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో మార్పు తీసుకువచ్చి, మంచి మార్గంలో నడిపించడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిని గుర్తించి, డీ–అడిక్షన్ కేంద్రాలకు పంపిస్తామని చెప్పారు. అవసరమైన వారికి చికిత్స, కౌన్సెలింగ్ ద్వారా చర్యలు చేపడతామని వెల్లడించారు. ‘సంకల్పం’ రెండు దశల్లో నిర్వహిస్తామన్నారు. మాదక ద్రవ్యాల ప్రమాదాలపై తొలి దశలో కళాశాలల్లో విద్యార్థులకు, రెండో దశలో తల్లిదండ్రులకు అవగాహన సదస్సులు చేపడతామని ఎస్పీ వివరించారు.

శివోహం

మల్లేశ్వరస్వామి మూలవిరాట్

స్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శివాలయం సోమవారం శివ నామస్మరణతో మార్మోగింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. కార్తిక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని దీపాలు వెలిగించి పూజలు చేసేందుకు తెల్లవారుజాము నుంచే జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోని యజ్ఞాల బావి నీటితో స్నానాలు చేశారు. అనంతరం ఆలయం చుట్టూ శివ నామం స్మరిస్తూ ప్రదక్షిణలు చేశారు. కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు పొంగించి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

–పెదకాకాని

క్లుప్తంగా

ఏపీటీఎఫ్ జిల్లాశాఖ కార్యవర్గం ఎన్నిక

కె.బసవలింగారావు

మొహమ్మద్ ఖాలీద్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.బసవలింగారావు, మొహమ్మద్ ఖాలీద్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులోని రెవెన్యూ భవన్‌లో జరిగిన జిల్లా కౌన్సిల్‌లో జిల్లా శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పి.నాగశివన్నారాయణ, పుట్టా జనార్ధనరావు, పూడుమల్లి పార్వతి, గుడిపాటి దాస్, కార్యదర్శులుగా పి.లక్ష్మీనారాయణ, గడ్డిపాటి శివరామకృష్ణయ్య, చక్కా వెంకటేశ్వరావు, పచ్చల శివరామకృష్ణ, కుంబా శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా మునగా వెంకటేశ్వరావు, బి.సాయి లక్ష్మీ, కేసన రమేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా యూ.వందనం, సభ్యులుగా డి.శివశంకర్రావు, షేక్ సిద్దిక్, కంచర్ల ఆదినారాయణ, ఆర్.బాలరాజు, కె.శివశంకర్‌నాయక్‌తోపాటు మొత్తం 19తో పాటు అకడమిక్, జీవో, సాంస్కృతిక, మహిళా కమిటీల కన్వీనర్లు, సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈవీ రామారావు, ఎన్నికల పరిశీలకునిగా మక్కెన శ్రీనివాసరావు వ్యవహరించారు.

ఎమ్మెస్సీ యోగా పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ(పెదకాకాని): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ ఏడాది జులై, ఆగస్టు నెలల్లో నిర్వహించిన ఎమ్మెస్సీ యోగా నాలుగవ సెమిస్టర్, పీజీ డిప్లొమో యోగా పరీక్ష ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ రావు సోమవారం విడుదల చేశారు. రీవాల్యుయేషన్ ఒక్కొక్క పేపర్‌కు రూ.1860 చెల్లించాలన్నారు. ఈ నెల 27వ తేదీ లోపు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఫిరంగిపురం: ప్రయాణీలతో వెళుతున్న ఆటోను వెనక నుంచి వచ్చి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రంలోని రేపూడి గ్రామశివారులో సోమవారం చోటుచేసుకుంది. ప్రయాణీలను తీసుకుని పేరేచర్ల నుండి నరసరావుపేట వైపునకు వెళుతున్న ఆటోను గుంటూరు నుంచి నరసరావుపేటకు వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనక నుండి ఢీకొంది. దీంతో ఆటోలోని ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. వారిని 108లో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సకోసం తరలించారు. సంఘటనా స్థలానికి ఎస్‌ఐ నవీన్, పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పూర్తివివరాల తెలియాల్సి ఉంది.

నిర్ణీత వేళల్లో సమస్యలకు పరిష్కారం చూపాలి

- ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశం
- సమస్యలు ఏకరువు పెట్టిన బాధితులు

సమస్య ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): దురుసుగా వ్యవహరిస్తున్న ఓ ఎస్‌ఐపై, కుటుంబ సభ్యుల నుంచి బంగారం యిప్పించాలని ఓ బాధితురాలు ఫిర్యాదు చేశారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. బాధితుల నుంచి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అర్జీలు స్వీకరించారు.
అర్జీదారుల సమస్యలను ఆయన ఆలకించారు. ఆయా ఫిర్యాదిదారుల సమస్య లపై సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో జిల్లా ఎస్పీ మాట్లాడారు. ప్రతి ఫిర్యాదు నిర్ణీత సమయంలో చట్టపరంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి, డీఎస్పీలు శ్రీనివాస రెడ్డి (మహిళా పీఎస్), అరవింద్ (గుంటూరు పశ్చిమ), భానోదయ (గుంటూరు దక్షిణ)లు అర్జీలు స్వీకరించారు.

ఎస్‌ఐ దురుసు ప్రవర్తనపై..

ఈనెల ఒకటిన బీరువాలో దాచిన 25 గ్రాముల బంగారం, రూ.30 వేలు అపహరించారు. అదే రోజు సాయంత్రం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇంటి వద్ద ఒకరిపై అనుమానం ఉందని చెప్పాం. ఆ రోజు సదరు ఎస్‌ఐ మా ఇంటికి వచ్చి, దొంగతనం ఎక్కడ జరిగిందంటూ బిగ్గరగా కేకలు వేయ సాగాడు. మరుసటి రోజు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే తమపై అనుమానంగా సదరు ఎస్‌ఐ మాట్లాడారు. ఒకటో తేది నుంచి పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్తున్నా, సదరు ఎస్‌ఐ రేపు రండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడు. దొంగలించిన బంగారం గుర్తించి, సదరు ఎస్‌ఐపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– పి.మరియమ్మ భర్త రవికుమార్, సంజీవయ్యనగర్ ఒకటో వీధి.

నగలు, నగదు తీసుకుని..

చిన్నతనంలో తండ్రి, నాలుగేళ్ల క్రితం తల్లి చనిపోయారు. ఒంటరిగా ఉంటున్న నన్ను సోదరి కుమారుడు ఫోన్ చేసి, వాళ్ల ఇంటికి తీసుకెళ్లారు. రెండు నెలలు బాగానే చూసుకున్నారు. నాతో నమ్మకంగా ఉంటూ పద్నాలుగా సవర్ల బంగారం, రూ.13 లక్షలు తీసుకున్నారు. నగలు, నగదు తిరిగి యివ్వాలని వారిని అడగ్గా, నాపై దాడికి పాల్పడ్డారు. దీంతో వారికి భయపడి తెలిసిన వాళ్ల ఇళ్లల్లో ఉంటున్నాం. వారి నుంచి ప్రాణహాని ఉంది. నా వద్ద తీసుకున్న నగదు, నగలు యిప్పించాలని కోరుతున్నాం.

– షేక్.మౌలాబి, శ్రీనివాసరావుపేట ఐదో వీధి.

స్నేహితుడు మోసగించాడు

స్నేహితుడితో కల్సి జాబ్ కన్సల్‌టెన్సీ ప్రారంభించాం. దీనికై అతనికి రూ.2.27 లక్షలు చెల్లించా. ఆరు నెలలు ఇద్దరి మధ్య బాగానే ఉంది. కాలక్రమేణా నన్ను దూరంగా ఉంచాడు. వ్యాపారంలో వచ్చే లాభాలు యివ్వడం లేదు. దీనిపై ఇటీవల స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశా. ఈ ఏడాది జనవరిలో రూ.1.78 లక్షలు చెల్లిస్తానని ఒప్పుకున్నాడు. తరువాత అతనికి ఫోన్ చేయగా స్పందించడం లేదు. పదేళ్ల క్రితం మోటారు సైకిల్‌పై వెళ్తుండగా, లారీ ఢీకొనగా కుడి కాలు విరిగింది. ప్రస్తుం ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉంది. న్యాయం చేయగలరు.

– హరిష్, బుచ్చయ్యతోట, ఐదోవీధి.

విద్యుత్ అధికారుల దాడులు

రూ. 6.69 లక్షల అపరాధ రుసుం వసూలు

కొరిటెపాడు (గుంటూరువెస్ట్): నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ చల్లా రమేష్‌బాబు తెలిపారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు డీ–6 సెక్షన్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. 49 మంది అధికారులు, 147 మంది సిబ్బంది కలిసి 49 బృందాలుగా ఏర్పడి 4,599 సర్వీసులను తనిఖీ చేశారు. అనుమితించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 268 మందికి రూ.6.45 లక్షలు, అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిల్లో విద్యుత్ వాడుకుంటున్న ముగ్గురిపై రూ.15వేలు అపరాధ రుసుం విధించారు. తనిఖీల్లో ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు కె.ఎ.కరీం, కె.శ్రీనివాసబాబు, విజిలెన్స్ సీఐ డి.వెంకన్నచౌదరి, డీఈఈలు రాజమోహన్‌రావు, కె.రవికుమార్, ఎన్.మల్లికార్జునప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, ఏఈలు కె.సాంబశివరావు, కోటేశ్వరరావు, శివశంకర్ పాల్గొన్నారు.

సంక్షేమ చట్టం– 2007 పై న్యాయ విజ్ఞాన సదస్సు

అవగాహన కల్పిస్తున్న సయ్యద్ జియాఉద్దీన్

గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం తల్లి దండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం, 2007 పై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సదస్సుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ పాల్గొన్నారు. వృద్ధులకు ఉన్న అన్ని రకాల చట్టాలు, వాటి ఉపయోగాలు, హాస్పిటల్స్, వృద్ధాశ్రమాల్లో, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న వసతులు, సదుపాయాల గురించి వివరించారు. పారా లీగల్ వలంటీర్ ఎం.డి.రఫీ మాట్లాడుతూ రెవెన్యూ డివిజనల్ ఆఫీసు గుంటూరులో సీనియర్ సిటిజన్స్‌కు న్యాయ పరమైన సలహాలు, సేవలు ఎలా అందుతాయో వివరించారు. ఎటువంటి సివిల్ సమస్యలైనా త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేసి న్యాయం అందేలా చేస్తామని తెలిపారు. గుంటూరు సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ ప్రెసిడెంట్ కైలాసనాథ్, సీనియర్ సిటిజెన్స్ వైస్ ప్రెసిడెంట్ కె.వి.చలపతి రావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కి ఎటువంటి సేవలు చేస్తున్నారో అలాగే ఇంకొంత సహాయ సహకారాలుంటే ఎలాంటి సేవలు చేయవచ్చో తెలిపారు. వారికి ఉన్న సమస్యలు గురించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కి ఉన్న న్యాయపరమైన హక్కుల గురించి తెలిపారు. అందరూ అడిగిన సమస్యలకు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రగతి వృద్ధాశ్రమం, ఉదయశ్రీ వృద్ధాశ్రమం, కొత్తపేట వృద్ధాశ్రమం నుంచి వృద్ధులు, సీనియర్ సిటిజన్స్ ఆఫీస్ స్టాఫ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గుంటూరు ప్రత్తిపాడు లోని నవీన ఆదర్శ మహిళా మండలి వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడ ఉన్న వృద్ధులకు న్యాయపరమైన సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ మహిళామండలి స్టాఫ్, వృద్ధులు పాల్గొన్నారు.

హైవేపై బ్లాక్ స్పాట్‌లలో హెచ్చరిక బోర్డులు

గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ జి. భానుదయ

రహదారిపై బ్లాక్ స్పాట్‌లను గుర్తిస్తున్న డీఎస్పీ భానుదయ, ఎంవీఐ నాగమల్లేశ్వరి, సీఐలు

ప్రత్తిపాడు: హైవేపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లలో హెచ్చరిక బోర్డులు, లైట్లు ఏర్పాటు చేయాలని గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ జి. భానుదయ అన్నారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా ప్రత్తిపాడు మండలంలోని పదహారవ నంబరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు (బ్లాక్ స్పాట్స్)ను గుర్తించేందుకు సోమవారం సాయంత్రం గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ భానుదయ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరి, ఎన్‌హెచ్‌ఏఐ సీనియర్ ఇంజనీర్ దత్తాత్రేయ, నల్లపాడు సీఐ వంశీధర్, ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావుల బృందం హైవేపై పర్యటించింది. సౌత్ సబ్‌డివిజన్ పరిధిలోని 28 కిలోమీటర్ల హైవే పరిధిలో మొత్తం పన్నెండు బ్లాక్ స్పాట్‌లను అధికారుల బృందం గుర్తించింది. ఆయా స్పాట్‌లలో తీసుకోవలసిన భద్రతా చర్యలపై చర్చించారు. ప్రమాద స్థలాల్లో సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయాలని, హెచ్చరిక బోర్డులు, సూచిక చిహ్నాలు, రిఫ్లెక్టివ్ మార్కింగ్‌లు, సీసీ టీవీ కెమెరాలు, ప్రమాద ప్రాంతాల వద్ద ఫెన్సింగ్, స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అధికారుల బృందం చేసిన అధ్యయనం ఆధారంగా ప్రత్యేక సాంకేతిక రిపోర్టును రూపొందించి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు అందించనున్నట్లు తెలిపారు. ప్రత్తిపాడు ఎస్‌ఐ కె. నరహరి తదితరులున్నారు.

పెదకాకానిలో 2 కిలోల గంజాయి స్వాధీనం

పెదకాకాని: గంజాయి ప్యాకెట్లు తయారీ చేస్తున్న ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన షేక్ సునీల్‌భాషా, ఇంటూరు కిరణ్‌లు చెడు వ్యసనాలకు బానిసలుగా మారి గంజాయి తాగడంతో పాటు అమ్మడానికి అలవాటు పడ్డారు. వెనిగండ్ల భ్రమరాంబ కాలనీలో సోమవారం గంజాయి తాగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో గంజాయి త్రాగుతున్న సునీల్‌భాషా, ఇంటూరి కిరణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద చిన్న చిన్న ప్యాకెట్‌ల రూపంలో ఉన్న 2 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు సీఐ టిపి నారాయణస్వామి తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 600 గరిష్ఠం : రూ. 900

మోడల్ ధర రూ. 700

పారదర్శకంగా దివ్యాంగులకు సదరం సేవలు

- 24/7 వైద్యులు, నర్సులు అందుబాటులో ఉండాలి
- ఆంధ్రప్రదేశ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు

ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులతో మాట్లాడుతున్న కె.వి.ఎన్. చక్రధర్‌బాబు, పక్కన డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు

ప్రత్తిపాడు: పారదర్శకంగా, శాస్త్రీయంగా దివ్యాంగులకు సదరం క్యాంపుల్లో సేవలు అందించాలని ఆంధ్రప్రదేశ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు అన్నారు. ప్రత్తిపాడులోని సదరం ప్రత్యేక వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. వైద్య నిపుణుల ద్వారా దివ్యాంగుల నిర్ధారణ ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. సదరం క్యాంప్ వద్ద చేసిన ఏర్పాట్లు, కౌంటర్లు, రిజిస్ట్రేషన్లు, పరీక్షలు, సర్టిఫికెట్ ప్రాసెసింగ్.. వంటి విషయాలను స్థానిక వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. హాజరైన దివ్యాంగులతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. దివ్యాంగ నిర్ధారణ నిమిత్తం నిర్వహించే ఈ సదరం క్యాంపుల్లో దివ్యాంగులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఓపీ, ఐపీ పరిశీలన..

అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ప్రసవ సేవలు, ఔట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ సేవలను డైరెక్టర్ చక్రధర్‌బాబు పరిశీలించారు. రోజువారీ ఓపీ, రక్త పరీక్షల వివరాలు ప్రజలకు అందుతున్న సేవలపై ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ ప్రవీణ్ డైరెక్టర్‌కు వివరించారు. ల్యాబ్‌లో రక్త, మూత్ర పరీక్షలతో పాటు బయోకెమిస్ట్రీ పరీక్షలు జరుగుతున్నాయా, రిపోర్టులు ఎన్ని రోజులకు అందిస్తున్నారు. పరికరాలను సక్రమంగా వినియోగిస్తున్నారా, వంటి విషయాలపై ఆరా తీశారు. వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు కచ్చితంగా 24/7 అందుబాటులో ఉండాలని ప్రజలకు అత్యంత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

డిజిటల్ సేవలను మరింత విస్తృతం చేయాలి..

ఆస్పత్రిలో డిజిటల్ సేవలను మరింత విస్తృతం చేయాలని డైరెక్టర్ చక్రధర్‌బాబు సూచించారు. ఈ హాస్పిటల్ ద్వారా అందిస్తున్న డిజిటల్ ఓపీ, రోగుల నమోదు, డిజిటల్ ప్రిస్క్రిప్షన్, ల్యాబ్–ఫార్మసీ ఇంటిగ్రేషన్ సౌకర్యాలను పరిశీలించారు. డిజిటల్ సేవలను మరింత వేగవంతం చేసి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రసవ వార్డును సందర్శించి అక్కడ ఉన్న గర్భిణులతో మాట్లాడి అందుతున్న ప్రసవ సేవలను అడిగి తెలుసుకున్నారు. అన్ని విభాగాల సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ రంగారావు, సదరం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ చంద్, సీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థి జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ప్రిన్సిపల్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ కళాశాలలో సీనియర్ ఎంపీసీ చదువుతున్న విద్యార్థి దొండపాటి ధృవేష్ ఇటీవల మన్యం జిల్లా పార్వతీపురంలో జరిగిన అండర్ 19 రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచాడని తెలిపారు. డిసెంబర్ నెల 5వ తేదీ నుంచి 7వతేదీ వరకు బెంగళూరులో జరుగునున్న జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి ధృవేష్‌ను కళాశాల అధ్యాపకులు రవికుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు అభినందించారు.

19, 20వ తేదీల్లో ఆదర్శ్–2025

బ్రోచర్లు విడుదల చేస్తున్న రామకృష్ణమూర్తి, పీఎం ప్రసాద్, సుబ్బారావు, నర్సిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరంఅమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 19, 20వ తేదీల్లో ఆదర్శ్–2025 పేరుతో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ పీఎం ప్రసాద్ తెలిపారు. సోమవారం కళాశాలలో బ్రోచర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు చెస్, క్యారమ్స్, కబడ్డీ, వాలీ బాల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, పికెల్ బాల్, షాట్‌పుట్, త్రోబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా పోటీల్లో విజేతలకు రూ.రెండు లక్షల వరకు నగదు బహుమతులు అందజేస్తామని వివరించారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే విద్యార్థులు, కోచ్‌లకు భోజన, వసతి సదుపాయాలు కల్పించేందుకు నిర్ణయించామని, ఎటువంటి ఎంట్రీ రుసుం చెల్లించాల్సిన అవసరం లేకుండా విద్యార్థులు పాల్గొనవచ్చునని వివరించారు. విద్యార్థుల్లో శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగించేందుకు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేర్లు నమోదుకు 63021 78787, 81214 24642 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సుష్మ, సీహెచ్ సుబ్బారావు, వజ్రాల నర్సిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

- కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 400 గజాలలో గల 10000+ Sft. విల్లా అమ్మకమునకు కలదు. నో బ్రోకర్స్. ✆ 99662 28370

SERVICES

GOLD FINANCE

- బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

WANTED

- సివిల్ కాంట్రాక్ట్ కంపెనీ నందు పని చేయుటకు సివిల్ ఇంజనీర్ మరియు సైట్ లో పనిచేయుటకు ఐటిఐ ఇంజనీర్ కావలెను. 9951052345
- కావలెను. గుంటూరు సిటీ, కొత్తపేట, మెడికల్ ఏజెన్సీ నందు 10th / Intermediate అర్హత కలిగిన ఆఫీస్ బాయ్స్ కావలెను. సంప్ర: 99499 44577
- గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు 10th Pass, 35సం॥వయస్సు పైబడిన వారు, గృహిణులు కావలెను. 9989909698
- గుంటూరు పరిసర ప్రాంతాల్లో ప్రముఖ పురుగు మందుల కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15000+3000. సం॥ 9121469383
- గుంటూరు సిటీలో తెలుగు ఇంగ్లీషు టైపు ఫాస్ట్ గా చేయగలిగిన లేడీ టైపిస్ట్ కావలెను. 9666933337.
- షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమం హైదరాబాద్‌లో టీటి వంట మనుషులు,లేడీసూపర్ వైజర్స్, లేడీటీ టీకర్స్, నర్సులు,కాంపౌండర్స్, ఆయాలు, వాచ్‌మేన్స్ భార్యాభర్తలు కావలెను. 8985114453, 9391036931

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు 7075167663 7075167541

గమనిక

అర్ధరాత్రి ఆటో, ద్విచక్రవాహనాల దహనం

దహనమైన ఆటో, ద్విచక్రవాహనాలు

గుంటూరు రూరల్: అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నివాసాల మధ్య రోడ్డుపై నిలిపి ఉంచిన ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను దహనం చేసిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం అడవితక్కెళ్ళపాడు టిడ్‌కో నివాసాల వద్ద ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను దహనం చేశారు. ఉదయం నివాసాల్లోని ప్రజలు గమనించటంతో బాధితులు పవన్, పద్మ, సింధూలు సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఐతే సంఘటనలో ఆకతాయిలు మద్యం మత్తులో ఘాతకానికి పాల్పడ్డారా? లేక పాత కక్షల నేపథ్యంలో ఇటువంటి సంఘటనలకు పూనుకున్నారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు వెనకవైపు కూతవేటు దూరంలో ఇటువంటి సంఘటన జరగటంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు కనిపించే అంత దూరంలోనే ఇటువంటి సంఘటన జరగటంతో ఇక ప్రజల రక్షణ పరిస్థితి ఏంటా అని ఆలోచనలో పడ్డారు. ఇదేవిధంగా రాత్రి సమయాల్లో ఆకతాయిలు మద్యం మత్తులో వివాదాలకు పాల్పడటం, గొడవలు నిత్యం జరుగుతూనే ఉంటాయని, రాత్రి సమయంలో పోలీసుల గస్తీలు, బీట్‌లు లేకపోవటంతో ఇటువంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని ఆత్మహత్య

కొల్లిపర: మండల పరిధిలోని జెముడుబాడుపాలెం గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి ఇంటిలో ఉరివేసుకొని మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జెముడుబాడుపాలెం గ్రామానికి చెందిన పసుపులేటి లావణ్య (20) గుంటూరు లోని ప్రైవేటు కళాశాలలో బీటెక్ 4 ఇయర్ చదువుతోంది. ఆమెకు గత మూడు సంవత్సరాలు నుంచి చిన్న ప్రేగులో అనారోగ్య సమస్యలు వలన వైద్యం తీసుకుంటోంటుంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తన తల్లి ఇంటి ఆరు బయట పనులు చేసుకునే సమయంలో ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకుంది. తల్లి బయట ఇంటి బయట పనులు ముగించుకుని ఇంటిలోకి వచ్చే సరికి తను ఉరి వేసుకోవటం గమనించి పోలీసులకు సమాచారం అందించింది.

అన్నం పెట్టిన సంస్థకే కన్నం

- రూ. 87లక్షలు చోరీ
- 15 రోజుల్లోనే కేసును ఛేదించిన రైల్వే పోలీసులు
- ఇద్దరు నిందితులు అరెస్ట్

స్వాధీనం చేసుకున్న నగదు, నిందితులను చూపుతున్న జీఆర్పీ డీఎస్పీ రత్నరాజు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్లో ఓ ప్రయాణికుడు నిద్రిస్తుండగా రూ.87 లక్షల నగదు ఉన్న అతని బ్యాగును చోరీ చేసిన నిందితులను రైల్వే పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ రైల్వే ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో జీఆర్పీ డీఎస్పీ రత్నరాజు ఈ కేసులో ఇద్దరు నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. గుంటూరులోని ఒక పౌల్ట్రీ ఫారంలో మేనేజర్‌గా పనిచేస్తున్న బెజవాడ నాగరాజు యజమానుల సూచనల మేరకు గత నెల 31న విజయనగరం, విశాఖపట్నంలోని తమ బ్రాంచ్ కార్యాలయాలకు వెళ్లి.. అక్కడ నుంచి రూ.87లక్షల నగదుతో గుంటూరుకు బయలుదేరారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రాయగడ ఎక్స్‌ప్రెస్ బీ1 కోచ్‌లో ఎక్కిన ఆయన తన బ్యాగును బెర్త్ కింద పెట్టి నిద్రపోయాడు. ఒకటో తేదీ తెల్లవారుజామున 3.10 గంటలకు రైలు విజయవాడ చేరుకున్న సమయంలో నాగరాజు తన బ్యాగును చూసుకుంటే కనిపించలేదు. రైలు అంతా వెతికినా ఉపయోగం లేకపోవడంతో అదే రోజు విజయవాడ జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్ద మొత్తంలో నగదు చోరీకి గురవడంతో పోలీసులు ఈ కేసును సవాలుగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రత్యేక బృందాలుగా..

ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, సీఐబీ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసు దర్యాప్తు చేపట్టారు. అందుబాటులోని సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు ఒక బృందం విశాఖపట్నం వెళ్లి అక్కడ బాధితుడు రైలు ఎక్కే సమయం నుంచి అందుబాటులో ఉన్న అన్ని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో రైలు విజయవాడ స్టేషన్ చేరుకున్న సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి తలకు టోపీ, ముఖానికి మాస్క్, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించి, సిమెంట్ కలర్ లగేజీ బ్యాగుతో వెళ్తుండటంతో గుర్తించి అతని కథలికలను తనిఖీ చేశారు. అతని చేతిలోని బ్యాగు.. చోరీకి గురైన బ్యాగుగా బాధితుడు గుర్తించడంతో పోలీసులు అతని కథలికలపై అన్ని ప్రాంతాలలో నిఘా పెట్టారు. అయితే అతను ఎక్కడా కూడా తన ముఖానికి మాస్క్, తలకు టోపీ తీయకపోవడంతో ఆనవాళ్లు గుర్తు పట్టడం పోలీసులకు కష్టంగా మారింది.

సాంకేతిక పరిజ్ఞానంతో..

స్టేషన్ నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి అనుమానితుడిని ట్రేస్ చేయగా ఆటోలో వారధి జంక్షన్‌కు చేరుకుని అక్కడ నుంచి ఒక ప్రైవేటు వాహనంలో పొన్నూరు చేరుకుని, అక్కడ నుంచి ఆర్టీసీ బస్సులో ఒంగోలు వెళ్లి అక్కడ తన దుస్తులు మార్చి, బ్యాగులోని నగదును మరో బ్యాగులోకి మార్చుకుని పలు ప్రాంతాలకు తప్పించుకుని తిరుగుతున్నాడు. పోలీసులు సీసీ టీవీలు, బస్సు డ్రైవర్లు, కండక్టర్‌లను విచారించి, సెల్‌ఫోన్ టవర్‌ల ఐడీలను ఉపయోగించి సాంకేతిక సమాచారం ధ్రువీకరణ చేపట్టారు. బాధితుడికి దగ్గర లొకేషన్‌లోని సెల్ నంబర్‌లను సేకరించడం ద్వారా నిందితుడిని గుర్తించారు. బాధితుడు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కినప్పటి నుంచి నిందితుడు కూడా అదే రైలు ఎక్కినట్టు గుర్తించారు.

అన్నదమ్ముల పనే..

అదే విధంగా ఆ మేనేజర్ పనిచేసే పౌల్ట్రీలో ఇతర సిబ్బంది సెల్ ఫోన్ నంబర్‌లను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేయగా అనుమానితుడి నంబర్‌కు పౌల్ట్రీఫారంలో పనిచేసే బూదాల లలిత్‌కుమార్ నుంచి ఫోన్‌లు వెళ్లినట్టుగా గుర్తించారు. ఆ ఫోన్‌లు అతని తమ్ముడు బూదాల అశోక్ కుమార్ పేరుతో ఉండటంతో ఇద్దరు కలసి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. చోరీ జరిగినప్పటి నుంచి లలిత్‌కుమార్ కూడా కనిపించకపోవడంతో పోలీసులు వేగంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నిందితులు ఇద్దరు సోమవారం చెన్నై వెళ్లేందుకు విజయవాడ రైల్వేస్టేషన్‌కు వస్తున్న తరుణంలో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు పార్శిల్ కార్యాలయం వద్ద దాడి చేసి అరెస్టు చేశారు.

ఇప్పటికే ఒకసారి ప్రయత్నం..

బూదాల లలిత్‌కుమార్ తాను పనిచేసే సంస్థలో ఇతర బ్రాంచ్‌ల నుంచి తరచూ పెద్ద మొత్తంలో నగదు తీసుకువస్తుంటారని గమనించాడు. ఎలాగైనా నగదును చోరీ చేయాలని తన తమ్ముడు బూదాల అశోక్‌కుమార్‌తో కలసి పథకం వేశాడు. అందులో భాగంగా అక్టోబర్ ఒకటో తేదీన సిబ్బంది రైలులో నగదుతో వస్తారని గమనించి చోరీకి యత్నించారు. అది కుదరకపోవడంతో అదే నెల 31న తన సోదరుడు చేత చోరీ చేయించాడు. ఆ నగదులో వారు అనేక ప్రాంతాలలో తిరుగుతూ చివరికి చెన్నై వెళ్లిపోయే క్రమంలో పోలీసులకు పట్టుపడ్డారు. చోరీ సొమ్ములో రూ.2.5లక్షలు జల్సాలకు వాడుకోగా, మిగి లిన రూ.84.5లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. పదిహేను రోజుల్లోనే కేసును ఛేదించిన జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు జె.వి రమణ, ఫతే ఆలీబేగ్ తదితరులను రైల్వే డీఎస్పీ రత్నరాజు ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

వృథాగా తాగునీరు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని సీతానగరం మార్వాడీ బజారులో తాగునీటి పైపు నుంచి తాగునీరు లీకై బయటకు వస్తోంది. సిమెంట్ రోడ్డుకు రంధ్రాలు ఏర్పడి తాగునీరు రోడ్డుపైకి ఉబుకుతోందని స్థానికులు చెబుతున్నారు. గత 15 రోజుల నుంచి తాగునీరు వృథాగా డ్రైనేజీలో కలుస్తోందని.. ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

త్రీవీలర్ మోటారు సైకిల్‌కు దరఖాస్తు

ఫిరంగిపురం: మండల పరిధిలో అర్హులైన దివ్యాంగులు త్రీవీలర్ మోటారు సైకిల్ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకూ గడువు ఉన్నందున గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కళ్లం ట్రస్ట్ ఆధ్వర్యంలో వన సమారాధన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి కళ్లం రత్తారెడ్డి, తులసమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఏర్పాటు చేయడంతో దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విచ్చేసి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 4 వేల మందికి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కళ్లం రామిరెడ్డి, సాంబిరెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి

ఫిరంగిపురం: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి జనాబ్ పఠాన్ అబ్దుల్లాఖాన్ అన్నారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో పఠాన్ అబ్దుల్లాఖాన్‌ను ఫిరంగిపురం మండలానికి చెందిన జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ సైదాఖాన్, జిల్లా బూత్ కమిటీ విభాగ అధ్యక్షుడు ఉడుముల పిచ్చిరెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

మంగళగిరి టౌన్: టిప్పర్ లారీ ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన మంగళగిరిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. పట్టణ పరిధి కొప్పురావు కాలనీకి చెందిన మురాల సుందర యాండ్రూస్(35) ర్యాపిడో బైక్ రైడర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సోమవారం తన ద్విచక్రవాహనంపై మండల పరిధి కురగల్లు నుంచి మంగళగిరి తిరిగి వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి టిప్పర్ లారీ టైర్‌కు తగిలింది. ఈ ఘటనలో లారీ యువకుడి తలపై నుంచి వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బండారుపల్లిలో మహిళ మృతదేహం

తాడికొండ: తాడికొండ మండలం బండారుపల్లి మేజర్ కాలువలో సోమవారం గుర్తుతెలియని సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన మహిళ మృతదేహం తేలియాడుతూ లభ్యమైనట్లు తాడికొండ పోలీసులు తెలిపారు. వీఆర్వో మధుసూధనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మహిళ మృతదేహం ఉబ్బి గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి వీఆర్వో ఫిర్యాదు మేరకు ఎస్ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలు

దుగ్గిరాల: కిశోర బాలికలకు బాలల సంక్షేమం, పరిరక్షణ, పోషకాహారం వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి తెలిపారు. దుగ్గిరాల మండల కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఐసీడీఎస్ వాణి ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా కిశోర బాలికలకు సోమవారం సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓం.. శివోహం!



విశేష అలంకరణలో స్వామివారు

శ్రీగంగా భ్రమరాంభ సమేత మల్లికార్జున ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

విద్యుత్ దీప కాంతుల్లో మంగళగిరి శివాలయం

దర్శనానికి బారులు తీరిన భక్తులు

- కార్తికమాస చివరి సోమవారం ప్రత్యేక పూజలు
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

మంగళగిరి టౌన్: కార్తికమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయాలు, పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు శివాలయాల వద్ద స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. భక్తులు ఆలయాలకు చేరుకుని మహా శివునికి అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగించి పరమశివుని భక్తిశ్రద్ధలతో పూజించారు. మంగళగిరి నియోజకవర్గ పరిధి మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ఆలయాలు కార్తిక దీపకాంతులతో కళకళలాడాయి. మంగళగిరి నగర పరిధి శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానం శివ నామస్మరణతో మార్మోగింది. హర హర మహాదేవ.. శంభో శంకర.. అంటూ భక్తులు శివయ్యను దర్శించుకున్నారు.

దీపాలతో శివలింగం ఆకృతి..

మహిళలు, వృద్ధులు, చిన్నారులు శివునికి పెద్ద ఎత్తున దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. శివాలయంలో దీపాలతో శివలింగం ఆకృతిలో దీపాలు వెలిగించడంతో భక్తులు తిలకించేందుకు ఆసక్తి చూపారు. శివాలయంలో కర్నూలు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర పరిధి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. నృసింహ దర్శనం అనంతరం రాజ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభం వద్ద కార్తిక దీపాలు వెలిగించారు. తెల్లవారుజాము నుంచే పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆయా ఆలయాల అధికారులు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా కార్తిక పూజలు..

ఫిరంగిపురం: మండలంలోని ఆలయాల్లో కార్తిక చివరి సోమవారం సందర్భంగా దేవతామూర్తులకు విశేష పూజలు చేశారు. ఫిరంగిపురంలోని కాళహస్తీశ్వరస్వామి, నగరేశ్వరస్వామి, వేములూరిపాడులోని జలపాలేశ్వరస్వామి, నుదురుపాడు, వేమవరం గ్రామాల్లోని అన్నపూర్ణ సహిత విశ్వేశ్వర స్వామివార్లకు అర్చకులు విశేష అర్చనలు నిర్వహించారు. వేమవరంలోని కోటిలింగాల క్షేత్రంలోని మహాకాళేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. సాయంత్రం దీపోత్సవం, మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

జిల్లా మహా సభలను జయప్రదం చేయాలి

దుగ్గిరాలలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

కార్మికులతో మాట్లాడుతున్న దుర్గారావు

దుగ్గిరాల: తాడేపల్లిలో ఈనెల 23, 24వ తేదీల్లో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ అన్నారు. దుగ్గిరాలలోని ముర్తుజా నగర్ షాదీ ఖానాలో జరిగిన సీఐటీయూ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాల్లో కార్మికులు పాల్గొనాలని కోరారు. సీఐటీయూ జిల్లా 11వ మహాసభలు తాడేపల్లిలో జరుగనున్నాయని.. డిసెంబరు 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు జరిగే అఖిలభారత మహాసభల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మహాసభకు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ కన్వీనర్‌గా జి.శ్రీనివాసరావు, కో–కన్వీనర్‌గా జయ, జయపాల్, కోటేశ్వరరావు, కమిటీ సభ్యులుగా జకరయ్య, రామారావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలరాజు, ఐలు నాయకులు స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: సీఐటీయూ గుంటూరు జిల్లా 11వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం తాడేపల్లి పట్టణంలో ప్రచార కార్యక్రమాన్ని నాయకులు నిర్వహించారు. నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ.. మహాసభల మొదటి రోజు జరిగే ర్యాలీకి కార్మికులు తరలిరావాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో బాబ్జి, సంతోషం, అనూష, సువార్త, వెంగమ్మ, రాంబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో అక్రమ వెంచర్ల తొలగింపు

తాడికొండ: గుంటూరు జిల్లా అమరావతి మండల కేంద్రంలో సోమవారం సీఆర్డీయే అధికారులు అక్రమ వెంచర్లను తొలగించారు. సర్వే నంబరు 173(పీ)లో అక్రమంగా వేసిన వెంచర్ రోడ్లను ధ్వంసం చేసి గండికొట్టినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఆర్డీయే పరిధిలో అనధికారిక లేఅవుట్లను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని, ఎక్కడైనా అనధికారిక లేఅవుట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు తెలిపారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు

తాడికొండ: కులం పేరుతో దూషించిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫణిదరం గ్రామంలో ఆటో నడిపే మాడుగుల శ్రీను తన తల్లితో తాలూకా ప్రయాణ బకాయి డబ్బులు అడిగేందుకు నక్కా శ్రీను, నక్కా సాంబశివరావుల వద్దకు వెళ్లారు. కాగా డబ్బులు అడిగినందుకు గానూ నక్కా శ్రీను, నక్కా సాంబశివరావులు ఫిర్యాది మాడుగుల శ్రీనుపై దాడి చేయడంతో పాటు తన తల్లితో అసభ్యంగా ప్రవర్తించారని అన్నారు. మాడుగుల శ్రీను ఫిర్యాదు మేరకు ఇద్దరిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యమంలా సంతకాల సేకరణ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, మండల అధ్యక్షులు అమరా నాగయ్య ఆధ్వర్యంలో సోమవారం ఉండవల్లి వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షులు మున్నంగి వీర శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి ఉయ్యూరు రవీంద్రరెడ్డి, చిర్రావూరులో పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గోరా నాగ ప్రశాంతి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. తాడేపల్లి పట్టణ పరిధిలో 18వ వార్డు అధ్యక్షులు బిట్రా శశికుమార్, బోండా నరేష్ ఆధ్వర్యంలో విడివిడిగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉండవల్లిలో రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి ఉయ్యూరు రవీంద్రరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని అన్నారు. కార్యక్రమాల్లో చిర్రావూరు అధ్యక్షులు మేకా సాంబశివరావు, నున్న కుమార్ ఆంజనేయులు, ఉండవల్లిలో కూరపాటి బుల్లిబాబు, అశోక్‌రెడ్డి, అనీల్, రాజు, భాగ్యరాజు, వెంకటరమణ, నరసమ్మ, తిరుపతమ్మ, అంకరాజు, తంబి, జోజిబాబు, శ్రీకాంత్, బాబూరావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు. ంపాడులో కాకి సన్ని, గాంధీ, రాజు, బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 2 సెంట్ల స్థలం ఇవ్వాలి

మంగళగిరి టౌన్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి కేఎల్ రావు కాలనీలో ఇల్లు తొలగించడంపై ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని.. చంద్రబాబు సర్కార్ ఎన్నికల హామీ మేరకు 2 సెంట్ల స్థలం ఇవ్వాలని కోరుతూ ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషాకు సోమవారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గత 45 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న కుటుంబాలను ఐరన్ బ్రిడ్జి నిర్మాణం కోసం తొలగించడం అన్యాయమని అన్నారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడుతూ.. పేదల ఇళ్లను తొలగించడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకురాలు శ్రీనివాసకుమారి, ప్రజా సంఘాల నాయకులు కంచర్ల కాశయ్య, విజయ భాస్కరరెడ్డి, రామకృష్ణ, వెంకటయ్య, మధు శ్రీనివాస్, కాలనీ వాసులు ప్రమీల, శివపార్వతి, అనసూయ, రిజ్వానా, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీయింగ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

అధికారులు వచ్చి చూసారే కానీ చర్యలు లేవని మండిపాటు

లచ్చన్నగుడిపూడిలో సర్వే నంబరు 113, 114లో జరుగుతున్న అక్రమ క్వారీయింగ్

లచ్చన్నగుడిపూడి(తాడికొండ): తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీయింగ్‌ను గ్రామస్తులు అడ్డుకొని నిలిపివేశారు. గత రెండు రోజులుగా సర్వే నంబరు 113, 114లోని 5.70 ఎకరాల భూమిలో గతంలో పెద్ద ఎత్తున క్వారీయింగ్ నిర్వహించారు. పట్టా భూమిగా ఉన్న ఈ పొలంలో వ్యవసాయానికి అనుకూలంగా లేదంటూ దరఖాస్తు చేసుకున్నట్లు చూపించి మైనింగ్‌కు అనుమతులు జారీ చేశారు. అయితే 06 మీటర్లకు మాత్రమే అనుమతులు ఇవ్వగా వందల మీటర్ల లోతులో మట్టిని తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా గత రెండు రోజులుగా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామస్తులు మూకుమ్మడిగా అడ్డుకొని ఆదివారం లారీలు, ప్రొక్లెయిన్ యంత్రాలకు కారు అడ్డుగా పెట్టి నిలిపివేశారు. దీనిపై అధికారులకు సమాచారం ఇవ్వగా వచ్చి చూసి వెళ్లారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. దీనిపై తహసీల్దార్ మెహర్ కుమార్‌ను వివరణ కోరగా.. అది పట్టా భూమి అని, భూములకు ధరలు పెరిగినందున మట్టి వేసి చదును చేసుకునేందుకు యంత్రాలు తీసుకొచ్చామని నిర్వాహకులు చెబుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు మైనింగ్ ఆరోపణలు చేస్తున్నారని, పట్టా కాగితాలు తీసుకురావాలని సూచించామని మంగళవారం దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

మంగళగిరి టౌన్: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదలైన చెక్కులను సోమవారం స్థానిక టీడీపీ నాయకులు బాధితుల నివాసాలకు వెళ్లి అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. మంగళగిరి మండల పరిధి నూతక్కిలో నివాసం ఉంటున్న వల్లూరి లీలావతికి రూ.1,21,226లు, కరీముల్లాకు రూ.90,188లు, మోదుగుల ధనలక్ష్మికి రూ.36,569లు, అన్నపురెడ్డి శివారెడ్డికి రూ.35,541ల విలువైన చెక్కులను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సరైన మార్గదర్శకత్వంతో విద్యార్థుల రాణింపు

మోతడక(తాడికొండ): సరైన మార్గదర్శకత్వం ఉంటే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించవచ్చని జీజీహెచ్ సైక్రియాట్రిస్ట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నైమిష అన్నారు. మోతడక చలపతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు దిశా నిర్దేశ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు కష్టపడి చదవాలన్నారు. చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ.. విద్యార్థులు అధ్యాపకుల సూచనలు పాటిస్తే ఉన్నత స్థానాలు అందుకుంటారని తెలిపారు. అనంతరం 2024–25 బ్యాచ్ ప్రథమ సంవత్సరం మొదటి ర్యాంకు సాధించిన వాసా సిరి, రెండో ర్యాంకు సాధించిన కె.వర్షిత, ఎస్.మౌనిక, తృతీయ ర్యాంకు కె.ప్రణీషాలతో పాటు అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ నల్లాని వెంకట రామారావు, సీబీటీ ప్రిన్సిపల్ నాగ శ్రీనివాసరావు, డీన్ శివప్రసాద్ అధ్యాపకులు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని రద్దు చేసే వరకూ పోరాటం

నిడమర్రులో పూర్తయిన సంతకాల సేకరణ పేపర్లను వేమారెడ్డికి అందజేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: చంద్రబాబు ప్రభుత్వం పీపీపీ విధానాన్ని రద్దు చేసేంత వరకూ ఉద్యమం కొనసాగిస్తామని.. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని మంగళగిరి పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ పరిధి 32వ వార్డులో వార్డు అధ్యక్షురాలు సంకె సునీత ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, జాన్ మిల్టన్, ప్రశాంత్, రుత్విక్, సర్దార్, విక్టర్ ఇమ్మానియేలు, వార్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి..

మంగళగిరి పట్టణ పరిధి 27వ వార్డు టిడ్కో గృహ సముదాయంలో సోమవారం వార్డు అధ్యక్షులు అవ్వారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీల పీపీపీ విధానం ఉపసంహరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టౌన్ మహిళా విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ సీహెచ్ ధనశ్రీ, జిల్లా చేనేత విభాగ అధ్యక్షులు ఊట్ల పాల శ్రీనివాసరావు, నాయకులు కుక్కమల్ల శేషు, మల్లవరపు చిన్ని, గోపీనాథ్, అజయ్, ప్రియ, నందిగం ఆకాష్ పాల్గొన్నారు.

నిడమర్రులో పూర్తయిన సంతకాల సేకరణ..

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిడమర్రులో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ మేరకు నియోజకవర్గ కార్యాలయంలో సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిని కలిసి సోమవారం సంతకాల సేకరణ పేపర్లను నాయకులు అందజేశారు. వేమారెడ్డి మాట్లాడుతూ.. నిడమర్రు గ్రామంలో 2,530 సంతకాల సేకరణ జరిగిందని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్వచ్ఛందంగా ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిడమర్రు గ్రామ అధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి, నాయకులు జంగా నాగిరెడ్డి, మేరుగు నాగేశ్వరరావు, మండేపూడి రాజారత్నం, పరమేశ్వరదాసు, మండేపూడి నాగరాజు, కర్రి భాస్కరరావు, మండేపూడి రమేష్, కర్రి సతీష్, కె.శ్రీనివాసరావు, కట్టెపోగు మస్తాన్‌రావు, చక్రవర్తి, చెరుకు కిరణ్, షేక్ బాజీ, ఎం.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, సంకురు నాగరాజు, కర్రి రత్నం, దూర నాగేశ్వరరావు, ఎండీ ఫిరోజ్, కుక్కమల్ల శేషు, దేవా, ప్రశాంత్, బ్రహ్మయ్య, సుభాకర్, కట్టెపోగు భూషణం, రామనాథం, భీమిరెడ్డి సాయిరెడ్డి, బాబి, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం వర్సిటీ లేబర్ సెస్ రూ.5.13 కోట్లు పెండింగ్

పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు

కిలారు రాజా రమేష్

గుంటూరు వెస్ట్: మంగళగిరి రూరల్ మండలం నీరు కొండ గ్రామ పరిధిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లేబర్ సెస్ రూ.5.08 కోట్లు పెండింగ్ ఉందని వాటిని వసూలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన కిలారు రాజా రమేష్ విన్నవించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకి అర్జీ అందజేశారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 2016 నుంచి మొత్తం రూ.580 కోట్లు ఎస్టిమేషన్‌తో భవనాలు నిర్మిస్తుందని, దీనికి గానూ ఒక శాతం లేబర్ సెస్ రూ.5.80 కోట్లు చెల్లించాల్సి ఉందని అర్జీలో పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం రూ.71,72,336 మాత్రమే చెల్లించారని, ఇంకా రూ.5,08,27,664 చెల్లించాల్సి ఉందని వివరించారు. యూనివర్సిటీలో సుమారు 6,000 మంది విద్యార్థులు హాస్టల్స్‌లో ఉంటున్నారని, 4000 విద్యార్థులు డేస్కాలర్స్‌గా చదువుకుంటున్నారని పేర్కొన్నారు. హాస్టల్ విద్యార్థుల నుంచి ఏడాదికి ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షలు యాజమాన్యం వసూలు చేస్తోందని, ఆరి పరిపుష్టిగా ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు లేబర్ సెస్ ఒక శాతం చెల్లించడం పెద్ద కష్టం కాదని అభిప్రాయపడ్డారు. అధికారులు పెండింగ్‌లో ఉన్న లేబర్ సెస్ వసూలు చేసి అసంఘటిత రంగ కార్మికులుగా పనిచేస్తున్న వారి సంక్షేమం కోసం ఉపయోగించాలని కోరారు.

కల్లుగీత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: కష్టాల్లో ఉన్న కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి పట్టణ పరిధిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.నరసింహమూర్తి మాట్లాడుతూ.. తమ సమస్యలను విన్నవిస్తూ కమిషర్‌కు వినతిపత్రం అందజేశామని, సానుకూలంగా స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కల్లుగీత ఆర్థిక కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవుడు, సంఘ అధ్యక్షులు వాక రామచంద్రరావు, సహాయ కార్యదర్శులు చంటి, నాగేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బావని చితకబాదిన బావమరిది

- మూడు రోజులుగా ఆస్పత్రిలో నిర్జీవంగా క్షతగాత్రుడు
- గంజాయి, మద్యం మత్తే కారణం
- పోలీసుల అదుపులో నిందితుడు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవి

తాడేపల్లి రూరల్: బావమరిది గాడి తప్పి గంజాయికి, మద్యానికి బానిసై ఇంట్లో వారితో, వీధిలో వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ దారితప్పిన అతడిని తీసుకువచ్చి తన ఇంట్లో పెట్టుకుని బావ జాగ్రత్తగా చూసు కుంటున్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ బావమరిది బావను చితకబాదడంతో బావ అపస్మారక స్థితి వెళ్లిన సంఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం ప్రకారం... బూసిపాక వాసు మంగళగిరిలో రత్నాల చెరువులో నివాసముంటున్నాడు. చిన్నవయస్సు అయినప్పటికీ పూర్తిగా దారితప్పి గంజాయి, మద్యం సేవించి ఇంట్లో వారిపై, వీధిలో వారిపై విచక్షణా రహితంగా ప్రవర్తిస్తున్నాడు. వారిపై దాడికి పాల్పడుతుండడంతో అతనిలో మార్పు తీసుకువచ్చేందుకు అక్క నాగమణి, బావ ఎం.రవిలు వాసుని ఈనెల 12వ తేదీన తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరారెడ్డి నగర్లోని తమ ఇంటికి తీసుకువచ్చారు. 14వ తేదీ అక్క వేరే వారి ఇంటికి వెళ్లడంతో వాసు ఇంటి తలుపులు వేసి నిద్రపోతున్న బావ రవిపై విచక్షణా రహితంగా బలమైన చెక్కతో దాడికి పాల్పడి తలుపులు వేసుకుని కూర్చున్నాడు. రవి ద్విచక్రవాహనాన్ని స్నేహితుడు తీసుకుని ఇవ్వడానికి రాగా తలుపులు కొట్టినా తీయకపోవడంతో పక్కనే ఉన్న రవి తమ్ముడు రమేష్‌కు సమాచారం ఇచ్చాడు. రమేష్ వచ్చి తలుపులు కొట్టగా లోపల కూర్చున్న వాసు ‘ నేను తలుపులు తీయను, ఏం చేసుకుంటారో చేసుకోండి.. మీ అన్నయ్యను నేను కొట్టా.. చచ్చిపోయాడు.. ఏం చేసుకుంటారో చేసుకోండి’ అంటూ బూతులు తిట్టాడు. వెంటనే రవి తమ్ముడు రమేష్, స్థానికుల సహాయంతో ఇంటి తలుపులు పగలకొట్టగా రవి ఇంట్లో సోఫాపై నిర్జీవంగా పడి ఉన్నాడు. వెంటనే క్షతగాత్రుడిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు రవి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని వెల్లడించారు. ఈ ఘటనపై భార్య నాగమణి తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు దాడికి పాల్పడ్డ వాసుని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం రవి పరిస్థితి విషమంగా ఉండడంతో బంధువులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా...

చెవిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

విజయవాడలీగల్: మద్యం అక్రమ కేసులో విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, చెరుకూరు వెంకటేష్‌నాయుడు తరపున దాఖలైన బెయిల్ పిటిషన్లపై విచారణను ఏసీబీ కోర్టు ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది. మరో వైపు గుంటూరు జైలులో రిమాండ్‌లో ఉన్న నవీన్‌కృష్ణ, బాలాజీ కుమార్ యాదవ్ తరఫున సోమవారం బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు.

సంజయ్ పిటిషన్ డిస్మిస్

అగ్నిమాపక శాఖ డీజీగా ఉన్న సమయంలో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై విజయవాడ జిల్లా జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఐపీఎస్ అధికారి సంజయ్ బెయిల్ పిటిషన్‌ను వరుసగా మూడవసారి ఏసీబీ కోర్టు కొట్టివేసింది.

విజయ భాస్కరరెడ్డి బెయిల్ విచారణ వాయిదా

ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి, వారి కుటుంబ సభ్యులపై అసభ్యకర పోస్టులను పెట్టారనే ఆరోపణలపై నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాలపాటి విజయభాస్కరరెడ్డి తరపున దాఖలైన బెయిల్ పిటిషన్‌పై విచారణను 2వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ మంగళవారానికి వాయిదా వేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగి పట్ల దురుసుగా ప్రవర్తించారనే అభియోగంపై నమోదైన కేసులో విజయవాడ జిల్లా జైలులో ఉన్న మాలపాటి ఓబుల్‌రెడ్డి తరపున దాఖలయిన బెయిల్ పిటిషన్‌పై విచారణను 6వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ మంగళవారానికి వాయిదా వేశారు.

సౌందరరెడ్డికి పరిహారంపై మీ స్పందన ఏమిటి?

- రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ, ఎస్పీ, ఎస్‌హెచ్‌ఓలకు సుప్రీంకోర్టు నోటీసులు
- సీబీఐ దర్యాప్తుపై జనవరి 5 వరకు స్టే పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: 'గంజాయి కుట్ర.. అక్రమ నిర్బంధం' కేసులో ప్రభుత్వం తనకు నష్టపరిహారం చెల్లించాలంటూ వైఎస్సార్‌సీపీ నేత కుంచాల సౌందరరెడ్డి ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. దీనిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు డీజీపీ, ఎస్పీ, ఎస్‌హెచ్‌ఓలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ జనవరి 5కు వాయిదా వేసింది. అప్పటి వరకు హైకోర్టు జారీ చేసిన సీబీఐ దర్యాప్తు ఆదేశాలపై స్టే కొనసాగుతుందని తెలిపింది. ఈ కేసుపై సీబీఐ విచారణకు ఆదేశిస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ అధికారి దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను, అలాగే నష్టపరిహారం కోరుతూ సౌందరరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కలిపి సోమవారం ఒకేసారి విచారించిన జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ విపుల్ ఎం.పంచోలి ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తప్పుడు, ప్రజా వ్యతిరేక విధానాలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడమే నేరంగా పరిగణించిందని, ఈ కారణంగానే తనపై 'గంజాయి కుట్ర' పన్నారని, దీనిని విచారించిన హైకోర్టు ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందని సౌందర రెడ్డి తన పిటిషన్‌లో సుప్రీంకోర్టుకు నివేదించిన సంగతి తెలిసిందే.

'ఈ-స్టాంపులు'.. ఇది తెల్గీ కంటే బడా స్కామ్!

- హైకోర్టులో మాజీ ఎంపీ తలారి రంగయ్య పిల్

సాక్షి, అమరావతి: టీడీపీ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆయన కంపెనీ ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ వేల కోట్ల రూపాయల మేర భారీ 'ఈ–స్టాంప్' కుంభకోణానికి పాల్పడిందని, దీనిపై సీబీఐ, ఈడీ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ)ల దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. దర్యాప్తుపై రాజకీయ ప్రభావం లేకుండా ఉండేందుకు దర్యాప్తును స్వయంగా పర్యవేక్షించాలని హైకోర్టును కోరుతూ అనంతపురం మాజీ ఎంపీ తలారి రంగయ్య ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, రిజిస్ట్రేషన్, స్టాంపుల ఐజీ, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఇండియా ఎండీ, కేంద్ర ఆర్థిక కార్యదర్శి, సీబీఐ, ఈడీ, ఎస్ఎఫ్ఐఓలతో పాటు యర్రప్ప, ఆయన భార్య భార్గవి, ఎమ్మెల్యే సురేంద్రబాబును వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారు.

బీసీల సమగ్ర కులగణన జరపాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు బీసీ సంక్షేమ సంఘం వినతి

సాక్షి, అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో దామాషా ప్రకారం బీసీల చట్టబద్ధ రిజర్వేషన్లు అమలు చేసేందుకు డెడికేటెడ్ కమిషన్ ద్వారా సమగ్ర కులగణన జరిపించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావిస్తూ విజయవాడలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీకి సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. బీసీ జనగణన, వర్గీకరణలు జరపకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడమంటే సామాజిక న్యాయానికి తూట్లు పొడవడమేనన్నారు. ఈ అంశంపై హైకోర్టులో పిల్ కూడా వేసినట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం బీసీలకు చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

భారత ఉన్నత విద్యకు స్వర్ణయుగం

పరిశోధన విద్యలో అద్భుత పురోగతి

పీహెచ్‌డీలు, ప్రచురణలు, పేటెంట్ల గణాంకాల అప్‌ట్రెండ్

అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో 60% పీహెచ్‌డీ అర్హత కలిగిన అధ్యాపకులు

కేపీఎంజీ అధ్యయనం వెల్లడి

పరిశోధక విద్య విషయంలో దేశం గణనీయమైన పురోగతి సాధిస్తోంది. ఆరేళ్లలో విశ్వవిద్యాలయాల పీహెచ్‌డీ ప్రవేశాల్లో ఏకంగా 21శాతం వృద్ధి కనిపిస్తోంది. అంటే 2019లో 97,947 ప్రవేశాల నుంచి 2025లో 1,18,556కి చేరుకుంది. ఇక పీహెచ్‌డీల సమర్పణ, అవార్డుల స్వీకరణ 49 శాతం పెరిగి 24,481కి ఎగబాకింది. వీటి ఫలితంగా పరిశోధన ప్రచురణలు మూడు రెట్లు వేగాన్ని సాధించి పేటెంట్ల సంఖ్య పెరుగుదలలో తోడ్పాటును అందిస్తోంది. నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) పదేళ్ల డేటా ఆధారంగా ప్రముఖ సర్వీస్ నెట్‌వర్క్ సంస్థ-కేపీఎంజీ చేసిన అధ్యయనంలో వెల్లడైన పలు ఆసక్తికరమైన అంశాలు ఇవీ... - సాక్షి, అమరావతి

ప్రపంచ వాటా పెరుగుదల

పరిశోధన కోసం దశాబ్ద కాలంగా సాగిస్తున్న కృషి పేటెంట్ల సంఖ్య పెరుగుదలతో స్పష్టంగా కనిపిస్తోంది. 2018–25 మధ్య విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ సంస్థల ప్రచురణ వాల్యూమ్స్ 150 శాతం, ఫార్మసీ, మేనేజ్‌మెంట్‌లో 300 శాతం వృద్ధి చెందాయి. ఈ కాలంలోనే ప్రపంచ పరిశోధన ప్రచురణలలో భారతదేశ వాటా 3.5 శాతం నుంచి 5.2 శాతానికి దూసుకెళ్లింది. ఉన్నత విద్యా సంస్థల్లో పీహెచ్‌డీ అర్హత కలిగిన అధ్యాపకుల నేతృత్వంలో బోధన శాతం గణనీయంగా పెరిగింది. దీనితో దేశీయంగా పీహెచ్‌డీ ప్రవేశాలు, అవార్డుల స్వీకరణ గణాంకాలు గణనీయంగా పెరిగాయి.

విద్యా నైపుణ్యం, బోధన నాణ్యతకు ప్రాధాన్యం..

దేశంలోని అగ్రశ్రేణి సంస్థల్లో దాదాపు 60% పీహెచ్‌డీ అర్హత కలిగిన అధ్యాపకులు బోధన సాగిస్తున్నారు. తద్వారా పరిశోధన, విద్యా నైపుణ్యం, బోధనా నాణ్యతకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఇక్కడ దేశంలోని టాప్ 100 ఉన్నత విద్యా సంస్థలలో పీహెచ్‌డీ అర్హత కలిగిన అధ్యాపకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మేనేజ్‌మెంట్ సంస్థలలో 90 శాతానికి పైగా, ఇంజనీరింగ్ కళాశాలల్లో 80 శాతానికి పైగా పీహెచ్‌డీ అర్హత కలిగిన వారితో విద్యా బోధన కొనసాగుతోంది. కొన్ని అగ్రశ్రేణి సంస్థల్లోని వివిధ విభాగాల్లో 73 శాతానికి పైగా పీహెచ్‌డీ–అర్హత కలిగిన అధ్యాపకుల నియామకం కనిపిస్తోంది.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ నిలువుటద్దం..

దేశంలో ఏటా ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో దరఖాస్తు చేసుకునే విద్యాసంస్థల సంఖ్య పెరుగుతుండడం విశ్వవిద్యాలయం, ఉన్నత విద్యా సంస్థల బోధన నాణ్యత, వాటి సామర్థ్యానికి నిలువుటద్దం.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో దరఖాస్తు చేసుకునే విద్యాసంస్థల సంఖ్య 2016లో 2,426 కాగా, 2025 నాటికి 217 శాతం పెరిగి 7,692కి చేరింది.

ఇక కళాశాలల విభాగంలో 401 శాతం అంటే 803 నుంచి 4,030వరకు సంస్థలు ర్యాంకుల కోసం పోటీపడే పరిస్థితి వచ్చింది.

ర్యాంకింగ్స్ విషయంలో ఐఐఎస్‌సీ బెంగళూరు, జేఎన్‌యూ, ఐఐటీ మద్రాస్ వంటి ప్రభుత్వ సంస్థల ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి. ఇక ఈ విషయంలో ప్రైవేటు వర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థల గట్టి పోటీని ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంది.

విద్యా సంస్థల్లో నాణ్యత ప్రమాణాలకు సంబంధించి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులతో పాటు క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ కీలకం. ఈ విషయంలో తాజాగా భారత్ 54 సంస్థలతో నాల్గవ అత్యధిక ప్రాతినిధ్యం కలిగిన దేశంగా అవతరించింది.

చిత్తూరు కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

- తమ పొలానికి దారి సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన
- పక్కా టీడీపీ కార్యకర్తలం.. న్యాయం చేయాలంటూ పురుగుమందు తాగిన వైనం

ఆత్మహత్యకు యత్నించిన నందిని

చిత్తూరు కలెక్టరేట్: తమ పొలానికి దారి ఇవ్వడంలేదని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని చిత్తూరు కలెక్టరేట్‌లో సోమవారం ఒక మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు ఆమె చేతిలోని పురుగుమందు డబ్బా లాగేయడంతో ప్రాణాపాయం తప్పింది. వి.కోట మండలం మిట్టూరు గ్రామానికి చెందిన నందిని తమ పొలానికి దారి సమస్యను పరిష్కరించాలని పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చింది. ఈ సందర్భంగా వి.కోట రెవెన్యూ అధికారులు తమ సమస్యను తీర్చడం లేదంటూ పురుగుమందు తాగింది. పోలీసులు పురుగుమందు డబ్బాను లాగేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ 'కలెక్టర్ సార్‌ని రమ్మని చెప్పండి మాట్లాడాలి. వి.కోట తహసీల్దార్, వీఆర్‌వోల వద్ద న్యాయం లేదు సర్. నాకు న్యాయం కావాలి. మా దగ్గర న్యాయం ఉంది ఎవరూ పట్టించుకోవడం లేదు. మేం పక్కా టీడీపీ కార్యకర్తలం' అంటూ బిగ్గరగా అరిచి మరీ చెప్పింది. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహించే కుప్పం నియోజకవర్గం పక్కనే ఉన్న పలమనేరు నియోజకవర్గంలోని మిట్టూరులో నందిని నివసిస్తున్నారు. గ్రామంలోని సర్వే నంబరు 223లో ఉండే పొలానికి చుట్టుపక్కలవారు దారి సమస్య సృష్టిస్తుండడంతో న్యాయం చేయాలని 17 నెలలుగా మండల రెవెన్యూ కార్యాలయంలోను, కలెక్టరేట్‌లోను వినతిపత్రాలు ఇచ్చారు. సమస్య పరిష్కరించాలంటూ వీఆర్‌వోని, వి.కోట తహసీల్దారును అనేకసార్లు కోరినా ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో తమ సమస్యను ఎవరూ పట్టించుకోరంటూ మనస్తాపం చెంది ఆమె సోమవారం కుటుంబీకులతో కలెక్టరేట్‌కు వచ్చి ఆత్మహత్యాయత్నం చేసింది. నందినిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆమెకు ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఈ విషయమై మిట్టూరు వీఆర్‌వో నవీన్‌ను సంప్రదించగా.. తనకు రెండువారాల కిందటే అదనపు బాధ్యతలు ఇచ్చారని చెప్పారు. రీసర్వే పనుల ఒత్తిడిలో దానిపై ఫోకస్ పెట్టలేదని, క్షేత్రస్థాయిలో పరిశీలించలేదని తెలిపారు. వాస్తవంగా బాధితురాలి భూమికి చుట్టూ సెటిల్‌మెంట్ భూమి ఉందని, దారి ఇచ్చేందుకు వారు ఒప్పుకోవడం లేదని చెప్పారు.

బాబు సర్కారు బా'గో'తం

- గో మాంసం సీజ్ ఓ బూటకం.. ఎక్కడికి తరలించేశారు
- ప్రభుత్వం అద్భుతంగా నటిస్తోంది
- పశుసంవర్ధక శాఖ అధికారి నిర్ధారించినా ప్రభుత్వ పెద్దల మీనమేషాలు
- హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధుల ధ్వజం
- కోల్డ్ స్టోరేజ్ ఎదుట ఆందోళన

మిత్ర మెరైన్ ఏజెన్సీస్ కోల్డ్ స్టోరేజీ ముందు ఆందోళన చేస్తున్న హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీలో శ్రీమిత్ర మెరైన్ ఏజెన్సీస్ కోల్డ్ స్టోరేజ్ నుంచి రెండు వారాల క్రితం సీజ్ చేసిన 1.89 లక్షల కిలోల గో మాంసంపై చంద్రబాబుతోపాటు ఆయన సర్కారు అద్భుతంగా నటిస్తోందని, హిందువుల మనోభావాలు దెబ్బతీస్తోందని హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు దుయ్యబట్టారు. కోల్డ్ స్టోరేజ్ ముందు విశ్వహిందూ పరిషత్, సమరసత అభియాన్, ప్రాంత మందిర, అర్చక పురోహిత్ సురక్ష తదితర హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు సోమవారం ఆందోళన చేపట్టారు. గో మాంసం సీజ్ చేయడం ఒక బూటకమన్నారు. హిందువులు ఆవులను గోమాతగా పూజిస్తుంటే చంద్రబాబు ప్రభుత్వంలోని బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ అతని అనుచరుడు తటవర్తి సుబ్రహ్మణ్య గుప్తా లక్షల గోవులను వధించి విదేశాలకు మాంసం అమ్ముకుంటున్నారని విమర్శించారు. గో మాంసం సీజ్ చేయడం అంటే తెరచుకునే తాళాలు వేయడం కాదని ఎద్దేవా చేశారు. పశు సంవర్ధకశాఖ, పోలీసులను బలిపశువులు చేసిన చంద్రబాబు ప్రభుత్వం హిందువుల మనోభావాలతో అడుకుంటోందని ధ్వజమెత్తారు. కూటమిలో భాగస్వామి అయిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, డిప్యూటీ సీఎం పవన్, స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సీఐఐ సదస్సు పేరుతో రాష్ట్ర కేబినెట్ విశాఖకు తరలివచ్చినా హిందువుల ఆందోళనను పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. ఈ విషయాన్ని దేశంలోని ఇతర హిందూ ధార్మిక సంస్థలతో కలిసి ప్రధాని మోదీ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అధికారపక్ష ఎమ్మెల్యే అనుచరునికి చెందిన ఈ కోల్డ్ స్టోరేజ్ వల్ల పక్కనే ఉన్న సింహాచలంలోని గోవులకూ ముప్పు పొంచి ఉందన్నారు. సీజ్ అంశంపై నిజానిజాలు తేలేవరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా గో మాంసం రవాణా చేస్తున్న సుబ్రహ్మణ్య గుప్తాను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

కోల్డ్ స్టోరేజ్ వద్ద నాటకీయ పరిణామాలు

తమను కోల్డ్ స్టోరేజ్ లోపలికి పంపిస్తే సీజ్ చేసిన గో మాంసం ఉందా లేదా పరిశీలిస్తామని గంటన్నరపాటు ధార్మిక సంస్థల ప్రతినిధులు ఆందోళన చేస్తే చివరకు ఐదుగురిని మాత్రమే సెల్‌ఫోన్‌లు లేకుండా లోపలికి అనుమతించారు. దీంతో పరిశీలించి వచ్చిన వారు మాట్లాడుతూ సీజ్ చేసిన గో మాంసం ఎక్కడికో తరలించినట్టు అనుమానం వ్యక్తం చేశారు. సీజ్ చేసినట్లుగా చెప్పుకొస్తున్న మాంసానికి అసలు లక్క వంటి సీలు లేక కేవలం ఒక్క తాళం మాత్రమే వేసినట్టు ఉందన్నారు. కార్యక్రమంలో ధార్మిక సంస్థల రాష్ట్ర నాయకులు పూడిపెద్ది శర్మ, మీసాల రవీంద్ర, జిల్లా నాయకులు గాడు వెంకటనారాయణ, పీవీవీ ప్రసాదరావు, ఫణీంద్ర, ఎం.రామకృష్ణ, బి.సుబ్రహ్మణ్యం, శీరపు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాబు మాటలు.. ఆరని మంటలు

- విశాఖ ఉక్కు ఉద్యోగులపై వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాల్సిందే
- నిప్పులు చెరిగిన స్టీల్ ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాలు

ధర్నా చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాలు

సాక్షి, విశాఖపట్నం: ''స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు పని చెయ్యకుండా జీతాలివ్వమంటే ఎలా?'' అంటూ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై విశాఖ ఉక్కు పరిశ్రమ కార్మికుల్లో రేగిన ఆగ్రహ జ్వాలలు చల్లారడం లేదు. అధికార అహంకారంతో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవ విరుద్ధమని అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు తేల్చిచెప్పారు. ప్లాంట్‌ను పరిరక్షిస్తామంటూ ఎన్నికల ముందు ప్రగల్బాలు పలికి గద్దెనెక్కిన తర్వాత ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఉద్యోగుల వైపు వేళ్లు చూపుతున్నారంటూ మండిపడ్డారు. దమ్ముంటే ప్లాంట్‌పై చర్చకు రావాలంటూ సీఎం చంద్రబాబుకు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు, ఉత్పత్తి లక్ష్యాలను చేరుకుంటేనే 100 శాతం జీతాలు ఇస్తామంటూ ప్లాంట్ యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్‌ను నిరసిస్తూ సోమవారం –యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్, అదే సమయంలో.. ఉద్యోగులను ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ విశాఖ ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు మిన్నంటాయి. ఉత్పత్తి లక్ష్యాలకు అనుగుణంగానే జీతాలు చెల్లిస్తామంటూ ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. కార్మికులకు చెల్లించాల్సిన జీతాలపై యాజమాన్యం అనాలోచిత నిర్ణయం తీసుకుని ఆదేశాలివ్వడం అత్యంత దుర్మార్గమని నినదించారు. ఈ సందర్భంగా కార్మిక ప్రతినిధులు మాట్లాడుతూ ''అనకాపల్లి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న మిట్టల్ ప్రైవేట్ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వాలని అడిగిన చంద్రబాబు, విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం ఎందుకు నోరెత్తలేదు? ఇదేనా ఆంధ్రుల హక్కుపై ఈ సర్కారుకు ఉన్న చిత్తశుద్ధి?'' అంటూ నిలదీశారు. ఉత్పత్తి లక్ష్యాలకు జీతాలను ముడిపెడుతూ జారీ చేసిన సర్క్యులర్ వెనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర దాగి ఉందని చంద్రబాబు మాటలతో స్పష్టమైందన్నారు. తక్షణమే చంద్రబాబు తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవడంతో పాటు యాజమాన్యం సర్క్యులర్ రద్దు చేయాలని, లేదంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని అల్టిమేటం జారీ చేశారు.

బాబు సర్కారు వచ్చాకే ప్రైవేటు వైపు అడుగులు

చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వైపు అడుగులు వేగంగా పడుతున్నాయని ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. 2024 జూన్ తర్వాత నుంచి వేల మంది కార్మికులను తొలగించడం, ముడిసరుకు దొరక్కపోవడం, నిల్వలు కుంచించుకుపోవడం, ఉద్యోగులు వీఆర్ఎస్ తీసుకోవాలంటూ ఉత్తర్వులు, జీతాల్లో కోతలు, 32 విభాగాలను ప్రైవేట్‌పరం చేసేందుకు టెండర్లు పిలవడం... ఉత్పత్తి నిర్వీర్యానికి చంద్రబాబు, కేంద్రం కలిసి నిరంకుశ నిర్ణయాలు అమలు చేస్తున్నాయని మండిపడ్డారు.

గనులపై కేంద్రంతో ఒక్కసారైనా మాట్లాడారా?

'సొంత గనులు కేటాయించండి మహాప్రభో అని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ఎన్నోసార్లు వినతిపత్రాలు అందించాం. ఒక్కసారి కూడా కేంద్రంతో సంప్రదింపులు జరపలేదు. నక్కపల్లిలో ఏర్పాటు చేయనున్న మిట్టల్ ప్లాంట్‌కు గనులు కేటాయించాలంటూ చంద్రబాబు కేంద్రాన్ని కోరడం ముమ్మాటికీ ఆంధ్రులకు ద్రోహం చేసినట్లే' అని దుమ్మెత్తిపోశారు. స్టీల్ ప్లాంట్, ఉద్యోగులు, కార్మికుల గురించి తప్పుగా మాట్లాడటం చూస్తుంటే ప్రైవేటీకరణకు చంద్రబాబు 100 శాతం కట్టుబడి ఉన్నట్లు అర్థమవుతోందని అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. ''సంపద సృష్టి అంటూ కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసే చంద్రబాబుకు ప్లాంట్‌ను నడిపిస్తున్న ఉద్యోగుల గురించి మాట్లాడే అర్హతే లేదని' తెగేసి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని దురుద్దేశంతోనే కర్మాగారం, కార్మికులను టార్గెట్ చేసిందని, ఈ క్రమంలోనే చంద్రబాబు మాటల దాడులు చేస్తున్నారంటూ మండిపడ్డారు. ప్రభుత్వాల కుట్ర చర్యలను కార్మిక వర్గం ఐక్యంగా తిప్పికొడుతుందని స్పష్టం చేశారు.

చర్చకు సిద్ధమా చంద్రబాబూ?

చంద్రబాబు లేవనెత్తిన ప్రతి అంశానికి మేం సమాధానం చెబుతాం. ఎకరా భూమి 99 పైసలకు కట్టబెట్టింది ఎవరు? ఇది ప్రజాధనం కాదా.? ప్రైవేటు స్టీల్ ప్లాంట్‌లు, కంపెనీలు ఎంత ఎగ్గొట్టాయి? ప్రభుత్వాలకు ఎంత చెల్లించాయి? స్టీల్ ప్లాంట్‌పై చర్చకు రండి. 2009 ఫిబ్రవరి 19న ఢిల్లీలో స్టీల్ ప్లాంట్ కార్మికులు సొంత గనుల కోసం ధర్నా చేస్తే మద్దతుగా మాట్లాడిన చంద్రబాబు తర్వాత కాలంలో అధికారంలోకి వచ్చి ఏం చేశారు? అసెంబ్లీ ఎన్నికల్లో మమ్మల్ని గెలిపించండి. స్టీల్ ప్లాంట్‌ను అన్ని రకాలుగా ఆదుకునే బాధ్యత మాది అని అన్నారు. ఇప్పుడేమో.. జీతాలెందుకని మాట్లాడటం సిగ్గు చేటు. వాస్తవాలు మాట్లాడండి. తప్పుడు విమర్శలతో ఉద్యోగులను నిరుత్సాహపరచొద్దు. చిత్తశుద్ధి ఉంటే చంద్రబాబు మాటల్ని వెనక్కి తీసుకోవాలి. యాజమాన్యం వెంటనే ఉత్పత్తితో కూడిన జీతభత్యాలు చెల్లిస్తామన్న సర్క్యులర్‌ను రద్దు చేయించాలి.

– జీఎస్‌జే అచ్యుతరావు, ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ

ప్రైవేటీకరణకే ఉద్యోగులు, కార్మికులపై మాటల దాడి

అవసరమైన ముడి సరుకు ఇవ్వకుండా ఉత్పత్తి సాధించాలని చెప్పడం అత్యంత దుర్మార్గం. టార్గెట్లను అధిగమించడానికి, ఉత్పత్తి సాధించడానికి కార్మికులు, ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారు. కానీ, పరికరాలు సరిగా ఉన్నాయా? మేన్ పవర్ సరిపోతుందా? ముడిసరకు ఉందా? దీనిపై ఎప్పుడైనా చర్చించారా? ఉద్యోగులు, కార్మికుల గురించి ఎవరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడినా, సర్క్యులర్లు జారీ చేసినా సహించేది లేదు.

– రమణమూర్తి, స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు

చంద్రబాబు వ్యాఖ్యలు దుర్మార్గం

- స్టీల్ ప్లాంట్ కార్మికులకు సీఎం క్షమాపణ చెప్పాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ ఆగ్రహం



సాక్షి, విశాఖపట్నం: నవరత్న హోదా పొందిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను వైట్ ఎలిఫెంట్ అంటూ, కార్మికులు పని చేయకుండా ఇళ్లలో పడుకుని జీతాలు అడుగుతున్నారంటూ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు చంద్రబాబు తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన సోమవారం విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల సమయంలో చంద్రబాబు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడతామని కార్మికులను నమ్మించి ఓట్లు పొందారు. ఇప్పుడు కార్మికుల అవసరం లేదు కాబట్టి వారిని నోటికొచ్చినట్లు నిందిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమికి అత్యధిక మెజార్టీ అందించిన నియోజకవర్గం గాజువాకలో సింహభాగం ఓట్లు స్టీల్ ప్లాంట్ కార్మికులవే. మీ పార్టీకి అత్యధిక మెజార్టీ ఇచ్చిన నియోజకవర్గంలో ఉన్న అతి పెద్ద సంస్థ అయిన స్టీల్ ప్లాంటునే మీరు ప్రైవేటీకరణ చేస్తున్నారంటే రాష్ట్రంలో మిగిలిన నియోజకవర్గాల పరిస్థితి ఏమిటన్నది చెప్పనవసరం లేదు.' అని కొండా రాజీవ్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

కార్మికుల కష్టం, త్యాగం గుర్తులేవా బాబూ?

'ఇంటికి తాళాలు వేసుకుని పడుకునేది కార్మికులు కాదు... కరోనా కాలంలో చంద్రబాబే హైదారాబాద్‌లో ఇంటికి తాళాలు వేసుకుని లోపల పడుకున్నారు. కరోనా సమయంలో కూడా స్టీల్ ప్లాంట్ కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి పని చేసి పరిశ్రమను కాపాడుకున్నారు. దేశానికి కీలకమైన సమయంలో అవసరమైన ఉక్కును అందించారు. అలాంటి కార్మికుల కష్టం, త్యాగం గుర్తులేవా చంద్రబాబూ..? ప్లాంట్‌లో కార్మికులను వేధించి, వీఆర్ఎస్ పెట్టుకునేలా ఈ ప్రభుత్వం చేస్తోంది. స్టీల్ ప్లాంట్‌ను 32 విభాగాలుగా చేసి, ఒక్కొక్కటి అమ్మేసే పని మొదలుపెట్టారు. చంద్రబాబు వ్యాఖ్యలతో ఇది పూర్తిగా అందరికీ అర్థమైంది. స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతున్నామని, కేంద్రం నుంచి ప్యాకేజీ కూడా సాధించామని పదేపదే చెబుతున్న కూటమి నేతలు... ఆ ప్యాకేజీలో ఒక్క రూపాయి అయినా కార్మికుల సంక్షేమం కోసం వారి ఖాతాల్లో జమ చేసినట్లు చూపగలరా? లేదా ప్యాకేజీ డబ్బులతో స్టీల్ ప్లాంట్‌ను ఆధునికీకరించారా? ముడిసరకు కొన్నారా? ఆ నిధులతో ఏం చేశారో చెప్పండి? భిలాయ్, భద్రావతి, సేలం వంటి చోట్ల ఉన్న స్టీల్ ప్లాంట్లకు రూ.65 వేల కోట్ల చొప్పున ప్యాకేజీలు ఇచ్చారు. మరి విశాఖ స్టీల్ ప్లాంట్ ఏం పాపం చేసింది? అది కేవలం సీఎం చంద్రబాబు అసమర్థత కాదా? స్టీల్ ప్లాంట్ విషయంలో కూడా చంద్రబాబు చరిత్రలో ద్రోహిగా మిగలడం ఖాయం' అని అన్నారు.

బాలకృష్ణ ఆదేశాలతోనే టీడీపీ గూండాల దాడి!

- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి ధ్వజం
- అప్రజాస్వామిక విధానాలతో టీడీపీ భూస్థాపితం
- పాలనా వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించే యత్నం



సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి సర్కారు అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలు, చంద్రబాబు పాలనా వైఫల్యాలతో ఈ ప్రభుత్వం అతి త్వరలోనే కుప్పకూలడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. హిందూపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై టీడీపీ గూండాల దాడి అత్యంత హేయమని మండిపడ్డారు. దాడిని నిలువరించాల్సిన పోలీసులు చోద్యం చూస్తూ కూర్చున్నారని, పైగా తమ పార్టీ కార్యకర్తలపై ఎస్సీ అట్రాసిటీ కేసు బనాయించారని ఆక్షేపించారు. హిందూపురం బయలుదేరిన తమ పార్టీ నాయకులను ఆదివారం ఎక్కడికక్కడ అడ్డుకోవటాన్ని ఖండించారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

దాడి వెనుక బాలకృష్ణ ప్రోద్బలం

'ప్రశాంతత కోరుకునే హిందూపురంలో జరిగిన ఘటన చూసి ప్రజలు టీడీపీని, ఎమ్మెల్యే బాలకృష్ణను అసహ్యించుకుంటున్నారు. రాజకీయ విమర్శ చేసినందుకు పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేయడం హేయం. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు సహించరానివి. ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గంలో అడుగు పెట్టిన రోజే ఈ ఘటన జరగటాన్ని బట్టి దాడి వెనుక ఆయన ప్రోద్బలం ఉందన్న అనుమానాలు కలుగుతున్నాయి. బాలకృష్ణ ఆదేశాలతోనే టీడీపీ గూండాలు దాడి చేసినట్లు స్పష్టంగా అర్థమవుతోంది.

బాధితులపైనే అక్రమ కేసులా?

దాడి సమయంలో అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకపోగా, అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించడం సిగ్గుచేటు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు దిగుతూ భయోత్పాతం సృష్టిస్తున్నారు. హిందూపురం వెళ్తున్న అనంతపురం, సత్యసాయి జిల్లాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను అడ్డుకుని వెనక్కి పంపారు. మాజీ ఎమ్మెల్యేలను హౌస్ అరెస్టులు చేశారంటే వైఎస్సార్ సీపీని చూసి ఈ ప్రభుత్వం ఎంత భయపడుతోందో తెలుస్తోంది.

సతీష్ మృతిపై తప్పుడు ప్రచారం

'టీటీడీ పూర్వ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ మృతిపై ప్రాథమిక దర్యాప్తు పూర్తి కాకుండానే, చివరకు పోస్టుమార్టం నిర్వహించకముందే వైఎస్సార్‌సీపీని నిందిస్తూ ఎల్లో మీడియా, టీడీపీ అనుకూల సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీపై నిందలు మోపి రాజకీయంగా బురద జల్లడమే లక్ష్యంగా హత్య అంటూ కట్టుకథ ప్రచారం చేశారు' అని విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు.

సచివాలయ ఉద్యోగులకు మరోసారి బదిలీలు

సాక్షి, అమరావతి: గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులు స్పౌజ్ కేటగిరిలో ఒక జిల్లా నుంచి మరో జిల్లా బదిలీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెలాఖరులోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలంటూ గ్రామ/వార్డు సచివాలయాల శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. బదిలీలు పూర్తిగా ఉద్యోగి అభ్యర్థన ప్రాతిపదికన మాత్రమే ఉంటాయని, అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. క్రమశిక్షణ చర్యలకు గురైన వారు, విజిలెన్స్ కేసులు నమోదైన వారి అభ్యర్థనలు పరిగణనలోకి తీసుకోబోరని వెల్లడించారు. భార్యాభర్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, మున్సిపల్, కో–ఆపరేటివ్, ఎయిడెడ్ సంస్థలలో ఉద్యోగాలు చేస్తున్న వారు బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని, భర్త లేదా భార్యలో ఒకరు ప్రైవేట్ ఉద్యోగి అయితే ఈ ప్రక్రియలో బదిలీలకు అర్హత ఉండదని స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలోనే ఉద్యోగులు వారికి కావాల్సిన మండలాలు లేదంటే మున్సిపాలిటీలను ఎంపిక చేసుకోవచ్చని, ప్రభుత్వం కూడా బదిలీల ప్రక్రియలో కొత్త జిల్లాలో మండలాలు లేదంటే మున్సిపాలిటీలను ఆయా ఉద్యోగులకు కేటాయిస్తూ ఆదేశాలు ఇస్తుందని పేర్కొన్నారు. ఆ తర్వాత మండలాలు లేదంటే మున్సిపాలిటీల్లో ఖాళీల మేరకు కౌన్సిలింగ్ ప్రక్రియలో నిర్ణీత సచివాలయం కేటాయించనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థుల మెరిట్ ర్యాంక్ ఆధారంగా సీరియల్‌గా ఈ బదిలీల ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు.

పక్షుల గురించి మనకు ఎంత తెలుసు.
సరిగ్గా అడిగితే పది పక్షుల పేర్లకన్నా ఎక్కువ చెప్పలేము.
ఇక వాటి రెక్కల గురించి, ఈకల గురించి చెప్పగలమా?
పక్షుల రెక్కలకు ఉండే ఈకలు వేరు...
తోకకు ఉండే ఈకలు వేరు...
శరీరంపై ఒక తీరున... దారిని కనిపెట్టేవి ఒక తీరున...
ఈకల వెనుక ఇంత కథ ఉంది అంటారు ఈశా మున్షీ.
బెంగళూరులో ఈమె పక్షిల ఈకల లైబ్రరీ నడుపుతున్నారు.
అనేక జాతుల ఈకలను ప్రదర్శనకు పెట్టడం ద్వారా
ఆ పక్షుల పరిరక్షణకు చైతన్యం కలిగిస్తున్నారు.
ఫెదర్ లైబ్రరీ వినూత్న కృషిపై కథనం.

● వినూత్న కృషి

పక్షి ఈకలకు లైబ్రరీ ఉంది

‘ఈకను తీసేసినట్లు తీసేశాడు’ అని అంటూ ఉంటారు. కానీ ప్రతి ఈకకూ ఓ లెక్క ఉంటుంది అంటారామె. గాల్లో ఎగిరే ప్రతి పక్షి రెక్క వెనుకాల బోలెడన్ని విషయాలు దాగున్నాయని ఆమె కనిపెట్టారు. ఆ విషయాలను అందరికీ తెలిసేలా ఓ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ రెక్క ఏ పక్షిది, దాని స్వభావం ఏమిటి, ఆ పక్షి ఏ జాతిది అనే సమస్త వివరాలు ఆమె వివరిస్తారు. ఆమే ఈశా మున్షీ.

ఈక ఆమెను తాకింది

2020లో కోవిడ్ మన దేశాన్ని వణికిస్తున్న కాలం. అహ్మదాబాద్‌లోని తన ఇంట్లో ఉన్న ఈశా మున్షీ పెంపుడు పిల్లి ఓ పక్షిని పట్టుకుంది. దాన్ని ఆమె విడిపించే క్రమంలో పక్షి రెక్కలు కొన్ని ఊడి కిందపడ్డాయి. తన చేతివేళ్ల కంటే చిన్నగా ఉన్న ఆ రెక్కలు ఆమెలో ఆసక్తిని రేపాయి. ఈ రెక్కల ఆధారంగా ఆ పక్షి వివరాలు గుర్తించే అవకాశం ఉందా అని ఆలోచించారు. తనకు తెలిసినవారిని అడిగారు. గూగుల్ చేసి చూశారు. కానీ ఎక్కడా సమాచారం దొరకలేదు. తానే ఆ సమాచారాన్నే కనుక్కోవాలని ప్రయత్నాలు మొదలుపెట్టారు. వృత్తిరీత్యా ఆర్కిటెక్ట్ అయిన ఆమె ఆర్నిథాలజీ (పక్షులు శాస్త్రం)కి సంబంధించి ఆన్‌లైన్ కోర్సులో చేరారు. ఆ తర్వాత అక్కడే ఏఐకి పక్షుల శబ్దాలను నేర్పే ప్రాజెక్టులో చేరారు. పక్షుల మీదున్న ఆమె ఆసక్తి పెరుగుతూ మరిన్ని కొత్త విషయాలు తెలుసుకునేందుకు మార్గం ఏర్పడింది.

గ్రంథాలయం పెట్టాలన్న ఆలోచనతో

ఏడాది అనంతరం మరోసారి ఈశా ఆలోచన పక్షుల ఈకల వైపు మళ్లింది. అందరికీ పక్షుల గురించి తెలిసేలా పక్షుల ఈకల సేకరణ చేయాలని భావించారు. ఈ విషయాన్ని తన స్నేహితురాలితో పంచుకున్నారు. అదే రోజు రోడ్డుపై ఆ హూపీ పక్షి మరణించి కనిపించింది. తను అనుకున్నది మొదలుపెట్టడానికి ఇదొక సంకేతంగా ఆమె భావించారు.

దీక్షతో సాగుతూ

వాతావరణంలో ఇమడలేక, అనారోగ్య సమస్యలతో మరణించిన పక్షుల ఈకల్ని ఈశా సేకరించి, వాటి వివరాలతో వాటిని భద్రపరుస్తున్నారు. ఇదంతా అవసరమా అని ఎవరైనా ప్రశ్నిస్తే ‘పక్షులు మన జీవ వైవిధ్యంలో భాగం. వాటి జీవితానికి రెక్కలు ప్రధానం. అటువంటి వాటిని సేకరించి, వాటి వివరాలను భద్రపరచడం ద్వారా వాటి సమస్యలను తెలుసుకోవచ్చు. వాటి గురించిన సమాచారాన్ని తరువాతి తరాల వారికి అందించవచ్చు’ అంటారు. ఈ ప్రయాణంలో ఎన్నోసార్లు అరుదైన పక్షుల్ని చూసే అవకాశం దక్కిందని సంబరంతో చెప్తున్నారు. బెంగళూరులోని నేషనల్ సెంటర్ ఫర్ బయలాజికల్ సైన్సెస్‌లో పక్షుల విభాగానికి ఆమె గౌరవ పర్యవేక్షకురాలిగా ఉన్నారు.

లైబ్రరీగా మార్చి...

అటవీ సంరక్షణా చట్టాల ప్రకారం వ్యక్తిగతంగా ఎవరూ పక్షుల ఈకల్ని సేకరించేందుకు అనుమతి లేదు. అయితే ఒక ట్రస్టుగా ఏర్పడి, పక్షుల ఈకల సేకరణ చేయొచ్చని ఆమెకు అధికారులు సూచించారు. దీంతో రెండు నెలల్లోనే ఒక ట్రస్టు కింద ‘ఫెదర్ లైబ్రరీ’(పక్షుల ఈకల గ్రంథాలయం) బెంగళూరులో ప్రారంభించారు. ప్రస్తుతం జర్మనీ, అమెరికా దేశాల తర్వాత ఇటువంటి లైబ్రరీ కలిగిన దేశం భారత్ కావడం విశేషం. ఇక్కడ 160 రకాల పక్షుల ఈకలు, 400 పక్షుల అవశేషాలు, వాటి వివరాలు ఉంటాయి. లైబ్రరీలో పక్షుల్ని భద్రపరిచేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేశారు ఈషా. దేశంలోని పర్యావరణవేత్తలే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా అనేకమంది ఈ లైబ్రరీకి వచ్చి, పక్షుల గురించి అనేక విషయాలు తెలుసుకుంటూ ఉంటారు. ఇక్కడి దాకా రాలేనివారు వెబ్‌సైట్‌ను సందర్శిస్తుంటారు.

● సమ్‌థింగ్ స్పెషల్

స్వీట్ డాడీ... స్విగ్గీ డాడీ!

పిల్లలు తమ కంటే మెరుగైన జీవితం గడపాలని కలలు కంటారు తల్లిదండ్రులు. అందుకోసం ప్రతి క్షణం కష్టపడతారు. ఇలాంటి ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది...

స్విగ్గీ డెలివరీ పార్ట్‌నర్ ఒకరు ఒక బిల్డింగ్ లిఫ్ట్ దగ్గర కూర్చొని ఉన్నాడు. తనతోపాటు కూతురు కూడా ఉంది. ఆ చిట్టితల్లికి తండ్రి ఓపికగా పాఠం చెబుతున్న వీడియో నెటిజనులను కదిలించింది. బహుశా ఆ వ్యక్తి భార్య వేరే ఉద్యోగం ఏదైనా చేస్తూ ఉండవచ్చు. పాపను తనతోపాటు తీసుకువెళ్లే అవకాశం ఆమెకు లేకపోయి ఉండవచ్చు. దీంతో ప్రతి స్విగ్గీ డెలివరీకి కూతురుని వెంట తీసుకువెళుతుంటాడు. ఏ మాత్రం విరామం దొరికినా ఇలా పాఠాలు చెబుతుంటాడు. ‘స్విగ్గీ డాడీ’ ‘రియల్ హీరో’ అంటూ ఆ స్విగ్గీ ఉద్యోగిని ఆకాశానికెత్తారు నెటిజనులు. ‘చాలామంది తండ్రులు ఉద్యోగం నుంచి ఇంటికి రాగానే ఫోన్‌లో మునిగిపోయి పిల్లల చదువును పట్టించుకోరు. చదివించాల్సిన బాధ్యత తల్లిదే అన్నట్లుగా ఉంటుంది వారి ధోరణి. అలాంటి తండ్రులకు ఈ రియల్ హీరో మోడల్ కావాలి. తనకు ఉన్న పరిమితులలోనే పాపను చదివిస్తున్న తీరు అభినందనీయం’ అన్నారు.

● స్ఫూర్తి

91 ఏళ్ల యువకుడు

వయసు 60 దాటగానే... ‘ఇక చాలు నాయనా’ అని ఇంటికి, విశ్రాంతికి పరిమితమయ్యేవారు చాలామంది ఉంటారు. అయితే కొందరు మాత్రం వయసుతో సంబంధం లేకుండా కష్టపడుతూనే ఉంటారు. పనిలోనే వారికి విశ్రాంతి దొరుకుతుంది.

తాజా విషయానికి వస్తే... పనిలో ఒక వృద్ధుడి అంకితభావంపై సినీ హీరో ఆర్.మాధవన్ షేర్ చేసిన వీడియో నెటిజనులకు బాగా నచ్చింది. సింగపుర్‌లోని ఒక హోటల్ రెస్ట్‌రూమ్‌లో పని చేస్తున్న వృద్ధుడిని ఆస్ట్రేలియన్ వ్లాగర్ పలకరించి సంభాషించాడు. ఆ వృద్ధుడి వయసు 91 సంవత్సరాలు. రోజూ పన్నెండు గంటల షిఫ్ట్‌లో పనిచేస్తాడు. రాత్రి ఏడు గంటలకు అతడి డ్యూటీ ముగుస్తుంది. ‘ఈ వయసులోనూ పన్నెండు గంటలు పనిచేస్తున్నావు. చురుగ్గా ఉన్నావు. నీ ఆరోగ్య రహస్యం ఏమిటి? ఏంతింటావు? అని ఆస్ట్రేలియన్ వ్లాగర్ అడిగితే...

‘సాధారణ భోజనమే’ అని జవాబు ఇచ్చాడు.

‘వ్యాయామాలు చేస్తుంటారా?’ అని అడిగితే...

‘ఎప్పుడూ లేదు’ అని చెప్పాడు. పనే అతడి వ్యాయామం. పనే అతడి విశ్రాంతి!

‘ఆరోగ్యానికి ఆనందమే మూలం... వ్యాయామం కాదు... ఆ ఆనందం ఈ పెద్దాయనకు పనిలోనే దొరుకుతుంది’ అని స్పందించాడు ఒక నెటిజనుడు.

బ్యూటిప్

బీట్‌రూట్ మాస్క్‌తో మచ్చలేని అందం

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే బీట్‌రూట్, చర్మం ప్రకాశవంతంగా మారడంలోనూ అద్భుతంగా పనిచేస్తుంది. బీట్‌రూట్‌లో ఉండే విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని హైడ్రేట్ చేసి, మృదువుగా, నిగారింపుగా ఉంచుతాయి. ఇంట్లోనే తక్కువ సమయంతో తయారు చేసుకునే బీట్‌రూట్ ఫేస్ మాస్క్‌లను ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం..

బీట్‌రూట్ ముక్కలను మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేయాలి. వడకట్టి తీసిన రసంలో రెండు టేబుల్ స్పూన్లు రోజ్ వాటర్, టీ స్పూన్ నిమ్మ రసం కలపండి. దీనిలో కాటన్ బాల్‌ను ముంచాలి. దాంతో బీట్‌రూట్ రసాన్ని ముఖానికి అప్లై చేసి, 15 నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై మురికి తొలగిపోతుంది. నిమ్మరసం వల్ల ముఖంపై ఉండే మచ్చలు తగ్గుతాయి. రోజ్ వాటర్ చర్మానికి సహజసిద్ధమైన తేమను అందిస్తుంది.

అలోవెరా జెల్‌తో... బీట్‌రూట్ రసం తీసుకుని అందులో రెండు టేబుల్ స్పూన్లు అలోవెరా జెల్ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడగాలి.

ఇలా చేయడం వల్ల చర్మంపై ఉండే మురికి, మచ్చలు తొలగిపోయి చర్మం ఆరోగ్యంగా... అందంగా నిగనిగలాడుతుంది.

బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) నవంబర్ 17న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,24,910	బంగారం (24 క్యారెట్లు)	1,27,150	బంగారం (24 క్యారెట్లు)	1,25,400	బంగారం (24 క్యారెట్లు)	1,27,150	బంగారం (24 క్యారెట్లు)	1,24,000	బంగారం (24 క్యారెట్లు)	1,25,890
బంగారం (22 క్యారెట్లు)	1,12,880	బంగారం (22 క్యారెట్లు)	1,14,550	బంగారం (22 క్యారెట్లు)	1,14,950	బంగారం (22 క్యారెట్లు)	1,18,000	బంగారం (22 క్యారెట్లు)	1,14,080	బంగారం (22 క్యారెట్లు)	1,15,400
వెండి	1,59,500	వెండి	1,59,600	వెండి	1,73,000	వెండి	1,59,600	వెండి	1,59,000	వెండి	1,73,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి
విశాఖ కార్తె : నవంబర్ 19 వరకు
అనూరాధ కార్తె: 20 నుంచి



● ‘నానో’ మ్యాజిక్

తక్కువ ఎరువు ఎక్కువ దిగుబడి!

నానో–ఫెర్టిలైజర్ (అతి సూక్ష్మ లేదా నానో రసాయనిక ఎరువుల) సాంకేతికతను అభివృద్ధి చేసిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధకులు

అతి సూక్ష్మ ఎరువుల ప్రయోజనాలు 3:
- ఎరువుల మోతాదులో 20–30% చాలు
- 80–70% తగ్గనున్న ఎరువుల ఖర్చు
- నేల, నీరు, గాలి కాలుష్యానికి చెక్!

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రోజ్మేరీ పంటపై అతి సూక్ష్మ ఎరువుల తొలి ప్రయోగం విజయవంతం

పంట మొక్కల మొదళ్ల దగ్గర వేసే సాధారణ రసాయనిక ఎరువుల్లో 30 శాతమే పంటలకు ఉపయోగపడుతుంటే, 70% ఎరువులు నేల పాలవుతున్నాయి. రైతుల డబ్బు వృథా కావటంతో పాటు ఇవి నేలను, నీటిని, గాలిని కలుషితం చేస్తున్నాయి. అయితే, దీన్ని సమూలంగా మార్చేసే అవకాశం ఉందని తాజా పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. నేలపై వేసే యూరియా వంటి ఎన్‌పీకే (రసాయనిక) ఎరువులనే అతి సూక్ష్మ కణాల ఎన్‌పీకే పొడిగా మార్చి, నేలపై వెయ్యకుండా, నీటిలో కలిపి పిచికారీ చేస్తే.. ప్రామాణిక మోతాదులో కేవలం 20–30% నానో ఎరువులతోనే అధిక దిగుబడులు సాధించవచ్చు. 80–70% ఎరువులను నికరంగా ఆదాయ చెయ్యవచ్చు. ఎరువుల ఖర్చును తగ్గించుకోవటంతో పాటు పనిలో పనిగా పర్యావరణ కాలుష్యాన్ని, నేల ఆరోగ్యాన్ని, భూతాపాన్ని కూడా తగ్గించుకోవచ్చు. అయితే, అతి సూక్ష్మ రసాయనిక ఎరువులతో దీర్ఘకాలంలో దుష్ఫలితాలేమీ లేవని నిర్ధారించే పరీక్షలు ఇంకా చెయ్యాల్సి ఉంది. ఆ తర్వాతే ఈ టెక్నాలజీ రైతులకు అందుబాటులోకి వస్తుందని ఈ పరిశోధనలో కీలకపాత్ర పోషిస్తున్న ప్రొ. శ్రీకాంత్ ‘సాక్షి సాగుబడి’తో చెప్పారు.

ప్రొఫెసర్ పొదిలె అప్పారావు

‘నానో ఫెర్టిలైజర్ లేదా అతి సూక్ష్మ రసాయనిక ఎరువులు’ అనగానే సీసాల్లో నింపి అమ్ముతున్న నానో ద్రవ రూప ఎరువులు చప్పున గుర్తొస్తాయి. అయితే, ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్నది వాటి గురించి కాదు. మామూలుగా మన రైతులు గుప్పిళ్లతో పొలాల్లో వెదజల్లే తెల్లని యూరియా, ఫాస్ఫరస్, డీఏపీ వంటి గుళికల రసాయనిక ఎరువుల గురించే. గుళికల రూపంలో ఉండే వీటిని అతి సూక్ష్మ కణాల పొడిగా మార్చితే అవి ‘నానో ఎరువులు’ అవుతాయి. ఈ పొడిని నీటితో కలిపి పంటలపై పిచికారీ చేస్తే.. వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటలకు సిఫారసు చేసే రసాయనిక ఎరువుల మోతాదులో 20–30% అతిసూక్ష్మ ఎరువులతోనే సాధారణం కన్నా అధిక దిగుబడి సాధించవచ్చని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధకులు రుజువు చేశారు. ఎన్‌పీకే స్థూల ఎరువులతో పాటు ఐరన్, జింక్ తదితర సూక్ష్మపోషక ఘనరూప ఎరువులను సైతం పొడిగా మార్చి, నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేసి సత్ఫలితాలు సాధించవచ్చు అంటున్నారు. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ వీవీఎస్ఎస్ శ్రీకాంత్ తదితర పరిశోధకుల బృందం నానో–ఎరువుల రూపకల్పన, తయారీపై పనిచేసింది. మొక్కల ఎదుగుదల తీరుపై ప్లాంట్ సైన్సెస్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ పొదిలె అప్పారావు బృందం అధ్యయనం చేసింది.

రోజ్మేరీపై నెలకోసారి పిచికారీ

రోజ్మేరీ (రోస్మరినస్ అఫిసినాలిస్) ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా వాడుకలో ఉన్న విలువైన సుగంధ నూనె పంట. రోజ్మేరీ నూనెను ఆహారం, సౌందర్య సాధనాలు, ఔషధ పరిశ్రమల్లో విస్తృతంగా ఉపయోగిస్తారు. అయితే, సాధారణంగా అధికంగా రసాయనిక ఎరువుల వాడకంతో అధిక ఖర్చుతో పాటు పర్యావరణానికి హాని కలుగుతోంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధకులు ప్రత్యేక డిజైన్‌తో రూపొందించిన యంత్రంలో సాధారణ ఎన్‌పీకే ఎరువులను వేసి, నానో ఎరువుల పొడిగా మార్చారు. ఎన్‌పీకే ఎరువులతో పాటు ఇనుము, జింక్, మాంగనీస్, రాగి సహా కీలకమైన సూక్ష్మ పోషకాలను కూడా అతి సూక్ష్మ పొడిగా మార్చి వాడారు. గ్రీన్‌హౌస్‌లో కుండీల్లో పెరిగే రోజ్మేరీ మొక్కలపై 3 నెలల పంట కాలంలో నెలకోసారి పిచికారీ చేశారు. సాధారణ ఎరువుల గుళికలను నేలపై వేసినప్పటితో పోల్చితే, పిచికారీ చేసిన నానో పొడిలోని పోషకాలను మొక్కలు ఆకుల ద్వారా చాలా మెరుగ్గా ఉపయోగించుకున్నట్లు గుర్తించారు.

రోజ్మేరీ పంట సాగులో సాధారణంగా హెక్టారుకు ఏడాదిలో 100–300 కిలోల ఎన్‌పీకే ఎరువులు వాడతారు. అయితే, రోజ్మేరీ మొక్కలకు ప్రామాణిక ఎరువుల మోతాదులో 20–30% పరిమాణంలోనే నానో ఎరువుల పొడిని వాడారు. అయినా మొక్కలు, వేర్ల పెరుగుదల మెరుగ్గా ఉంది. అతి సూక్ష్మ రూపంలోని రసాయనిక ఎరువుల కణాలను ఆకులు సులువుగా గ్రహించటం వల్ల సమర్థవంతంగా పోషక శోషణ జరిగింది. జీవక్రియ మెరుగ్గా జరిగింది. ఫలితంగా అధిక నూనె దిగుబడి వచ్చింది. నూనె నాణ్యత, సుగంధ స్థాయి అధికంగా వచ్చింది. ఈ పరిశోధన ఫలితాలు ‘ఇండస్ట్రియల్ క్రాప్స్–ప్రొడక్ట్స్’ శాస్త్రీయ జర్నల్‌లో ఇటీవల ప్రచురితమయ్యాయి. ఈ విధానాన్ని మార్కెట్‌లో అధిక విలువ కలిగిన అనేక ఔషధ, సుగంధ పంటలకు కూడా అన్వయించవచ్చని పరిశోధకులు విశ్వసిస్తున్నారు.

మీటరులో 100 కోట్ల వంతు!

సాధారణంగా రైతులు వాడే డీఏపీ, ఎన్‌పీకే వంటి రసాయనిక ఎరువుల గుళికలు మైక్రోమీటర్ల (మీటరులో పది లక్షల వంతు) సైజులో ఉంటాయి. ఇఫ్కో నుంచి సాధారణ 19:19:19 ఎన్‌పీకే, మైక్రో–న్యూట్రియంట్ మిక్స్ (ఉత్కర్ష్ కాంబి–2)లను కొనుగోలు చేశారు. వీటిని హై–ఎనర్జీ షేకర్ మిల్లులో వేసి నానో ఎరువుల పొడిని తయారు చేశారు. నానో ఎరువుల కణాలు మీటరులో 100 కోట్ల వంతు సైజులో అతి సూక్ష్మంగా ఉంటాయి. నానో ఎరువుల బయో ఎవైలబిలిటీ (జీవ లభ్యత) ఎక్కువ. నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేసినప్పుడు పత్ర రంధ్రాల ద్వారా ఈ పోషకాలు నేరుగా మొక్క సులువుగా, సమర్థవంతంగా తీసుకోగలుగుతుంది. నేలలో వేసిన సాధారణ ఎరువుల్లో పోషకాలను వేర్ల ద్వారా గ్రహించగలిగే దానికన్నా, పిచికారీ చేసిన నానో ఎరువుల పోషకాలను చాలా సులువుగా, మెరుగ్గా పంట మొక్కలు తీసుకోగలుగుతాయి. వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు సిఫారసు చేసే మోతాదులో 20 నుంచి 30% అతి సూక్ష్మ ఎరువులతోనే అధిక దిగుబడి తీయటం సాధ్యమవుతుందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధకులు పేర్కొన్నారు.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి

నీటి కుంటలతో మేలెంత?

కరువు ప్రాంతాల్లో వర్షాధార వ్యవసాయంలో బోర్లపై కన్నా నీటి కుంటల్లో (ఫామ్ పాండ్స్) నిల్వ చేసుకునే వర్షపు నీటిపై ఆధారపడటం మేలని డ్రోన్ల సహాయంతో చేసిన ఒక అధ్యయనం తేల్చింది. రక్షిత నీటి తడుల ద్వారా పంటను రక్షించుకోవటంతో పాటు దిగుబడులు పెంచుకోవటానికి ఫామ్ పాండ్స్ ఉపయోగపడుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం బండ్లపల్లె గ్రామ పరిసరాల్లోని ఫామ్ పాండ్స్ ఆర్థిక ప్రయోజనాలపై ‘ఇస్రో’కి చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ కేంద్రం నిపుణులు అధ్యయనం చేశారు. 13.7 చదరపు కిలో మీటర్ల పొలాల్లోని 13 నీటి కుంటల్లో నిల్వ చేసిన నీరు సుమారు 25 హెక్టార్ల వరికి, 63 హెక్టార్ల వేరుశనగకు రక్షిత తడులకు సరిపోయాయి. ఫలితంగా వరి ద్వారా రూ. 5 లక్షలు, వేరుశనగ ద్వారా రూ. 10 లక్షలకు పైగా అదనపు ఆదాయం లభించింది. సమర్థవంతంగా వ్యవసాయ చెరువుల పర్యవేక్షణ, నిర్వహణ కోసం డ్రోన్ టెక్నాలజీని జియోస్పేషియల్ సాధనాలతో అనుసంధానించటం ఈ అధ్యయనం ప్రత్యేకత. నీటి కుంట లోతు 3–5 మీటర్లుంటే ప్రయోజనకరమని తేలింది.

డిసెంబర్ 3, 4 తేదీల్లో కన్హా శాంతి వనంలో

మహా కిసాన్ మేళా

రంగారెడ్డి జిల్లా నందిగామ సమీపంలోని ప్రసిద్ధ హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ కన్హా శాంతి వనంలో డిసెంబర్ 3–4 తేదీల్లో మహా కిసాన్ మేళా జరగనుంది. సుస్థిర వ్యవసాయాభివృద్ధి కోసం కృషి చేసే లాభాపేక్ష లేని శాస్త్రీయ సంస్థ ఆసియన్ పీజీపీఆర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ మహా కిసాన్ మేళా జరుగుతోంది. దేశంలో ఎప్పుడూ లేని రీతిలో అత్యంత ఆధ్యాత్మిక కేంద్రంలో జరుగుతున్న ఈ మహోత్సవంలో వేలాది మంది రైతు ప్రతినిధులు పాల్గొంటారని ఆసియన్ పీజీపీఆర్ఆర్ సొసైటీ (ఇండియా చాప్టర్) అధ్యక్షులు డా. శామారావ్ తెలిపారు. ఇక్రిశాట్ ఆవరణలో గత నెలలో నిర్వహించాలని తొలుత తలపెట్టినప్పటికీ భారీ వర్షాల కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారే ఈ కిసాన్ మేళాలో ప్రతినిధులుగా పాల్గొనేందుకు అర్హులు. ఈ నెల 20 వరకు మాత్రమే రిజిస్ట్రేషన్ (ఫీజు: రూ. వంద) సదుపాయం అందుబాటులో ఉంటుంది. డా. నితేష్ – 98440 94168, డా. శామారావ్ జహగీర్దార్ – 97406 41068. రిజిస్ట్రేషన్, వసతి రిజర్వేషన్ నమోదు లింక్: https://eventform.in/view/apgpr



వివిధ సైజుల్లో నానో ఎరువులు

దీర్ఘకాలిక ప్రభావాలపై పరీక్షలు చెయ్యాల్సి ఉంది

వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించే ప్రామాణిక రసాయనిక ఎరువుల పరిమాణంలో 20–30% నానో ఎరువులు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చు. అతి సూక్ష్మ కణాలతో కూడి ఉన్నందున నానో ఎరువులు తక్కువ మోతాదుతోనే అధిక ఫలితాన్ని ఇస్తాయి. నేల, నీటి వ్యవస్థలపై ఒత్తిడిని తగ్గిస్తాయి. సాధారణ రసాయనిక ఎరువులను ఉపయోగించి నానో ఎరువులను తయారు చేశాం. మా యూనివర్సిటీ ప్రయోగశాలలో నియంత్రిత వాతావరణంలో కుండీల్లో రోజ్మేరీ మొక్కలపై ప్రయోగాత్మకంగా నానో ఎరువులు వాడాం. దాంతో పాటు రోజ్మేరీ నూనె దిగబడితో పాటు నాణ్యత కూడా పెరిగింది. అయితే, రైతులకు ఈ సాంకేతికత అందించడానికి ముందు మరికొన్ని పరీక్షలు చెయ్యాల్సి ఉంది. నానో ఎరువుల వల్ల దీర్ఘకాలిక పర్యావరణ, ఆరోగ్య ప్రభావాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవడానికి అంతర్జాతీయ మార్గదర్శకాలు, కేంద్ర ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం కఠినమైన పరీక్షలు ఇంకా చెయ్యాల్సి ఉంది. నానోటెక్నాలజీ అనూహ్యంగా ఎటువంటి హానీ చెయ్యదని, వ్యవసాయానికి నిజంగా ప్రయోజనం చేకూరుస్తుందని ఆధార సహితంగా నిర్ధారించుకోవటానికి ఈ పరీక్షలు ముఖ్యం. ఆ తదనంతరం నానో ఎరువుల సాంకేతికతను రైతుల వద్దకు తీసుకువెళ్తాం.

– ప్రొఫెసర్ వీవీఎస్ఎస్ శ్రీకాంత్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ,యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్



రాజస్తాన్ రాయల్స్ హెడ్ కోచ్‌గా కుమార్ సంగక్కర ఖరారు

ఐపీఎల్ టీమ్ రాజస్తాన్ రాయల్స్‌కు 2026 సీజన్‌లో కుమార్ సంగక్కర హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. సంగక్కర ఇప్పటికే టీమ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. గత సీజన్‌లో జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరించిన రాహుల్ ద్రవిడ్ ఆగస్టులో తన పదవి నుంచి తప్పుకున్నాడు. అప్పుడే సంగక్కరకు అదనపు బాధ్యతలు ఇవ్వడం ఖాయమైంది. ఇప్పుడు రాయల్స్ మేనేజ్‌మెంట్ దీనిని అధికారికంగా ప్రకటించింది. సంగక్కర 2021 నుంచి 2024 వరకు కూడా టీమ్ హెడ్ కోచ్‌గా పని చేశాడు. 2022లో ఫైనల్‌కు చేరిన రాజస్తాన్ రాయల్స్ జట్టు 2024లో 'ప్లే ఆఫ్స్'కు అర్హత సాధించగలిగింది. రాయల్స్ టీమ్‌కు బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న విక్రమ్ రాథోడ్‌ను అసిస్టెంట్ కోచ్‌గా ఎంపిక చేయగా... షేన్ బాండ్ బౌలింగ్ కోచ్ బాధ్యతలు నిలబెట్టుకున్నాడు. ట్రెవర్ పెన్నీ అసిస్టెంట్ కోచ్‌గా, సిద్ లాహిరి పెర్ఫార్మెన్స్ కోచ్‌గా కొనసాగుతారు. 2025 సీజన్‌లో ఆడిన 14 మ్యాచ్‌లలో రాజస్తాన్ 4 మ్యాచ్‌లు మాత్రమే గెలిచి 9వ స్థానంతో ముగించింది. రాబోయే సీజన్ వేలానికి ముందు తమ సీనియర్ ప్లేయర్, కెప్టెన్ సంజూ సామ్సన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకి ఇచ్చిన రాయల్స్... అతని స్థానంలో రవీంద్ర జడేజా, స్యామ్ కరన్‌లను తీసుకుంది.

అర్జున్ గేమ్ 'డ్రా'

పనాజీ: పురుషుల ప్రపంచకప్ చెస్ టోర్నీ క్వార్టర్ ఫైనల్ తొలి గేమ్‌ను భారత గ్రాండ్ మాస్టర్ ఇరిగేశి అర్జున్ 'డ్రా' చేసుకున్నాడు. చైనా గ్రాండ్‌మాస్టర్ వె యితో సోమవారం జరిగిన తొలి గేమ్‌ను నల్ల పావులతో ఆడిన ప్రపంచ ఆరో ర్యాంకర్ అర్జున్ 31 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. వీరిద్దరి మధ్య నేడు జరిగే రెండో గేమ్‌లో ఎవరు గెలుస్తారో వారికి సెమీఫైనల్ బెర్త్ ఖరారవుతుంది. రెండో గేమ్ కూడా 'డ్రా' అయితే బుధవారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు. సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్)–మార్టినెజ్ (రొమేనియా)... స్యామ్ షాంక్‌లాండ్ (అమెరికా)–ఆంద్రీ ఎసిపెంకో (రష్యా) తొలి గేమ్‌లు కూడా 'డ్రా' కాగా... నొదిర్‌బెక్ యాకుబొయెవ్ (ఉజ్బెకిస్తాన్) 44 ఎత్తుల్లో అలెగ్జాండర్ డాన్‌షెంకో (జర్మనీ)పై గెలుపొందాడు.

ప్యాట్ కమిన్స్‌కే సన్‌రైజర్స్ సారథ్యం



సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ సారథి ప్యాట్ కమిన్స్‌పై విశ్వాసం ఉంచింది. 2026 సీజన్‌లో కూడా కమిన్స్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని సన్‌రైజర్స్ యాజమాన్యం సోమవారం ప్రకటించింది. కమిన్స్ వరుసగా మూడో సీజన్‌లో జట్టు నాయకత్వ బాధ్యతలు చేపడుతున్నాడు. 2024లో కమిన్స్ కెప్టెన్సీలో ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచిన జట్టు... గత సీజన్‌లో 14 మ్యాచ్‌లలో 6 మాత్రమే గెలిచి పాయింట్ల పట్టికలో ఆరో స్థానంతో ముగించింది. ప్లే ఆఫ్స్‌కు చేరడంలో విఫలమైనా... 15 మంది ఆటగాళ్లను టీమ్ అట్టిపెట్టుకుంది. కమిన్స్ సారథ్యంలో రెండు సీజన్లు కలిపి 30 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ 15 గెలిచి, 14 ఓడింది. మరో మ్యాచ్‌లో ఫలితం తేలలేదు.

భళా బవుమా...

- సమర్థ నాయకుడిగా ఎదిగిన దక్షిణాఫ్రికా కెప్టెన్
- బ్యాటర్‌గా, సారథిగా అద్భుత ఫలితాలు

సరిగ్గా పదేళ్ల క్రితం తెంబా బవుమా భారత గడ్డపై తన తొలి టెస్టు మ్యాచ్ ఓపెనర్‌గా ఆడి విఫలమయ్యాడు. మరో నాలుగేళ్ల తర్వాత కూడా ఇక్కడ మూడు టెస్టులు ఆడిన అతడు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాడు. ఆరు ఇన్నింగ్స్‌లలో ఒక్క అర్ధ సెంచరీ కూడా లేకుండా రెండు డకౌట్‌లు సహా మొత్తం 96 పరుగులకే పరిమితమయ్యాడు. ఈసారి జట్టులో అందరికంటే సీనియర్ బ్యాటర్‌గా, కెప్టెన్‌గా మళ్లీ ఈ గడ్డపై అడుగు పెట్టిన అతను తొలి టెస్టునే చిరస్మరణీయం చేసుకున్నాడు. అసాధారణ రీతిలో పోరాడుతూ అజేయ హాఫ్ సెంచరీని నమోదు చేసిన అతను, తన కెప్టెన్సీ వ్యూహాలతో కూడా భారత్ పని పట్టాడు. తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ప్రత్యర్థికి తన ఆటతోనే సమాధానమిచ్చాడు. ఇదే జోరును అతను తర్వాతి టెస్టులోనూ కనబరిస్తే సిరీస్ గెలిచే ఘనత కూడా బవుమా ఖాతాలో చేరవచ్చు.

సాక్షి క్రీడా విభాగం

బవుమా

దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో ఫైనల్‌కు చేరిన తర్వాత కూడా కెప్టెన్‌గా ఎక్కువ మంది బవుమాను సీరియస్‌గా తీసుకోలేదు. బలమైన ప్రత్యర్థులతో తలపడకుండానే ఫైనల్ చేరిందని జట్టుపై విమర్శలూ వచ్చాయి. అయితే ఆస్ట్రేలియాను చిత్తు చేసి చాంపియన్‌గా నిలవడంతో పాటు ఫైనల్లో చేసిన కీలక అర్ధ సెంచరీ అతడికి కొంత గుర్తింపును ఇచ్చింది. అయినా సరే... విజేతగా అందుకున్న గదతో బవుమా పాల్గొన్న వీడియో షూట్‌పై కూడా వ్యంగ్య వ్యాఖ్యానాలే వినిపించాయి. అయితే ఇవన్నీ తనకు కొత్త కాదు, వివక్షతో పాటు విసుర్లు కూడా అలవాటే అన్నట్లుగా వాటిని అతను ఎప్పుడూ పట్టించుకోలేదు. ఎప్పుడూ అలాంటి వాటికి సమాధానం కూడా ఇవ్వకుండా తన పని తాను చేసుకుంటూ పోయాడు. ఎంతో మందికి సాధ్యం కాని ఘనతను నమోదు చేస్తూ 15 ఏళ్ల తర్వాత భారత గడ్డపై దక్షిణాఫ్రికాను గెలిపించిన బవుమా... డబ్ల్యూటీసీ విజయం గాలివాటం కాదని నిరూపించాడు. అతని కెప్టెన్సీలో 11 టెస్టులు ఆడిన జట్టు 10 గెలిచి, మరో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలవడం విశేషం. తన కెప్టెన్సీలో బ్యాటర్‌గా కూడా అతను 57 సగటుతో పరుగులు సాధించాడు.

పట్టుదలకు మారు పేరుగా...

డబ్ల్యూటీసీ ఫైనల్ తర్వాత బవుమా మరో టెస్టు మ్యాచ్ ఆడలేదు. గాయంతో ఆటకు దూరమైన అతను మెల్లగా కోలుకుంటూ భారత్‌తో టెస్టుల కోసం సిద్ధమయ్యాడు. ఈ సిరీస్‌కు ముందు 'ఎ' జట్టు తరఫున బరిలోకి దిగి తన బ్యాటింగ్‌కు పదును పెట్టుకున్నాడు. కోల్‌కతా టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైనా... రెండో ఇన్నింగ్స్‌లో తన బ్యాటింగ్ విలువను అతను చూపించాడు. ఆట సాగిన కొద్దీ పిచ్ ఆడలేని స్థితికి చేరుతోందని అర్థం కావడంతో సాధ్యమైనన్ని ఎక్కువ పరుగులు జోడించేందుకు పట్టుదలగా నిలబడ్డాడు. అబేధ్యమైన డిఫెన్స్‌తో కూడా బవుమా ఆకట్టుకున్నాడు. తాను ఆడిన తొలి 23 బంతుల్లో 4 పరుగులే చేసినా... వీటిలో స్పిన్నర్లు వేసిన 17 బంతులను అతను సమర్థంగా ఎదుర్కొన్నాడు. ఆ తర్వాత తడబాటు లేకుండా ఒక్కో పరుగు జోడిస్తూ పోయాడు. అతను తీసిన 33 సింగిల్స్ చివర్లో కీలకంగా మారాయి. నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి రెండు జట్ల నుంచి అర్ధ సెంచరీ చేయడం ఒక్క బవుమాకే సాధ్యమైంది. భారీగా పరుగులు ఇవ్వడం లేదని భావించిన భారత్ బవుమా చేసిన నష్టాన్ని ఊహించలేకపోయింది.

పదునైన వ్యూహంతో...

124 పరుగుల లక్ష్యాన్ని భారత్ ఛేదించకుండా వారి సొంతగడ్డపై నిలువరించడం సాధారణ విషయం కాదు. ఏ జట్టయినా ఆట మొదలు కాకముందే కాడి పడేస్తుంది. కానీ బవుమా సహచరుల్లో ధైర్యం నూరిపోశాడు. ఈ స్కోరు కూడా మనకు సరిపోతుంది అతని వారిలో నమ్మకం పెంచే ప్రయత్నం చేశాడు. తన వ్యూహాలతో భారత బ్యాటర్లకు అవకాశం ఇవ్వకుండా అడ్డుకున్నాడు. ఆరంభంలోనే యాన్సెన్ రెండు వికెట్లు తీసిన తర్వాత తన స్పిన్నర్లను అతను సమర్థంగా వాడుకున్నాడు. కీలక సమయంలో మార్క్‌రమ్‌ను అనూహ్యంగా బౌలింగ్ దింపి అతను ఫలితం సాధించగలిగాడు. చక్కగా ఆడుతున్న సుందర్‌ను మార్క్‌రమ్ అవుట్ చేయడంతో సఫారీ విజయానికి దారులు తెరచుకున్నాయి. ఇక లెఫ్ట్ హ్యాండర్ అక్షర్ పటేల్ చెలరేగే అవకాశం ఉందని తెలిసినా లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌తో బౌలింగ్ చేయించి 'సాహసం' చేశాడు. ఊహించినట్లే తొలి నాలుగు బంతుల్లో అక్షర్ 2 సిక్స్‌లు, ఫోర్ బాదేయడంతో వ్యూహం బెడిసికొట్టినట్లు అనిపించింది. కానీ అక్షర్ గాల్లోకి లేపిన తర్వాతి బంతిని తానే క్యాచ్ అందుకొని బవుమా విజయనాదం చేశాడు. ఈ వ్యూహంపై అన్ని వైపుల నుంచి ప్రశంసలు వచ్చాయి.

కొసమెరుపు: సరిగ్గా రెండేళ్ల క్రితం 2023 నవంబర్ 16న ఇదే ఈడెన్ గార్డెన్‌లో ఆస్ట్రేలియా చేతిలో దక్షిణాఫ్రికా వన్డే వరల్డ్ కప్ సెమీఫైనల్లో ఓడింది. కెప్టెన్ బవుమా 'సున్నా'కు అవుటై వేదనతో నిష్క్రమించాడు. ఇప్పుడే అదే తేదీన అదే మైదానంలో బవుమా తాను ఎప్పటికీ మర్చిపోలేని ఘనతను సాధించాడు.

మూడో స్థానంతో ముగింపు

-చివరిరోజు రజతం గెలిచిన భారత షూటర్ గుర్‌ప్రీత్ సింగ్

కైరో: పతకంతో ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌ను ఘనంగా ప్రారంభించిన భారత షూటర్లు పతకంతోనే ఈ మెగా ఈవెంట్‌ను ముగించారు. సోమవారం ముగిసిన ప్రపంచ రైఫిల్, పిస్టల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆఖరి రోజు భారత్‌కు రజత పతకం లభించింది. నాన్ ఒలింపిక్ ఈవెంట్ అయిన పురుషుల 25 మీటర్ల సెంటర్‌ఫైర్ పిస్టల్ విభాగంలో భారత షూటర్ గుర్‌ప్రీత్ సింగ్ రజత పతకం సొంతం చేసుకున్నాడు. 34 మంది షూటర్లు పోటీపడ్డ ఈ విభాగంలో గుర్‌ప్రీత్ 584 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచాడు. పావ్లో కొరొస్టిలోవ్ (ఉక్రెయిన్; 584 పాయింట్లు) స్వర్ణం, పియరీ లూయిస్ (ఫ్రాన్స్; 583 పాయింట్లు) కాంస్యం సాధించారు. పావ్లో, గుర్‌ప్రీత్ పాయింట్లు సమంగా ఉన్నప్పటికీ... గుర్‌ప్రీత్ (18)తో పోలిస్తే కేంద్ర బిందువుపై పావ్లో (29) షాట్‌లు ఎక్కువగా కొట్టడంతో అతనికి స్వర్ణం లభించింది. ఓవరాల్‌గా ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో భారత్ 3 స్వర్ణాలు, 6 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి 13 పతకాలతో మూడో స్థానంలో నిలిచింది. 12 స్వర్ణాలు, 7 రజతాలు, 2 కాంస్యాలతో కలిపి 21 పతకాలు నెగ్గిన చైనా అగ్రస్థానాన్ని దక్కించుకోగా... 7 స్వర్ణాలు, 3 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి 14 పతకాలు గెలిచిన దక్షిణ కొరియా రెండో స్థానంలో నిలిచింది.

రెండో టెస్టుకూ గిల్ సందేహమే!

కోల్‌కతా: మెడనొప్పితో తొలి టెస్టు నుంచి అర్ధాంతరంగా తప్పుకున్న భారత టెస్టు జట్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినా అతని పరిస్థితి ఇంకా మెరుగుపడలేదని సమాచారం. 'గిల్‌కి మెడ నొప్పి తీవ్రంగా ఉంది. అతను నెక్ కాలర్ ధరిస్తూనే ఉన్నాడు. కనీసం 3–4 రోజులు విశ్రాంతి తీసుకోవాలని, విమానం ఎక్కరాదని వైద్యులు చెప్పారు. ఇలాంటి స్థితిలో అతను ప్రయాణించే పరిస్థితి లేదు. అయితే అతని ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం' అని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. దాంతో గిల్ జట్టుకు పాటు గువహటి వెళ్లడం లేదని స్పష్టమైంది. బుధవారం భారత జట్టు కోల్‌కతా నుంచి బయల్దేరుతుంది.

నవీ ముంబై, వడోదరలలో డబ్ల్యూపీఎల్!

ముంబై: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 సీజన్ రెండు వేదికలకే పరిమితం అయ్యే అవకాశం ఉంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంతో పాటు వడోదరలోని కొటాంబి స్టేడియంలో ఈ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. దీనిపై ఈ నెల 26న జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారు. తర్వాతి రోజు 27న లీగ్ కోసం వేలం నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌లో పురుషుల టి20 వరల్డ్ కప్ జరగనున్న నేపథ్యంలో డబ్ల్యూపీఎల్ మరింత ముందుగా జరపనున్నారు. జనవరి 7 నుంచి ఫిబ్రవరి 3 వరకు టోర్నీ నిర్వహించాలని బీసీసీఐ యోచిస్తోంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

నిర్మాతలపై గౌరవం ఇంకా పెరిగింది

- వేణు ఊడుగుల

రాహుల్ మోపిదేవి, వేణు ఊడుగుల

''ఏదైనా మంచి కాన్సెప్ట్, పర్పస్ ఉన్న కథ దొరికితే దాన్ని ప్రేక్షకుల ముందుకు సరైన విధంగా చేర్చాలనే ప్రయత్నంలో భాగంగా దర్శకుడిగా ఉన్న నేను 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంతో నిర్మాతగా మారాను. ప్రొడ్యూసర్ అయ్యాక ప్రొడక్షన్‌లోని ఇబ్బందుల గురించి నాకు మరింత బాగా తెలిసింది. నిర్మాతలపై నాకున్న గౌరవం ఇంకా పెరిగింది. 'బేబి, 7జీ బృందావన కాలనీ, సైరత్, ప్రేమిస్తే..' వంటి చిత్రాల తరహాలో 'రాజు వెడ్స్ రాంబాయి' కూడా ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది.. వారిని ఆలోజింపజేసే చిత్రం ఇది'' అని తెలిపారు దర్శక–నిర్మాత వేణు ఊడుగుల.

అఖిల్, తేజస్విని జంటగా నటించిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. సాయిలు కంపాటి దర్శకత్వంలో ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్స్‌పై డా. నాగేశ్వర రావు పూజారి సమర్పణలో వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ నెల 21న ఈ మూవీని రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా వేణు ఊడుగుల మాట్లాడుతూ –''ఖమ్మం–వరంగల్ జిల్లాల మధ్య జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ స్క్రిప్ట్‌ను రెడీ చేశాడు సాయిలు. ఈ చిత్రానికి నిర్మాతగా నేను న్యాయం చేయగలని భావించి, ప్రొడ్యూసర్‌గా మారాను. నా దర్శకత్వంలో యూవీ సంస్థలో ఓ మూవీ రానుంది'' అని చెప్పారు. ''వాస్తవ ఘటనలు జరిగిన ప్రాంతంలోనే ఈ సినిమా చిత్రీకరించాం'' అన్నారు రాహుల్ మోపిదేవి.

టాలీవుడ్ ఎంట్రీ

రషా తడాని

దివంగత నటుడు కృష్ణ మనవడు, దివంగత నటుడు రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. 'ఆర్ఎక్స్ 100, మంగళవారం' చిత్రాల ఫేమ్ అజయ్ భూపతి ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. సి.అశ్వనీదత్ సమర్పణలో చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెలలోనే ప్రారంభం కానుంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి రషా తడాని నటించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''భావోద్వేగాలు, నిజాయితీ, రియలిజం కలగలిపిన కొత్త తరహా ప్రేమకథగా ఈ చిత్రం ఉండబోతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఇదిలా ఉంటే.. నార్త్ ఇండియన్ డిస్ట్రిబ్యూటర్, ఏఏ ఫిల్మ్స్ ఇండియా యజమాని అనిల్ తడాని, నటి రవీనా టాండన్‌ల కుమార్తె రషా తడాని అనే సంగతి తెలిసిందే. తెలుగులో ఆమె ఎంట్రీ ఇస్తున్న తొలి చిత్రం ఇదే కావడం విశేషం.

ప్రభాస్

డబుల్ ధమాకా

హీరో ప్రభాస్.. తన అభిమానులకు డబుల్ ధమాకా ఇవ్వనున్నారు. ఆయన హీరోగా నటించిన 'బాహుబలి' చిత్రం రెండు భాగాలుగా విడుదలైంది. అదేవిధంగా 'సలార్, కల్కి 2898 ఏడీ' వంటి సినిమాలకు కూడా రెండో భాగం ఉంటుందని మేకర్స్ ప్రకటించారు. ఇకపోతే ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఫౌజి' మూవీ కూడా టు పార్ట్స్‌గా ఆడియన్స్ ముందుకు రానుంది. 'సీతా రామం' మూవీ ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న 'ఫౌజి'లో ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్, రాహుల్ రవీంద్రన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. దేశభక్తి అంశాలతో పీరియాడికల్ యాక్షన్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఇదిలా ఉంటే...'ఫౌజి' రెండు భాగాలుగా విడుదలకానుంది. ఈ విషయాన్ని హను రాఘవపూడి ఇటీవల స్పష్టం చేశారు. ''ఫౌజి' తొలి భాగంలో ప్రభాస్ పాత్ర తాలూకు ప్రపంచాన్ని చూస్తారు. రెండో భాగంలో(ప్రీక్వెల్) ఆయన పాత్ర పూర్తి వైవిధ్యంగా ఉంటుంది. అలాగే స్వాతంత్ర్య సమర యోధుల కథలను, నిజ జీవితంలో నాకు స్ఫూర్తినిచ్చిన వాస్తవ ఘటనలను ప్రీక్వెల్‌లో చూస్తారు'' అన్నారు హను రాఘవపూడి. 2026 ఆగస్టులో ఈ మూవీ రిలీజ్ కానుందని టాక్.

విద్య.. వినోదం

యానిమేషన్ నేపథ్యంలో రూపొందిన బాలల చిత్రం 'కికీ–కోకో'. కికీ అనే కుక్క పాత్ర, కోకో అనే చిన్నారి పాత్ర లీడ్ రోల్స్‌లో పి.నారాయణన్ దర్శకత్వంలో రూపొందిన యానిమేషన్ చిత్రం 'కికీ– కోకో'. ఇనికా ప్రొడక్షన్స్‌పై జి.యం.కార్తికేయన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా పి. నారాయణన్ మాట్లాడుతూ–'' చిన్నారుల వినోదం, విద్యకు కొత్త నిర్వచనం చూపే వినూత్న చిత్రం ఇది. కికీ అనే పెంపుడు కుక్క, కోకో అనే చిన్నారి మధ్య ఉన్న అపూర్వమైన బంధాన్ని ఈ చిత్రం చెబుతుంది'' అని తెలిపారు. ''ఇది ఒక సినిమా మాత్రమే కాదు. స్నేహం, ప్రేమ, కథల ద్వారా పిల్లలు నేర్చుకునే విలువైన పాఠాల వేదిక'' అని జి.యం.కార్తికేయన్ తెలిపారు. ఈ చిత్రానికి కాన్సెప్ట్, క్రియేటివ్ డైరెక్టర్: గోకుల్ రాజ్ భాస్కర్.

కుల వ్యవస్థపై దండోరా

శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవి, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, రాధ్య, అదితి భావరాజు ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో ముప్పనేని శ్రీలక్ష్మీ సమర్పణలో లౌక్య ఎంటర్‌టైన్మెంట్స్‌పై రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 25న రిలీజ్ కానుంది. 'దండోరా' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో శివాజీ మాట్లాడుతూ– ''మన సమాజంలోని కుల వ్యవస్థ మీద సెటైరికల్‌గా అద్భుతమైన కథను రాసుకున్నారు మురళీగారు. తమిళ్, మలయాళీ ఆర్టిస్టులే బాగా నటిస్తారనుకునే వారికి 'దండోరా' చూస్తే.. అంతకంటే గొప్ప ఆర్టిస్టులు తెలుగులో ఉన్నారని అర్థం అవుతుంది'' అని చెప్పారు. ''చావు, కులం అనే పాయింట్స్‌తో మంచి విషయాల్ని ఈ సినిమాలో చెప్పారు మురళిగారు'' అన్నారు నవదీప్. ''సమాజంలో ఆలోచనలు రేకెత్తించేలా మా 'దండోరా' ఉంటుంది'' అని బిందు మాధవి పేర్కొన్నారు. ''మా సినిమా అలరించేలా ఉంటుంది'' అని అన్నారు రవీంద్ర బెనర్జీ ముప్పనేని. ''దండోరా' టీజర్ చూసి అల్లు అర్జున్‌గారు అభినందించారు. అదే మాకు పెద్ద సక్సెస్'' అని మురళీకాంత్ చెప్పారు.

నవదీప్, బిందుమాధవి

థ్రిల్లింగ్ టార్టాయిస్

శశిధర్, విజయ్ కుమార్, సంతోష్, రాంబాబు

రాజ్‌తరుణ్, అమృత చౌదరి జంటగా, అవసరాల శ్రీనివాస్, ధన్యా బాలకృష్ణ ప్రధాన పాత్రల్లో 'టార్టాయిస్' అనే కొత్త సినిమా ఆరంభమైంది. రిత్విక్ కుమార్ దర్శకత్వంలో ప్రశ్విత ఎంటర్‌టైన్మెంట్, ఎస్‌కే గోల్డెన్ ఆర్ట్స్, చందమామ క్రియేషన్స్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్‌పై శశిధర్ నల్ల, విజయ్ కుమార్, ఇమ్మడి సంతోష్, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. రాజ్ తరుణ్ మాట్లాడుతూ– ''టార్టాయిస్' చిత్రం చాలా కొత్తగా, వైవిధ్యంగా ఉంటుంది. నా కెరీర్‌కు కిక్ ఇచ్చే చిత్రం ఇది'' అని తెలిపారు. ''సరికొత్త స్క్రీన్ ప్లేతో సాగే థ్రిల్లర్ చిత్రం ఇది'' అన్నారు రిత్విక్ కుమార్. ''త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం'' అని శశిధర్ నల్ల, విజయ్ కుమార్, సంతోష్ ఇమ్మడి, రామిశెట్టి రాంబాబు పేర్కొన్నారు. ఈ చిత్రానికి చంద్రబోస్ లిరిక్స్ అందిస్తుండగా, అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు.

సమాజానికి సందేశం

హరినాథ్, సోఫియా

హరినాథ్ పొలిచర్ల హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'నా తెలుగోడు'. తనికెళ్ల భరణి, రఘు బాబు, జరీనా వహాబ్, నిధి పాల్, రోనీ కౌలా, సోఫియా తన్వీర్ ఇతర పాత్రలు పోషించారు. డ్రీం టీం ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ సినిమా డిసెంబరు 12న విడుదల కానుంది. హరినాథ్ పొలిచర్ల మాట్లాడుతూ–''ఈ సినిమాలో సైనికుడిగా చేశాను. సైనికులు దేశం కోసం జీవితాన్ని త్యాగం చేస్తారు. వారి జీవితంతో పాటు డ్రగ్స్ నుండి సమాజాన్ని కాపాడాలి, మహిళలను సంరక్షించాలంటూ సమాజానికి సందేశం ఇచ్చే అంశాలను మా చిత్రంలో చూపించాను. ఎన్టీఆర్‌గారి స్ఫూర్తితో 'నా తెలుగోడు' టైటిల్ పెట్టడం గర్వంగా ఉంది. మా చిత్రాన్ని 'ఆర్‌కే' పేరుతో హిందీలో విడుదల చేయనున్నాం'' అన్నారు.

పొలిటికల్ డ్రామా

నరేష్ మేడి, రాగ్, రజిత శాండీ, రణధీర్ బీసు, రాఘవ మందలపు, పెద్ది రాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'ఆపరేషన్ పద్మ'. కార్తికేయ.వి దర్శకత్వంలో ఘట్టమనేని అరవింద్ బాబు, రాఘవ మందలపు, రాంబాబు మందలపు నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌లాంచ్‌లో నరేష్ మేడి మాట్లాడుతూ– ''పొలిటికల్ డ్రామా నేపథ్యంతో సాగే సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం ఇది'' అని తెలిపారు. ''నా క్యారెక్టరైజేషన్‌లో రెండు షేడ్స్ ఉంటాయి'' అని తెలిపారు రజిత శాండీ. ''27 రోజుల్లో ఒకే షెడ్యూల్‌లో ఈ చిత్రం పూర్తి చేశాం'' అన్నారు వి.కార్తికేయ, రాఘవ మందలపు. నిర్మాతలు దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్, ముత్యాల రాందాస్, డీఎస్ రావు తదితరులు మాట్లాడారు.

రజిత, నరేష్

మెడికల్ కాలేజీ నేపథ్యంలో...

సూర్య రాజ్, ప్రీతి, హను రెడ్డి

'కేజీఎఫ్, సలార్' చిత్రాల ఫేమ్ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో న్యూ మూవీ షురూ అయింది. సూర్య రాజ్ వీరబత్తిని, హను రెడ్డి, ప్రీతి పగడాల ప్రధాన పాత్రల్లో కీర్తన్ నాదగౌడ దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. ''భయంతో కూడిన గ్రామంలో మెడికల్ కాలేజీ నేపథ్యంలో ఈ సినిమా కథ ఉండబోతుంది. సైన్స్, మిస్టరీ, హారర్ ఎలిమెంట్స్ ఉంటాయి. సరికొత్త కథతో ఈ చిత్రం ప్రేక్షకులకు సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇవ్వనుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. శ్రీ వైష్ణవ, శశాంక్ పాటిల్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు వెంకీ జీజీ సంగీతం అందిస్తున్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
18-11-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
388	103
84,951	26,013

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,881	▽	21
డోజోన్స్	47,132	▽	15
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,681	▽	17
డాక్స్	23,571	▽	306
హాంగ్‌సెంగ్	3,990	▽	39
నికాయ్	50,324	▽	53

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.32	89.34
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.30	118.25
€	యూరో	ఎస్‌బీఐ	101.65	104.44
¥	జపాన్ యెన్ (100)	థామస్‌కుక్	46.00	59.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	55.43	59.27
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.78	69.47
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.75	24.25
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.24	24.50
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.59	13.42

సైయెంట్ సెమీకండక్టర్స్.. ఇంటెలిజెంట్ ఎస్‌వోసీ

- అజిముత్ ఏఐతో కలిసి రూపకల్పన
- ఆవిష్కరించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా తొలి ఇంటెలిజెంట్ పవర్ చిప్ ప్లాట్‌ఫాం, సిస్టమ్ ఆన్ ఎ చిప్ (ఎస్‌వోసీ) అయిన 'అర్క జీకేటీ–1'ని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం ఆవిష్కరించారు. సైయెంట్ సెమీకండక్టర్స్, అజిముత్ ఏఐ కలిసి దీన్ని రూపొందించాయి. సెమీకండక్టర్ల డిజైన్, టెక్ ఆవిష్కరణలకు హబ్‌గా ఎదగాలనే లక్ష్య సాధన దిశగా ఇదొక కీలక మైలురాయని వైష్ణవ్ తెలిపారు. ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ టెక్నాలజీలను డిజైన్ చేయడం, అభివృద్ధి చేయడంలో భారత్ సామర్థ్యాలను ఇది తెలియజేస్తుందని ఆయన పేర్కొన్నారు. మల్టీ–కోర్ కస్టమ్ కంప్యూటింగ్, అడ్వాన్స్‌డ్ అనలాగ్ సెన్సింగ్, మెమొరీ, ఇంటెలిజెంట్ పవర్ మేనేజ్‌మెంట్ మొదలైన వాటన్నింటిని సమగ్రపర్చి, విద్యుత్ ఆదా చేసే ఎస్‌వోసీగా దీన్ని రూపొందించినట్లు సైయెంట్ వైస్ చైర్మన్ కృష్ణ బోదనపు తెలిపారు. ఇది అత్యధిక వృద్ధి అవకాశాలున్న స్మార్ట్ యుటిలిటీలు, అధునాతన మీటరింగ్, బ్యాటరీ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ తదితర విభాగాల్లో ఉపయోగపడుతుందని అజిముత్ ఏఐ వ్యవస్థాపకుడు ప్రవీణ్ వై తెలిపారు.

మా ఈవీలకు తెలుగు రాష్ట్రాలు టాప్

మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్

- బీఈవీల విక్రయాల్లో సగటున 10% వాటా
- రెండు రాష్ట్రాల్లో 10 సేల్స్, సర్వీస్ టచ్‌పాయింట్లు
- త్వరలో మరో ఫ్రాంచైజీ భాగస్వామి
- భారత్‌లో ప్లాంటుపై ఇప్పటివరకు రూ. 3,000 కోట్ల పెట్టుబడులు
- జనవరిలో రేట్లు పెంచే అవకాశం...

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ వాహనాల విక్రయాలకు సంబంధించి తమకు రెండు తెలుగు రాష్ట్రాలు కీలకంగా ఉంటున్నాయని లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ వెల్లడించారు. టాప్ ఎండ్–కస్టమర్ల కోసం ఉద్దేశించిన ఎక్స్‌క్లూజివ్ 'మేబాక్ లాంజ్' హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేయడమనేది ఇక్కడి మార్కెట్ ప్రాధాన్యతను తెలియజేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తమ ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలకు అగ్రస్థానంలో ఉంటున్న నేపథ్యంలో ఇక్కడ కార్యకలాపాలు మరింతగా విస్తరిస్తున్నామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం స్థాయిలోనే ఈసారి విక్రయాల వృద్ధి ఉంటుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..

కీలకంగా ఏపీ, తెలంగాణ..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లగ్జరీ కార్ల మార్కెట్లో, ముఖ్యంగా టాప్ ఎండ్ లగ్జరీ కార్లు, బీఈవీల (బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు) విభాగంలో మెర్సిడెస్ బెంజ్ అగ్రగామిగా ఉంది. దేశీయంగా మా అమ్మకాల్లో ఈ రెండు రాష్ట్రాల వాటా 15 శాతంగా ఉంటుంది. బీఈవీల విషయానికొస్తే మా మొత్తం వాహన విక్రయాల్లో వీటి వాటా సగటున 8 శాతంగా ఉండగా, ఇక్కడ అంతకు మించి పది శాతంగా ఉంది. సానుకూల ట్యాక్సేషన్ విధానాలు, చార్జింగ్ మౌలిక సదుపాయాలు ఇక్కడ బీఈవీల వినియోగం పెరగడానికి దోహదపడుతున్నాయి. అంతేగాకుండా బీఈవీలను ఇంతకు ముందే ఉపయోగించిన అనుభవం గల టెక్ కస్టమర్లు ఎక్కువగా ఉండటం కూడా ఇందుకు తోడ్పడుతోంది. హైదరాబాద్‌లోని సంపన్న కస్టమర్లలో (హెచ్ఎన్ఐ) మా బ్రాండ్‌పై ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో టాప్ ఎండ్ లగ్జరీ కస్టమర్లకు సంబంధించి ఎక్స్‌క్లూజివ్ 'మేబాక్ లాంజ్'ని ఇక్కడే ఏర్పాటు చేశాం. హైదరాబాద్, సికింద్రాబాద్, వైజాగ్, విజయవాడలాంటి కీలక మార్కెట్ల వ్యాప్తంగా మాకు 10 అధునాతన సేల్స్, సర్వీస్ టచ్‌పాయింట్లు ఉన్నాయి. త్వరలోనే వైజాగ్‌లో మూడో ఫ్రాంచైజీ భాగస్వామిని నియమించుకుంటున్నాం.

పెట్టుబడులు.. కొత్త మోడల్స్..

పుణెకి దగ్గర్లోని చకాన్‌లో 100 ఎకరాల విస్తీర్ణంలో మా ప్లాంటు

ఉంది. దీనిపై ఇప్పటివరకు రూ. 3,000 కోట్లకు పైగా ఇన్వెస్ట్ చేశాం. ఈ ప్లాంటు సామర్థ్యం ఏటా 20,000 యూనిట్లుగా ఉంది. మరిన్ని కొత్త ప్రోడక్టులను తెచ్చే కొద్దీ, అవసరాన్ని బట్టి ప్లాంటు సామర్థ్యాన్ని పెంచుకుంటాం. మా ఫ్రాంచైజీ భాగస్వాములు వచ్చే మూడేళ్లలో సుమారు రూ. 450 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నారు. భారత్‌లో సుమారు 25 మోడల్స్ విక్రయిస్తుండగా, ఇందులో 11 మోడల్స్ స్థానికంగానే తయారు చేస్తున్నాం. పోర్ట్‌ఫోలియోలో 5–6 ఈవీలు ఉన్నాయి. వచ్చే రెండు మూడేళ్లలో అంతర్జాతీయంగా దాదాపు 40 మోడల్స్‌ను ప్రవేశపెట్టనుండగా, వాటిలో కొన్ని వాహనాలను ఇక్కడ కూడా అందుబాటులోకి తేనున్నాం. వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో సీఎల్‌ఏ ఈవీని తేబోతున్నాం. దీని ధర సుమారు రూ. 50–60 లక్షలు.

ఈవీల అమ్మకాలు..

అయిదేళ్ల క్రితం దేశీయంగా మేము ఈవీలను ప్రవేశపెట్టినప్పుడు, ఎందుకు అనే ప్రశ్న వచ్చింది. ఇప్పుడది కొత్తగా ఏ మోడల్ తెస్తున్నారనే ప్రశ్నగా మారింది. ప్రస్తుతం ఇక్కడ మా అమ్మకాల్లో ఈవీల వాటా 8%కి చేరింది. రోడ్ ట్యాక్స్ లేని చోట్ల అమ్మకాలు ఎక్కువ. కస్టమర్లు, తయారీ కంపెనీలు, ప్రభుత్వాల ఆసక్తిని బట్టి ఈవీల వినియోగం గణనీయంగా పెరుగుతుంది.

వ్యాపార వృద్ధి.. ధరల పెంపు..

జీఎస్‌టీ తగ్గింపుతో ఈ పండుగ సీజన్‌లో గణనీయంగా వాహనాలు విక్రయించినప్పటికీ, భౌగోళిక రాజకీయాంశాలు, ధరలపరమైన ఒత్తిళ్లు తదితర కారణాల రీత్యా ఈసారి విక్రయాల వృద్ధి గతేడాది స్థాయికే పరిమితం కావచ్చని అంచనా వేస్తున్నాం. ఇక యూరో మారకం విలువ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో దేశీయంగా ఈ ఏడాది 2–3 సార్లు ధరలు పెంచాం. కానీ అది తక్కువే. వచ్చే ఏడాది జనవరిలో కొంత పెంచవచ్చు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి కూడా లగ్జరీ కార్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో వాటిని మరింత అందుబాటులోకి తెచ్చేలా మా టచ్‌పాయింట్లను పెంచుతున్నాం. ఈ ఏడాదిలోనే కొత్తగా 16 టచ్‌పాయింట్లను ప్రారంభించాం. ప్రస్తుతం 50 నగరాల్లో 140 పైచిలుకు టచ్ పాయింట్లు ఉన్నాయి. మరిన్ని ప్రారంభిస్తున్నాం.

సోషల్ మీడియా ద్వారా వ్యాపారావకాశాలు: డబ్ల్యూకామర్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యూట్యూబ్, ఫేస్‌బుక్‌లాంటి సోషల్ మీడియా ద్వారా వ్యాపారం చేసే అవకాశాలను కల్పిస్తున్నట్లు హైదరాబాదీ సంస్థ డబ్ల్యూకామర్స్ సహ–వ్యవస్థాపకుడు శ్రీధర్ శ్రీరామనేని తెలిపారు. ఈ విధానంలో పెట్టుబడి, సరుకుల నిల్వలాంటి బాదరబందీ ఉండదని.. చిరు వ్యాపారులు, విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగులు ఎవరైనా దీన్ని ప్రారంభించవచ్చని వివరించారు. ఇందుకోసం కంపెనీ తాము ఆఫర్ చేసే ఉత్పత్తులను విక్రయించేందుకు, విక్రేతల పేరుతో ఆన్‌లైన్ స్టోర్ ఏర్పాటు చేస్తుంది. దాని లింకులు/క్యూఆర్ కోడ్‌లను విక్రేతలు తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం లేదా తెలిసినవారికి షేర్ చేయాలి. వాటి ఆధారంగా జరిగే ఆయా ఉత్పత్తుల అమ్మకాలపై విక్రేతకు 20–40 శాతం లాభం ఉంటుంది. డెలివరీ బాధ్యతలను కంపెనీ తీసుకుంటుంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 22,000కు పైగా యాక్టివ్ ఆన్‌లైన్ స్టోర్స్ ఉన్నాయని, హెల్త్, వెల్‌నెస్ తదితర విభాగాల్లో 40కి పైగా బ్రాండ్స్, 600 పైచిలుకు ఉత్పత్తులు ఉన్నాయని శ్రీధర్ చెప్పారు.

అమెరికాతో భారత్ ఎల్‌పీజీ డీల్

- ఏడాది కాలానికి ఒప్పందం
- 2.2 మిలియన్ టన్నులకు సై
- తొలిసారి యూఎస్ నుంచి కొనుగోలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజాలు ఏడాదిపాటు యూఎస్ నుంచి వంట గ్యాస్(ఎల్‌పీజీ) కొనుగోలుకి ఒప్పందం కుదుర్చుకున్నాయి. డీల్‌లో భాగంగా 2026వరకూ 2.2 మిలియన్ టన్నుల ఎల్‌పీజీని దిగుమతి చేసుకోనున్నాయి. దీంతో యూఎస్ నుంచి భారత ప్రభుత్వం ఇంధన కొనుగోళ్లను పెంచుకోనుంది. తద్వారా యూఎస్‌తో వాణిజ్య మిగులును తగ్గించుకోనుంది. దేశీ వస్తువులపై యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ 50% టారిఫ్‌లను విధించిన నేపథ్యంలో తాజా డీల్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. దేశీ పీఎస్‌యూ చమురు దిగ్గజాలు ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్.. యూఎస్ గల్ఫ్ కోస్ట్ నుంచి ఎల్‌పీజీ దిగుమతికి ఏడాదిపాటు అమల్లో ఉండే కాంట్రాక్టుకు తెరతీసినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. భారత వార్షిక ఎల్‌పీజీ దిగుమతుల్లో ఇది 10% కాగా, దేశీ మార్కెట్లకు యూఎస్ ఎల్‌పీజీ సరఫరాపై తొలి కాంట్రాక్టుగా నిలవనుంది.

31 మిలియన్ టన్నులు

పెట్రోల్, డీజిల్, జెట్ ఇంధనం విషయంలో భారత్ స్వయం సమృద్ధిని సాధించినప్పటికీ.. దేశీయంగా వినియోగించే 31 మిలియన్ టన్నుల ఎల్‌పీజీలో 65 శాతంవరకూ దిగుమతి చేసుకుంటోంది. 2024లో దిగుమతి చేసుకున్న 20.4 మిలియన్ టన్నులలో 90 శాతంవరకూ యూఏఈ, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా నుంచి లభించింది. గత రెండు నెలలుగా యూఎస్‌తో భారత్ నిర్వహిస్తున్న ద్వైపాక్షిక వాణిజ్య చర్చలలో భాగంగా వంట గ్యాస్ దిగుమతులకు తెరతీసింది. మరోపక్క పెట్రోల్, డీజిల్ తదితరాలను ప్రాసెస్ చేసేందుకు వీలయ్యే ముడిచమురులో 8 శాతంవరకూ యూఎస్ నుంచి కొనుగోలు చేస్తోంది.

51 శాతం అధికం

ఈ ఏడాది(2025) తొలి అర్ధభాగంలో యూఎస్ నుంచి రోజుకి 2,71,000 బ్యారళ్ల(బీపీడీ) ముడిచమురును భారత్ దిగుమతి చేసుకుంది. 2024 తొలి ఆరు నెలల దిగుమతులతో పోలిస్తే ఇవి 51 శాతం అధికం.

చారిత్రాత్మకం

ప్రపంచంలోనే వేగవంత వృద్ధిలో ఉన్న, భారీ ఎల్‌పీజీ మార్కెట్ అయిన భారత్ తొలిసారి యూఎస్‌తో డీల్ కుదుర్చుకున్నట్లు చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇది చారిత్రాత్మకంకాగా.. తద్వారా దేశ ప్రజలకు అందుబాటు ధరలో ఎల్‌పీజీ సరఫరాలకు తెరతీసినట్లు చెప్పారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

అక్టోబర్‌లో ఎగుమతులు డీలా	ఐపీవోకి 3 కంపెనీలు రెడీ

26,000 పైకి నిఫ్టీ

- సెన్సెక్స్ 388 పాయింట్లు ప్లస్
- సూచీలకు ఆరోరోజూ లాభాలే

ముంబై: దేశీయ కార్పొరేట్ సెప్టెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మెప్పించడం, సంస్థాగత ఇన్వెస్టర్ల(డీఐఐలు) కొనుగోళ్లతో స్టాక్ మార్కెట్ వరుసగా ఆరో రోజూ లాభాలు ఆర్జించింది. అమెరికా సుంకాల పెంపుతో నెలకొన్న సమస్యలను పరిగణనలోకి తీసుకొని ఎగుమతిదారులకు ఊరట కల్పిస్తూ ఆర్‌బీఐ కొన్ని నిబంధనలకు సడలింపు ఇవ్వడం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 388 పాయింట్లు పెరిగి 84,951 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 103 పాయింట్లు బలపడి 26,000 స్థాయి పైన 26,013 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 425 పాయింట్లు బలపడి 84,988 వద్ద, నిఫ్టీ 114 పాయింట్లు ఎగసి 26,024 వద్ద గరిష్టాలు నమోదు చేశాయి.

➤ బ్యాంకు నిఫ్టీ ఇండెక్సు 1% పెరిగి 59,002 వద్ద జీవితకాల గరిష్టాన్ని తాకింది.

➤ స్టాక్ బ్రోకింగ్ 'గ్రో' రూ.లక్ష కోట్ల కంపెనీగా అవతరించింది. ఇంట్రాడేలో 20% ఎగసి రూ.178 వద్ద కొత్త గరిష్టాన్ని తాకింది. చివరికి 18% లాభంతో రూ.174 వద్ద ముగిసింది. ఈ క్రమంలో కంపెనీ మార్కెట్ విలువ రూ.1.07 లక్షల కోట్లుగా నమోదైంది. లిస్టింగ్ రోజు నుంచి నాలుగు ట్రేడింగ్ సెషన్లలో ఈ షేరు 14% ర్యాలీ చేసింది. ఇష్యూ ధర (రూ.100)తో పోలిస్తే 78% ర్యాలీ చేసింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 2,700 అప్రెంటిస్‌లు

బ్యాంక్ ఆఫ్ బరోడా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల్లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 2,700.

» **ఖాళీల వివరాలు:** తెలంగాణ–154, ఆంధ్రప్రదేశ్–38, తమిళనాడు–159, కర్ణాటక–440, కేరళ–52, ఒడిశా–29, పాండిచ్చేరి–06, ఛత్తీస్‌గఢ్–48, గోవా–10, మహారాష్ట్ర–297, మధ్యప్రదేశ్–56, పశ్చిమ బెంగాల్–104, బీహార్–47, ఉత్తరప్రదేశ్–307, ఉత్తరాఖండ్–22, రాజస్థాన్–215, జార్ఖండ్–15, పంజాబ్–96, మిజోరాం–05, మణిపూర్–05, చండీగఢ్–12, గుజరాత్–400, దాద్రానగర్ హవేలీ–05, ఢిల్లీ–119, జమ్మూ కశ్మీర్–05, హర్యానా–36, అస్సాం–21.

» **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

» **వయసు:** 20 నుంచి 28 ఏళ్లు ఉండాలి.

» **స్టైపెండ్:** నెలకు రూ.15,000.

» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.11.2025.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.12.2025

» **వెబ్‌సైట్:** https://bankofbaroda.bank.in

డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో 31 పోస్టులు

న్యూఢిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 31.

» **పోస్టుల వివరాలు:** బిజినెస్ అనలిస్ట్–03, టెక్నాలజీ హెడ్–01, సొల్యూషన్ ఆర్కిటెక్ట్–01, సీనియర్ ఫుల్ స్టాక్ డెవలపర్–04, ఫుల్ స్టాక్ డెవలపర్–02, ఫ్రంట్–ఎండ్ డెవలపర్–02, మొబైల్ డెవలపర్–ఆండ్రాయిడ్–ఐవోఎస్–01, డిజైనర్–01, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్–01, సీనియర్ డేటా అనలిస్ట్–01, సీనియర్ డేటాబేస్ ఇంజనీర్–01, డేటా సైంటిస్ట్–01, సీనియర్ సైబర్ సెక్యూరిటీ మేనేజర్–01, సీనియర్ క్లౌడ్ కమ్ డెవఆప్స్ ఇంజనీర్–02, లెవల్ 1 ఇంజనీర్/ఐటీ సపోర్ట్ ఇంజనీర్–02, హెడ్–01, డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్ట్–01, కంటెంట్ రైటర్–01, గ్రాఫిక్ డిజైనర్–02, హెడ్ సీబీ–ఆన్‌బోర్డింగ్–01, హెడ్ సీబీ–ఆన్‌బోర్డింగ్–01, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్–02.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ, పీజీ(ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్/ఐటీ, మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, మార్కెటింగ్, డెవలప్‌మెంట్ స్టడీస్, మాస్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్, జర్నలిజం, మార్కెటింగ్, పబ్లిక్ రిలేషన్స్, క్లౌడ్ సెక్యూరిటీ, అప్లికేషన్ సెక్యూరిటీ, ఇన్సిడెంట్ రెస్పాన్స్, డిజైన్, హ్యూమన్–కంప్యూటర్ ఇంటరాక్షన్, కంప్యూటర్ సైన్స్/ఐటీ)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితోపాటు ఉద్యోగానుభవం ఉండాలి.

» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 20.11.2025.

» **వెబ్‌సైట్:** https://dic.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడా క్యాపిటల్ మార్కెట్‌లో మేనేజర్ పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడా అనుబంధ సంస్థ అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా క్యాపిటల్ మార్కెట్ లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టు:** మేనేజర్–ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ (ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్/మెర్జర్స్ అండ్ అక్విజిషన్స్/ప్రైవేట్ ఈక్విటీ).

» **అర్హత:** ఎంబీఏ లేదా సీఏ/సీఎంఏ ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత పని అనుభవం ఉండాలి.

» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **పోస్టింగ్ ప్రదేశం:** ముంబై.

» **దరఖాస్తులకు చివరితేది:** 30.11.2025.

» **వెబ్‌సైట్:** https://www.bobcaps.in

ఎయిర్‌ఫోర్స్‌లో ఆఫీసర్

» ఏఎఫ్‌క్యాట్(1)–2026 నోటిఫికేషన్ విడుదల

» గ్రౌండ్ డ్యూటీ విభాగంలో 340 పోస్టులు

» ఏఎఫ్‌క్యాట్‌లో విజయంతో నియామకం

» ప్రారంభంలోనే పే లెవల్–10తో వేతన శ్రేణి

» ప్రారంభ వేతన శ్రేణి రూ.56,100–రూ.1,77,500

ఆర్మీ జాబ్స్

ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బీటెక్‌లో నిర్దేశిత బ్రాంచ్‌లో ఉత్తీర్ణులకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ స్వాగతం పలుకుతోంది. ఆఫీసర్ హోదాలో అడుగు పెట్టే అవకాశం కల్పిస్తోంది. ప్రారంభంలోనే పే లెవల్–10తో వేతనం అందుకోవచ్చు. వీటన్నింటికీ మార్గం.. ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఏఎఫ్‌క్యాట్)! ఇది గ్రౌండ్ డ్యూటీ, ఫ్లయింగ్ బ్రాంచ్‌లలో.. ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి ఎయిర్‌ఫోర్స్ నిర్వహించే పరీక్ష. తాజాగా 2026కు సంబంధించి ఏఎఫ్‌క్యాట్ (1)/2026కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఏఎఫ్‌క్యాట్ వివరాలు, ఎంపిక విధానం, పోస్టులు, పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు...

ఎయిర్‌ఫోర్స్‌లోని పలు విభాగాల్లో(గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్, నాన్–టెక్నికల్, ఫ్లయింగ్ బ్రాంచ్) పోస్టుల భర్తీకి ఎయిర్‌ఫోర్స్ సొంతంగా నియామక ప్రక్రియ చేపడుతుంది. ఇందుకోసం తొలుత నిర్వహించే రాత పరీక్షనే ఏఎఫ్‌క్యాట్ అంటారు. ఎయిర్‌ఫోర్స్‌లో ఖాళీలను ఎన్‌డీఏ, సీడీఎస్‌ల ద్వారా భర్తీ చేస్తారు. వీటికి అదనంగా ఏఎఫ్‌క్యాట్ విధానంలోనూ పోస్టుల భర్తీకి ఎయిర్‌ఫోర్స్ చర్యలు తీసుకుంటోంది. దీంతో ఎన్‌డీఏ, సీడీఎస్ అవకాశాలను అందిపుచ్చుకోలేని వారికి ఇది చక్కటి అవకాశంగా నిలుస్తోంది.

ఏటా రెండుసార్లు

ఏఎఫ్‌క్యాట్ ద్వారా పోస్టుల భర్తీకి ఏటా రెండు సార్లు పరీక్ష నిర్వహిస్తారు. 2026 నోటిఫికేషన్‌కు సంబంధించి ఎంపిక ప్రక్రియలో విజయం సాధించినవారికి 2027 జూలై నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి.

మొత్తం 340 పోస్టులు

ఏఎఫ్‌క్యాట్(1)–2026 ద్వారా మొత్తం 340 పోస్టులను భర్తీ చేయనున్నారు.

ఇందులో–ఫ్లయింగ్ బ్రాంచ్ (షార్ట్ సర్వీస్ కమిషన్)లో పురుషులు 34; మహిళలకు–4 పోస్టులు, –గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్‌లో ఏరోనాటికల్ ఇంజనీర్ (ఎలక్ట్రానిక్స్–ఏఈ(ఎల్))–పురుషులు పర్మనెంట్ కమిషన్‌తో 3, షార్ట్ సర్వీస్ కమిషన్‌తో 100; మహిళలకు పర్మనెంట్ కమిషన్‌తో 3; షార్ట్ సర్వీస్ కమిషన్‌తో 23 ఏరోనాటికల్ ఇంజనీరింగ్ (మెకానికల్–ఏఈ(ఎం))–పురుషులు 9 (పీసీ), 38 (ఎస్ఎస్‌సీ); మహిళలు–3(పీసీ); 9(ఎస్ఎస్‌సీ) పోస్టులు భర్తీ చేస్తారు.

అలాగే గ్రౌండ్ డ్యూటీ నాన్–టెక్నికల్ వెపన్ సిస్టమ్స్–పురుషులు–21,మహిళలు–5 పోస్టులు, అడ్మినిస్ట్రేషన్–పురుషులు–48,మహిళలు–12పోస్టులు, లాజిస్టిక్స్– పురుషులు–9, మహిళలు–2 పోస్టులు, అకౌంట్స్ –పురుషులు–8, మహిళలు–2 పోస్టులు, ఎడ్యుకేషన్–పురుషులు–2,మహిళలు–2 పోస్టులు, మెటీయరాలజీ– పురుషులు–1, మహిళలు–2 పోస్టులు ఉన్నాయి. గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్ బ్రాంచ్‌లలో అన్ని పోస్టులను షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ప్రాతిపదికన భర్తీ చేస్తారు.

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ

ఏఎఫ్‌క్యాట్‌లో భాగంగానే ఫ్లయింగ్ బ్రాంచ్‌లో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్‌లో పేర్కొన్న ఖాళీలు, అదే విధంగా ఏఎఫ్‌క్యాట్‌లో పేర్కొన్న సీట్లకు పది శాతం చొప్పున ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్‌కు కేటాయిస్తారు. ఈ విధానంలో దరఖాస్తు చేసుకోవాలంటే.. ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ విభాగంలో 'సి' సర్టిఫికెట్ పొంది ఉండాలి.

అర్హతలు

పోస్టును అనుసరించి ఇంటర్మీడియెట్, నిర్దేశిత బ్రాంచ్‌లలో బీటెక్, బీఎస్సీ, బీబీఏ/ బీబీఎం/సీఏ ఫ్/పీజీ ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

- **ఫ్లయింగ్ బ్రాంచ్:** జనవరి 1, 2027 నాటికి 20–24 ఏళ్లు (జనవరి 2, 2003 – జనవరి 1, 2007 మధ్యలో జన్మించి ఉండాలి). ఫ్లయింగ్ బ్రాంచ్‌కు సంబంధించి కమర్షియల్ పైలట్ లైసెన్స్ కలిగి ఉన్న వారికి గరిష్ట వయో పరిమితిలో రెండేళ్ల మినహాయింపు ఉంటుంది. ఈ అభ్యర్థులు జనవరి 2, 2001 – జనవరి 1, 2007 మధ్యలో జన్మించి ఉండాలి.
- **గ్రౌండ్ డ్యూటీ:** జనవరి 1, 2007 నాటికి 20–26 ఏళ్లు ఉండాలి. అన్ని విభాగాలకు అవివాహితులు మాత్రమే అర్హులు.

ఏఎఫ్‌క్యాట్‌తోపాటు.. ఏఎఫ్ఎస్‌బీ

ఎయిర్ ఫోర్స్‌లో పలు విభాగాల్లో పోస్టుల భర్తీకి చేపట్టే ఎంపిక ప్రక్రియలో ముందుగా ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇందులో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారికి మలి దశలో ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్ బోర్డ్ పరిధిలో తుది దశ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

300 మార్కులకు ఏఎఫ్‌క్యాట్

ఎంపిక ప్రక్రియలో తొలి దశగా నిర్వహించే ఏఎఫ్‌క్యాట్ మొత్తం నాలుగు విభాగాల్లో (జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ వెర్బల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్, మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్) 100 ప్రశ్నలు–300 మార్కులకు ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు కేటాయిస్తారు. అదే విధంగా తప్పు సమాధానాలకు ఒక మార్క్ నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్షకు నిర్దేశించిన సమయం రెండు గంటలు.

ఏఎఫ్ఎస్‌బీ టెస్టింగ్ ఇలా

- ఎంపిక ప్రక్రియలో తొలి దశ ఏఎఫ్‌క్యాట్‌లో విజయం సాధించిన వారికి రెండో దశలో ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డ్‌ల ఆధ్వర్యంలో ఏఎఫ్ఎస్‌బీ టెస్టింగ్ నిర్వహిస్తారు. ఈ ఎంపిక ప్రక్రియ మొత్తం మూడంచెల్లో ఉంటుంది.
- **తొలి దశ స్టేజ్–1:** ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్.
- **రెండో దశ స్టేజ్–2:** సైకాలజికల్ టెస్ట్. ఇందులో భాగంగా అయిదు రోజులు పాటు పలు అంశాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. అదే విధంగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది.
- ఫ్లయింగ్ బ్రాంచ్ అభ్యర్థులకు ప్రత్యేకంగా కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్ (సీపీఎస్ఎస్) విధానంలో ఇంకో పరీక్ష కూడా నిర్వహిస్తారు. ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ 'సి' సర్టిఫికెట్ ద్వారా ఎన్‌సీసీ ఎంట్రీకి దరఖాస్తు చేసుకున్న వారికి ఏఎఫ్‌క్యాట్ నుంచి మినహాయింపు ఉంటుంది.

శిక్షణ

రెండు దశల్లోనూ విజయం సాధించి తుది విజేతల జాబితాలో నిలిచిన వారిని శిక్షణకు ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి.. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో పదేళ్ల పాటు విధులు నిర్వర్తించే అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత ఆసక్తి, ప్రతిభను అనుసరించి మరో నాలుగేళ్లపాటు పొడిగించుకునే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా.. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో మొత్తం 14 ఏళ్లు పూర్తి చేసుకున్న తర్వాత పర్మనెంట్ కమిషన్ హోదా పొందే అవకాశాన్ని కూడా ఎయిర్‌ఫోర్స్ కల్పిస్తోంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2025, నవంబర్ 17 – డిసెంబర్ 14
- **ఏఎఫ్‌క్యాట్ తేదీలు:** 2026 జనవరి 31
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, హైదరాబాద్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://afcat.cdac.in

విజయానికి మార్గమిదే

ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ కొలువులకు అవకాశం కల్పించే ఏఎఫ్‌క్యాట్‌లో విజయానికి దృష్టి పెట్టాల్సిన అంశాలు..

ఇంగ్లిష్

ఈ విభాగంలో రాణించడానికి కాంప్రెహెన్షన్, ఇంగ్లిష్ గ్రామర్, సెంటెన్స్ కంప్లీషన్, సెంటెన్స్ ఫార్మేషన్, స్పాటింగ్ ద ఎర్రర్, యాంటానిమ్స్, సినానిమ్స్, క్లోజ్ టెస్ట్, ఇడియమ్స్, ఫ్రేజెస్, అనాలజీ, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్

చరిత్ర, జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీలతోపాటు జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యం సంతరించుకున్న అంశాలు, సంఘటనలు, సైన్స్ అండ్ టెక్నాలజీ తాజా పరిణామాలు, రక్షణ రంగంలోని పరిణామాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

టైమ్ అండ్ వర్క్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్, సింపుల్, కాంపౌండ్ ఇంట్రస్ట్, టైమ్ అండ్ డిస్టెన్స్,నంబర్ సిరీస్, పెరిమీటర్, ఏరియా, ప్రాబబిలిటీ అంశాలపై పట్టు సాధించాలి.

రీజనింగ్ అండ్ మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్

ఇందులో రాణించడానికి వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ అంశాలతోపాటు.. సీటింగ్ అరేంజ్‌మెంట్, రొటేటెడ్ బ్లాక్స్, హిడెన్ ఫిగర్స్, అనాలజీపై అవగాహన పొందాలి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం – పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం – బయాలజీ » పోటీ పరీక్షల ప్రత్యేకం – తెలంగాణ చరిత్ర

క్లుప్తంగా...

ఓఎల్‌ఎక్స్‌లో తహశీల్దార్ కార్యాలయం !

గిద్దలూరు తహశీల్దార్ కార్యాలయాన్ని అమ్మకానికి పెట్టిన ఆకతాయి

ఓఎల్‌ఎక్స్‌లో తహశీల్దార్ కార్యాలయం భవనం పోస్టు

గిద్దలూరు రూరల్: ప్రకాశం జిల్లా గిద్దలూరు తహశీల్దార్ కార్యాలయం అమ్మకానికి సిద్ధంగా ఉందంటూ ఓ గుర్తు తెలియని వ్యక్తి ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి పెట్టినట్లు సోషల్ మీడియాలో ఓ వీడియో హల్‌చల్ చేస్తోంది. ఓఎల్‌ఎక్స్‌లో తహశీల్దార్ కార్యాలయం ఫొటో పెట్టి రూ.20 వేలకు అమ్మకానికి సిద్ధంగా ఉందని పోస్టు చేశాడు. దీంతో ఆ వార్త సోషల్ మీడియా వాట్సాప్ గ్రూపుల్లో పెద్ద దుమారం రేపింది. ఈ విషయమై స్థానిక తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డిని వివరణ కోరగా ఆ పోస్టుపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మురుగప్ప గ్రూప్ మాజీ చైర్మన్ వెల్లయన్ కన్నుమూత

వెల్లయన్ (ఫైల్)

సాక్షి, చెన్నై: మురుగప్ప గ్రూప్ మాజీ చైర్మన్ అరుణాచలం వెల్లయన్ (72) సోమవారం చెన్నైలో కన్నుమూశారు. ఈ గ్రూప్ పరిధిలోని వివిధ కంపెనీల బోర్డులలో పనిచేయడమే కాకుండా కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఈఐడీ ప్యారీ లిమిటెడ్‌లలో చైర్మన్‌గా కూడా వ్యవహరించిన ఆయన దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధ పడుతూ సోమవారం చెన్నైలో కన్నుమూశారు. ఆయనకు భార్య లలిత వెల్లయన్, కుమారులు అరుణ్ వెల్లయన్, నారాయణన్ వెల్లయన్ ఉన్నారు. మురుగప్ప కుటుంబంలో ఒక విశిష్ట వ్యాపార నాయకుడిగా, విలువైన సభ్యుడిగా వెల్లయన్ అనేక దశాబ్దాలుగా తనను అంకితం చేసుకున్నారు. వైవిధ్యభరితమైన వ్యాపారాలలో వ్యూహాత్మక దిశానిర్దేశం చేశారని మురుగప్ప గ్రూప్ విడుదల చేసిన అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. వెల్లయన్ కనోరియా కెమికల్స్– ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఎక్సిమ్ బ్యాంక్ అండ్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వంటి కంపెనీల బోర్డులలో కూడా పనిచేశారు. సదరన్ ఇండియా చాంబర్ ఆఫ్ కామర్స్, ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ షుగర్ మిల్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా సైకిల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ వంటి వివిధ పరిశ్రమ, వాణిజ్య సంస్థలలో నాయకత్వ పదవులను నిర్వహించారు. ఆయన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, కోలీకోడ్ (ఐఐఎం – కోలీకోడ్) గవర్నర్ల బోర్డుకు చైర్మన్‌గా కూడా చేశారు. వెల్లయన్ తమిళనాడు వ్యవసాయ వర్సిటీ, ఆస్టన్ వర్సిటీల నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు.

ఎంబీబీఎస్ యాజమాన్య కోటా వెబ్‌ఆప్షన్‌ల నమోదుకు అవకాశం

సాక్షి, అమరావతి: 2025–26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ యాజమాన్య కోటా స్ట్రే వెకెన్సీ రౌండ్ కౌన్సెలింగ్‌కు వెబ్‌ఆప్షన్‌ల నమోదుకు హెల్త్ వర్సిటీ అవకాశం కల్పించింది. సోమవారం మధ్యాహ్నం 3.30 నుంచి ఆప్షన్‌ల నమోదు ప్రక్రియను ప్రారంభించింది. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల వరకూ గడువు విధించింది. మూడు సీట్లు కేటగిరి బీ1లో, 91 సీట్లు ఎన్‌ఆర్‌ఐ కోటా కింద అందుబాటులో ఉన్నట్లు పేర్కొంది.

ఆ నిందితులను విచారణకు దూరంగా ఉంచండి

గ్రూప్–1 మూల్యాంకనం కేసులో ఏపీపీఎస్సీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: గ్రూప్–1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం కేసులో నిందితులుగా ఉన్న అధికారులను తాము జరుపుతున్న విచారణ ప్రక్రియ నుంచి దూరంగా ఉంచాలని హైకోర్టు సోమవారం ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)ను ఆదేశించింది. అభ్యర్థుల తరపు సీనియర్ న్యాయవాది పి.శ్రీరఘురాం చేసిన వాదనలకు సానుకూలంగా స్పందించిన న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. ఈ మొత్తం వ్యవహారంలో ఏపీపీఎస్సీ అధికారులు వాస్తవాలను దాచిపెడుతున్నారని, ఏ మాత్రం పారదర్శకంగా వ్యవహరించడం లేదని హైకోర్టు ఆక్షేపించింది. తమ ఆదేశాల మేరకు జవాబు పత్రాలను తమ ముందుంచిన అధికారులు, ఓఎంఆర్ షీట్‌లో అభ్యర్థుల వివరాలుండే భాగాన్ని ఇవ్వలేదని పేర్కొంది. తదుపరి విచారణ నాటికి అభ్యర్థుల వివరాలుండే భాగాలను కూడా తమ ముందుంచాలని సర్వీస్ కమిషన్‌ను ఆదేశించింది. జవాబు పత్రాలకు జత చేసిన ఓఎంఆర్ షీట్‌ల బార్‌కోడ్‌లోని వివరాలు, మాన్యువల్ మూల్యాంకనం కోసం రెండోసారి ముద్రించిన బార్‌కోడ్‌లోని వివరాలతో సరిపోలుతుందా? అలా సరిపోలేటట్లు బార్ కోడ్‌లు ముద్రించడం సాధ్యమేనా? అన్న సందేహాల నివృత్తికి నిపుణుల పేర్లను సూచించాలని కూడా ఏపీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది.

ఆకాశ గంగను ఒడిసిపట్టిన భగీరథి

దేశంలోనే రెండో నీటి సంరక్షణ పంచాయతీగా మురుగమ్మి

నేడు రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకోనున్న సర్పంచ్ సుబ్బరత్నమ్మ

మాజీ సీఎం వైఎస్ జగన్ సహకారంతోనే సాకారమైందన్న సర్పంచ్

అర్ధచంద్రాకారంలో తీసిన నీటికుంట

వీసీ పల్లి: నిత్యం కరువు కాటకాలతో అల్లాడే ప్రాంతం. అరకొరగా అందే భూగర్భ జలాలూ ఫ్లోరైడ్‌తో నిండిపోయి తాగేందుకు పనికిరాని దుస్థితి. గుక్కెడు నీటి కోసం మైళ్ల దూరం వెళ్లాల్సిందే. ఇలాంటి దుర్భర పరిస్థితులు ఎదుర్కొన్న ప్రకాశం జిల్లా పీసీ పల్లి మండలం మురుగమ్మి గ్రామం వైఎస్ జగన్ ప్రభుత్వ సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులతో వర్షపు నీటిని ఒడిసిపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశంలోనే 2వ ఉత్తమ నీటి సంరక్షణ పంచాయతీగా ఎంపికైంది. సర్పంచ్ సుబ్బరత్నమ్మ మంగళవారం ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

వైఎస్ జగన్ సహకారంతో కల సాకారం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2021–24 మధ్య మురుగమ్మి పంచాయతీ సర్పంచ్ సుబ్బరత్నమ్మ అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, ఆయన సహకారంతో గ్రామంలో 47కుపైగా వాటర్‌షెడ్ పథకాలను చేపట్టారు. పంచాయతీలో సుమారు రూ.కోటికి పైగా నిధులు వెచ్చించి నీటికుంటలు, ఊట కుంటలు, చెక్ డ్యాంలు నిర్మించారు. కొండ చుట్టూ కందకాలు తీయించారు. కొండ మీద పడిన వర్షపు నీరు ఎక్కడికి అక్కడ ఆగి భూమిలోకి ఇంకేటట్లు రెండు కందకాలు రూ.2 లక్షలతో తవ్వించారు. వర్షం నీరు ఎటువైపు వాలు ఉంటే అటు ప్రవహిస్తూ ఒకచోట ఇంకేటట్టు రూ.27 లక్షలు వెచ్చించి 16 చిన్న ఊట కుంటలు తీశారు. 21 డక్ అవుట్ పాండ్‌లు ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.35 లక్షలు ఖర్చు చేశారు. 'అమృత సరోవర్' పేరిట నీరు ఎక్కువగా ప్రవహించే ఏటవాలు ప్రాంతంలో కుంటతీసి చుట్టూ పెద్ద కందకం ఏర్పాటు చేశారు. ఈ చర్యల వల్ల వర్షాకాలంలో వాటర్ షెడ్ పథకాల్లో గణనీయంగా నీరు చేరింది. దీంతో చుట్టుపక్కల ఉన్న పంట పొలాల బోర్లలో భూగర్భ నీటిశాతం గణనీయంగా పెరిగింది. దీంతో రైతులు వరి, శనగ, పొగాకు వంటి పంటలు సాగు చేశారు. అంతేకాకుండా కొత్త నీరు చేరడంతో నీటిలో గతంలో అధికంగా ఉండే ఫ్లోరైడ్ శాతం తగ్గుముఖం పట్టింది.

వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు కొండ చుట్టూ తీసిన కందకాలు

నా కష్టం.. జగనన్న ఆశయం ఫలించాయి

2021–24 మధ్య కాలంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులు సంతోషంగా ఉండాలని, పల్లెలు పంటలతో కళకళలాడాలని కోరుకునేవారు. ఆయన ఆశయానికి అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చిన నిధులను దుర్వినియోగం కాకుండా పంచాయతీల్లో వాటర్ షెడ్ పథకాలు పెద్ద ఎత్తున నిర్మించాను. నా కష్టం.. జగనన్న ఆశయం నెరవేరి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లోని బోర్లలో నీటిమట్టం గణనీయంగా పెరిగింది. నా కష్టాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం అవార్డు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది.

– సుబ్బరత్నమ్మ, సర్పంచ్, అవార్డు గ్రహీత, మురుగమ్మి

రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

ప్రయాణించలేకపోతున్నాం.. రోడ్డు వేయండి

శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నం నుంచి చంగుడి, సరాలి మీదుగా మాకనాపల్లి గ్రామం వరకు బీటీ రోడ్డు పనులు నిర్మిస్తామని చెప్పి రోడ్డు తవ్వేసి వదిలేశారని చంగుడి గ్రామస్తులు సోమవారం రోడ్డుపై వాహనాలు అడ్డంగా పెట్టి రెండు గంటలపాటు బైఠాయించారు.ఈ రహదారి పనులకు ఏప్రిల్ 15న స్థానిక టీడీపీ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపన చేసి వదిలేశారని చెప్పారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేకు రహదారి పనులు చేయాలని విన్నవించగా.. వారంలోగా పనులు ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

రహదారిపై అడ్డంగా పెట్టిన వాహనాలు

– పాతపట్నం

ప్రత్యక్షంగా పైరసీ.. పరోక్షంగా బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్

రెండు రకాలుగా దందా చేసిన 'ఐ బొమ్మ'రవి

సాక్షి, హైదరాబాద్: 'ఓ వెబ్‌సైట్‌లో పైరసీ సినిమా చూస్తే ఏమవుతుంది ? తక్కువ రేటుకే అది అందుబాటులో ఉంది కదా..! అని అనేక మంది భావిస్తున్నారు. ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టు తర్వాత ఇదే అంశాన్ని పలువురు లేవనెత్తారు. ఈ వ్యవహారంలో పైకి పైరసీ కనిపిస్తున్నా, అంతర్గతంగా బెట్టింగ్ దందా, డేటా చోరీ ఉన్నాయి'అని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విశ్వనాథ్ చన్నప్ప సజ్జనార్ పేర్కొన్నారు. 'ఐ బొమ్మ'కేసులకు సంబంధించి ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడించారు. ఆ వివరాలు సజ్జనార్ మాటల్లోనే...

2019లో తొలి వెబ్‌సైట్ ఏర్పాటు

విశాఖపట్నానికి చెందిన ఇమ్మడి రవి ఎంబీఏ పూర్తి చేశాడు. హైదరాబాద్‌కు వలసవచ్చి తొలినాళ్లల్లో వెబ్ సర్వీస్‌లు అందించే ఈఆర్ ఇన్ఫోటెక్ సంస్థను ఏర్పాటు చేశాడు. ఆపై పైరసీ దందాలోకి దిగి.. 2019లో ఐ బొమ్మ, 2022లో బప్పం టీవీ పేర్లతో వెబ్‌సైట్లు ఏర్పాటు చేశాడు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే మరోటి తెరుస్తూ మొత్తం 65 మిర్రర్ సైట్లు రూపొందించాడు. వీటి హోస్ట్ సర్వర్లను స్విట్జర్లాండ్‌లో పెట్టాడు. కరేబియన్ దీవులతోపాటు నెదర్లాండ్స్, ఫ్రాన్స్, దుబాయ్‌ల్లోనూ సంచరిస్తూ ఆయా దేశాల్లో ఖరీదు చేసిన 110 డొమైన్స్ ద్వారా ఈ వెబ్‌సైట్లు హోస్ట్ చేశాడు. ఇతడి నుంచి స్వాధీనం చేసుకున్న హార్డ్‌డిస్క్‌ల్లో 21 వేల చిత్రాలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వీటిలో 1972 నాటి గాడ్‌ఫాదర్ నుంచి తాజా సినిమా ఓజీ వరకు ఉన్నాయి. రవి రెండేళ్ల క్రితం భారత పౌరసత్వం వదిలేసి కరేబియన్ దీవుల్లో ఒకటైన సెయింట్ కిట్స్ అండ్ నెవీస్ దేశ పౌరసత్వం పొందాడు. ఆంధ్రప్రదేశ్‌లో తీసుకున్న డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నా, ఇతడు మహారాష్ట్రకు చెందిన ప్రహ్లాద్ కుమార్ వెల్లెల పేరుతో మరో డ్రైవింగ్ లైసెన్స్ పొందాడు.

బాధితుల్లో చిత్ర పరిశ్రమతో పాటు సామాన్యులూ...

ఇమ్మడి రవి నిర్వహిస్తున్న పైరసీ వెబ్‌సైట్ల ద్వారా సినీ పరిశ్రమతోపాటు సామాన్యులూ నష్టపోయారు. ఈ వెబ్‌సైట్ల ద్వారా యాడ్స్ ప్రమోట్ చేయడానికి అనేక బెట్టింగ్, గేమింగ్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నాడు. ప్రధానంగా వన్ విన్, వన్ ఎక్స్ బెట్ సంస్థలు ఉన్నాయి. పైరసీ వెబ్‌సైట్‌లో సినిమా చూడటానికి క్లిక్ చేస్తే అది బెట్టింగ్ సైట్/యాప్‌కు రీడైరెక్ట్ చేస్తుంది. ఇలా అనేకమంది వాటికి బానిసలుగా మారి సర్వం కోల్పోయారు. ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్యలు చేసుకోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇతడికి సంబంధించిన ఒక బ్యాంకు ఖాతా విశ్లేషణ ద్వారా రూ.20 కోట్లు ఆర్జించినట్టు తెలుస్తోంది. ఇలాంటి 32 బ్యాంకు ఖాతాలను విశ్లేషించాల్సి ఉంది. ఇమ్మడి రవిపై సిటీ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఐదు కేసులు ఉన్నాయి. ఇతడి ఇద్దరు అనుచరులు శివాజీ, ప్రశాంత్‌లను గతంలో అరెస్టు చేశారు. ఇతడు తన వెబ్‌సైట్ వీక్షకుల ఫోన్లు, కంప్యూటర్లలోని ఏపీకే ఫైల్స్ పంపి డేటాను తస్కరించాడు. ఇలా దాదాపు 50 లక్షల మంది డేటా హార్డ్‌డిస్క్‌ల్లో భద్రపరిచాడు.

రవి వ్యవహారాలపై సీబీఐ, ఈడీలకు సమాచారం

స్క్రీన్ రికార్డింగ్‌తోపాటు సీక్రెట్ కెమెరాలతో రికార్డింగ్ ద్వారా రవి పైరసీ చేస్తున్నాడు. కొన్ని టెలిగ్రాం గ్రూపుల నుంచి కొన్ని చిత్రాలను ఖరీదు చేశాడు. ఇతడికి లండన్ సహా విదేశాల్లో కొందరు అనుచరులు ఉన్నట్టు తెలుస్తోంది. పైరసీ దందాతోపాటు బెట్టింగ్ యాడ్స్ ద్వారా వచ్చిన మొత్తంతో మనీ లాండరింగ్‌కు పాల్పడినట్టు అనుమానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఇతడి అంశాన్ని సీబీఐ, ఈడీల దృష్టికి తీసుకువెళ్లనున్నారు. రెండు నెలల క్రితం కొందరు అరెస్టు అయినప్పుడు నన్ను పట్టుకోండి అంటూ తోపులా సవాల్ చేశాడు. ఇప్పుడు జైలులో ఉన్నాడు. రవి అరెస్టు తర్వాత పోలీసులకు వ్యతిరేకంగా అనేకమంది మీమ్స్ చేశారు. వీరి పైనా చర్యలకు రంగం సిద్ధం చేశాం. సైబర్ నేరాలతోపాటు సినీ పైరసీపై సమాచారం ఉంటే తక్షణం 1930కు కాల్ చేసి తెలియజేయాలి.

ఆ బెలూన్లను ముట్టుకోవద్దు

- గుర్తించిన వెంటనే అధికారులకు సమాచారమివ్వండి
- పరిశోధనల కోసం ఇస్రో, టాటా సంస్థ బెలూన్స్ విడుదల

సాక్షి, అమరావతి: వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేయడానికి టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్‌ఆర్), అణు శక్తి శాఖ, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సంయుక్తంగా శాస్త్రీయ బెలూన్ ప్రయోగాలు నిర్వహించనుంది. పారాచూట్ మాదిరి బెలూన్లను గాలిలోకి వదిలి వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేస్తారు. హైదరాబాద్ ఈసీఐఎల్ నుంచి గాలిలోకి వదిలే బెలూన్లు గాలి దిశను బట్టి హైదరాబాద్‌కు 200 నుంచి 350 కి.మీ దూరంలో పడే అవకాశం ఉందని, కాబట్టి ఈ బెలూన్లను గుర్తించిన వారు వాటిని ముట్టుకోకుండా సమీపంలోని పోలీస్ స్టేషన్, పోస్టాఫీస్ లేదా జిల్లా అధికారులకు సమాచారం అందించాల్సిందిగా టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సైంటిస్టు డాక్టర్ టి.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని ముట్టుకోకుండా సమాచారం ఇచ్చిన వారికి ప్రభుత్వం పారితోషకం అందజేస్తుందని, ముట్టుకొని తెరిచి చూసిన వారికి ఎటువంటి బహుమతి ఉండదన్నారు. పాలిథిన్ పదార్థంతో తయారైన శాస్త్రీయ బెలూన్ ప్రయోగాలు పూర్తైన అనంతరం పరికరాలు బెలూన్ నుంచి విడిపోయి రంగుల పారాచూట్లతో నెమ్మదిగా భూమి పైకి వస్తాయని తెలిపారు. ఈ పరికరాలు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, శ్రీకాకుళం, విజయనగరం, వైఎస్సార్ కడప, విశాఖపట్నం జిల్లాల్లో పడవచ్చునన్నారు. ఆ పారాచూట్లలో ఉన్న శాస్త్రీయ పరికరాలు సున్నితమైనవని, తాకొద్దని టి.వెంకటేశ్వరరావు ఆ ప్రకటనలో వివరించారు.

ఆనంద్ మొదలెట్టారు.. సజ్జనార్ కొనసాగించారు!

- ఫలితంగానే సవాల్ విసిరిన వ్యక్తి జైల్లోకి: హీరో చిరంజీవి
- నా ఇంట్లోనూ ఒకరు డిజిటల్ అరెస్టయ్యారు: నటుడు నాగార్జున
- రవి అరెస్టు సినిమాల్లో సూపర్ హిట్ సీన్‌లా ఉంది: రాజమౌళి

సీపీ సజ్జనార్‌తో సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున, రాజమౌళి, దిల్‌రాజు

సాక్షి, హైదరాబాద్: 'ఐబొమ్మ' వెబ్‌సైట్లతో వ్యవస్థీకృతంగా పైరసీకి పాల్పడి, సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కిన ఇమ్మడి రవి వ్యవహారాలకు సంబంధించి హైదరాబాద్ సీపీ సజ్జనార్ సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో జరిగిన ఈ సమావేశంలో సినీరంగానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. పైరసీ కింగ్‌పిన్‌ను అరెస్టు చేసినందుకు హైదరాబాద్ పోలీసులను అభినందించారు. జెద్దాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన హైదరాబాదీలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

అధికారి మారినా ప్రయత్నం కొనసాగింది

సినీ రంగాన్ని పైరసీ చాలా ఏళ్లుగా పట్టి పీడిస్తోంది. ఈ పైరసీని ఎలా అడ్డుకోవాలా? అని సినీ రంగం తర్జనభర్జన పడుతున్నప్పుడు నగర పోలీసు కమిషనర్‌గా సీవీ ఆనంద్ తొలి అడుగు వేసి కీలక వ్యక్తుల్ని అరెస్టు చేశారు. ఆయన బదిలీ అయినా ప్రయత్నాన్ని కొనసాగిస్తూ సజ్జనార్ ఛాలెంజ్ చేసిన వ్యక్తిని పట్టుకున్నారు.

– చిరంజీవి

మా ఇంట్లోనూ ఒకరు డిజిటల్ అరెస్టు అయ్యారు

ఐబొమ్మ రవిని అరెస్టు చేయడం దేశ సినీ రంగానికి మేలు చేసినట్లు. ఈ విషయం బయటకు వచ్చిన వెంటనే చెన్నై నుంచి నా స్నేహితుడు ఫోన్ చేసి అభినందించాడు. ఆరేడు నెలల క్రితం మా ఇంట్లోనూ ఓ సైబర్ నేరం జరిగింది. కుటుంబ సభ్యులు ఒకరు రెండు రోజులపాటు డిజిటల్ అరెస్టు అయ్యారు.

– నాగార్జున

ఛాలెంజ్ విసిరిన రెండు నెలల్లో జైలుకు..

ఇది ఓ సినిమాలో సూపర్ హిట్ సీన్‌లా ఉంది. ఛాలెంజ్ చేసిన వ్యక్తిని రెండు నెలల్లో జైలుకు పంపారు. ఏదీ ఉచితంగా రాదని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. పైరసీ చేసిన సినిమాలను వెబ్‌సైట్‌లో ఉంచడం వాళ్లు చేస్తున్న సేవ కాదు. వాటిని చూడటానికి ఆశపడి మనం పర్సనల్ డేటా వారికి ఇస్తున్నాం. దీన్ని వాళ్లు సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్నారు.

– రాజమౌళి

కేంద్రమూ సీరియస్‌గానే ఉంది..

సినీ పైరసీపై తెలంగాణ ప్రభుత్వం, పోలీసులతో పాటు కేంద్రం సీరియస్‌గా ఉంది. ప్రత్యేక చట్టాలను తీసుకురావడం ద్వారా దీన్ని నిర్మూలించాలని భావిస్తోంది. మీ ఇంట్లో ఒక బంగారు గొలుసుపోతే ఇంటిల్లిపాదీ షాక్ అవుతారు. సినిమా అనేది మా సొత్తు. దాన్ని పైరసీ చేస్తే మాకూ అలానే ఉంటుంది.

– దిల్ రాజు

పోలీసులే మా హీరోలు

తెలంగాణ పోలీసులు మా హీరోలు. పైరసీ వల్ల మాకు ఆర్థిక నష్టం. ప్రేక్షకులకు వ్యక్తిగత నష్టం. ప్రతి ఒక్కరూ పైరసీ సినిమాకు దూరంగా ఉండాలి. పైరసీని నిరోధించడానికి సినీరంగం కలిసికట్టుగా పనిచేస్తూ పోలీసులకు సహకరిస్తోంది.

– సురేశ్‌బాబు

మార్చి 16 లేదా 21 నుంచి పది పరీక్షలు

- రాష్ట్ర కార్యాలయం నుంచే ఇన్విజిలేటర్ల నియామకం
- పర్యవేక్షకులు, స్క్వాడ్‌తో కలిపి 37 వేల మంది ఎంపికకు అధికారుల కసరత్తు

సాక్షి, అమరావతి: పదోతరగతి పరీక్షలను మార్చిలో నిర్వహించేందుకు విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. మార్చి 16తో ఒక టైంటేబుల్, మార్చి 21తో మరో టైంటేబుల్ రూపొందించి అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ఈ రెండింటిలో ఒకదానికి ప్రభుత్వం ఓకే చెప్పనుంది. ఈలోగా పరీక్షల సిబ్బంది నియామకం, ఇన్విజిలేటర్ల ఎంపిక, పరీక్ష సెంటర్ల గుర్తింపుపై దృష్టిసారించారు. దాదాపు 6.50 లక్షలమంది విద్యార్థులు 3,500 సెంటర్లలో పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు 35 వేలమంది ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది అవసరం. పరీక్షల సరళి పరిశీలన కోసం మరో రెండువేల మంది స్క్వాడ్ సిబ్బందిని నియమించాలి. గతేడాది ఇన్విజిలేటర్ల ఎంపికను జిల్లాల్లో చేపట్టగా, ఈసారి రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టరేట్ నుంచే చేపట్టాలని నిర్ణయించారు.

చార్జి మెమోలు, సస్పెన్షన్ ఉంటే నో చాన్స్

ఇన్విజిలేటర్ల ఎంపిక కోసం రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టరేట్ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఇన్విజిలేటర్లుగా స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలను తీసుకోనున్నారు. యూడైస్‌లో డేటా ఆధారంగా ఉపాధ్యాయుల పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని డైరెక్టరేట్ అధికారులు జిల్లా అధికారులను ఆదేశించారు. గతంలో చార్జి మెమోలు తీసుకున్నవారు, సస్పెన్షన్‌కు గురైనవారు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్నవారిని పరీక్ష విధులకు దూరం పెట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది. స్కూల్ అసిస్టెంట్లను నియమిస్తున్నందున ఆ సబ్జెక్టు పరీక్షల సమయంలో సంబంధిత సబ్జెక్టు టీచర్లను పరీక్ష విధుల నుంచి తప్పించనున్నారు. గతేడాది పదో తరగతి పరీక్ష పేపర్లు వాట్సాప్‌లో ప్రత్యక్షమవడంతో బాధ్యులపై చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారు. డిసెంబర్ మొదటి వారంలోగా పరీక్షల షెడ్యూల్‌పై ప్రభుత్వ నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

పార్కు స్థలంలో పాగా

రూ.5 కోట్ల విలువైన స్థలంపై అధికార పార్టీ నేతల కన్ను

రాప్తాడు రూరల్: అది ప్రజా అవసరాల కోసం వదిలిన స్థలం. అంటే పూర్తిగా పంచాయతీ స్థలం. ఇక్కడ పార్కు, బడి, గుడి నిర్మించొచ్చు. లేదా ఇతరత్రా ప్రజా అవసరాలకు వాడుకోవచ్చు. ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో ఈ స్థలం చాలా ఖరీదుగా మారింది. దీంతో కొందరు కబ్జారాయుళ్లు దీనిపై కన్నేశారు. వీరికి అధికార పార్టీకి చెందిన కొందరు అండగా నిలుస్తున్నారు. ఫలితంగా రూ.5 కోట్ల విలువైన 'ఓపెన్' (కామన్) స్థలం అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఏర్పడింది. కానీ, స్థానికులు తమ శక్తిమేరా వీరి ఆగడాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వివరాలివీ..

వైఎస్సార్‌సీపీ హయాంలో సాగని ఆటలు..

అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ ఐజీ నగర్ పక్కన 21 సర్వే నంబరులో 8.91 ఎకరాల్లో గొంది రామలక్ష్మమ్మ 2007లో లేఔట్ వేశారు. ఇందులో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజా ప్రయోజనాల కోసం (కామన్ సైట్) 44 సెంట్ల స్థలాన్ని వదిలారు. ఈ ఓపెన్ స్థలంపై కొందరి కన్నుపడింది. 2009 ఏప్రిల్‌లోనే జి. రాజేంద్రనాయుడు, తుమ్మలనాయుడు, వి. హనుమంతునాయుడు, నాగేంద్ర, ఎన్. తారక రామేశ్వర్ పేర్ల మీద జీపీఏ చేయించుకున్నారు. ఈ స్థలంలో పాగా వేసేందుకు గత ప్రభుత్వ హయాంలోనే అక్రమార్కులు ప్రయత్నించారు. ఇందులో భాగంగా కొందరి పేర్ల మీద అగ్రిమెంటు కూడా చేయించారు. క్షేత్రస్థాయికి వెళ్లేసరికి స్థానికులు, అప్పటి ప్రజాప్రతినిధులు, సీపీఐ నాయకులు అడ్డుకున్నారు. ఓపెన్ స్థలం అన్యాక్రాంతం కావడానికి వీల్లేదని, రక్షణ చర్యలు చేపట్టాలని అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 44 సెంట్ల ఓపెన్ స్థలంలో కక్కలపల్లి పంచాయతీ నిధులతో పార్కు అభివృద్ధి చేయాలంటూ 2021 అక్టోబరు 14న అహుడా వైస్ చైర్మన్ లేఖ కూడా రాశారు.



GOVERNMENT OF ANDHRA PRADESH
ANANTAPURAMU-HINDUPUR URBAN DEVELOPMENT AUTHORITY
ANANTAPURAMU

From
Sri P. Murali[illegible] Goud
Vice-Chairperson
Anantapuramu-Hindupur Urban Development Authority
D. No. [illegible]
Near Joint Collector Bungalow
Anantapuramu

To
Sri D. [illegible] Reddy
Andhra Pradesh Vyavasaya Karmika Sangham
Jilla Samithi
Anantapuramu

RC. No. 605/2021/AHUDA Dt: 14-10-2021

Sir,

Sub:- AHUDA, Anantapuramu District – Anantapuramu Mandal, Kakkalapalli Colony Gram Panchayat – Sy. No. 21 – Open space to an extent of Ac 0.44 Cents – Occupied – Reg.

Ref:- 1) Representation received from Andhra Pradesh Vyavasaya Karmika Sangham, Jilla Samithi, Anantapuramu on Dt: 04-10-2021
2) This office RLP No. RLP/2020/DTCP-AHUDA/[illegible]

With reference 1st cited, wherein an unauthorized layout was laid in Sy. No. 21 of Kakkalapalli Colony Gram Panchayat, Anantapuramu Mandal during 2007. This office has prepared Regularisation Layout Pattern (RLP) for the said Sy. No. 21 of Kakkalapalli Colony Gram Panchayat, Anantapuramu Mandal, the same was approved by the Director of Town and Country Planning, Govt. of Andhra Pradesh, Mangalagiri, Guntur District and shown 0.44 Cents of land as open space under Layout Regularisation Scheme (LRS), 2020 vide reference 2nd cited.

This office Planning Staff has inspected the site under reference and found open space is intact and protected with erected cement pillars and around the Open space.

It is also given direction to the Panchayat Secretary, Kakkalapalli Colony Gram Panchayat, Anantapuramu Mandal to develop the park in open space to an extent of Ac 0.44 Cents in Sy. No. 21 of Kakkalapalli Colony Gram Panchayat from Panchayat General Fund to avoid encroachments in future.

Yours faithfully
Vice-Chairperson
AHUDA
Anantapuramu

Copy submitted to Spandana, Praja Samasyala Parishkara Vedika, Collectorate Office, Anantapuramu for favour of information.

పంచాయతీ జనరల్ ఫండ్‌తో పార్కు అభివృద్ధి చేయాలంటూ 2021 అక్టోబరులో అహుడా వైస్ చైర్మన్ రాసిన లేఖ

చంద్రబాబు ప్రభుత్వం రాగానే..

చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత కబ్జాకోరులు మళ్లీ రంగంలోకి దిగారు. రాప్తాడు నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుడు తెర వెనుక మంత్రాంగం నడిపారు. ఈ క్రమంలో ఐదునెలల కిందట 44 సెంట్ల స్థలాన్ని జేసీబీలతో చదును చేసేందుకు కబ్జాదారులు ప్రయత్నించారు. స్థానికులు ఏర్పాటుచేసుకున్న నాగులకట్టను సైతం ధ్వంసం చేశారు. రావి, వేప చెట్లను తొలగించడంతో స్థానికులు తిరగబడ్డారు. దీంతో.. 'ఈ స్థలం మాది.. ఎవరొచ్చినా ఏమీకాదు. మీకు కావాలంటే 8 సెంట్లు వదిలిపెడతాం. లేదంటే అదీలేదు'.. అని కబ్జాదారులు హెచ్చరించారు. స్థానికులు వెంటనే అనంతపురం రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు జేసీబీతో పనులు చేయిస్తున్న నాగేంద్ర (రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిలో ఒకరు) తదితరులను అదుపులోకి తీసుకున్నారు. బాధితులు ఫిర్యాదు చేసినా కేసు నమోదుకు వెనకడుగు వేశారు. 'ముఖ్యమైన వ్యక్తి నుంచి ఫోన్‌కాల్' రావడంతో పోలీసులు సైలెంట్ అయ్యారనే ఆరోపణలున్నాయి. అయితే, అధికార పార్టీకి చెందిన నేతల అండ ఉండడంతో అక్రమార్కులు తాజాగా మళ్లీ రంగంలోకి దిగారు. ఈ స్థలం తమదేనని, విక్రయిస్తామంటూ కొనుగోలుదారులకు చూపిస్తున్నారు. తరచూ వాహనాల్లో వచ్చి ఈ స్థలాన్ని చూసి వెళ్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

ఒక్క సెంటూ అన్యాక్రాంతం కానివ్వం..

కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని 21 సర్వే నంబరులోని ప్రైవేట్ లేఔట్‌లో ప్రజాప్రయోజనాల కోసం 44 సెంట్ల స్థలాన్ని వదిలారు. ఇది పూర్తిగా పంచాయతీకి సంబంధించిన స్థలం. ఎవరు ఆక్రమించినా క్రిమినల్ కేసులు నమోదుచేయిస్తాం. త్వరలోనే అక్కడ ఒకవైపు అంగన్‌వాడీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. మరోవైపు.. నరిగమ్మ ఆలయం నిర్మాణానికి పరిశీలిస్తున్నాం. మిగతా స్థలంలో పార్కు ఏర్పాటుచేస్తాం. ఒక్క సెంటు కూడా అన్యాక్రాంతం కానివ్వం. ప్రజలకు ఉపయోగపడేలా చూస్తాం.

– తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ దివాకర్

మైనర్ బాలికపై ఇద్దరు లైంగిక దాడి

ఇద్దరి అరెస్ట్

తిరుపతి క్రైమ్: తిరుపతిలో మైనర్ బాలిక (12)పై ఇద్దరు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరానికి చెందిన ఓ బాలికకు ఇన్‌స్టాగ్రామ్‌లో పీలేరుకు చెందిన బాలు(20), గుణ(26) పరిచయమయ్యారు. వీరు బాలికకు మాయమాటలు చెప్పి ఈ నెల 9న పీలేరుకు పిలిపించుకున్నారు. అక్కడ ఓరోజు ఉండి తిరిగి పీలేరు నుంచి తిరుపతిలోని విద్యానగర్‌కు వచ్చారు. అక్కడ వారికి తెలిసిన ఓ మహిళ వద్దకు తీసుకువెళ్లి తమ బంధువు అని బాలికను పరిచయం చేశారు. 9న బాలిక అదృశ్యమైనట్లు ఆమె తల్లిదండ్రులు ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక తిరుపతిలో ఉందని తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు వెంటనే గుర్తించి వారి నుంచి బాలికను తీసుకువచ్చేశారు. బాలిక వచ్చిన అనంతరం ఆమెను పోలీసులు విచారించగా..తనపై ఇద్దరూ లైంగిక దాడి చేసినట్లు చెప్పింది. దీనిపై కేసు నమోదు చేసి ఆ ఇద్దరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. బాలికను వైద్య పరీక్షల కోసం రుయా ఆసుపత్రికి తరలించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం ఆధ్వర్యంలో 19న సంతకాల సేకరణ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమానికి మద్దతుగా పార్టీ పంచాయతీ రాజ్ విభాగం ఆధ్వర్యంలో 19న రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ జరపనున్నట్టు వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వీఎల్‌జీ చేతికి కర్నూలు ఎయిర్‌పోర్టు నిర్వహణ

సాక్షి, అమరావతి: కర్నూలు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయ నిర్వహణ కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన వీఎల్‌జీ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు గాను ఏడాదికి రూ. 3.49 కోట్లు చెల్లించనున్నది. ప్రస్తుతం నిర్వహిస్తున్న సంస్థ కాలపరిమితి తీరడంతో టెండర్లను ఆహ్వానిస్తే ఇందులో ఎల్–1గా వీఎల్‌జీ నిలిచినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మూడు బీసీ కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మూడు బీసీ కార్పొరేషన్‌లకు ప్రభుత్వం డైరెక్టర్లను నియమించింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ ఎస్.సత్యనారాయణ సోమవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ సగర, ఉప్పర సంక్షేమ అభివృద్ధి సంస్థ (కార్పొరేషన్), దాసరి కార్పొరేషన్, ముదలియార్ కార్పొరేషన్‌కు 15 మంది చొప్పున డైరెక్టర్లను నియమించారు. వీరి పదవీకాలం రెండేళ్లు ఉంటుంది.

స్మార్ట్ వర్క్ అవసరం

సాక్షి, అమరావతి: ఉద్యోగులు స్మార్ట్ వర్క్ చేయాలని.. అందుకు తగ్గట్టు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖల ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే అన్నారు. ఏపీపీఎస్సీ ద్వారా నూతనంగా నియమితులైన 39 మంది ఉద్యోగుల శిక్షణలో భాగంగా విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడటంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ శిక్షణ పూర్తయిన తర్వాత ప్రధాన, జోనల్, ప్రాంతీయ కార్యాలయాల్లో పోస్టింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సభ్యకార్యదర్శి శరవణన్, చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ఎం.రాజశేఖర్, జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ శ్రీరంజని పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించండి: ఏపీ ఎస్టీఏ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలో అర్బన్ ఎంఈవో, డిప్యూటీ డీఈవో పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, సమస్యను పరిష్కరించేందుకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భాషా పండిట్ పదోన్నతులు పూర్తిచేసి, మిగిలిన పోస్టుల్లో ఎస్జీటీలకు అవకాశం కల్పించేలా సవరణ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మున్సిపాలిటీల్లో కొత్త పాఠశాలలు ఏర్పాటు చేయాలని, మున్సిపల్ టీచర్ల అంతర్ యాజమాన్య బదిలీలు షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బడి ఈడు పిల్లలపై దృష్టి పెట్టండి

సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలోనే ఉండాలని, ఇందుకోసం ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కో–ఆర్డినేటర్లు పనిచేయాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కో–ఆర్డినేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీడీ మాట్లాడుతూ.. బతుకుతెరువు కోసం తల్లిదండ్రులు వలస వెళ్లినా వారి పిల్లలు స్థానిక పాఠశాలల్లో లేదా సీజనల్ హాస్టల్ ద్వారా విద్యను అందించేందుకు కో–ఆర్డినేటర్లు చొరవ తీసుకోవాలన్నారు. బడి వయసు పిల్లలు కూలి పనుల్లో, యాచక వృత్తిలో కనిపించకూడదన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయుల క్రీడా పోటీలకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. పురుష టీచర్లకు క్రికెట్, మహిళా టీచర్లకు త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో మండల స్థాయిలో, డిసెంబర్ 13, 14 తేదీల్లో డివిజన్, 20, 21, 22 తేదీల్లో జిల్లా స్థాయిలో, జనవరి 2,3,4 తేదీల్లో రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయి. క్రీడల కోసం మండలానికి రూ.5 వేలు, డివిజన్‌కు రూ.20 వేలు, జిల్లాకు రూ.20 వేల చొప్పున మొత్తం 1.06 కోట్లను బడ్జెట్‌ను సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా కేటాయించారు.

అందానికో.. మంచుతునక



హరిత సీమలో మైమరపిస్తున్న హిమ సౌందర్యం

మంచు దుప్పటిని చీల్చుకుని వస్తున్న అరుణ కిరణాలు

పొద్దున్నే బతుకు వేట

- కోనసీమకు 'స్నో'యగం
- మంత్రముగ్ధులను చేస్తున్న ప్రకృతి రమణీయత
- శీతాకాలంలో సరికొత్త సొబగులు
- కొత్త హంగులు అద్దుకున్న పచ్చని తోటలు

సాక్షి, అమలాపురం: అందానికి 'మంచు'తునకలా.. విరిసిన పచ్చదనంపై మంచు ముత్యాల్లా.. దారులు హిమసుమధారల్లా.. ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేసేలా.. పచ్చని కోనసీమను మంచు దుప్పటి కప్పుకుంటోంది. పసిడి కంకులతో కోతలకు సిద్ధమైన పైర్లను, కొబ్బరి, అరటి, పూల తోటలను ఉషోదయ వేళ మంచు కప్పేయడంతో కోనసీమ కొత్త అందాలను సంతరించుకుంటోంది. శీతాకాలంలో ఇలాంటి అందాలను చూడాలంటే అల్లూరి జిల్లా పాడేరు, అరకు, లంబసింగి, మారేడుమిల్లి వంటి పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని చాలామంది భావిస్తారు. అయితే కేరళను తలపించే ప్రకృతి అందాలతో తులతూగే కోనసీమ సైతం మంచు అందాలతో కట్టిపడేస్తోంది. సంక్రాంతి పండగ కన్నా ముందే రా.. రమ్మని స్వాగతం పలుకుతోంది.

సూర్యుడు సిగ్గుపడి సన్నగా నవ్వినట్టు..

ప్రకృతి పిలిచే.. మనసు దోచే

పసిడి పచ్చని వరి చేలు, గోదావరి నదీ పాయలపై పరచుకుంటున్న దట్టమైన మంచు తెరలు, కొబ్బరి చిగురుటాకులపై హిమ బిందువులు, వేకువ జామున ప్రసరించే భానుడి కిరణాలు, చల్లని గాలులు, తెల్లని మబ్బుల నీలాకాశం.. ఇలా ప్రతి ఒక్కటీ ప్రకృతి ప్రేమికుల మదిని దోచేవే. ఇలాంటి అపురూప దృశ్యాలు కోనసీమలో కోకొల్లలు.

నుదుట సిందూరం అద్దుకున్నట్టు

వణికించే చలి గాలులను చీల్చుకుని వస్తున్న నిలివెచ్చని సూర్య కిరణాలు కొబ్బరి చెట్ల మధ్య నుంచి భూమిని తాకుతున్న చిత్రం ప్రకృతి ప్రేమికుల మదిని దోచేస్తోంది. వర్షాకాలంలో అరుదుగా కనిపించే ఇంద్రధనస్సులు మంచు దుప్పటితో కళ్ల ముందు సాక్షాత్కరిస్తున్నాయి. మంచు తెరల నుంచి బయట పడుతున్న సమయంలో కోనసీమ సంప్రదాయ పెంకుటిల్లు కొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. చెంతనే కొబ్బరి చెట్ల ఆకులపై నుంచి రాలే హిమ బిందువుల సోయగం ఎంత చూసినా తనివి తీరనిది. నుదుట సిందూరం అద్దుకుందా అన్నట్లు కనిపించే మంచు అందాలను మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుంది. ఇటువంటి అందాలకు రాజోలు దీవి చిరునామా. వైనతేయ, వశిష్ఠ నదీపాయల మధ్య ఒదిగి ఉండే ఈ దీవి ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు.

మంచు తెర అడ్డుకున్నా తప్పని శ్రమైక జీవనం

తనివితీరా చూసేలా..

కోనసీమకు మరో వరం విశాలమైన సముద్రతీరం. మంచు తెరల మాటున ఎగసిపడే కెరటాలు, చెంతనే ఉన్న సరుగుడు తోటలు అపురూపమే. అంతర్వేది, కేశనపల్లి, ఎస్.యానాం, వాసాలతిప్ప, చిర్రయానాం తీరం.. వాటి వద్ద ఉన్న మొగలి పొదలు మైమరపిస్తాయి. చిట్టిపొట్టి చిట్టడవుల (మడ) మధ్య వేకువజామునే మంచు దుప్పటిని చీల్చుకుంటూ సాగే బోటు ప్రయాణాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. కాట్రేనికోన, అల్లవరంలో ఉండే ఈ మడ అడవుల అందాల అద్భుతమే.

స్వాగతం పలుకుతూ..

ప్రకృతి అందాలతో పాటు ఇక్కడి కార్మికుల శ్రమైక జీవన సౌందర్యం మరో అద్భుతం. గోదావరి.. సముద్ర తీరాల్లో తెలతెలవారకుండా మంచు పరదాల మాటున సాగే చేపల వేట.. పసిడి చేల మధ్య పనిచేసే కూలీలు.. ఇటుక బట్టీలలో కార్మికులు.. కొబ్బరి చెట్లు ఎక్కి దింపు తీసే శ్రమజీవులు.. సైకిళ్లపై అరటి గెలులు రవాణా చేసే రైతులు.. ఇలా చెప్పుకొంటూ పోతే తెల్లవారుజామున కార్మికుల జీవనం కూడా మంచు అందాలలో మంత్రముగ్ధులను చేస్తోంది. శీతాకాలం.. సంక్రాంతికి రెండు నెలల ముందే ఒకసారి కోనసీమ 'రండి.. రండి.. దయచేయండి' అని పర్యాటకులను, ప్రకృతి ప్రేమికులను పిలుస్తోంది.

ఎన్నో అందాలు... ప్రకృతి సోయగాలు

మంచు ముసుగులోనే బతుకు పయనం

చలికాలం.. జర భద్రం

- పెరిగిన చలి తీవ్రత
- పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

భీమవరం (ప్రకాశం చౌక్)/బుట్టాయగూడెం: : వారం రోజులు గా చలి తీవ్రత క్రమేపీ పెరుగుతోంది. సాయంత్రం 5 గంటలకే వాతావరణం చల్లబడి చలి మొదలవుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. చలి పెరుగుతున్న క్రమంలో పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ము ఖ్యంగా గుండె సమస్యలు, డయాబెటిస్, ఆస్తమా, పొగతాగే వారు, క్యాన్సర్, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. చలికాలంలో ముఖ్యంగా శ్వాసనాళాలు ముడుచుకుపోయే అవకాశం అధికంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

బుట్టాయగూడెంలో పొగమంచు

జాగ్రత్తలు తప్పనిసరి

- చర్మం పొడి బారకుండా మాయిశ్చరైజర్లు వినియోగించాలి.
- తగిన మోతాదులో నీరు కచ్చితంగా తాగాలి.
- శీతల పానియాలు, ఐస్‌క్రీమ్‌లు, కూలింగ్ వాటర్‌కు దూరంగా ఉండాలి.
- దుమ్ము, ధూళి ఉండే ప్రాంతాలకు దూరంగా, చలిగాలుల్లో తిరగడం మానేయాలి.
- ఇమ్యూనైజేషన్ వ్యాక్సిన్ ఏడాదికి ఒకసారి, న్యూమోనియా వ్యాక్సిన్ ఐదేళ్లకు ఒకసారి వైద్యుల సూచనలతో వేయించుకోవాలి.
- ఇండోర్ వ్యాయామం, జిమ్ ప్లాన్ చేసుకోవాలి.
- బయటకు వెళ్లే సమయంలో తగినంత వేడిని శరీరానికి అందించే ఉన్ని దుస్తులు ధరించాలి.
- ఇంట్లో ఎవరికైనా జలుబు, దగ్గు వస్తే వైద్యుల సూచనలతో మందులు వాడాలి.
- సొంత వైద్యం సరికాదు. కుటుంబంలో ఒకరికి వాడే ఔషధాలు వేరొకరికి వినియోగించరాదు.
- శ్వాస సంబంధిత సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

ఏజెన్సీలో చలి పంజా

పశ్చిమ గోదావరి ఏజెన్సీ ప్రాంతంలో కొద్ది రోజులుగా పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నా యి. రోజురోజుకూ చలితీవ్రత పెరుగుతోంది. మారుమూల కొండ ప్రాంతాల్లోని గ్రామాల్లో ఉదయం 8 గంటలు దాటితే కానీ ప్రజలు బయటకు రాలేని, సాయంత్రం 6 గంటలకే ఇళ్లకు చేరాల్సిన పరిస్థితి. బ్యాక్టీరియా, వైరస్‌ల ప్రభావంతో చాలామంది జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో ఆస్పత్రులకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. డిసెంబర్, జనవరిలో చలి మరింత పెరిగే అవ కాశం ఉంది. మంచులో ప్రయాణాలు ప్రమాదకరమని పోలీసులు సూచిస్తున్నారు. గతంలో గిరిజన మండలాల్లో వేకువజామున మంచులో ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి.

శరీరాన్ని రక్షించుకోవాలి

శీతాకాలంలో జాగ్రత్తగా ఉండాలి. చలి నుంచి శరీరాన్ని రక్షించుకోవాలి. ఈ సీజన్‌లో వ్యాధినిరోధక శక్తిని పెంచే విటమిన్ సీ కలిగిన పదార్థాలు, సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవాలి. గోరువెచ్చని నీటిని తీసుకోవాలి. శ్వాసకోశ సమస్యతో ఇబ్బందులు వస్తే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. మెరుగైన వైద్యం అవసరమైతే వైద్య సేవలను ఉపయోగించుకోవాలి. ముఖ్యంగా పిల్లలను, వృద్ధులు చలిలో తిరగకుండా చూసుకోవాలి. – గీతాబాయ్, డీఎంహెచ్ఓ, భీమవరం

ఫార్మసీ విద్యార్థులకు పరిశ్రమ నైపుణ్యాలు అవసరం

సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రమేష్ చంద్ర

సాక్షి, అమరావతి: దేశంలో ఫార్మసీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఫార్మా విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్, పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రమేష్ చంద్ర తెలిపారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ), ఐపీఏ– స్టూడెంట్ ఫోరం సంయుక్తంగా 'వాక్సిన్లపై అవగాహనలో ఫార్మసిస్టుల భాగస్వామ్యం' అంశంపై ఎనికేపాడులోని విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఫర్ విమెన్‌లో సోమవారం 64వ నేషనల్ ఫార్మసీ వారోత్సవాలను రమేష్ చంద్ర ప్రారంభించారు. భారత ఫార్మసీ రంగం మరో నాలుగేళ్లలో 100 బిలియన్ డాలర్ల విలువకు చేరుకోనుందని, ఇందులో అవకాశాలు అపారంగా పెరుగుతాయన్నారు. ముఖ్యంగా ఫార్మాస్యూటికల్ సైన్సెస్, అనలిటికల్, రీసెర్చ్ అండ్ డేటా స్కిల్స్, క్వాలిటీ కంట్రోల్, క్లినికల్, పేషెంట్–కేంద్రిత నైపుణ్యాలు, బిజినెస్, మార్కెటింగ్ వంటి అంశాలలో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పరిశ్రమ– విద్యా సంస్థల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేస్తూ, లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఫార్మసీ విద్యార్థులకు అందిస్తున్న సహకారాన్ని ఆయన వివరించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ అమలు చేస్తున్న మెడికల్ పరికరాల పరిశ్రమ బలోపేతానికి, సామర్థ్యం, నైపుణ్యాభివృద్ధి పథకాన్ని కూడా వినియోగించుకోవాలని ఆయన విద్యార్థులు, కళాశాలలు, పరిశ్రమలను కోరారు. విజయవాడ రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ గైనిక్, లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ స్నేహ మద్దుకూరి మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. నేషనల్ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా ఫార్మసీ విద్యార్థులు సమీప గ్రామాలలో వివిధ టీకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు, విద్యార్థులు ఎనికేపాడు గ్రామంలో టీకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ నెల 19న శ్రీ సత్యసాయి బాబా శతజయంతి వేడుకలకు ప్రధాని హాజరు

సాక్షి, అమరావతి: శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తికి భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శతజయంతి వేడుకలకు హాజరు కావడానికి ఈ నెల 19వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్న నేపథ్యంలో ప్రజల కదలికలను, రవాణా, పరిపాలన ఏర్పాట్లు కోసం పలువురు ఐఏఎస్ అధికారులకు విధులు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పలు జిల్లాల నుంచి రెవెన్యూ డివిజనల్ అధికారులను, జాయింట్ కలెక్టర్లతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులను నియమిస్తూ ఈ నెల 18వ తేదీన శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో సూచించారు.

ఆయిల్ ఫామ్

- రైతులను ఆదుకొంటున్న పంట
- తూర్పు గోదావరి జిల్లాలో 49 వేల ఎకరాల్లో సాగు
- టన్ను గెలల ధర రూ.19,636
- ఎకరాకు 12 టన్నుల దిగుబడి రూ.2 లక్షల రాబడి

దేవరపల్లి: తూర్పు గోదావరి జిల్లా మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంటగా ఉన్న ఆయిల్‌పామ్ సాగు కొన్నాళ్లుగా ఆశాజనకంగా ఉంటోంది. మార్చి నెలతో పోలిస్తే ధర కొంత తగ్గింది. అయినప్పటికీ ఇప్పుడు లభిస్తున్న ధర గిట్టుబాటు అవుతోందని, ఇది ఇంకా పెరిగితే తమకు మరింత లాభదాయకంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. జిల్లాలోని గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు, రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో సుమారు 38 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోంది. దాదాపు 30 ఏళ్లుగా ఈ ప్రాంత రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. వారు పండించిన ఆయిల్ పామ్ గెలలను 3ఎఫ్ ఆయిల్, నవభారత్ కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. టన్ను ఆయిల్‌పామ్ గెలలకు 2019లో రూ.6 వేలుగా ఉన్న ధర అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2022 నాటికి ఏకంగా 23,639కి పెరిగింది. ఈ ఏడాది మార్చి నెలలో రూ.20,900 ధర లభించగా ప్రస్తుతం అది రూ.19,636కు తగ్గింది. పామాయిల్ రికవరీ శాతాన్ని బట్టి ఆయిల్‌పామ్ గెలల ధరను ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. అక్టోబర్‌లో ఫ్యాక్టరీకి రైతులు ఇచ్చిన గెలలకు నవంబర్‌లో ధర ప్రకటిస్తుంది. రవాణా చార్జీలు, ఇతర ఖర్చులకు అదనంగా టన్నుకు రూ.170 చెల్లిస్తారు. ప్రస్తుతం లభిస్తున్న ధర గిట్టుబాటు అవుతున్నప్పటికీ మరింత పెరిగితే బాగుంటుందని రైతులు ఆశిస్తున్నారు.

సాగుపై ఆసక్తి

ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు గిట్టుబాటు ధర లభిస్తూండటంతో రైతులు దీని సాగుకు ఆసక్తి చూపుతున్నారు. చాలామంది రైతులు తమకున్న భూమిలో కొంత విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో పలువురు రైతులు 10 నుంచి 40 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. కొంతమంది జీడిమామిడి తోటలను తొలగించి ఆ భూముల్లో ఆయిల్‌పామ్ మొక్క తోటలు వేస్తున్నారు. వీటి నుంచి ఐదేళ్ల తర్వాత దిగుబడి మొదలవుతుంది. సరైన యాజమాన్య పద్ధతులు, నీటి సదుపాయం ఉన్న భూముల్లో మొక్క తోటల నుంచి ఎకరాకు 10 టన్నుల వరకూ దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. నేల స్వభావాన్ని బట్టి ఎకరాకు 10 నుంచి 12 టన్నుల దిగుబడి సాధిస్తున్న రైతులు కూడా ఉన్నారు. ప్రస్తుతం పొగాకు సాగు కష్టతరంగా మారడం, కూలీల కొరత ఎక్కువగా ఉండటంతో ప్రత్యామ్నాయంగా మరికొందరు ఆ భూముల్లో నాలుగేళ్లుగా ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఈ విధంగా దాదాపు 12 వేల ఎకరాల్లో మొక్క తోటలు వేసినట్లు సమాచారం.

దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఆయిల్‌పామ్ తోట (అంతరచిత్రం) పరిశ్రమకు రవాణా చేస్తున్న పామాయిల్ గెలలు

దిగుబడి వచ్చే సమయంలో ధర స్వల్పం

ఆయిల్‌పామ్ గెలల దిగుబడి ఏడాదికి ఎకరాకు సగటున 10 నుంచి 12 టన్నుల వరకూ వస్తుంది. ఇందులో 80 శాతం దిగుబడి మే – ఆగస్టు నెలల మధ్యనే వస్తుంది. మిగిలిన ఎనిమిది నెలలూ 20 శాతం మాత్రమే దిగుబడి వస్తుంది. ఆ సమయంలోనే మార్కెట్లో ధర పెరుగుతుంది. వర్షాకాలం నాలుగు నెలలూ దండిగా దిగుబడి వచ్చినప్పటికీ గిట్టుబాటు ధర రావడం లేదని, దీంతో, ఆదాయం తగ్గుతోందని రైతులు చెబుతున్నారు. మొత్తం మీద ఏడాదికి ఎకరాకు సుమారు రూ.2 లక్షల ఆదాయం వస్తుందని, ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్‌కు మంచి ధర వస్తుందని అంటున్నారు.

ఆదుకుంటోంది



ఆయిల్‌పామ్ పంట రైతులను ఆదుకుంటోంది. ఇతర పంటల నష్టాన్ని భర్తీ చేస్తోంది. టన్ను గెలల సగటు ధర రూ.16,000 ఉంటే ఏడాదికి ఎకరాకు రూ.1.60 లక్షలు, రూ.20,000 పలికితే రూ.2 లక్షల వరకూ ఆదాయం వస్తోంది. ఖర్చులు పోనూ ఎకరాకు సుమారు రూ.1.50 లక్షలు మిగులుతోంది. పెట్టుబడి ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేలు అవుతుంది. నేను 25 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నాను. 15 ఎకరాల మొక్క తోట ఉంది. ఎకరాకు 10 టన్నుల దిగుబడి వస్తోంది. – మేడిబోయిన గంగరాజు, రైతు, చిన్నాయగూడెం, దేవరపల్లి మండలం.

ఇది లాభాల పంట



ఆయిల్‌పామ్ లాభాల పంట. శ్రమ, పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ ఇచ్చే పంట. డ్రిప్ ద్వారా నీటి తడులు పెట్టడం, పశువుల ఎరువు వాడడం వల్ల దిగుబడులు పెరిగాయి. ఎకరాకు 10 టన్నుల దిగుబడి వస్తుంది. నేను 8 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నాను. ఎకరాకు సగటున 9 టన్నుల దిగుబడి వస్తోంది. మార్కెట్లో ధర మరింత పెరిగే అవకాశం ఉంది. – చిరువూరి గంగాధర్, రైతు, దేవరపల్లి

వర్షాకాలంలోనే దిగుబడి

ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ పంట లాభదాయకంగా ఉంది. ఏడాదికి సగటున ఎకరాకు రూ.2.20 లక్షల ఆదాయం వస్తోంది. పెట్టుబడి, ఖర్చులు పోను ఎకరాకు రూ.1.80 లక్షలు నికరంగా మిగులుతోంది. ఆయిల్‌పామ్ తోటల్లో కోకో, అరటి వంటివి అంతర పంటలుగా సాగు చేసి రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. వర్షాకాలం నాలుగు నెలలూ నాణ్యమైన గెలల దిగుబడి వస్తుంది. కొంత మంది రైతులు ఎకరాకు 10 నుంచి 13 టన్నుల దిగుబడి కూడా సాధిస్తున్నారు. – యాగంటి వెంకటేశ్వరరావు, రైతు, దేవరపల్లి

హెల్త్

క్యాన్సర్‌కు ఆహారం ఆన్సర్

డాక్టర్ రాజేష్ బొల్లం
సీనియర్ కన్సల్టెంట్
మెడికల్ ఆంకాలజిస్ట్

ఇంగ్లిష్‌లోనూ తెలుగులోనూ కామన్‌గా ఓ సామెత ఉంది. అదే... ప్రివెన్షన్ ఈజ్ బెటర్ ద్యాన్ క్యూర్. అంటే చికిత్స కంటే నివారణ మేలు అని అర్థం. నిజమే... రోజూ ఆహారం తీసుకోక తప్పదు. అదే గనక ఆరోగ్యకరమైనది కావడంతో పాటు క్యాన్సర్‌ను నివారించేదైతే... అది కేవలం క్యాన్సర్‌నే కాదు... ఎంతో ఆత్మక్షోభనూ, మరెంతో వేదననూ నివారిస్తుంది. అంతేకాదు... భవిష్యత్తులో మందులకు పెట్టే బోలెడంత డబ్బునూ ఆదా చేస్తుంది. అన్నిటికంటే ముందుగా శారీరక బాధల నివారణతో పాటు మానసికమైన శాంతినీ కాపాడుతుంది. అందుకే రోజూ ఎలాగూ తినే అవే ఆకుకూరలనూ, కాయగూరలనూ, పండ్లనూ మార్చి మార్చి తింటూ ఉంటే పై ప్రయోజనాలన్నీ కలుగుతాయి. ఏయే ఆహారపదార్థాలు ఏయే క్యాన్సర్లను నివారిస్తాయో, అలా నివారించడానికి వాటిల్లోని ఏ పోషకాలు తోడ్పడతాయో తెలుసుకుందాం. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం. తద్వారా క్యాన్సర్‌ను నివారించుకుందాం...

పండ్లు... ఆకుకూరలు... ఆహారపదార్థాలు... ఇలా మనం రోజూ తినే పదార్థాలతోనే క్యాన్సర్లను నివారించుకోవడం సాధ్యమనే అనడం కాకుండా వాటిల్లోని ఏయే పోషక విలువలు అలా జరిగిందేందుకు దోహదపడతాయో తెలుపుతున్నారు క్యాన్సర్‌పై పరిశోధనలు సాగిస్తున్న శాస్త్రవేత్తలూ, ఆహారనిపుణులు. పైగా ఏయే ఆహారపదార్థాల్లోని ఏ నిర్దిష్టమైన పోషకం క్యాన్సర్‌ను ఎలా నివారిస్తుందో తెలుసుకునేందుకు యూకేకు చెందిన 'వరల్డ్ క్యాన్సర్ రీసెర్చ్ ఫండ్' ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఆ అధ్యయనాల ద్వారా కేవలం ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు తినడం ద్వారానే చాలా సులువుగా క్యాన్సర్‌ను ఎలా నివారించగలమో తెలుసుకుందాం.



తల, మెడ (హెడ్ అండ్ నెక్) క్యాన్సర్‌ల నివారణకు...

పసుపు, నారింజ, ఎరుపు, ఆకుపచ్చ, తెల్లటి తొక్క కలిగి ఉండే పండ్లు తల, మెడ క్యాన్సర్లను నివారిస్తాయి. ఇందులో ఉండే ఫైటో కెమికల్స్ హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ల నివారణకు తోడ్పడతాయి. అలాగే ఈ పండ్లలోనే మెరుపు కలిగి ఉండే (కొద్దిపాటి మెరుపుతో బ్రైట్‌గా ఉండే) తొక్కతో ఉండే పండ్లు ఈ హెడ్ అండ్ నెక్ క్యాన్సర్లను మరింత సమర్థంగా నివారిస్తాయి. ఉదాహరణకు... నారింజ, కివీ, జామ, పైనాపిల్ పండ్లు తల, మెడ క్యాన్సర్లను నివారణకు సమర్థంగా తోడ్పడతాయి.

పెదవులు, నోరు, ఫ్యారింగ్స్ క్యాన్సర్ నివారణకు...

బాగా ముదురురంగులో ఉండే అన్ని రకాల పండ్లతో పాటు బాగా ముదురు ఆకుపచ్చరంగులో ఉండే ఆకుకూరలు పెదవులు, నోరు, ఫ్యారింగ్ క్యాన్సర్లను నివారిస్తాయి. అంతేకాదు... విటమిన్ ఏ ఎక్కువగా ఉండే పండ్లు కూడా నోరు, ఫ్యారింగ్స్ క్యాన్సర్లను నివారిస్తాయి. ఉదాహరణకు విటమిన్-ఏ ఎక్కువగా ఉండే బొప్పాయి, క్యారట్, మామిడి వంటి తాజా పండ్లు నోరు, ఫ్యారింగ్స్, క్యాన్సర్లను నివారణకు తోడ్పడతాయి. టొమాటోలోని లైకోపిన్ కూడా ఈ తరహా క్యాన్సర్ల నివారణకు ఉపయోగపడుతుంది. అంతేకాదు... ఈ లైకోపిన్‌తో మరో ఉపయోగం కూడా ఉంది. ఇందులో యాంటీ క్యాన్సర్ గుణాలతో పాటు గుండెజబ్బులను నివారించే గుణం కూడా ఉంది.

కంటి క్యాన్సర్ నివారణకు...

ఒమెగా 3-ఫ్యాటీ ఆసిడ్స్ ఎక్కువగా ఉండే సాల్మన్ చేపలు, వాల్‌నట్‌లతో పాటు గ్రీన్-టీ, బెర్రీ పండ్లు, పసుపు, విటమిన్-ఇ, విటమిన్-సి, విటమిన్-ఏ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలతో కంటి క్యాన్సర్లను సమర్థంగా నివారించవచ్చు. సెలీనియమ్, పీచుపదార్థాలు ఫైటోకెమికల్స్ ఎక్కువగా ఉండే బ్రెజిల్-నట్స్ కూడా కంటి క్యాన్సర్ నివారణకు తోడ్పతాయి.

బ్రెయిన్ క్యాన్సర్ కణుతుల నివారణకు...

ఉల్లి, వెల్లుల్లి జాతికి చెందిన రెబ్బలలో మెదడు (బ్రెయిన్) క్యాన్సర్‌ను నివారించే గుణం ఎక్కువ. (అన్నట్టు వీటిలోని యాంటీ క్యాన్సర్ పోషకాలు కేవలం బ్రెయిన్ క్యాన్సర్‌నే కాదు... ఇతరత్రా చాలా రకాల క్యాన్సర్‌ల నివారణకూ ఉపయోగపడతాయి). ఇక ఒమెగా 3-ఫ్యాటీ ఆసిడ్స్ ఎక్కువగా ఉండే వాల్‌నట్, లిన్ సీడ్ ఆయిల్‌తో మెదడు క్యాన్సర్‌లు తేలిగ్గా, సమర్థంగా నివారితమవుతాయి. ఇవి క్యాన్సర్ నివారణతో పాటు వ్యక్తుల్లో వ్యాధి నివారణ వ్యవస్థను (ఇమ్యూనిటీని) పటిష్ఠం చేసేందుకూ ఉపయోడపడతాయి.

రొమ్ము క్యాన్సర్ నివారణకు...

దానిమ్మ పండులోని ఎలాజిక్ యాసిడ్ అనే పోషకంలోని పాలీఫినాల్స్ రొమ్ముక్యాన్సర్‌ను సమర్థంగా నివారిస్తాయి. అలాగే కెరొటినాయిడ్ అనే పోషకం ఎక్కువగా ఉండే పాలకూర, క్యారట్, బ్రాకలీలు కూడా రొమ్ముక్యాన్సర్ నివారణకు గణనీయంగా తోడ్పడతాయి. ప్రైమరీ యాంటీ ఆక్సిడెంట్ ఎక్కువగా ఉండే గ్రీన్-టీ కూడా రొమ్ము క్యాన్సర్ నివారణకు చాలావరకు తోడ్పడుతుంది.

గాల్‌బ్లాడర్ క్యాన్సర్ నివారణకు...

ఊబకాయం / స్థూలకాయం రాకుండా ఆరోగ్యకరమైన పరిమితిలో బరువును నియంత్రించుకోవడమన్నది గాల్‌బ్లాడర్ క్యాన్సర్ నివారణకు బాగా తోడ్పడే అంశం. ఇలా బరువును నియంత్రించుకోవడం అన్నది కేవలం ఒక్క గాల్‌బ్లాడర్ క్యాన్సర్ నివారణకు మాత్రమే కాకుండా పెద్దపేగు, ప్రోస్టేట్, ఎండోమెట్రియమ్, మూత్రపిండాలు, రొమ్ము క్యాన్సర్ల నివారణకూ తోడ్పడుతుంది. ఇందుకోసం ఆరోగ్యకరంగా ఉండే కొవ్వులు తక్కువగా తీసుకుంటూ ఆకుకూరలు మాత్రం ఎక్కువ మోతాదులో తీసుకుంటూ ఉండాలి.

గర్భాశయ ముఖద్వార (సర్విక్స్) క్యాన్సర్ నివారణకు...

ఆహారంలో విటమిన్-ఇ, విటమిన్-సి ఎక్కువగా ఉండేలా చూసుకోవడం అని చర్య సర్విక్స్ క్యాన్సర్ నివారణకు బాగా ఉపకరిస్తుంది. ఉదాహరణకు క్యారట్, చిలగడదుంప, గుమ్మడి వంటి ఆహారాలతో దీన్ని చాలా బాగా నివారించవచ్చు. ఎలాజిక్ ఆసిడ్స్ అనేవి క్యాన్సర్ పెరుగుదలను అరికడతాయి. ఈ పోషకం స్ట్రాబెర్రీ, రాస్ప్‌బెర్రీ, వాల్‌నట్, దానిమ్మ, ద్రాక్ష, ఆపిల్, కివీ పండ్లలో పుష్కలంగా ఉంటుంది కాబట్టి వాటిని తీసుకోవడం ద్వారా గర్భాశయ ముఖద్వారా (సర్విక్స్) క్యాన్సర్‌ను సమర్థంగా నివారించవచ్చు. అయితే ఇక్కడ ఓ చిన్న జాగ్రత్త పాటించడం మేలు చేస్తుంది. అదేమిటంటే... చక్కెర మోతాదులు తక్కువగా ఉండే (లో-గ్లైసీమిక్) పండ్లైన దానిమ్మ, ఆపిల్ వంటి పండ్లతో ఈ క్యాన్సర్ నివారణ మరింత తేలిక.

ఒవేరియన్ క్యాన్సర్ నివారణకు...

క్యారట్‌ల వంటి వాటితో పాటు పసుపు రంగూ, నారింజరంగుల్లో ఉండే వెజిటబుల్స్‌తో (ఉదాహరణకు బెల్‌పెప్పర్ వంటివాటితో) ఒవేరియన్ క్యాన్సర్‌ను సమర్థంగా నివారించవచ్చు. కెరటినాయిడ్స్ ఎక్కువగా ఉండే క్యారట్ వంటివి రోజూ అరకప్పు మోతాదులో రెండు సార్లు తీసుకోవడం వల్ల ఒవేరియన్ క్యాన్సర్‌ను సమర్థంగా నివారించవచ్చని అమెరికన్ క్యాన్సర్ సొసైటీ వంటి ప్రజోపయోగ, పరిశోధనల సంస్థల అధ్యయానాల్లో తేలింది.

జీర్ణాశయ (స్టమక్) క్యాన్సర్ నివారణకు...

జీర్ణాశయ (స్టమక్) క్యాన్సర్ నివారణకు ఉపయె కాప్సికమ్ (కూరగా వండటానికి ఉపయోగించే బెంగళూరు మిరప లేదా బెల్‌పెప్పర్)లో ఉండే ఫైటోకెమికల్స్ బాగా ఉపయోగపడతాయి. పరిమితంగా తీసుకునే మిరపకాయలు ' మిర్చీ వంటి వాటితో పాటు మిరియాల పరిమిత వాడకం కూడా స్టమక్ క్యాన్సర్‌ను నివారిస్తాయి. ఆకుకూరలు, పొట్టుతో ఉండే ధాన్యాలు, తాజా పండ్లు అనేక క్యాన్సర్ల నివారణతో పాటు జీర్ణాశయ క్యాన్సర్ రిస్క్‌ను తగ్గిస్తాయి. జీర్ణాశయ క్యాన్సర్ నివారణకు ఉప్పు వాడకాన్ని గణనీయంగా తగ్గించడమూ అవసరమే.

మూత్రాశయ (బ్లాడర్) క్యాన్సర్ల నివారణకు...

క్రూసిఫెరస్ వెజిటబుల్స్ జాతిగా పేరుపడ్డ క్యాబేజీ, బ్రాకలీ వంటి ఆహారాలతో మూత్రాశయ (బ్లాడర్) క్యాన్సర్‌ను సమర్థంగా నివారించవచ్చు. యూనివర్సిటీ ఆఫ్ టెక్సస్‌లోని యాండర్సన్ క్యాన్సర్ సెంటర్‌లో తేలిన అంశాలను బట్టి విటమిన్-ఇ లోని ఆల్ఫా టోకోఫెరాల్ అనే జీవరసాయనం బ్లాడర్ క్యాన్సర్ నివారణకు బాగా ఉపయోగపడుతుంది. పాలకూర, బాదాంలతో పాటు పొద్దుతిరుగుడు నూనె, కుసుమ నూనెలోనూ విటమిన్-ఇ మోతాదులు ఎక్కువ. ఇక మిరియాలలో ఉండే పోషకాలు కూడా బ్లాడర్ క్యాన్సర్ నివారణకు ఉపయోగపడతాయి.

మూత్రపిండాల (కిడ్నీ) క్యాన్సర్ నివారణకు...

నారింజ రంగులో ఉండే కూరగాయలు (ఉదాహరణ క్యారట్)తో పాటు టొమాటో, అల్లం, ఆప్రికాట్ వంటివి... మూత్రపిండాల (కిడ్నీ) క్యాన్సర్ నివారణకు బాగా తోడ్పడతాయి. కిడ్నీల ఇన్‌ఫ్లమేషన్‌ను బెర్రీ పండ్లు గణనీయంగా తగ్గిస్తాయి. ఫలితంగా కిడ్నీ జబ్బుల ముప్పు కూడా బాగా తగ్గిపోతుంది. ఇక పొట్టు తీయని ధాన్యాలు, నట్స్, బఠాణీ, చిక్కుళ్ల వంటి ఫైటేట్ అనే పోషకం ఉన్న ఆహారాలు మూత్రపిండాల క్యాన్సర్ నివారణకు సమర్థంగా తోడ్పడతాయి.

కాలేయ క్యాన్సర్ నివారణకు...

పాలీఫీనాల్, యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండే బ్లూబెర్రీ పండ్లు, విటమిన్-ఇ పుష్కలంగా ఉండే బెల్‌పెప్పర్, పాలకూర, బాదం వంటి ఆహార పదార్థాలు కాలేయ క్యాన్సర్ నివారణకు తోడ్పడతాయి. ఇక నూనెల్లో పొద్దుతిరుగుడు నూనె, కుసుమ నూనెలు కూడా కాలేయ క్యాన్సర్ నివారణకు దోహదపడతాయి. అయితే ఈ నూనెలను పరిమితంగా మాత్రమే తీసుకోవాలని గుర్తుంచుకోవాలి.

ప్రోస్టేట్ క్యాన్సర్ నివారణకు...

లైకోపిన్ అనే పోషకం పుష్కలంగా ఉండే టొమాటోలు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్‌ను సమర్థంగా నివారించవచ్చు. ఇక పాలీఫీనాల్స్ ఎక్కువగా ఉండే గ్రీన్-టీ, అలాగే దానిమ్మ వంటి పండ్లు కూడా ప్రోస్టేట్ క్యాన్సర్ కణాల వ్యాప్తినీ, విస్తరణను సమర్థంగా నియంత్రిస్తాయి. క్రూసిఫెరస్ జాతి శాకాహారాలైన బ్రాకలీ, కాలీఫ్లవర్ వంటివి ప్రోస్టేట్ క్యాన్సర్‌ను బాగా నివారిస్తాయంటూ అనేక అధ్యయనాలతో తేలింది.

పెద్దపేగు-మలద్వార (కోలో-రెక్టల్) క్యాన్సర్ల నివారణకు...

పీచుపదార్థాలు (ఫైబర్) ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా కోలోరెక్టల్ క్యాన్సర్‌ను సమర్థంగా నివారించవచ్చు. ఉదాహరణకు పొట్టుతో ఉండే కాయ ధాన్యాలతో పాటు నిమ్మజాతి పండ్లు, బెర్రీ పండ్లు, ఎర్ర ఉల్లిగడ్డలు, దానిమ్మ వంటి పండ్లు తీసుకుంటూ ఉండాలి. వాటితో పాటు క్రూసిఫెరస్ జాతి వెజిటబుల్స్ అయిన క్యాబేజీ, కాలీఫ్లవర్, బ్రాకలీ వంటి ఆహార పదార్థాలతో కోలో-రెక్టల్ క్యాన్సర్లను సమర్థంగా నివారించవచ్చు. ఇక ఉల్లి, వెల్లుల్లి వంటి ఘాటైన ఆహారపదార్థాల్లో ఉండే అల్లిసిన్ వంటి పోషకాలూ పెద్దపేగు-మలద్వార క్యాన్సర్లను సమర్థంగా అరికడతాయి. విటమిన్-డి ఎక్కువగా ఉండే గుడ్లు, చేపలు కూడా ఇందుకు తోడ్పడతాయి.

ఎముక క్యాన్సర్ నివారణకు...

యాంటీ ఆక్సిడెంట్స్ అనే పోషకాలు ఆక్సిడేషన్ ప్రక్రియతో వెలువడే విషయాలను (టాక్సిక్ మెటీరియల్స్‌ను) విరిచేస్తాయి. ఇలాంటి యాంటీఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండే పండ్లు, ఆకుకూరలు... ఉదాహరణకు బెర్రీలు, చెర్రీలు, టొమాటో, బ్రాకలీ వంటివి ఎముక క్యాన్సర్‌ను సమర్థంగా నివారిస్తాయి. అలాగే ఒమెగా 3-ఫ్యాటీ ఆసిడ్స్ అనే పోషకాలు పుష్కలంగా ఉండే సాల్మన్ చేపలు, వాల్‌నట్‌లతోనూ ఎముక క్యాన్సర్లు బాగానే నివారితమవుతాయి. ఇక ప్రోటీన్లు ఎక్కువగా ఉండే మాంసాహారం, చేపలు, గుడ్లతోనూ ఎముక క్యాన్సర్ త్వరితంగా నివారితమవుతుంది.

చివరగా...

ఆహారం తీసుకోవడం అన్నది మన జీవక్రియల కోసం మనం రోజూ తప్పక చేసే పని అయినందున... ఆ ఆహారాన్నే తాజా ఆకుకూరలు, కూరగాయలు, తాజా పండ్ల రూపంలో మరింత ఆరోగ్యకరంగా తీసుకోవడం వల్ల ఒకే సమయంలో రెండు సౌకర్యాలు సమకూరతాయి. అవి ఆరోగ్యంగా ఉండటం, అలా ఆరోగ్యంగా ఉండటం వల్ల వ్యాధి నిరోధకత మన సొంతం కావడంతో ఈ ఇమ్యూనిటీ కూడా క్యాన్సర్‌ల నివారణకు తోడ్పడుతుందని గుర్తుంచుకోవాలి. ఇలా తీసుకున్న ఆహారం వల్ల ఒళ్లు పెరగకుండా తగినంత వ్యాయామమూ చేయడం వల్ల ఈ మార్గంలో క్యాన్సర్ నివారణ మరింత సమర్థంగా చేయడం సాధ్యమవుతుంది.

నిర్వహణ
యాసీన్

బిజినెస్ రీల్

ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీకి 17 ప్రాజెక్టుల ఎంపిక

- వీటి ద్వారా రూ.7,172 కోట్ల పెట్టుబడులు
- కొత్తగా 11,800 మందికి ఉపాధి

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ పథకం (ఈసీఎంఎస్) కింద మరో 17 ప్రాజెక్టులను కేంద్రం ఎంపిక చేసింది. వీటికి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు లభించనున్నాయి. ఈ కంపెనీలు సంయుక్తంగా రూ.7,172 కోట్లను ఇన్వెస్ట్ చేయనుండగా, 11,800 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. రూ.65,111 కోట్ల విలువైన ఉత్పత్తి అందుబాటులోకి రానుంది. జబిల్, ఆక్వస్, ఆసుక్స్ సేఫ్టీ, ఏటీఅండ్ఎస్, ఎహూమే ఐవోటీ, హైక్యూ ఎలక్ట్రోటెక్, మైక్రోప్యాక్, రాకాన్, సహస్ర, సెక్యూర్ మీటర్స్, సియెర్రా సర్క్యూట్స్, సిర్మా మొబిలిటీ, టీఈ కనెక్టివిటీ ప్రాజెక్టులు ఎంపికైన వాటిల్లో ఉన్నాయి. స్మార్ట్ ఫోన్లు, ఐటీ హార్డ్‌వేర్, వేరబుల్స్, టెలికం, ఈవీలు, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, రక్షణ, మెడికల్ ఎలక్ట్రానిక్స్, రెన్యువబుల్ ఎనర్జీ రంగాలకు కావాల్సిన విడిభాగాలను ఇవి తయారు చేయనున్నాయి. కెమెరా మాడ్యూళ్లు, మల్టీ లేయర్ పీసీబీలు, ఎలక్ట్రానిక్ డివైజ్‌లకు ఎన్‌క్లోజర్లు, కనెక్టర్లు, ఆసిలేటర్లు, ఆప్టికల్ ట్రాన్సీవర్లు తదితర విడిభాగాల తయారీకి సంబంధించిన ప్లాంట్లను కంపెనీలు ఏర్పాటు చేయనున్నాయి. తదుపరి దశ వ్యాల్యూ చైన్ అనుసంధానానికి ఈసీఎంఎస్ పథకం వీలు కల్పిస్తుందని కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 2030–31 నాటికి భారత ఎలక్ట్రానిక్స్ రంగం 500 బిలియన్ డాలర్లకు చేరుకునేందుకు సాయపడుతుందన్నారు.

హైదరాబాద్‌లో ఫిన్‌షోర్ మేనేజ్‌మెంట్ కార్యాలయం

Finshore Management Services

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సెబీ రిజిస్టర్డ్ కేటగిరీ 1 మర్చంట్ బ్యాంకింగ్ సంస్థ ఫిన్‌షోర్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కొత్తగా హైదరాబాద్‌లో తమ శాఖను ప్రారంభించింది. పదేళ్లకు పైగా సర్వీసులు అందిస్తున్న ఫిన్‌షోర్ ఇప్పటి వరకు 55 ఎస్ఎంఈల ఐపీవోలను నిర్వహించినట్లు సంస్థ ప్రమోటర్ రామకృష్ణ అయ్యంగార్ తెలారు. అలాగే ఇతరత్రా లిస్టెడ్ కంపెనీల రైట్స్ ఇష్యూలు, ఓపెన్ ఆఫర్లు మొదలైన వాటికి సంబంధించి వేల్యుయేషన్ సేవలను అందిస్తున్నట్లు వివరించారు. దక్షిణాదిలో విస్తరించే క్రమంలో దాదాపు 39,800 ఎస్ఎంఈలకు కేంద్రంగా ఉంటున్న హైదరాబాద్‌ను ఎంచుకున్నట్లు పేర్కొన్నారు. దేశీయంగా అత్యంత వేగంగా ఎదుగుతున్న ఎంట్రప్రెన్యూర్ల వ్యవస్థలో ఒకటిగా నగరం ఉంటోందని వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-11-2025

విశాఖ	610–00
చిత్తూరు	663–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	625–00
విజయవాడ	640–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	620–00
వరంగల్	622–00
రిటైల్ ధర	6.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	309.6	1.93
TATACONSUM	1,179.00	1.83
MAXHEALTH	1,122.20	1.73
EICHERMOT	6,809.00	1.7
MARUTI	15,889.00	1.31

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TMPV	372.65	-4.74
ULTRACEMCO	11,775.00	-0.83
JIOFIN	312.45	-0.78
ASIANPAINT	2,885.40	-0.72
HDFCLIFE	768.3	-0.7

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,982
ఎన్ఎస్ఈ	99,600
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,55,760
ఎఫ్ఐఐ	+ 442
డీఐఐ	+ 1,466

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	59.97 (రాత్రి 11.30కు)	$ 59.95 (క్రితం ముగింపు)
బ్రెంట్	64.30 (రాత్రి 11.30కు)	$ 64.39 (క్రితం ముగింపు)

ఎగుమతులు డీలా

- అక్టోబర్‌లో 11.8 శాతం తగ్గుదల
- 34.38 బిలియన్ డాలర్లకు పరిమితం
- భారీగా పసిడి దిగుమతులు
- 41.68 బిలియన్ డాలర్లకు వాణిజ్య లోటు

న్యూఢిల్లీ: అమెరికా టారిఫ్‌లు మన దేశ ఎగుమతులపై అక్టోబర్‌లో చెప్పుకోతగ్గ ప్రభావమే చూపించాయి. వస్తు ఎగుమతులు క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూసినప్పుడు 11.8 శాతం తక్కువగా 34.38 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇదే నెలలో దిగుమతులు 16.63 శాతం అధికమై 76.06 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్య లోటు 41.68 బిలియన్ డాలర్లుగా నమోదైంది. భారత ఉత్పత్తులపై అమెరికా 50 శాతం టారిఫ్‌లను అమలు చేస్తుండడం తెలిసిందే. సేవల ఎగుమతులు 38.52 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే నెలలో సేవల ఎగుమతులు 34.41 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం.

- బంగారం దిగుమతులు 200 శాతం అధికమై 14.72 బిలియన్ డాలర్లకు చేరాయి. 2024 అక్టోబర్‌లో పసిడి దిగుమతుల విలువ 4.92 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు చూసినా బంగారం దిగుమతులు 21.44 శాతం పెరిగి 41.23 బివలియన్ డాలర్లకు చేరాయి.
- వెండి దిగుమతులు ఏకంగా 529 శాతం పెరిగి 2.71 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- చమురు దిగుమతులు మాత్రం 14.8 బిలియన్ డాలర్లకు తగ్గాయి. 2024 అక్టోబర్‌లో చమురు దిగుమతులు 18.9 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అంటే చమురు దిగుమతుల స్థాయికి బంగారం దిగుమమతులు చేరినట్టు తెలుస్తోంది.
- ఇంజనీరింగ్ ఉత్పత్తులు, పెట్రోలియం ఉత్పత్తులు, రత్నాభరణాలు, అపారెల్స్, టెక్స్‌టైల్, ఆర్గానిక్, ఇనార్గానిక్ కెమికల్స్, ఫార్మాస్యూటికల్స్, ప్లాస్టిక్ గూడ్స్ ఎగుమతులు చెప్పుకోతగ్గ స్థాయిలో తగ్గాయి. ఇక చేతి ఉత్పత్తులు, కార్పెట్, లెదర్, ఐరన్‌ఓర్, టీ, రైస్, పొగాకు, దినుసుల ఎగుమతులు మరింత క్షీణించాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో ఎగుమతులు 254.25 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే 0.63 శాతం ఎక్కువ. ఇదే కాలంలో దిగుమతులు 6.37 శాతం పెరిగి 451.08 బిలియన్ డాలర్లకు చేరాయి. తొలి ఆరు నెలల్లో వస్తు వాణిజ్య లోటు 196.82 బిలియన్ డాలర్లుగా ఉంది.

మొత్తం దిగుమతుల్లో 5 శాతం

బంగారం దిగుమతుల విలువ మొత్తం ఎగుమతుల్లో 5 శాతంగా ఉండడం గమనార్హం. అయితే, పసిడి దిగుమతులు భారీగా పెరగడానికి పండుగల సమయంలో డిమాండ్ కారణమని వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేజ్ అగర్వాల్ పేర్కొన్నారు. బంగారం దిగుమతుల్లో 40 శాతం స్విట్జర్లాండ్ నుంచి రాగా, యూఏఈ నుంచి 16 శాతం, దక్షిణాఫ్రికా నుంచి 10 శాతం చొప్పున దిగుమతైంది.

భారత్ మార్కెట్లోకి జర్మన్ కాస్మెటిక్ బ్రాండ్ 'ఎసెన్స్'

ప్రవేశపెట్టనున్న రిలయన్స్ రిటైల్

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన దిగ్గజ కాస్మెటిక్స్ బ్రాండ్ 'ఎసెన్స్'ని భారత్ మార్కెట్లో అందుబాటులోకి తెస్తున్నట్లు రిలయన్స్ రిటైల్ వెల్లడించింది. ఇందుకోసం దాని మాతృ సంస్థ కాస్నోవా బ్యూటీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది. అత్యంత నాణ్యమైన, అందుబాటు ధరలో లభించే ఉత్పత్తులతో తమ సౌందర్య సాధనాల పోర్ట్‌ఫోలియోను మరింత పటిష్టం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. ఆన్‌లైన్‌లోను, ఆఫ్‌లైన్ స్టోర్స్‌లోను ఇవి లభిస్తాయని వివరించింది. 2002లో జర్మనీలో ప్రారంభమైన ఎసెన్స్ ఉత్పత్తులు 90 పైగా దేశాల్లో అమ్ముడవుతున్నాయి. 80 శాతం ఉత్పత్తులు యూరప్‌లో తయారవుతున్నాయి.

3-5 ఏళ్లలో ఇన్వెస్టర్లు రెట్టింపు

ఈక్విటీ పెట్టుబడిదారులపై సెబీ చీఫ్ గురి

ముంబై: రానున్న మూడు నుంచి ఐదేళ్లలో ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడిదారుల సంఖ్య రెట్టింపునకు పెంచే లక్ష్యంతో ఉన్నట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలియజేశారు. ఇటీవల సెబీ చేపట్టిన సర్వే పలు అంశాలు వెల్లడైనట్లు పాండే పేర్కొన్నారు. సర్వేలో పాల్గొన్నవారిలో ఐదోవంతు వివిధ మార్గాల ద్వారా సెక్యూరిటీ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తిని ప్రదర్శించినట్లు వెల్లడించారు. 2025 అక్టోబర్‌కల్లా దేశీయంగా మొత్తం ఇన్వెస్టర్ల సంఖ్య 12.2 కోట్లకు చేరింది. 2020లో కోవిడ్ మహమ్మారి బయటపడ్డాక ఈ సంఖ్య వేగంగా పెరిగింది. కాగా.. ఇన్వెస్టర్ల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు పాండే తెలియజేశారు. తద్వారా 10 కోట్లమందిని జత చేసుకోగలిగితే పలు దేశాల ప్రజలను మించి దేశీ ఇన్వెస్టర్ల సంఖ్య బలపడనున్నట్లు సీఐఐ ఫైనాన్సింగ్ సదస్సులో ప్రస్తావించారు.

సెబీతోపాటు..

నియంత్రణ సంస్థ సెబీసహా.. కార్పొరేట్లు నాణ్యమైన సెక్యూరిటీల జారీకి కట్టుబడటం ద్వారా క్యాపిటల్ మార్కెట్ల ఎకోసిస్టమ్ బలపడుతుందని పాండే పేర్కొన్నారు. దీంతో పెట్టుబడిదారులను ఆకట్టుకోవచ్చని తెలియజేశారు. యూఎస్ మార్కెట్లలో కరెక్షన్ వచ్చినప్పటికీ దేశీయంగా ఇన్వెస్టర్ల భారీ పెట్టుబడుల కారణంగా దేశీ మార్కెట్లు నిలదొక్కుకుంటాయని అభిప్రాయపడ్డారు. దేశీ మార్కెట్లలో గాలిబుడగల(బబుల్) పరిస్థితిలేదని, అత్యుత్తమ ఆర్థిక వృద్ధి, ప్రభుత్వ పెట్టుబడులు, సంస్కరణలు, సులభతర వ్యాపార నిర్వహణకు వీలు వంటి అంశాలపట్ల ఇన్వెస్టర్లు పెట్టుబడులు చేపడుతున్నట్లు వివరించారు. కొత్త నియంత్రణలకు తెరతీయడం సెబీ అజెండాకాదని, అర్ధంచేసుకోగలిగే సరళతర, ఆవిష్కరణలకు మద్దతిచ్చే తెలివైన నిబంధనలను రూపొందించనున్నట్లు తెలియజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం(2025–26)లో ఈక్విటీ క్యాపిటల్ రూ. 2.5 లక్షల కోట్లను అధిగమించగా.. 7 నెలల్లో కార్పొరేట్ బాండ్ల పెట్టుబడులు రూ. 5.5 లక్షల కోట్లను తాకినట్లు వెల్లడించారు.

ఐపీవోలు బయటపడేందుకే!

ముంబై: కొద్ది నెలలుగా దుమ్మురేపుతున్న ప్రైమరీ మార్కెట్లపట్ల దేశ ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ పెదవి విరిచారు. నిజానికి ఐపీవోలు దీర్ఘకాలిక పెట్టుబడులను సమకూర్చుకోవడానికి కాకుండా కంపెనీ తొలి దశలో ఇన్వెస్ట్‌చేసిన పెట్టుబడిదారులు బయటపడేందుకే ఉపయోగపడుతున్నట్లు వ్యాఖ్యానించారు. ఇక్కడ సీఐఐ నిర్వహించిన ఒక సదస్సులో నాగేశ్వరన్ ప్రసంగించారు. దేశీ క్యాపిటల్ మార్కెట్లు పరిమాణంపరంగానే కాకుండా ప్రయోజనకరంగా ఎదగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ), డెరివేటివ్స్ లావాదేవీల పరిమాణం వంటి అంశాలతో మైలురాళ్లను చేరుకున్నట్లు వేడుక చేసుకోవడం తప్పని తెలియజేశారు. దీనిని ఆర్థిక ఘనతగా భావించరాదని, ఇది ఉత్పాదకత పెంచుకునేందుకు ఉపయోగపడాల్సిన పెట్టుబడులను రిస్కులవైపు మళ్లిస్తుందని అభిప్రాయపడ్డారు.

అంచనా మేర పన్ను వసూళ్లు సాధిస్తాం

- రిఫండ్ క్లెయిమ్‌లపై లోతైన పరిశీలన
- సీబీడీటీ చైర్మన్ రవి అగర్వాల్

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో అంచనా వేసిన విధంగా రూ.25.20 లక్షల కోట్ల పన్ను ఆదాయాన్ని 2025–26లో సాధిస్తామని ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) చైర్మన్ రవి అగర్వాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఇప్పటి వరకు గతేడాది ఇదే కాలంతో పోల్చితే 7 శాతం పెరిగినట్టు చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 10 నాటికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.12.92 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం. రిఫండ్‌లు 18 శాతం తగ్గి రూ.2.42 లక్షల కోట్లుగా ఉన్నాయి. రిఫండ్‌ల్లో జాప్యంపై ఎదురైన ప్రశ్నకు స్పందిస్తూ.. అధిక విలువతో కూడిన రిఫండ్ క్లెయిమ్‌లను ఆదాయపన్ను శాఖ పరిశీలిస్తోందంటూ.. ఏదైనా వెల్లడించడం మర్చిపోయినట్టయితే సవరించిన రిటర్నులు దాఖలు చేయాలని పన్ను చెల్లింపుదారులను కోరుతున్నట్టు చెప్పారు. ''తక్కువ విలువ కలిగిన రిఫండ్‌లను వెంటనే విడుదల చేస్తున్నాం. కొందరు తప్పుడు రిఫండ్‌లు లేదా మినహాయింపులను క్లెయిమ్ చేసుకున్నట్టు గుర్తించాం. మిగిలిన రిఫండ్‌లను ఈ నెల లేదా డిసెంబర్ చివరి నాటికి విడుదల చేస్తాం''అని రవి అగర్వాల్ తెలిపారు.

కొత్త చట్టం కింద ఐటీఆర్‌ల నోటిఫై

సరళీకరించిన నూతన ఆదాయపన్ను చట్టం, 2025 కింద కొత్త నిబంధనలు, ఐటీఆర్‌లను జనవరి చివరికి నోటిఫై చేస్తామని రవి అగర్వాల్ ప్రకటించారు. ఐటీ రిటర్నుల పత్రాలను నిబంధనల అమలు పరంగా సులభతరంగా ఉంచాలన్నది ఆదాయపన్ను శాఖ అభిమతంగా పేర్కొన్నారు. కొత్త ఆదాయపన్ను చట్టాన్ని ఆగస్ట్ 12న పార్లమెంట్ ఆమోదం తెలపడం గమనార్హం. ఇది 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది.

ఆంక్షలతో భారత ఓఎంసీలకు రిస్కేమీ లేదు

- వాటి మార్జిన్లపై ప్రభావం ఉండదు
- ఫిచ్ రేటింగ్స్ అంచనాలు

న్యూఢిల్లీ: రష్యన్ ఆయిల్ కంపెనీలైన రోజ్‌నెఫ్ట్, ల్యూక్ ఆయిల్‌పై అమెరికా ఆంక్షలు విధించడం, రష్యా చమురు ఆధారిత రిఫైనరీ ఉత్పత్తులపై ఐరోపా సమాఖ్య (ఈయూ) నిషేధం విధించడం భారత ప్రభుత్వరంగ చమురు సంస్థల మార్జిన్లు, పరపతి సామర్థ్యాలపై పెద్దగా ప్రభావం ఉండదని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. అయితే, ఈ ఆంక్షలు ఎంత కాలం పాటు కొనసాగుతాయి, ఎంత కఠినంగా అవి అమలవుతాయన్న దాని ఆధారంగా తుది ప్రభావం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. 2025 జనవరి నుంచి ఆగస్ట్ మధ్య కాలంలో భారత చమురు దిగుమతుల్లో మూడింట ఒక వంతు రష్యా నుంచే ఉండడం గమనార్హం. రష్యా డిస్కౌంట్ రేటుపై చమురును విక్రయించడంతో ప్రభుత్వరంగ చమురు సంస్థల లాభదాయకత గణనీయంగా మెరుగుపడింది. సాధారణంగా మధ్యప్రాచ్య దేశాలపై చమురు దిగుమతుల కోసం భారత్ ఎక్కువగా ఆధారపడేది. కానీ, 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడికి దిగిన తర్వాత ఈ పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో మార్కెట్ ధర కంటే తక్కువకే చమురును రష్యా ఆఫర్ చేయడంతో భారత కంపెనీలు అటువైపు మళ్లాయి. దీంతో భారత చమురు దిగుమతుల్లో అంతకుముందు రష్యా వాటా ఒక శాతంగా ఉంటే, 40 శాతానికి పెరిగింది.

చమురు ధరలు తక్కువ స్థాయిలోనే..

ప్రపంచ చమురు ఉత్పత్తి సామర్థ్యం తగినంత ఉండడం ధరలను అదుపులోనే ఉంచుతుందని, బ్రెంట్ బ్యారెల్ ధర 2026లో సగటున 65 డాలర్ల స్థాయిలో ఉండొచ్చని ఫిచ్ రేటింగ్స్ తెలిపంది. 2025లో బ్రెంట్ బ్యారెల్ 70 డాలర్లుగా ఉండడాన్ని ప్రస్తావించింది. ఇక రష్యా చమురు ఆధారిత ఉత్పత్తులను ఈయూకి ఎక్కువగా ఎగుమతి చేస్తున్న భారత్‌లోని ప్రైవేటు చమురు సంస్థలు రిస్కును ఎదుర్కోవాల్సి రావొచ్చని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. మూడు ప్రభుత్వరంగ చమురు సంస్థల (ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీ) ఇష్యూయర్ డిఫాల్ట్ రేటింగ్‌లు బలంగా ఉన్నట్టు తెలిపింది. ఎల్‌పీజీ సబ్సిడీల నష్టాన్ని ప్రభుత్వం ప్రకటించిన రూ.30వేల కోట్ల ప్యాకేజీతో గట్టెక్కొచ్చని పేర్కొంది. స్థూల రిఫైనింగ్ మార్జిన్ 2025–26లో బ్యారెల్‌కు 6–7 డాలర్లు, 2026–27లో 6 డాలర్ల స్థాయిలో ఉండొచ్చని అంచనా వేసింది.

ఇన్ఫీ నుంచి ఏఐ ఫస్ట్ జీసీసీ మోడల్

న్యూఢిల్లీ: గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను (జీసీసీ) కొత్త ఆవిష్కరణల హబ్‌లుగా మార్చేందుకు ఉపయోగపడే ఏఐ–ఫస్ట్ జీసీసీ మోడల్‌ను ఆవిష్కరించినట్లు ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ వెల్లడించింది. జీసీసీల ఏర్పాటుకు సంబంధించి సైట్ ఎంపిక, రిక్రూట్‌మెంట్, కార్యకలాపాలను ప్రారంభించడం వరకు వివిధ అంశాలకు సంబంధించి ప్రణాళికలకు ఇది సహాయకరంగా ఉంటుంది. లుఫ్తాన్సా సిస్టమ్స్, జూప్లస్‌లాంటి 100కు పైగా స్థానిక జీసీసీలతో కలిసి పని చేసిన అనుభవం ఆధారంగా దీన్ని రూపొందించినట్లు ఇన్ఫీ తెలిపింది.

5.2% వద్దే నిరుద్యోగం

అక్టోబర్ గణాంకాలు విడుదల ● సెప్టెంబర్‌లోనూ ఇదే స్థాయి



న్యూఢిల్లీ: నిరుద్యోగ రేటు అక్టోబర్‌లో 5.2 శాతం వద్దే కొనసాగింది. సెప్టెంబర్‌లోనూ 5.2 శాతంగా ఉండగా, ఆగస్ట్‌లో 5.1 శాతం, జూలైలో 5.2 శాతం, మే, జూన్‌లో 5.6 శాతం, ఏప్రిల్‌లో 5.1 శాతం వద్ద ఉండడం గమనార్హం. అక్టోబర్ నెలకు సంబంధించి పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వివరాలను కేంద్ర గణాంకాలు, ప్రణాళికల అమలు శాఖ విడుదల చేసింది. 15 ఏళ్ల వయసు పైబడిన వారికి సంబంధించిన గణాంకాలు ఇవి.

- గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం కాస్తంత తగ్గుముఖం పట్టింది. సెప్టెంబర్‌లో 4.6 శాతంగా ఉంటే, అక్టోబర్‌లో 4.4 శాతానికి తగ్గింది.
- పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పరిస్థితులు దీనికి విరుద్ధంగా ఉన్నాయి. నిరుద్యోగం రేటు సెప్టెంబర్‌లో ఉన్న 6.8 శాతం నుంచి 7 శాతానికి పెరిగింది.
- మొత్తం మీద 15 ఏళ్లు నిండిన మహిళల్లో నిరుద్యోగం 5.5 శాతం నుంచి 5.4 శాతానికి తగ్గింది. గ్రామీణ మహిళల్లో నిరుద్యోగ రేటు 4.3 శాతం నుంచి 4 శాతానికి పరిమితమైంది.
- పురుషులకు సంబంధించి నిరుద్యోగ రేటు అక్టోబర్‌లో 5.1 శాతం వద్ద స్థిరంగా ఉంది. గ్రామీణ పురుషుల్లో నిరుద్యోగం 4.7 శాతం నుంచి 4.6 శాతానికి తగ్గింది. అదే పట్టణాల్లో మాత్రం 6 శాతం నుంచి 6.1 శాతానికి పెరిగింది.
- వర్కర్–పాపులేషన్ రేషియో (మొత్తం జనాభాలో ఉపాధి పొందుతున్న వారు) 52.5 శాతంగా ఉంది. మహిళల్లో వర్కర్ పాపులేషన్ రేషియో స్థిరంగా పెరుగుతూ వస్తోంది. జూన్‌లో ఇది 30.2 శాతంగా ఉంటే, అక్టోబర్‌లో 32.4 శాతానికి మెరుగుపడింది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇది జూన్‌లో 33.6 శాతంగా ఉంటే, అక్టోబర్ నాటికి 36.9 శాతానికి పెరిగింది.
- లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ (ఎల్ఎఫ్‌పీఆర్) జూన్‌లో ఉన్న 54.2 శాతం నుంచి అక్టోబర్‌లో 55.4 శాతానికి మెరుగుపడింది.

3 కంపెనీలు రెడీ

ఐపీవో స్ట్రీట్

సెబీ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా మూడు కంపెనీల దరఖాస్తులను ఆమోదించింది. ఈ జాబితాలో ఏస్‌వెక్టర్, సిల్వర్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్, స్టీల్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ కంపెనీ చేరాయి. వీటిలో ఏస్‌వెక్టర్ 2025 జూలైలో గోప్యతా మార్గాన సెబీకి దరఖాస్తు చేసింది. సిల్వర్ కన్జూమర్, స్టీల్ ఇన్‌ఫ్రా ఈ ఏడాది ఆగస్ట్‌లో ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. ప్రస్తుత క్యాలండర్ ఏడాది(2025)లో ప్రైమరీ మార్కెట్లు సరికొత్త రికార్డులవైపు పరుగు తీస్తున్నాయి. ఇప్పటికే ఈ ఏడాది 92 కంపెనీలు మెయిన్‌బోర్డులో ఐపీవోకు వచ్చాయి. ఈ బాటలో మరికొన్ని కంపెనీలు ఈ నెలలోనే స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు సిద్ధపడుతున్నాయి. ఈ నేపథ్యంలో మరో 3 కంపెనీలకు సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం! వివరాలు చూద్దాం..

స్నాప్‌డీల్

కునాల్ భల్, రోహిత్ బన్సల్ ఏర్పాటు చేసిన ఏస్‌వెక్టర్ రహస్య ఫైలింగ్ విధానంలో ఐపీవోకు అనుమతి పొందింది. ఇటీవల ఇదే మార్గంలో పలు దిగ్గజాలు పబ్లిక్ ఇష్యూ వచ్చిన సంగతి తెలిసిందే. కాగా.. ఈకామర్స్ సంస్థ స్నాప్‌డీల్ మాతృ సంస్థ అయిన ఏస్‌వెక్టర్.. సాస్ ప్లాట్‌ఫామ్ యూనికామర్స్‌సహా, కన్జూమర్ బ్రాండ్ బిల్డింగ్ సంస్థ స్టెల్లారో బ్రాండ్స్‌ను నిర్వహిస్తోంది. వీటిలో యూనికామర్స్ 2024లోనే లిస్టయిన సంగతి తెలిసిందే.

పంపులు, ఫ్యాన్లు

పబ్లిక్ ఇష్యూ ద్వారా సిల్వర్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్ రూ. 1,400 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇందుకు అనుగుణంగా రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 865 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. మరో రూ. 35 కోట్లు అనుబంధ సంస్థ బీఏపీఎల్ రుణాల చెల్లింపులకు వినియోగించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. కంపెనీ ప్రధానంగా పంపులు, మోటార్లు, ఫ్యాన్లు, లైటింగ్ తదితర కన్జూమర్ ఎలక్ట్రికల్ ప్రొడక్టులను తయారు చేస్తోంది.

విస్తరణపై కన్ను

స్టీల్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ ఐపీవోలో భాగంగా రూ. 96 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.42 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వడోదర, హైదరాబాద్, భిలాయ్‌లలోగల తయారీ ప్లాంట్ల విస్తరణతోపాటు.. వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

అనుయా
ప్రాంజలి

భారత షూటర్లకు స్వర్ణ, రజతాలు

న్యూఢిల్లీ: బధిరుల ఒలింపిక్స్ క్రీడల్లో సోమవారం భారత్ ఖాతాలో మూడు పతకాలు చేరాయి. టోక్యోలో జరుగుతున్న ఈ విశ్వ క్రీడల్లో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో అనుయా ప్రసాద్ స్వర్ణ పతకాన్ని దక్కించుకోగా... ప్రాంజలి ధూమల్ రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్లో అనుయా 241.1 పాయింట్లు స్కోరు చేసి బధిరుల విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించడంతోపాటు పసిడి పతకాన్ని సాధించింది. ప్రాంజలి 236.8 పాయింట్లు స్కోరు చేసి రజత పతకాన్ని నెగ్గింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ అభినవ్ దేశ్వాల్ రజత పతకాన్ని గెలిచాడు. ఫైనల్లో అభినవ్ 235.2 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచాడు. రెండు రోజుల పోటీలు ముగిశాక భారత్ 2 స్వర్ణాలు, 4 రజతాలు, 1 కాంస్యంతో కలిపి ఏడు పతకాలతో మూడో స్థానంలో ఉంది.

సౌమ్య

సౌమ్య బృందం శుభారంభం

వుహాన్ (చైనా): ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫడరేషన్ (ఏఎఫ్‌సీ) మహిళల చాంపియన్స్ లీగ్ గ్రూప్ 'బి'లో భారత్‌కు చెందిన ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు శుభారంభం చేసింది. ఇరాన్‌కు చెందిన బామ్ ఖాతూన్ ఎఫ్‌సీ జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఈస్ట్ బెంగాల్ 3–1 గోల్స్ తేడాతో గెలిచింది. తెలంగాణకు చెందిన సౌమ్య గుగులోత్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈస్ట్ బెంగాల్ జట్టు జాతీయ మహిళల లీగ్ చాంపియన్ హోదాలో ఏఎఫ్‌సీ చాంపియన్స్ లీగ్ టోర్నీకి అర్హత సాధించింది. ఈస్ట్ బెంగాల్ తరఫున షిల్కీ హేమం (4వ నిమిషంలో), ఫజీలా ఇక్వాపుత్ (32వ నిమిషంలో), రెస్టీ నాన్‌జిరి (87వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. బామ్ ఖాతూన్ జట్టుకు మోనా హమూది (45+8వ నిమిషంలో) ఏకైక గోల్ అందించింది. గురువారం జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో వుహాన్ జియాంగ్డా ఎఫ్‌సీ (చైనా) జట్టుతో ఈస్ట్ బెంగాల్ తలపడుతుంది.

రన్నరప్ అనిరుధ్ జోడీ

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది ఐదో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్‌కు నిరాశ ఎదురైంది. ఆస్ట్రేలియాలో జరిగిన బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్–75 టోర్నీలో అనిరుధ్ చంద్రశేఖర్ (భారత్)–రీస్ స్టాల్డర్ (అమెరికా) ద్వయం రన్నరప్‌గా నిలిచింది. మ్యాట్ హుల్మీ–కోడీ పియర్సన్ (ఆస్ట్రేలియా) జంటతో జరిగిన ఫైనల్లో అనిరుధ్–స్టాల్డర్ ద్వయం 6–7 (5/7), 6–3, 6–10తో 'సూపర్ టైబ్రేక్'లో పోరాడి ఓడిపోయింది. 1 గంట 48 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో ఇండో–అమెరికన్ జంట ఐదు ఏస్‌లు సంధించింది. తొలి సర్వీస్‌లో 53 పాయింట్లకుగాను 43 పాయింట్లు... రెండో సర్వీస్‌లో 24 పాయింట్లకుగాను 8 పాయింట్లు సాధించింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. అనిరుధ్–స్టాల్డర్ జంటకు 2,880 డాలర్ల (రూ. 2 లక్షల 55 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 50 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది ఏటీపీ సర్క్యూట్‌లో అనిరుధ్ నాలుగు (బెంగళూరు ఓపెన్, గిరోనా ఓపెన్, లెక్సింగ్టన్ ఓపెన్, జింగ్‌షాన్ ఓపెన్) చాలెంజర్ డబుల్స్ టైటిల్స్ సాధించాడు.

సూపర్ సినెర్

వరుసగా రెండో ఏడాది ఏటీపీ ఫైనల్స్ టోర్నీ టైటిల్ హస్తగతం

- ఒక్క సెట్ కోల్పోకుండా వరుసగా రెండేళ్లు విజేతగా నిలిచిన తొలి ప్లేయర్‌గా రికార్డు
- ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్‌పై విజయం

రూ. 44 కోట్ల 92 లక్షల ప్రైజ్‌మనీ సొంతం



సినెర్

ట్యూరిన్: సొంతగడ్డపై 2025 సీజన్‌ను ఇటలీ టెన్నిస్ సూపర్ స్టార్ యానిక్ సినెర్ అద్భుతంగా ముగించాడు. పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నమెంట్ అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ సినెర్ విజేతగా నిలిచాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన సింగిల్స్ ఫైనల్లో సినెర్ 7–6 (7/4), 7–5తో ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)పై విజయం సాధించాడు. 2 గంటల 15 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సినెర్ ఎనిమిది ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తొలి సర్వీస్‌లో 43 పాయింట్లకుగాను 36 పాయింట్లు... రెండో సర్వీస్‌లో 35 పాయింట్లకుగాను 19 పాయింట్లు సంపాదించాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు.

- ఈ గెలుపుతో సినెర్ వరుసగా రెండో ఏడాది ఏటీపీ ఫైనల్స్ టోర్నీలో టైటిల్‌ను దక్కించుకున్నాడు. గత సంవత్సరంతోపాటు ఈ ఏడాది కూడా సినెర్ టైటిల్ గెలిచే క్రమంలో ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం విశేషం. ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ఓడిపోయినా... ముఖాముఖి రికార్డులో అల్‌కరాజ్ 10–6తో సినెర్‌పై ఆధిక్యంలో ఉన్నాడు.
- 1970లో ఏటీపీ ఫైనల్స్ టోర్నీ ప్రారంభమయ్యాక ఇప్పటి వరకు వరుసగా రెండేళ్లు ఒక్క సెట్ చేజార్చుకోకుండా విజేతగా నిలిచిన తొలి ప్లేయర్‌గా సినెర్ రికార్డు నెలకొల్పాడు.
- టైటిల్ నెగ్గిన సినెర్‌కు 50,71,000 డాలర్ల (రూ. 44 కోట్ల 92 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. రన్నరప్ అల్‌కరాజ్ ఖాతాలో 27,04,000 డాలర్ల (రూ. 23 కోట్ల 95 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు చేరాయి.
- ఏటీపీ ఫైనల్స్ టోర్నీని వరుసగా రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువసార్లు గెలిచిన తొమ్మిదో ప్లేయర్‌గా సినెర్ గుర్తింపు పొందాడు. గతంలో జొకోవిచ్ (సెర్బియా), ఫెడరర్ (స్విట్జర్లాండ్), ఇవాన్ లెండిల్ (చెక్ రిపబ్లిక్), పీట్ సంప్రాస్ (అమెరికా), ఇలీ నస్టాసె (రొమేనియా), జాన్ మెకన్రో (అమెరికా), జాన్ బోర్గ్ (స్వీడన్), లీటన్ హెవిట్ (ఆస్ట్రేలియా) ఈ ఘనత సాధించారు.


అల్‌కరాజ్

పవన్

ఐదు పతకాలు ఖాయం

గ్రేటర్ నోయిడా: ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ టోర్నమెంట్ పురుషుల విభాగంలో భారత్‌కు ఐదు పతకాలు ఖాయమయ్యాయి. జాదుమణి సింగ్ (50 కేజీలు), పవన్ బర్త్‌వాల్ (55 కేజీలు), హితేశ్ గులియా (70 కేజీలు), సుమిత్ కుందు (75 కేజీలు), నవీన్ (90 కేజీలు) సెమీఫైనల్లోకి ప్రవేశించి కనీసం కాంస్య పతకాలను సొంతం చేసుకోనున్నారు. సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో పవన్ 5–0తో అల్తిన్‌బెక్ నూర్‌సుల్తాన్ (కజకిస్తాన్)పై, జాదుమణి సింగ్ 5–0తో నుర్జత్ ఒంగారోవ్ (కజకిస్తాన్)పై ఏకపక్ష విజయాలు సాధించారు. హితేశ్ గులియా 3–2తో ఆసియా చాంపియన్ సెవన్ ఒకాజావా (జపాన్)పై... సుమిత్ 5–0తో కిమ్ హైన్ టే (దక్షిణ కొరియా)పై, నవీన్ 5–0తో బెక్‌జాత్ టంగాటర్ (కజకిస్తాన్)పై గెలుపొందారు. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో భారత్ నుంచి పది మంది బాక్సర్లు పోటీపడనున్నారు.

అభిషేక్ రెడ్డి అజేయ సెంచరీ

ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 224/2 • రాణించిన భరత్, షేక్ రషీద్

జంషెడ్‌పూర్: టాప్ ఆర్డర్ బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడటంతో... జార్ఖండ్ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ప్రత్యర్థికి దీటైన జవాబు ఇచ్చింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 60 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 224 పరుగులు సాధించింది. ఓపెనర్ అభిషేక్ రెడ్డి (156 బంతుల్లో 103 బ్యాటింగ్; 11 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీతో క్రీజులో ఉండగా... భారత జట్టు మాజీ సభ్యుడు కోన శ్రీకర్ భరత్ (67 బంతుల్లో 51; 8 ఫోర్లు), అండర్–19 ప్రపంచకప్ విజేత టీమిండియా సభ్యుడు షేక్ రషీద్ (117 బంతుల్లో 58; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు నమోదు చేశారు. భరత్‌తో తొలి వికెట్‌కు 94 పరుగులు జోడించిన అభిషేక్... రషీద్‌తో రెండో వికెట్‌కు 122 పరుగులు జత చేశాడు. అభిషేక్‌తో కలిసి నైట్‌వాచ్‌మన్ త్రిపురాణ విజయ్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. జార్ఖండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఆంధ్ర మరో 104 పరుగుల దూరంలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 259/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన జార్ఖండ్ జట్టు 112.3 ఓవర్లలో 328 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ 67 పరుగులిచ్చి 4 వికెట్లు... సౌరభ్ కుమార్ 77 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టారు.

హైదరాబాద్ 121 ఆలౌట్

జమ్మూ: బ్యాటర్ల వైఫల్యం కారణంగా... జమ్మూ కశ్మీర్ జట్టుతో జరుగుతున్న గ్రూప్ 'డి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ కష్టాల్లో పడింది. ఓవర్‌నైట్ స్కోరు 88/6తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ మరో 33 పరుగులు జోడించి 4 వికెట్లు కోల్పోయి 121 పరుగుల వద్ద ఆలౌటైంది. హైదరాబాద్ కెప్టెన్ రాహుల్ సింగ్ (48; 6 ఫోర్లు), తనయ్ త్యాగరాజన్ (16; 1 ఫోర్), రక్షణ్ రెడ్డి (11; 1 ఫోర్), కార్తికేయ కక్ (10; 2 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. జమ్మూ కశ్మీర్ బౌలర్లలో సునీల్ కుమార్ 29 పరుగులిచ్చి 5 వికెట్లు, ఆకిబ్ నబీ 39 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టారు. 49 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన జమ్మూ కశ్మీర్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 71 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 275 పరుగులు సాధించింది. కమ్రాన్ ఇక్బాల్ (50; 8 ఫోర్లు), అబ్దుల్ సమద్ (77 బ్యాటింగ్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), కన్హయ్య వాధ్వాన్ (82 బ్యాటింగ్; 10 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్ జట్టు 324 పరుగుల ఆధిక్యంలో ఉంది.

నార్వే నిరీక్షణ ముగిసె...

- 1998 తర్వాత మళ్లీ ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత
- వరుసగా ఏడోసారి పోర్చుగల్‌కు ప్రపంచకప్ బెర్త్

మిలాన్ (ఇటలీ): సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ నార్వే పురుషుల ఫుట్‌బాల్ జట్టు ప్రపంచకప్ టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. గ్రూప్ 'ఐ'లో భాగంగా నాలుగుసార్లు ప్రపంచ చాంపియన్ ఇటలీ జట్టుతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో నార్వే 4–1 గోల్స్ తేడాతో గెలిచింది. ఐదు జట్లున్న గ్రూప్ 'ఐ'లో నార్వే జట్టు ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లోనూ గెలుపొందింది. 24 పాయింట్లతో గ్రూప్ 'టాపర్'గా నిలిచి 1998 తర్వాత మళ్లీ ప్రపంచకప్ టోర్నీ బెర్త్‌ను దక్కించుకుంది. ఆట 24వ నిమిషంలో ఎస్పోసిటో గోల్‌తో ఇటలీ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ ఆధిక్యాన్ని ఇటలీ 63వ నిమిషం వరకు కాపాడుకుంది. ఆ తర్వాత నార్వే ఆటగాళ్లు విజృంభించారు. నాలుగు గోల్స్ సాధించి ఇటలీకి షాక్ ఇచ్చారు. 63వ నిమిషంలో నూసా గోల్‌తో నార్వే 1–1తో స్కోరును సమం చేసింది. రెండు నిమిషాల వ్యవధిలో హాలాండ్ (77వ, 79వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయడంతో నార్వే 3–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. 90+3వ నిమిషంలో లార్సెన్ గోల్‌తో నార్వే 4–1తో ఘనవిజయాన్ని ఖాయం చేసుకుంది. గ్రూప్ 'ఐ'లో 18 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన ఇటలీ 'ప్లే ఆఫ్' టోర్నీకి అర్హత సాధించింది. 16 జట్లు పోటీపడే యూరోపియన్ 'ప్లే ఆఫ్ టోర్నీ' ద్వారా నాలుగు జట్లు ప్రపంచకప్‌కు అర్హత పొందుతాయి. 2018, 2022 ప్రపంచకప్ టోర్నీలకు అర్హత సాధించడంలో విఫలమైన ఇటలీ ఈసారీ గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది.

రొనాల్డో లేకుండానే...

మరోవైపు గ్రూప్ 'ఎఫ్' నుంచి పోర్చుగల్ జట్టు వరుసగా ఏడోసారి ప్రపంచకప్ బెర్త్‌ను సాధించింది. అర్మేనియా జట్టుతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో పోర్చుగల్ 9–1 గోల్స్ తేడాతో ఘనవిజయం నమోదు చేసుకుంది. నాలుగు జట్లున్న గ్రూప్ 'ఎఫ్'లో పోర్చుగల్ 13 పాయింట్లతో 'టాపర్'గా నిలిచింది. కెప్టెన్ క్రిస్టియానో రొనాల్డో లేకుండానే ఈ మ్యాచ్‌లో ఆడిన పోర్చుగల్ గోల్స్ వర్షం కురిపించింది. పోర్చుగల్ తరఫున నెవెస్ (30వ, 41వ, 81వ నిమిషాల్లో), ఫెర్నాండెస్ (45+3వ, 52వ, 72వ నిమిషాల్లో) మూడు గోల్స్ చొప్పున చేయగా... వీగా (7వ నిమిషంలో), రామోస్ (28వ నిమిషంలో), కాన్సియో (90+2వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. అమెరికా, మెక్సికో, కెనడా ఉమ్మడిగా ఆతిథ్యమిచ్చే 2026 ప్రపంచకప్ టోర్నీలో తొలిసారి 48 జట్లు బరిలోకి దిగుతున్నాయి. ఇప్పటి వరకు 32 జట్లు అర్హత సాధించాయి.

నార్వే బృందం విజయానందం

సంబరంలో పోర్చుగల్ ఆటగాళ్లు

కేరళలోని ప్రఖ్యాత శబరిమల ఆలయంలో సోమవారం నుంచి మండల- మకరవిలక్కు పూజలు మొదలయ్యాయి. ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూజారి

దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లోని సిటీ హాల్‌లో క్రిస్మస్ లైటింగ్ వేడుక సోమవారం అట్టహాసంగా జరిగింది. పెద్ద సంఖ్యలో జనం పాల్గొన్న ఈ కార్యక్రమంలో విద్యుద్దీపాల వెలుగులు విరజిమ్మాయి

ఆ నిందితుల్ని అస్సలు విడుదల చేయొద్దు

డిజిటల్ అరెస్టు కేసులో సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: డిజిటల్ అరెస్ట్ అంటూ సుప్రీంకోర్టు మహిళా లాయర్(72)నుంచి రూ.3.29 కోట్లు కొట్టేసిన మోసగాడిని విడుదల చేయవద్దంటూ సుప్రీంకోర్టు దిగువ కోర్టును ఆదేశించింది. ఈ కేసు తీవ్రత దృష్ట్యా ఇలాంటి అసాధారణ ఆదేశాలను జారీ చేయాల్సి వస్తోందంటూ వ్యాఖ్యానించింది. ఇలాంటి కేసుల్లో కఠినమైన నిర్ణయాల ద్వారా మోసగాళ్లకు సరైన సందేశం ఇవ్వాలనుకుంటున్నామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం పేర్కొంది. డిజిటల్ అరెస్ట్ బాధిత లాయర్ కేసులో చొరవచూపాలని, ఈ నేరానికి పాల్పడిన వారిపై కఠిన చర్య తీసుకోవాలంటూ సుప్రీం లాయర్లు వేసిన పిటిషన్‌పై ఈ మేరకు తీర్పు వెలువరించింది. మేలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి నిందితులకు బెయిల్ మంజూరయ్యే అవకాశాలున్నాయంటూ అందులో పేర్కొన్నారు. దీనిపై వెంటనే స్పందించిన ధర్మాసనం ..విజయ్ ఖన్నా తదితర నిందితులను ఏ కోర్టు కూడా విడుదల చేయరాదు' అని స్పష్టం చేసింది.

రూ. 32 కోట్లు కొట్టేశారు

డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసం

బెంగళూరు మహిళకు టోకరా

బెంగళూరు: సైబర్ నేరగాళ్ల చేతిలో బెంగళూరుకు చెందిన సీనియర్ ఐటీ ఉద్యోగి మోసపోయారు. డిజిటల్ అరెస్టు పేరుతో ఆమెను బెదిరించిన నేరగాళ్లు ఏకంగా.. రూ.32 కోట్లు కొట్టేశారు. గతేడాది చివరి మూడు నెలల్లో మొదలైన ఈ ఘరానా మోసం ఈ ఏడాది వరకు కొనసాగింది. కొడుకు పెళ్లి ఉండటంతో విషయం బయటకు తెలియకుండా ఉంచిన మహిళ.. ఎట్టకేలకు ఈ నెల 14న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

డ్రగ్స్ పార్సిల్ వచ్చిందని చెప్పి...

బెంగళూరుకు చెందిన 57 మహిళ ఐటీ ఉద్యోగి. 2024 సెప్టెంబర్ 15న ఆమెకు ఓ వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. తనను తాను డీహెచ్ఎల్ కొరియర్ కంపెనీ ప్రతినిధిగా చెప్పుకొన్నాడు. మహిళ పేరుతో 3 క్రెడిట్ కార్డులు, 4 పాస్‌పోర్టులు, నిషేధిత ఎండీఎం డ్రగ్స్ ఉన్న పార్సిల్ ముంబైలోని తమ కొరియర్ సెంటర్‌కు వచ్చిందని చెప్పాడు. అయితే తానుండేది బెంగళూరులోనని, ఆ ప్యాకేజీతో తనకు సంబంధం లేదని మహిళ చెప్పారు. ఆ ప్యాకేజీ ఆమె నెంబర్‌తోనే లింక్ చేసి ఉందని, అది సైబర్ మోసం కావచ్చని కూడా చెప్పాడు. అంతేకాదు సైబర్ క్రైమ్‌సెల్‌కు ఫిర్యాదు చేయాలంటూ ఆమెకు సూచించాడు. సీబీఐ అధికారిగా చెప్పుకున్న ఓ వ్యక్తికి కాల్ ట్రాన్స్‌ఫర్ చేశారు. సదరు వ్యక్తి మహిళ నుంచి అనేక వివరాలు సేకరించాడు. సాక్ష్యాలన్నీ ఆమెకు వ్యతిరేకంగా ఉన్నాయని, ఆమెపై తమ నిఘా ఉందని భయపెట్టాడు. ఈ విషయం గురించి స్థానిక పోలీసులకు చెప్పొద్దని, ఎవరికైనా చెప్పాలని చూస్తే కుటుంబం మొత్తం కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. దీంతో భయపడ్డ ఆమె.. సైబర్ నేరగాళ్లు చెప్పినట్లే చేసింది. కొన్ని రోజులకు మరో వ్యక్తి సీబీఐ అధికారినంటూ ఫోన్ చేశాడు. వీడియో కాల్ చేసి ఆమెను డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు బెదిరించారు. ఆ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న మహిళ ఆ విషయాన్ని వాళ్లకు చెప్పారు. దీంతో 2024 సెప్టెంబర్ 23న ఫోన్ చేసిన ఆ వ్యక్తి.. మహిళ ఆస్తులన్నింటినీ ఆర్‌బీఐకి చెందిన ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ ముందు ప్రకటించాలని చెప్పాడు. బాధిత మహిళ ఆ కాల్ చేసిన వ్యక్తి చెప్పినట్లే చేసింది. నెమ్మదిగా వారిని నమ్మేసింది. దీంతో ఆమె నుంచి డబ్బు లాగడం మొదలుపెట్టారు.

187 లావాదేవీల్లో రూ. 31.83 కోట్లు బదిలీ..

ఆమెను రెండు స్కైప్ ఐడీలను ఇన్‌స్టాల్ చేయాలని చెప్పి, నిరంతరం వీడియో కాల్‌లో ఉండాలని బెదిరించారు. వీడియో కాల్ మొదలైన తరువాత మోహిత్ హండా అనే వ్యక్తి ఆమెను రెండు రోజులు పర్యవేక్షించాడు. ఆ తర్వాత రాహుల్ యాదవ్ అనే వ్యక్తి ఒక వారం పాటు ఆమెపై నిఘా ఉంచాడు. ప్రదీప్‌సింగ్ అనే వ్యక్తి సీనియర్ సీబీఐ అధికారిగా నటిస్తూ ఆమె నిర్దోషి అని నిరూపించుకోవాలని ఒత్తిడి తెచ్చాడు. అలా గతేడాది సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 22 మధ్య మహిళ తన ఆర్థిక వివరాలను వెల్లడించి, పెద్ద మొత్తంలో డబ్బును వారికి బదిలీ చేసింది. అక్టోబర్ 24 నుంచి నవంబర్ 3 వరకు రూ. 2 కోట్లు డిపాజిట్ చేసింది, ఆ తరువాత పన్నుల పేరుతో మరికొంత చెల్లించింది. చివరకు తన ఫిక్స్‌డ్ డిపాజిట్లను, ఇతర పొదుపులను కూడా డ్రా చేసి 187 లావాదేవీల్లో రూ.31.83 కోట్లను వారికి బదిలీ చేసింది. ఆమె నిర్దోషి అని తేలితే ఈ ఏడాది ఫిబ్రవరిలో డబ్బు తిరిగి స్తామని వారు చెప్పారు. నిరంతరం నిఘా, ఒత్తిడి మధ్య ఆమె జబ్బు పడింది. దీంతో ఒక నెల చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. ఆ సమయంలోనూ ఆమె ఎక్కడ ఉన్నది, ఏం చేస్తున్నదనే విషయాలను ఎప్పటికప్పుడు వారికి చెబుతూ వచ్చింది. ఫిబ్రవరిలో డబ్బు తిరిగి ఇచ్చేస్తామన్న వారు.. మార్చికి వాయిదా వేశారు. కొన్ని రోజుల తరువాత వారి నుంచి కాల్స్ ఆగిపోయాయి. కమ్యూనికేషన్ లేకుండా పోయింది. జూన్‌లో తన కొడుకు పెళ్లి ఉండటంతో అప్పటివరకు ఆగిన మహిళ వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ నెల 14న బెంగళూరులోని తూర్పు డివిజన్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కొడుకు పెళ్లి, ఇతర కారణాల వల్ల ఫిర్యాదు ఆలస్యమైందని తెలిపింది. మహిళ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

టైమ్స్ స్క్వేర్‌ను చుట్టేసిన 'చీర'

న్యూయార్క్

'సింగారమనే దారంతో చేసింది చీర
ఆనందమనే రంగులనే అద్దింది చీర
మమకారమనే మగ్గంపై నేసింది చీర
చీరలోని గొప్పతనం తెలుసుకో..'

అంటూ చీరకున్న ప్రత్యేకతను వర్ణించారు కవులు. అలాంటి చీర సాధికారతను అమెరికాలో ప్రదర్శించారు మహిళలు. న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్‌లో ప్రత్యేక 'చీర'కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యూయార్క్‌కు చెందిన ఓ దాతృత్వ సంస్థ ఉమా గ్లోబల్, స్థానిక కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. 'చీర గోస్ గ్లోబల్'పేరుతో జరిగిన ఈ కార్యక్రమం రెండో ఎడిషన్. ఈ వేడుకలో భారత్, బంగ్లాదేశ్, వెస్టిండీస్, మలేసియా, సింగపూర్, శ్రీలంక, అమెరికాలోని పలు నగరాల నుంచే కాకుండా న్యూయార్క్ మహిళలు కూడా పాల్గొన్నారు. విభిన్నమైన రంగులు, వివిధ రకాల చీరలతో టైమ్స్‌స్క్వేర్ కళకళలాడింది. కార్యక్రమంలో బిహు నృత్యం వంటి సాంస్కృతిక ప్రదర్శనలు, చీర వాకథాన్ నిర్వహించారు. టైమ్స్ స్క్వేర్ చుట్టూ ఒక సింబాలిక్ మార్చ్ నిర్వహించారు. 'వేల సంవత్సరాల చరిత్ర కలిగిన, ప్రపంచంలోని అత్యంత పురాతనమైన మహిళలు నిరంతరం ధరించే వస్త్రాల్లో చీర ఒకటి. చీరకట్టే విధానం, రకరకాల శైలులు భారత్ వైవిధ్యాన్ని, కళాత్మక వారసత్వాన్ని ప్రతిబింబిస్తాయి'న్యూయార్క్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియాలోని కాన్సుల్ ప్రజ్ఞాసింగ్ అన్నారు. చీర సాంస్కృతిక చరిత్ర, వైవిధ్యాన్ని ఆమె గుర్తు చేశారు. ఇది కేవలం సాంస్కృతిక వేడుక మాత్రమే కాదని, ఇండియాలోని చేతి వృత్తుల చరిత్రకు ప్రతీకని, మహిళలు నాయకత్వం వహిస్తే సమాజాలు అభివృద్ధి చెందుతాయని చీర మనకు గుర్తు చేస్తుందని న్యూయార్క్ నగర మేయర్ కార్యాలయంలో అంతర్జాతీయ వ్యవహారాల డిప్యూటీ కమిషనర్ దిలీప్ చౌహాన్ అన్నారు.

టైమ్స్ స్క్వేర్ వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రజ్ఞాసింగ్ తదితరులు

రాజ్‌భవన్‌లో జాగిలాలతో తనిఖీలు

బెంగాల్ గవర్నర్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో భద్రతా సిబ్బంది సోదాలు

ఆయుధాలున్నాయంటూ టీఎంసీ ఎంపీ ఆరోపణలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ సారథ్యంలో సోమవారం రాజ్‌భవన్‌లో భద్రతా సిబ్బంది సోదాలు నిర్వహించారు. రాజ్‌భవన్‌లో ఆయుధాలను ఉంచారంటూ టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఆరోపణలు చేసిన నేపథ్యంలో రాజ్‌భవన్ పరిసరాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. గవర్నర్ భద్రతా సిబ్బందితోపాటు కోల్‌కతా పోలీసులు, కేంద్ర బలగాలు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ఎక్కడన్నా ఉన్నాయేమోనని పూర్తిస్థాయిలో సోదాలు జరిపామని ఓ అధికారి తెలిపారు. ఉత్తర బెంగాల్‌లో పర్యటనలో ఉన్న ఆయన పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని వచ్చి, మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో రాజ్‌భవన్ గ్రౌండ్ ఫ్లోర్ నుంచి తనిఖీలు మొదలు పెట్టారన్నారు. ముందుగా రాజ్‌భవన్ లోపల ఉన్నవారందరినీ బయటకు పంపించి వేశారని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ప్రక్షాళనకు ఎస్ఐఆర్ అత్యవసరమంటూ గవర్నర్ చేసిన వ్యాఖ్యలపై కల్యాణ్ బెనర్జీ 'ఆయుధాల'ఆరోపణలు చేయడం తెల్సిందే.

బతికున్నట్లు నిరూపించుకునేందుకు మూడేళ్లు

డెత్ సర్టిఫికెట్‌లో భర్తకు బదులుగా భార్య పేరు చేర్చిన అధికారులు

అలీగఢ్: అధికారిక రికార్డుల ప్రకారం ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ జిల్లాకు చెందిన 58 ఏళ్ల సరోజ్ దేవి మూడేళ్ల క్రితమే చనిపోయింది..! అసలు చనిపోయింది నా భర్త..నేను కాదు మొర్రో.. అని అప్పటి నుంచి ఆమె అధికారుల వద్దకు వెళ్లి మొరపెట్టుకుంటూనే ఉంది. ఎవరూ ఆమె గోడును పట్టించుకున్న పాపాన పోలేదు. చమర్ నగారియా గ్రామానికి చెందిన జగదీశ్ ప్రసాద్ 2020లో చనిపోయాడు. స్థానిక క్లర్కు ఒకరు మృతుల జాబితాలో జగదీశ్ ప్రసాద్ బదులుగా అతడి భార్య సరోజ్ దేవి చనిపోయినట్లుగా 2022 జనవరి ఒకటో తేదీన నమోదు చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆమెకు కష్టాలు మొదలయ్యాయి. సరోజ్ దేవి ఆధార్ నంబర్‌ను డీయాక్టివేట్ అయ్యింది. గుర్తింపునకు సంబంధించిన ఇతర ఆధారలేవీ ఆమెకు లేకుండాపోయాయి. అప్పటి నుంచి ఆమె అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉంది. మూడేళ్లయినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. చివరికి ఈ నెల 15వ తేదీన ఖైర్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ శిశిర్ కుమార్‌కు తెహశీల్ దివస్ సందర్భంగా సరోజ్ దేవి తన సమస్యను వివరించింది. తన గుర్తింపును పునరుద్ధరించాలని, తనను తిరిగి బతికించాలని కోరింది. ఎట్టకేలకు ఆయన స్పందించారు. ప్రాధాన్యం కలిగిన అంశంగా భావించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రికార్డుల్లో ఇందుకు అవసరమైన దిద్దుబాట్లు చేపట్టామని శిశిర్ కుమార్ తెలిపారు. సమస్య పరిష్కారమై సరోజ్ దేవి త్వరలోనే ప్రభుత్వ రికార్డుల్లో సజీవురాలు అవ్వాలని ఆశిద్దాం.!

ఈవీఎం అవకతవకలపై కోర్టుకెళ్తాం: ఆర్జేడీ

పట్నా: బిహార్ ఎన్నికల్లో ఘోర పరాజయంపై మహాగఠ్‌బంధన్‌లోని ప్రధానమైన ఆర్జేడీ స్పందించింది. ఎన్నికల ఫలితాలు ప్రజల మనోభావాలను ప్రతిబింబించడం లేదన్న ఆ పార్టీ ఈవీఎంలపై అనుమానాలున్నాయని వ్యాఖ్యానించింది. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పేర్కొంది. ఇటీవల ఎన్నికల్లో 143 సీట్లలో పోటీ చేసిన ఈ పార్టీకి 25 సీట్లు మాత్రమే దక్కడం తెల్సిందే. ఇదొక్కటే కాదు, ఈ కూటమిలోని మిగతా పార్టీలు సైతం ఇదే రకమైన ఫలితాలను చవిచూశాయి. 243 సభ్యులున్న అసెంబ్లీలో ఎన్డీయే పక్షాలు ఏకంగా 202 సీట్లు గెల్చుకున్నాయి. 'క్షేత్రస్థాయి పరిస్థితికి తగ్గట్లుగా ఎన్నికల ఫలితాలు రాలేదు. అధికార పక్షంపై ప్రజాగ్రహం ఉన్నప్పటికీ ఫలితాలు ఇలా వచ్చాయి. తగురీతిలో ఆధారాలను సేకరించాక కోర్టుకు వెళదామనుకుంటున్నాం'అని ఆర్జేడీ నేత శక్తి సింగ్ చెప్పారు. సోమవారం ఎన్నికల బరిలో ఉన్న ఆర్జేడీ అభ్యర్థుల సమావేశం జరిగింది. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, రబ్డీదేవి తదితరులు పాల్గొన్నారు.

టైగర్ రిజర్వుల చుట్టూ ఈఎస్‌జెడ్‌లు

కిలోమీటర్ పరిధిలో మైనింగ్‌పై నిషేధం • రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న టైగర్ రిజర్వుల పరిరక్షణకు సంబంధించి సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. టైగర్ రిజర్వుల చుట్టూ ఉన్న ప్రాంతాన్ని సున్నిత పర్యావరణ జోన్లు(ఈఎస్‌జెడ్)లుగా ప్రకటించాలని, బఫర్ జోన్‌లలో కిలోమీటర్ పరిధిలో మైనింగ్ కార్యకలాపాలపై పూర్తి నిషేధం విధించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.ఏడాదిలోగా వీటిని అమలు చేయాలని స్పష్టం చేసింది. జిమ్ కార్బెట్ టైగర్ రిజర్వులో అక్రమంగా చెట్ల నరికివేత, నిర్మాణ పనుల కారణంగా జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని ఉత్తరఖండ్ ప్రభుత్వానికి ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం 80 పేజీల తీర్పు వెలువరించింది.

జిమ్ కార్బెట్‌కు తీవ్ర నష్టం

టైగర్ రిజర్వుల్లో పర్యావరణ ఉల్లంఘనలు, నష్టం తీవ్రత, పునరుద్ధరణ చర్యలతోపాటు ప్రఖ్యాత జిమ్ కార్బెట్ టైగర్ రిజర్వులో జరిగిన విధ్వంసానికి బాధ్యులైన అధికారుల గుర్తింపు తదితరాలపై 2024 మార్చిలో నియమించిన నిపుణుల కమిటీ తాజాగా ఇచ్చిన నివేదికను ధర్మాసనం ఆమోదించింది.కార్బెట్ టైగర్ రిజర్వులో సుమారు రూ.30 కోట్ల మేర విధ్వంసం జరిగినట్లు కమిటీ అంచనా వేసిందని ధర్మాసనం పేర్కొంది. దెబ్బతిన్న పర్యావరణ వ్యవస్థలను తిరిగి పునరుద్ధరించేందుకు రూ.4.3 కోట్ల వరకు ఖర్చవుతుందని తేల్చినట్లు కూడా ధర్మాసనం తెలిపింది. ఈ నివేదిక సూచనల మేరకు జిమ్‌కార్బెట్ టైగర్ రిజర్వు పునరుద్ధరణ కోసం చేపట్టాల్సిన చర్యలపై రెండు నెలల్లోగా ఒక ప్రణాళికను రూపొందించాలని ఉత్తరాఖండ్ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌ను ధర్మాసనం ఆదేశించింది. నిపుణుల కమిటీ నివేదికలో పేర్కొన్న అనధికారి నిర్మాణాలను మూడు నెలల్లోగా కూల్చి వేయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. తమ తీర్పు మేరకు అమలు చేసిన చర్యలతో ఏడాదిలోగా అఫిడవిట్ దాఖలు చేయాలంది.

ఫిబ్రవరి నుంచి ఢిల్లీ-షాంఘై ఎయిరిండియా సర్వీసులు

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఢిల్లీ-షాంఘై విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించనున్నట్లు ఎయిరిండియా సోమవారం ప్రకటించింది. కోవిడ్ నేపథ్యంలో 2020 ఆరంభంలోనే షాంఘై సర్వీసులను ఎయిరిండియా నిలిపి వేసింది. ఆ తర్వాత దాదాపు ఆరేళ్లకు పునఃప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. డీజీసీఏ అనుమతుల లోబడి వచ్చే ఏడాదిలో ముంబై-షాంఘై మధ్య నాన్‌స్టాప్ సర్వీసులను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామని తెలిపింది. వారానికి నాలుగుసార్లు ఢిల్లీ-షాంఘై మధ్య నడిచే బోయింగ్ 787-8 విమానాల్లో ఎకానమీ తరగతి సీట్లు 238, బిజినెస్ తరగతి సీట్లు 18 ఉంటాయని టాటా గ్రూప్ సారథ్యంలోని ఎయిరిండియా వివరించింది. షాంఘై తమ 48వ అంతర్జాతీయ గమ్యస్థానం కానుందని వెల్లడించింది. భారత్-చైనాల మధ్య డైరెక్ట్ విమాన సర్వీసులు అక్టోబర్ 26వ తేదీ నుంచి ప్రారంభం కావడం తెల్సిందే.

రష్యాతో వ్యాపారం చేస్తే తీవ్ర ఆంక్షలు తప్పవు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: రష్యాతో వ్యాపార సంబంధాలు కొనసాగించే దేశం ఏదైనా సరే ఇకపై అత్యంత తీవ్ర ఆంక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు చేశారు. ఉక్రెయిన్ దురాక్రమణ సాగిస్తున్న రష్యా లక్ష్యంగా తమ ప్రభుత్వం త్వరలో ఇందుకు సంబంధించిన చట్టం చేయనుందన్నారు. రష్యా, ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలకు తన మద్దతు ఉంటుందన్నారు. అదేవిధంగా, ఇదే చట్టంలో ఇరాన్‌తో సంబంధాలు నెరిపే దేశాలపైనా తీవ్ర ఆంక్షలు విధించేందుకు ఉద్దేశించిన నిబంధనలు కూడా చేర్చాలని సూచించానన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ట్రంప్ ఇప్పటికే అత్యధికంగా 50 శాతం టారిఫ్‌లను విధించడం తెల్సిందే. రష్యా నుంచి చమురును కొనుగోలు చేసిన లేదా తిరిగి విక్రయించిన దేశాలపై 500 శాతం టారిఫ్‌లను విధించాలంటూ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ప్రతిపాదించిన బిల్లుకు సెనేట్‌లోని విదేశీ సంబంధాల కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

పీవోకే ప్రధానిగా పీపీపీ నేత

ఇస్లామాబాద్: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) నూతన ప్రధానిగా పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ)కి చెందిన ప్రజాప్రతినిధి ఎన్నికయ్యారు. ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్(పీటీఐ) పార్టీకి చెందిన ప్రస్తుత ప్రధాని చౌదరి అన్వరుల్ హక్‌పై సోమవారం పీపీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ప్రాంతీయ అసెంబ్లీ ఆమోదించడంతో నూతన నేత ఎంపిక అనివార్యమైంది. అసెంబ్లీలోని 52 మంది సభ్యులకుగాను పీపీపీకి చెందిన రజా ఫైసల్ ముంతాజ్ రాథోడ్‌కు 32 మంది సభ్యులు అనుకూలంగా ఓటేశారు. ప్రస్తుత ప్రాంతీయ అసెంబ్లీకి 2021లో ఎన్నికలు జరిగాక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాలుగో నేత ముంతాజ్. ఈ అసెంబ్లీలో పీపీపీ వాస్తవ బలం 17 మాత్రమే కాగా, పీటీఐ నుంచి చేరికలతో 29కి చేరుకుంది.

కుప్పకూలిన క్వారీ.. ఆరుకు చేరిన మృతులు

సోన్‌భద్ర: ఉత్తరప్రదేశ్‌లోని సోన్‌భద్రలో రాతి క్వారీ కుప్పకూలిన ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. బిల్లి మార్కుండిలో శనివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకోవడం తెల్సిందే. క్వారీలో భారీ బండరాళ్ల కింద చిక్కుకుపోయినట్లుగా భావిస్తున్న సుమారు డజను మందిని కాపాడేందుకు అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. శనివారం సాయంత్రం ఒక మృతదేహాన్ని వెలికి తీసిన అధికారులు, ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం మరో ఐదుగురి మృతదేహాలను తేగలిగారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు అందజేస్తుందని మంత్రి రవీంద్ర జైశ్వాల్ తెలిపారు. గనిని నిర్వహిస్తున్న కృష్ణా మైనింగ్ వర్క్స్‌కు చెందిన మధుసూదన్‌సింగ్, దిలీప్ కేశరిలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అసోంలో ఫిబ్రవరిలో ఎస్ఐఆర్: ఈసీ

న్యూఢిల్లీ: అసోంలో ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియను చేపట్టాలని ఎన్నికల కమిషన్(ఈసీ) సోమవారం ఆదేశాలు జారీ చేసింది. 2026 ఫిబ్రవరి 10వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రచురించాలని అసోం చీఫ్ ఎలక్టోరల్ అధికారికి పంపిన ఆదేశాల్లో పేర్కొంది. జనవరి ఒకటో తేదీన స్పెషల్ రివిజన్ చేపట్టాలని అందులో పేర్కొంది. దీని ప్రకారం..బూత్ లెవల్ అధికారు(బీఎల్‌వో)లు నవంబర్ 22 నుంచి డిసెంబర్ 20వ తేదీ వరకు రాష్ట్రంలోని ఇల్లిల్లూ తిరిగి ఓటర్ల పరిశీలన చేపడతారు. సమగ్ర ఓటరు జాబితా ముసాయిదా డిసెంబర్ 27వ తేదీన విడుదల చేస్తారు. తుది జాబితాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన ప్రచురిస్తారు. ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లలో ఎస్ఐఆర్ చేపట్టనున్నట్లు ఈసీ గత నెలలో పేర్కొనడం తెల్సిందే. ఇందులో తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, పశ్చిబెంగాల్ అసెంబ్లీలకు 2026లో ఎన్నికలు జరగనున్నాయి. అసోంలోనూ 2026లోనే ఎన్నికలు జరగాల్సి ఉంది. 'పౌరసత్వ చట్టం కింద అసోంలో కొన్ని ప్రత్యేక నిబంధనలు అమల్లో ఉన్నాయి. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో రాష్ట్రంలో పౌరసత్వ పరిశీలన ప్రక్రియ దాదాపు పూర్తికావచ్చింది. ఈ పరిస్థితుల్లో అసోంలో ఎస్ఐఆర్ కోసం ప్రత్యేకంగా ఉత్తర్వులను జారీ చేస్తాం'అని ఇటీవల ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు.

మత మార్పిడి వ్యతిరేక చట్టంపై రాజస్థాన్ ప్రభుత్వానికి సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ: రాజస్తాన్ చట్ట వ్యతిరేక మతమార్పిడి చట్టం-2025 చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం ఆ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు మరికొందరికి నోటీసులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన జైపూర్ కేథలిక్ వెల్ఫేర్ సొసైటీ వేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. రాజ్యాంగ పరిధుల అతిక్రమణ, శాసనపరమైన ప్రామాణికతకు సంబంధించిన అంశాలను తాము ప్రస్తావించామని పిటిషనర్ తరపున వాదించిన రాజీవ్ ధావన్ చెప్పారు. ఇప్పటికే ఇలాంటి అంశంపై దాఖలైన పిటిషన్ పెండింగ్‌లో ఉందని ధర్మాసనం ఈ సందర్భంగా పేర్కొంది. రాజస్తాన్ ప్రభుత్వ, తదితరుల నుంచి సమాధానం అందాక సవివరంగా వాదనలు వింటామని పేర్కొన్న ధర్మాసనం..తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న మిగతా పిటిషన్లతో కలిపి విచారణ చేపడతామని తెలిపింది. అక్రమ మత మార్పిడులకు సంబంధించిన రాజస్తాన్‌లో సెప్టెంబర్ నుంచి అమల్లోకి వచ్చిన చట్టంలోని వివిధ నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన రెండు పిటిషన్లపై విచారణ చేపట్టేందుకు నవంబర్ 3వ తేదీన సుప్రీంకోర్టు అంగీకరించింది. ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హరియాణా, జార్ఖండ్, కర్నాటక ప్రభుత్వాలు తీసుకువచ్చిన అక్రమ మత మార్పిడుల నిరోధక చట్టాలను సవాల్ చేస్తూ వేర్వేరు పిటిషన్లు అత్యున్నత న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి.

ఫ్రాన్స్‌తో ఉక్రెయిన్ 'రఫేల్ ఒప్పందం'

పారిస్: ఫ్రాన్స్ నుంచి అత్యాధునిక 100 రఫేల్ యుద్ధ విమానాలను ఉక్రెయిన్ కొనుగోలు చేయనుంది. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాను యేల్ మాక్రాన్ సోమవారం పారిస్‌లో సంతకాలు చేశారు. ఈ విషయాన్ని ఉక్రెయిన్ ఎంబసీ, ఫ్రాన్స్ అధ్యక్ష భవనం ధ్రువీకరించాయి. ఒప్పందంలోని వివరాలను మాత్రం వెల్లడించలేదు. 2022లో రష్యా దురాక్రమణ మొదలయ్యాక ఉక్రెయిన్ అధ్యక్షుడు ఫ్రాన్స్‌లో 9వ సారి పర్యటిస్తున్నారు. శీతాకాలం ప్రవేశించిన వేళ తమ ఇంధన మౌలిక వసతులు, ఇతర లక్ష్యాలపై రష్యా దాడులు తీవ్రతరం చేసిన నేపథ్యంలో రక్షణ సన్నద్ధతను పెంచుకునే లక్ష్యంతో జెలెన్‌స్కీ ఫ్రాన్స్‌కు వచ్చారు.

పారిస్‌లో జెలెన్‌స్కీతో మాక్రాన్

రాష్ట్ర జాబితాలోని అంశంపై కేంద్రం చట్టం చేయొచ్చా?

భారత రాజ్యాంగం దేశంలో సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేసింది. రాజ్యాంగంలో ఎక్కడా సమాఖ్య అనే పదాన్ని ప్రయోగించపోయినా.. భారతదేశం సమాఖ్య రాజ్యమే. ఎందుకంటే సమాఖ్య మౌలిక లక్షణాలన్నీ భారత సమాఖ్యలో ఉన్నాయి. సమాఖ్యలో అత్యంత ముఖ్య లక్షణం అధికార విభజన. రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య చాలా విస్తృతమైన, స్పష్టమైన అధికార విభజన జరిగింది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ



కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య మూడు రకాల సంబంధాలను పొందుపర్చారు.

1. శాసన సంబంధాలు (Legislative Relations)-11వ భాగం, ప్రకరణ 245 నుంచి 255
2. పరిపాలనా సంబంధాలు (Administrative Relations)-11వ భాగం, ప్రకరణ 256 నుంచి 263
3. ఆర్థిక సంబంధాలు (Financial Relations) - 12 భాగం, ప్రకరణ 264 నుంచి 300

కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన సంబంధాలు

భాగం 11లోని ప్రకరణలు 245 నుంచి 255 వరకు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న శాసన సంబంధాలను పొందుపరిచారు. శాసన సంబంధాలు అంటే పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు ఏయే అంశాలపై చట్టాలు చేయవచ్చో వివరించే ప్రక్రియ.

ప్రకరణ-245: కేంద్ర పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల చట్టాల భౌగోళిక పరిమితులు:

- పార్లమెంట్ రూపొందించే చట్టాలు దేశంలో అన్ని ప్రాంతాలకు,అన్ని సంస్థలకు వర్తిస్తా యి. ఇవి ఇతర దేశాల్లో నివసిస్తున్న భారతీయులకు కూడా వర్తిస్తాయి (ప్రకరణ 245(2)). ఈ అధికారాన్నే 'Extra Territorial Legislation' లేదా 'సీమాంతేతర చట్టాలు' అంటారు.
- రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాలు ఆ రాష్ట్ర భూభాగాలకు మాత్రమే వర్తిస్తాయి. వీటికి సీమాంతేతర చట్టాల పరిధి లేదు.

పార్లమెంట్ చట్టాలపై పరిమితులు:

- పార్లమెంట్ చేసిన చట్టాలు కొన్ని ప్రాంతాలకు.. ముఖ్యంగా కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, దాద్రానగర్ హవేలి, డామన్-డయ్యూ ప్రాంతాలకు వర్తించవు. వీటి పరిపాలనను రాష్ట్రపతే నేరుగా నియంత్రిస్తారు. పరిపాలన ఆదేశాలను రాష్ట్రపతి జారీ చేస్తారు. ఇవి పార్లమెంట్ చట్టాలతో సమాన ప్రతిపత్తిని కలిగి ఉంటాయి.
- రాష్ట్రాల్లోని కొన్ని షెడ్యూల్డ్ ప్రాంతాలకు కూడా పార్లమెంట్ చట్టాలు వర్తించవు. ఈ ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తారు. అసోం గవర్నర్‌కు ఆ రాష్ట్రంలోని స్వయం ప్రతిపత్తి ఉన్న జిల్లా మండలి (Autonomous District Council)కి సంబంధించి ప్రత్యేక అధికారాలు ఉంటాయి.
- మేఘాలయ, త్రిపుర, మిజోరాం రాష్ట్రాల్లో స్వయం ప్రతిపత్తి ఉన్న జిల్లాలపై రాష్ట్రపతికి ప్రత్యేక అధికారాలు ఉంటాయి.

ప్రకరణ- 246: కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన: కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాలను మూడు జాబితాల్లో విభజించారు. వీటికి సంబంధించిన వివరాలను ఏడో షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

జాబితాలు

కేంద్ర జాబితా (Union List) ప్రకరణ 246 (1): రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ప్రారంభంలో ఈ జాబితాలో 97 అంశాలున్నాయి. తర్వాత ఈ జాబితాకు 2ఎ, 92ఎ, 92బి, 92సి అంశాలను చేర్చారు. 33లో ఉన్న అంశాలను తొలగించారు. ప్రస్తుతం ఇందులో వంద అంశాలున్నాయి.

జాబితాలోని ముఖ్యాంశాలు: దేశ రక్షణ, అంతర్జాతీయ వ్యవహారాలు, బ్యాంకింగ్, కరెన్సీ, అణుశక్తి, బీమా, ప్రసారాలు, వైమానిక, నౌకా సర్వీసులు మొదలైన జాతీయ ప్రాముఖ్యం ఉన్న విషయాలను కేంద్ర జాబితాలో పొందుపరిచారు.

కేంద్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలను రూపొందించవచ్చు, సవరించవచ్చు, రద్దు చేయవచ్చు.

రాష్ట్ర జాబితా (State List) ప్రకరణ 246(3): రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు ఇందులో 66 అంశాలున్నాయి. ప్రస్తుతం 61 అంశాలు మాత్రమే ఉన్నాయి. ఈ జాబితాలోని ఎంట్రీ 11, 19, 20, 29, 36లోని అంశాలను ఉమ్మడి జాబితాలోకి మార్చారు.

జాబితాలోని ముఖ్యాంశాలు: శాంతి భద్రతలు, పోలీస్, వ్యవసాయం, నీటిపారుదల, స్థానిక సంస్థలు, ప్రజారోగ్యం, పారిశుధ్యం, జైళ్లు, గ్రంథాలయాలు, మార్కెట్లు, వడ్డీ వ్యాపారం తదితర స్థానిక ప్రాముఖ్యం ఉన్న అంశాలను ఈ జాబితాలో పొందుపరిచారు.

ఉమ్మడి జాబితా (Concurrent List) ప్రకరణ 246(2): ప్రారంభంలో ఈ జాబితాలో 47 అంశాలు ఉండేవి. ప్రస్తుతం 52 ఉన్నాయి. ఈ జాబితాలో ఎంట్రీ నంబర్ 11ఎ న్యాయపాలన, సబార్డినేట్ కోర్టుల వ్యవస్థీకరణ, 17ఎ అడవులు, 17బి వన్యప్రాణుల సంరక్షణ, 20ఎ జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ, 25 సాధారణ విద్య, సాంకేతిక విద్య, 33ఎ తూనికలు, కొలతలు.

పై అన్ని అంశాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉమ్మడి జాబితాలోకి చేర్చారు. అందువల్ల ఉమ్మడి జాబితాలోని అంశాలు 47 నుంచి 52కు పెరిగాయి.

కేంద్ర, రాష్ట్ర శాసనాల మధ్య వైరుధ్యం

ఉమ్మడి జాబితాలోని అంశాలపైన పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేయవచ్చు. అయితే కేంద్ర శాసనానికి, రాష్ట్ర శాసనానికి మధ్య వైరుధ్యం ఏర్పడితే.. అంతిమంగా కేంద్ర శాసనానికే ఆధిక్యత ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మినహాయింపు ఉంటుంది.

ప్రకరణ 254 ప్రకారం.. ఉమ్మడి జాబితాలోని అంశాలపై రాష్ట్రపతి పూర్వానుమతితో రాష్ట్ర శాసనసభ చట్టం చేసి, ఇదే అంశంపై పార్లమెంట్ కూడా చట్టం చేస్తే.. పార్లమెంట్ చేసిన చట్టం రాష్ట్ర శాసనసభ చేసిన చట్టానికి విరుద్ధమైతే, రాష్ట్ర శాసనసభ చేసిన చట్టమే చెల్లుబాటవుతుంది.

కేంద్ర, రాష్ట్ర చట్టాల వివాదాల పరిష్కారానికి సంబంధించిన సూత్రాలు (Doctrines)

కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజనకు సంబంధించి వివాదాలు తలెత్తితే.. వాటిని పరిష్కరించడానికి సుప్రీంకోర్టు కొన్ని న్యాయ సూత్రాలను అవలంబిస్తుంది. ప్రతి సూత్రానికి అంతర్గతంగా ఒక పరమార్థం ఉంటుంది. వాటిని కింది విధంగా వివరించవచ్చు.

డాక్ట్రిన్ ఆఫ్ పిత్ అండ్ సబ్‌స్టాన్స్: సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన జరిగిన సందర్భాల్లో ఒక నిర్ణీత అంశం లేదా చట్టాన్ని ఒక జాబితాలో పొందుపరుస్తారు. ఆ జాబితాలో పొందుపరిచిన అంశం, మరో జాబితాలో పొందుపరిచిన అంశాన్ని సందర్భానుసారం కొంత వరకు అతిక్రమించినా, ఆ చట్టాలను రద్దు చేయరు. అలాంటి సందర్భాల్లో ఆ అంశంలోని సారాంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. దీన్నే 'పిత్ అండ్ సబ్‌స్టాన్స్' అంటారు. ఉదాహరణకు, మనీ లెండింగ్ (రుణం ఇవ్వడం) అనే అంశం రాష్ట్ర జాబితాలో ఉంది. దీనికి సాక్ష్యంగా ఆధారంగా రాసే ప్రామిసరీ నోటు అనే అంశం కేంద్ర జాబితాలో ఉంది. మనీ లెండింగ్‌ను నియంత్రిస్తూ రాష్ట్రం చేసిన చట్టం సందర్భానుసారం కేంద్ర జాబితాలోని ప్రామిసరీ నోటు అనే అంశంలోకి చొరబడ్డా.. రాష్ట్రం తన శాసనసభ పరిధిని అతిక్రమించిందనే నెపంతో న్యాయస్థానం ఆ చట్టాలను కొట్టివేయదు. ఎందుకంటే ఆ చట్టంలోని ప్రధాన సారాంశం రాష్ట్ర జాబితాలోనే ఉంది. అనుకోకుండా ఆ చట్ట పరిధి కేంద్ర జాబితాలోకి విస్తరించినా..ప్రధాన ఉద్దేశం రాష్ట్ర జాబితాలోని అంశాన్ని నియంత్రించడమే అవుతుంది. కేంద్ర, రాష్ట్రాలు తమ పరిధులను అతిక్రమించాయనే సమస్య ఉత్పన్నమైనప్పుడు న్యాయస్థానం 'పిత్ అండ్ సబ్‌స్టాన్స్' సూత్రం ప్రకారం తీర్పులు చెబుతుంది. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సదరన్ ఫార్మాస్యూటికల్ వర్సెస్ కేరళ ప్రభుత్వం (1981), స్టేట్ ఆఫ్ రాజస్థాన్ వర్సెస్ చావ్లా కేసుల్లో స్పష్టీకరించింది.

డాక్ట్రిన్ ఆఫ్ కలరబుల్ లెజిస్లేషన్: కేంద్ర రాష్ట్రాల అధికారాల విభజన ఉద్దేశం రెండింటి మధ్య ఎలాంటి విభేదాలు తలెత్తకుండా చూడటం. అయితే శాసన శాఖ తన పరిధిలో లేని అంశాలను ఉన్నట్లుగా ఊహించుకుని దురుద్దేశపూర్వకంగా చట్టాలు చేస్తే, అలాంటి చట్టాలను కలరబుల్ లెజిస్లేషన్ అంటారు. ఈ సూత్రం ముఖ్య ఉద్దేశం.. ప్రత్యక్షంగా చేయలేని పనిని పరోక్షంగానూ చేయకూడదు (You can not do indirectly what you can not do directly i.e. no person who has no title can not transfer it to others) ఉదాహరణకు 'రైల్వేలు' కేంద్ర జాబితాలో ఉంది. ఆ అంశాలపై రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేస్తే, ఆ చట్టాలు కలరబుల్ లెజిస్లేషన్ అవుతాయి.

డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ: రిపగ్నెన్సీ అంటే ఇష్టం లేకపోవడం లేదా అసంబద్ధం అని అర్థం. ఒక చట్టం ఒక పనికి అనుమతించి, మరో చట్టం ఆ పనికి అనుమతిని నిరాకరిస్తే దాన్ని అసంబద్ధం లేదా డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ అంటారు. ఉమ్మడి జాబితాలోని అంశాలపై పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ చట్టాలు చేయవచ్చు. రెండింటి మధ్య వివాదం ఏర్పడితే అంతిమంగా కేంద్ర చట్టమే చెల్లుబాటవుతుంది. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ చట్టాలు రెండూ పరస్పర విరుద్ధమైతే, డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ ప్రకారం ఆ చట్టాల చెల్లుబాటును నిర్ణయిస్తారు.

ఉదాహరణకు హత్య నేరానికి ఐ.పి.సి. 302 ప్రకారం శిక్ష పడుతుంది. బాల నేరస్థులకు సంబంధించి ఒకవేళ ఆ రాష్ట్రం ప్రత్యేక చట్టం చేసి ఉంటే, ఆ రాష్ట్ర చట్టం ప్రకారం వారిని విచారించి శిక్షించాల్సి ఉంటుంది. అలాంటి చట్టాలకు సి.ఆర్.పి.సి.లో మినహాయింపు ఉంటే రాష్ట్ర చట్టాలే చెల్లుబాటు అవుతాయి.

డాక్ట్రిన్ ఆఫ్ రెసిడ్యూరీ పవర్స్: రెసిడ్యూరీ అంటే మిగిలిపోయిన భాగం అని అర్థం. మూడు జాబితాల్లో ప్రస్తావించని అంశాలను అవశిష్ట అధికారాల పేరుతో కేంద్రానికి ఇచ్చారు. కాబట్టి అవశిష్ట అధికారాలపై చట్టం చేసే అధికారం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికే ఉంటుంది. ఈ సూత్రం ముఖ్య ఉద్దేశం కేంద్ర ప్రభుత్వాన్ని బలోపేతం చేయడమే.

ఉదాహరణకు పార్లమెంట్ అవశిష్ట అంశాలకు సంబంధించి పార్లమెంట్ సంపద పన్ను చట్టం-1957; బహుమతి పన్ను చట్టం-1957; కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 మొదలైన చట్టాలను రూపొందించింది. ఇవి డాక్ట్రిన్ ఆఫ్ రెసిడ్యూరీ పవర్స్‌లోకి వస్తాయి.

డాక్ట్రిన్ ఆఫ్ ఇమ్యూనిటీ ఆఫ్ ఇన్‌స్ట్రుమెంటాలిటీస్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆస్తులపై పరస్పరం పన్నులు విధించుకోడానికి మినహాయింపు ఉంది. దీన్ని డాక్ట్రిన్ ఆఫ్ ఇమ్యూనిటీ ఆఫ్ ఇన్‌స్ట్రుమెంటాలిటీస్ అంటారు. ప్రకరణలు 285, 287, 288, 289లో వీటిని ప్రస్తావించారు.

ప్రకరణ 247 ప్రకారం.. కేంద్ర జాబితాలో పొందుపరచిన అంశాలకు సంబంధించి అదనపు న్యాయస్థానాలను ఏర్పాటు చేసే అధికారం పార్లమెంట్ కలిగి ఉంటుంది.

అవశిష్ట జాబితా (Residual List) ప్రకరణ 248(1): అవశిష్ట జాబితాలోని అంశాలపై పార్లమెంట్ మాత్రమే చట్టం చేస్తుంది. అవశిష్ట జాబితా అంటే కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో ప్రస్తావించని అంశాలు.

ప్రకరణ 248 (2) ప్రకారం.. రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో లేని అంశాలకు పన్ను విధించే అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది.

అమెరికా, ఆస్ట్రేలియాలో అవశిష్ట అధికారాలను రాష్ట్రాలకు ఇచ్చారు. కెనడాలో అవశిష్ట అధికారాలు కేంద్రానికి ఇచ్చారు. భారత ప్రభుత్వ చట్టం -1935 ప్రకారం అవశిష్ట అధికారాలను ఆనాటి గవర్నర్ జనరల్‌కు ఇచ్చారు.

ప్రకరణ 249 (1) ప్రకారం.. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా రాజ్యసభ 2/3 వంతు సభ్యుల మెజారిటీతో ఒక తీర్మానం చేస్తే.. ఆ తీర్మానాన్ని లోక్‌సభ కూడా ఆమోదిస్తే ఆ అంశంపై పార్లమెంట్ చట్టాలను రూపొందిస్తుంది. ఆ విధంగా రాష్ట్ర జాబితాలో అంశాలపై పార్లమెంట్ చేసిన చట్టాలు ఒక సంవత్సరం వరకే అమల్లో ఉంటాయి (ప్రకరణ 249(2)). అవసరమైతే తీర్మానం ద్వారా మరో ఏడాది వరకు పొడిగించవచ్చు. గడువు ముగిసిన తర్వాత, ఆరు నెలల వరకు మాత్రమే అలాంటి చట్టాలు అమల్లో ఉంటాయి. తాత్కాలికంగా కేంద్ర జాబితాలోకి బదలాయించిన అంశం తిరిగి రాష్ట్ర జాబితాలోకి చేరుతుంది.

ప్రకరణ 250 (1) ప్రకారం.. దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి (ప్రకరణ 352) అమల్లో ఉన్నప్పుడు, పార్లమెంట్ రాష్ట్ర జాబితాలోని అంశాలపై శాసనాలను రూపొందిస్తుంది. అలాంటి శాసనం అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నంత కాలం చెల్లుబాటవుతుంది.

ప్రకరణ 250 (2) ప్రకారం.. అత్యవసర పరిస్థితి ఎత్తేసిన ఆరు నెలల తర్వాత ఆ చట్టాలు రద్దవుతాయి.

ప్రకరణ 251 ప్రకారం.. ప్రకరణలు 249, 250 అనుసరించి పార్లమెంట్ రాష్ట్ర జాబితాలో చేసిన చట్టాలకు, అంతకుముందే రాష్ట్రాలు వాటి జాబితాలో చేసుకున్న చట్టాలకు వైరుధ్యం ఏర్పడితే.. పార్లమెంట్ చేసిన చట్టమే చెల్లుబాటు అవుతుంది.

ప్రకరణ 252 (1) ప్రకారం.. రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు ఉమ్మడి ప్రయోజనార్థం రాష్ట్ర జాబితాలోని అంశాలపై చట్టాలు చేయమని కోరితే.. అలా కోరిన రాష్ట్రాలకు వర్తింపజేస్తూ రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలు రూపొందిస్తుంది.

ఉదాహరణకు ఎస్టేట్ సుంకం చట్టం-1955; ప్రైజ్ కాంపిటీషన్ చట్టం-1955; వన్యప్రాణి సంరక్షణచట్టం-1972; జలకాలుష్య నివారణ చట్టం-1974; పట్టణ, ఆస్తుల పరిమితి చట్టం-1976; మానవ అవయవాల మార్పిడి చట్టం-1994 మొదలైన చట్టాలను పార్లమెంట్ రూపొందించి రాష్ట్రాలకు వర్తింపజేసింది.

ప్రకరణ 252(2) ప్రకారం.. పైన పేర్కొన్న విధంగా రూపొందించిన శాసనాన్ని సవరించే లేదా రద్దు చేసే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది.

ప్రకారణ 253 ప్రకారం.. అంతర్జాతీయ ఒప్పందాల అమలు కోసం అవసరమైన శాసనాలను రూపొందించే అధికారం పార్లమెంట్‌కు ఉంది. ఈ ఒప్పందాల అమలుకు రాష్ట్రాల చట్టాలు అవరోధాలుగా ఉంటే వాటిని పార్లమెంట్ సవరించవచ్చు.

ఉదాహరణకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక అవసరాల రక్షణ చట్టం-1947; జెనీవా ఒప్పందం చట్టం-1960; హైజాకింగ్ వ్యతిరేక చట్టం-1982 లాంటి చట్టాలను పార్లమెంట్ రూపొందించింది.

ప్రకరణ 254 ప్రకారం.. ఉమ్మడి జాబితాలోని వైరుధ్యాలను తొలగించడం, పార్లమెంట్ రూపొందించిన శాసనానికి రాష్ట్ర విధానసభలు రూపొందించిన శాసనం విరుద్ధంగా ఉంటే, పార్లమెంట్ రూపొందించిన శాసనానికి ఆధిక్యత ఉంటుంది.

ప్రకరణ 255 ప్రకారం.. కొన్ని చట్టాలను రూపొందించే సమయంలో రాష్ట్రపతి, గవర్నర్‌ల పూర్వానుమతి అవసరం. ఒకవేళ అలాంటి చట్టాలను వీరి పూర్వానుమతి లేకుండా రూపొందిస్తే అవి చెల్లవు అని చెప్పే అధికారం రాష్ట్రపతి, గవర్నర్‌లకు ఉండదు. వారి అనుమతి తీసుకోవడమనేది కేవలం ప్రక్రియకు సంబంధించిందే కానీ, వారి అధికారాలకు చెందింది కాదు.

ఇతర భాగాల్లోని ప్రకరణలు (18వ భాగం)

ప్రకరణ 352 ప్రకారం.. జాతీయ అత్యవసర పరిస్థితి సమయంలోనూ కేంద్రం రాష్ట్ర జాబితాలో చట్టాలు చేయవచ్చు.

ప్రకరణ 356 ప్రకారం.. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించినప్పుడు రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ రాష్ట్ర శాసనసభ తరపున చట్టాలను రూపొందించవచ్చు.

చింతా దీక్షితులు పిల్లల పాటలను ఏ పేరుతో రచించారు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

తెలుగు బోధన పద్ధతులు

ఉపాధ్యాయ పోటీ పరీక్షలకు తెలుగు బోధన పద్ధతులు తప్పనిసరి అంశం. కాబట్టి అభ్యర్థులు తెలుగు మెథడాలజీపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఎందుకంటే డీఎస్సీలో ఏ విభాగాన్నీ అశ్రద్ధ చేయరాదు. ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్ (తెలుగు) అభ్యర్థులు డీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాన్ని అధ్యయనం చేయాలి. గణితం, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ స్టడీస్, ఇంగ్లిష్, తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు సిద్ధమయ్యే అభ్యర్థులు విధిగా బీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాన్ని చదవాలి. ఇక్కడ డీఎడ్, బీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాల్లోని 'సహ పాఠ్య కార్యక్రమాలు- బోధనోపకరణాలు' అనే అధ్యాయంలో వచ్చే ప్రశ్నలను సమగ్రంగా తెలుసుకుందాం.

మాదిరి ప్రశ్నలు

1. **భాషాభ్యసనంలో అతి ముఖ్యమైన వేటిని పెంపొందించడానికి భాషా ప్రయోగశాల ఉపకరిస్తుంది?**
   1) శ్రవణ- పఠన నైపుణ్యాలు
   2) లేఖన- ఉచ్చారణ సామర్థ్యాలు
   3) పఠన- లేఖన సామర్థ్యాలు
   4) శ్రవణ- భాషణ నైపుణ్యాలు
2. **ద్వితీయ భాష, తృతీయ భాషల అభ్యసనం లో బహుళ ప్రయోజనకారి ఏది?**
   1) టేప్ రికార్డర్ 2) లింగ్వా ఫోన్
   3) భాషా ప్రయోగశాల
   4) దూరదర్శన్
3. **భాషా ప్రయోగశాలను మొదట ఏ దేశంలో ఉపయోగించారు?**
   1) అమెరికా 2) జర్మనీ
   3) ఇంగ్లండ్ 4) ఇండియా
4. **'భాషా ప్రయోగశాల' ఒక _____?**
   1) స్వయం అధ్యయన కేంద్రం
   2) స్వయం అభ్యసన పరికరం
   3) స్వయంప్రదర్శనశాల
   4) నైపుణ్య ప్రదర్శన కేంద్రం
5. **భాషా ప్రయోగశాలలో ఎన్ని గదులు ఉంటాయి?**
   1) 5 గదులు లేదా అరలు
   2) 4 గదులు లేదా అరలు
   3) 3 గదులు లేదా అరలు
   4) 2 గదులు లేదా అరలు
6. **భాషా ప్రయోగశాల వల్ల ప్రయోజనం కానిది?**
   1) స్వీయ అభ్యసన శక్తి
   2) ఉచ్చారణ దక్షత
   3) అభ్యసనానికి సన్నద్ధం
   4) ప్రవర్తనలో పరివర్తన
7. **సహపాఠ్య కార్యకలాపం కానిది?**
   1) భాషా క్రీడలు 2) పుస్తక నిధి
   3) కవితా గోష్ఠులు 4) క్షేత్ర సందర్శన
8. **'వ్యాస రచన - లేఖా రచనలు' ఏ విభాగానికి చెందినవి?**
   1) సహపాఠ్య కార్యకలాపాలు
   2) బోధన నైపుణ్యాలు
   3) భాషా క్రీడలు
   4) సృజనాత్మక రచనా క్రీడలు
9. **నీతి గురించి అసత్య ప్రవచనం?**
   1) సామాజిక దృష్టి కలది
   2) వ్యక్తిగత భావన
   3) మతమౌఢ్య భావన
   4) వ్యక్తికి, సమాజానికి ఉపయోగపడే విలువ
10. **ఉపాధ్యాయుడు.. విద్యార్థులకు కుక్క- గాడిద, నాలుగు ఎద్దులు- సింహం లాంటి కథలను బోధించడం ఎందులో భాగం?**
    1) బాల సాహిత్యం 2) నీతి విద్య
    3) సాంకేతిక విద్య 4) సాహస కథలు
11. **పిల్లలకు పనికొచ్చే పాటలను, కథలను రాసిన తొలితరం రచయితల్లో ప్రముఖులు**
    1) ముళ్లపూడి వెంకటరమణ
    2) మునిమాణిక్యం నరసింహారావు
    3) కొడవటిగంటి కుటుంబరావు
    4) చింతా దీక్షితులు
12. **చింతా దీక్షితులు పిల్లల పాటలను ఏ పేరుతో రచించారు?**
    1) బుడుగులు 2) హరివిల్లు
    3) లక్కపిడతలు 4) చిన్నారిలోకం
13. **భాషా ప్రయోగశాలలోని ఏ విభాగంలో మాస్టర్ టేపులు, రికార్డు చేసే విద్యార్థులు కోరిన టేపుల్ని వినిపించే యంత్రాలు ఉంటాయి?**
    1) వినే బూత్ 2) సలహాదారు బూత్
    3) కంట్రోల్ రూమ్
    4)రికార్డింగ్ థియేటర్
14. **పాఠశాల స్థాయిలో సారస్వత సంఘాల్లో ఎవరి భాగస్వామ్యం పట్టుకొమ్మలాంటిది?**
    1) విద్యార్థి 2) భాషోపాధ్యాయుడు
    3) ప్రధానోపాధ్యాయుడు
    4) పై అందరూ
15. **'ఉపాధ్యాయులు పాఠ్యభాగ విశదీకరణలో లక్ష్యాలను ఏర్పరచుకుంటారు. ఆ లక్ష్య సాధనకు సాధనాలే బోధనోపకరణాలు' అని ఎవరన్నారు?**
    1) గిజుబాయి 2) కొంపెల్లి ఆంజనేయశాస్త్రి
    3) జాకీర్ హుస్సేన్
    4) హుమాయున్ కబీర్
16. **''ఉపకరణం విషయ చిత్రీకరణకు, విషయాన్ని తొందరగా, సులువుగా అర్థం చేసుకోవడానికి, శాశ్వతమైన అవగాహనకు ఉపయోగపడుతుంది' అని ఎవరన్నారు?**
    1) కొంపెల్లి ఆంజనేయ శాస్త్రి
    2) సర్వేపల్లి రాధాకృష్ణన్
    3) హుమాయున్ కబీర్
    4) గొడవర్తి సూర్యనారాయణ
17. **విద్యార్థులు అదనపు సమాచారాన్ని ఇవ్వడానికి చక్కగా దోహదపడేవి?**
    1) భాషా నైపుణ్యాలు
    2) కనీస అభ్యసన స్థాయిలు
    3) బోధన నైపుణ్యాలు
    4) బోధనోపకరణాలు
18. **విద్యార్థులు బోధనాంశాలను సెట్లుగా జతపరచడం ఏ భాషా క్రీడ?**
    1) డామినో ఆట 2) బింగో ఆట
    3) పదక్రీడ 4) అంత్యాక్షరి ఆట
19. **విద్యార్థుల్లో అవధాన శక్తిని పెంపొందించడమే కాకుండా తక్కువ సమయంలో ఎక్కువ సమాచారం అందించే శ్రవ్య ఉపకరణం?**
    1) రేడియో 2) టేప్ రికార్డర్
    3) సెల్‌ఫోన్ 4) డీవీడీ ప్లేయర్
20. **విద్యార్థుల ఉచ్చారణా దోషాలను ఏ పరికరం ద్వారా సవరించొచ్చు?**
    1) రేడియో 2) వీడియో చిత్రాలు
    3) టేప్ రికార్డర్ 4) కంప్యూటర్
21. **28 పాచికలు ఉండే ఒక రకమైన పాచికలాట ఏది?**
    1) పద క్రీడలు 2) వాక్య క్రీడలు
    3) బింగోఆట 4) డామినో ఆట
22. **టేప్ రికార్డర్ స్థానాన్ని ఆక్రమించిన వేటిని శ్రవ్య, దృశ్య ఉపకరణాలుగా ఉపయోగించొచ్చు?**
    1) కంప్యూటర్ 2) సీడీ/ డీవీడీ ప్లేయర్స్
    3) సెల్‌ఫోన్లు 4) వీడియో చిత్రాలు
23. **బోధనాభ్యసన ప్రక్రియలో ఉపాధ్యాయులు తరగతి గదిలో ఎక్కువగా వినియోగిస్తున్న ఉపకరణాలు ఏవి?**
    1) దృశ్య ఉపకరణాలు
    2) శ్రవ్య ఉపకరణాలు
    3) దృశ్య-శ్రవ్య ఉపకరణాలు
    4) ఏదీకాదు
24. **రచనలు, చిత్రాలు, కృత్యాలతో స్వయంగా విద్యార్థులతో తయారు చేయించి తరగతి గదిలో ప్రదర్శిస్తే దాన్ని ఏమంటారు?**
    1) కర పత్రిక 2) గోడ పత్రిక
    3) పాఠశాల పత్రిక 4) పైవన్నీ
25. **ద్విపార్శ్వ ఉపకరణాలకు ఉదాహరణ?**
    1) మెరుపు అట్టలు 2) వర్ణచిత్రాలు
    3) రేఖాచిత్రాలు 4) పైవన్నీ
26. **పొడవు, వెడల్పు, ఎత్తులను కలిగిన ఉపకరణాలను ఏమని పిలుస్తారు?**
    1) ద్విపార్శ్వ ఉపకరణాలు
    2) త్రిపార్శ్వ ఉపకరణాలు
    3) సాంకేతిక దృశ్య ఉపకరణాలు
    4) దృశ్య, శ్రవ్య ఉపకరణాలు
27. **కీలుబొమ్మలు, తోలుబొమ్మలు ఏ రకమైన ఉపకరణాలు?**
    1) దృశ్యశ్రవ్య 2) సాంకేతిక దృశ్య
    3) త్రిపార్శ్వ 4) ద్విపార్శ్వ
28. **ఓవర్‌హెడ్ ప్రొజెక్టర్, బులెటిన్ బోర్డ్‌లు ఏ రకమైన ఉపకరణాలు?**
    1) సాంకేతిక దృశ్య 2) దృశ్యశ్రవ్య
    3) ద్విపార్శ్వ 4) త్రిపార్శ్వ
29. **వ్యాఖ్యాయుత చిత్రాలు అని వేటినంటారు?**
    1) కార్టూన్ చిత్రాలు
    2) వీడియో చిత్రాలు
    3) మూకీ చిత్రాలు
    4) డాక్యుమెంటరీ చిత్రాలు
30. **పూర్వకాలంలో ఎక్కువగా ఏ చిత్రాలు మాత్రమే ఉండేవి?**
    1) వీడియో చిత్రాలు
    2) డాక్యుమెంటరీ చిత్రాలు
    3) కార్టూన్ చిత్రాలు
    4) మూకీ చిత్రాలు
31. **నేడు ప్రసార సాధనాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న ఉపకరణం?**
    1) టేప్ రికార్డర్ 2) చలనచిత్రం
    3) టెలివిజన్ 4) కంప్యూటర్
32. **మనరాష్ట్రంలో దూరదర్శన్‌లో ప్రసారమయ్యే ఏ కార్యక్రమాల్లో భాషకు సంబంధించిన పాఠ్యాంశాలు ఎక్కువగా కనిపిస్తాయి?**
    1) టెలి స్కూల్ 2) మన టి.వి.
    3) మన బడి 4) వేద పాఠశాల
33. **సంగణకం అంటే?**
    1) దూరదర్శన్ 2) కంప్యూటర్
    3) ఇంటర్నెట్ 4) వెబ్ బ్రౌజింగ్
34. **రాబోయే కాలంలో కంప్యూటర్ వాడకం తగ్గి అందరూ సెల్‌ఫోన్ మీదే ఆధారపడతారని పేర్కొన్న శాస్త్రవేత్త?**
    1) జోనాథన్ రాట్‌బెర్గ్ 2) వెబ్‌స్టర్
    3) జాన్ ఆడమ్స్ 4) జాన్ అండర్సన్
35. **విద్యార్థుల్లో పదజాలాభివృద్ధి కోసం ఉప కరించే క్రీడలు ఏవి?**
    1) పద క్రీడలు 2) వాక్య క్రీడలు
    3) కథాపురాణ క్రీడలు
    4) అంత్యాక్షరి క్రీడలు

సమాధానాలు

1) 4; 2) 3; 3) 1; 4) 2;
5) 3; 6) 4; 7) 2; 8) 1;
9) 3; 10) 2; 11) 4; 12) 3;
13) 3; 14) 1; 15) 2; 16) 3;
17) 4; 18) 2; 19) 1; 20) 3;
21) 4; 22) 2; 23) 1; 24) 2;
25) 4; 26) 2; 27) 3; 28) 1;
29) 4; 30) 4; 31) 3; 32) 1;
33) 2; 34) 4; 35) 1.

గత డీఎస్సీ ప్రశ్నలు

1. **త్రిపార్శ్వ ఉపకరణాలను ఉపయోగించి బోధించే సందర్భంలో నీవు ఉపయోగించే ఉపకరణాలు?**
   1) మెరుపు అట్టలు 2) తోలుబొమ్మలు
   3) ఛాయాచిత్రాలు 4) వ్యంగ్య చిత్రాలు
2. **మౌఖిక అభినయం ఏ బోధనోపకరణానికి చెందింది?**
   1) దృశ్య ఉపకరణం 2) చలనచిత్రాలు
   3) శ్రవ్య ఉపకరణం
   4) దృశ్య చలన ఉపకరణాలు
3. **కిందివాటిలో సహపాఠ్య కార్యక్రమాలకు చెందనిది?**
   1) అవధాన ప్రక్రియ
   2) బోధాంతర్గత జట్టు కృత్యం
   3) ఆవిష్కరణ వ్యూహం
   4) సిమ్యులేషన్ వ్యూహం
4. **విద్యార్థుల్లో భాషాభినివేశం, సాహిత్యాభిలాషను పెంచడానికి తోడ్పడే యాత్రలు**
   1) విహార యాత్రలు 2) వినోద యాత్రలు
   3) భాషా విహార యాత్రలు
   4) విజ్ఞాన యాత్రలు
5. **దృశ్యశ్రవణ పరికరానికి ఉదాహరణ?**
   1) టేప్ రికార్డర్ 2) ఛాయాచిత్రాలు
   3) పత్రికలు 4) తోలుబొమ్మలాట
6. **విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తులను వెలికితీసేందుకు, రచనా వ్యాసంగాన్ని పెంపొందించడానికి చక్కగా దోహదపడే సహపాఠ్య కార్యకలాపం?**
   1) భాషా విహార యాత్రలు
   2) సారస్వత సంఘాలు
   3) పాఠశాల పత్రిక
   4) గోడ పత్రిక
7. **భాషా ప్రయోగశాలలో ప్రధాన టేపులు, అభ్యాసకులను పరీక్షించడానికి అవసర మైన సామాగ్రి ఉండే అర?**
   1) వినే బూత్ 2) సలహాదారు బూత్
   3) కంట్రోల్ రూమ్ 4) ఏదీకాదు
8. **నల్లబల్ల, ఫ్లానెల్ బల్ల, బులెటిన్ బల్ల, అయస్కాంత బల్ల మొదలైన ఉపకరణాలు?**
   1) ప్రక్షేపక ఉపకరణాలు
   2) దృశ్యశ్రవ్య ఉపకరణాలు
   3) శ్రవ్య ఉపకరణాలు
   4) దృశ్య ఉపకరణాలు

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 3;
5) 4; 6) 3; 7) 2; 8) 4;

జన్యుశాస్త్ర ప్రయోగాల్లో వేటిని ఉపయోగిస్తారు?

మొక్కలు - వర్గీకరణ, విస్తరణ

ప్రకృతిలో పిండిపదార్థాన్ని స్వయంగా తయారుచేసుకొని, వినియోగించుకొని ఇతర జీవులకు ఆహారంగా అందించేవి మొక్కలు. మానవుడికి ఇవి అనేక విధాలుగా తోడ్పడుతున్నాయి. ఔషధాలు, కాగితం తయారీలో, వివిధ పరిశ్రమల్లో వీటిని విరివిగా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా ప్రాణులు జీవించడానికి అవసరమైన ఆక్సిజన్‌ను ఇవి అందిస్తున్నాయి.

మొక్కల గురించి తెలుసుకోవడానికి సౌలభ్యం కోసం వీటిని విభిన్న సముదాయాలుగా విభజించారు. జీవపరిణామక్రమం, ఆకృతులు, విస్తరణ ఆధారంగా వీటిని వివిధ రకాలుగా వర్గీకరించారు. మొట్టమొదటిసారిగా మొక్కలను వాటి స్వరూపం ఆధారంగా అరిస్టాటిల్ మూడు రకాలుగా వర్గీకరించారు.

అవి:
1) గుల్మాలు
2) పొదలు
3) వృక్షాలు

క్రీ.పూ.4000 ఏళ్ల కిందట ఈజిప్టు, అస్సీరియన్ దేశస్థులు పైరు మొక్కలు, ఫలాల మొక్కలు తదితరాలుగా వీటిని చిత్రపటాల (హీరోగ్లిఫిక్స్) రూపంలో నమోదు చేశారు. క్రీ.పూ. 2500 సంవత్సరాల నాటికే చైనా దేశస్థులు మొక్కలు, వాటి సాగు గురించి వివరించారు.

గ్రీకు తత్వవేత్తలైన సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ వృక్షశాస్త్ర అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు. థియోఫ్రాస్టస్‌ను వృక్షశాస్త్ర పితామహుడిగా భావిస్తారు. ఈయన మొట్టమొదటి సారిగా 500 రకాల మొక్కల లక్షణాలను వివరిస్తూ 'హిస్టోరియా ప్లాంటారం' గ్రంథాన్ని రచించాడు. 16, 17 శతాబ్దాల్లో ఔషధ మొక్కలపై విస్తృత అధ్యయనం జరిగింది.

18వ శతాబ్దంలో లిన్నేయస్ (స్వీడన్ శాస్త్రజ్ఞుడు) ద్వినామీకరణ విధానాన్ని అభివృద్ధి పరిచి మొక్కలను వర్గీకరించారు. జీవ పరిణామ క్రమం ప్రకారం మొక్కలను వృక్ష రాజ్యంగా పేర్కొని వాటిని భిన్న రకాలుగా విభజించారు. వీటిలో అనేక లక్షణాలను పరిగణనలోకి తీసుకున్నారు. లిన్నేయస్‌ను వర్గీకరణ శాస్త్ర పితామహుడుగా పరిగణిస్తారు.

క్రీ.పూ.2000లో భారతీయులు అధర్వణ వేదంలో ఔషధ మొక్కల గురించి వివరించారు.

పరాశరుడు వ్యవసాయం, కలుపు మొక్కల గురించి వివరిస్తూ 'కృషి పరాశరం'; అడవులు, ఔషధ మొక్కలు, మొక్కల బాహ్య, అంతర్నిర్మాణం గురించి వర్ణిస్తూ 'వృక్షాయుర్వేదం' గ్రంథాలను రచించారు. ఈయనను 'భారతదేశ వృక్షశాస్త్ర పితామహుడు'గా పేర్కొంటారు.

పుష్పించని మొక్కలు (క్రిప్టోగామ్స్)

పుష్పించని మొక్కలు పుష్పాలు, ఫలాలు, విత్తనాలను కలిగి ఉండవు. నిర్మాణం ఆధారంగా వీటిని మూడు రకాలుగా వర్గీకరించారు.

1. **థాలోఫైటా:** ఇవి వేరు, కాండం, పత్రాలుగా విభేదనం చెంది ఉండవు. వీటి దేహ భాగాన్ని 'థాలస్' అంటారు. వీటిలో మళ్లీ రెండు రకాలు ఉన్నాయి.

ఎ) ఆల్గే (శైవలాలు): శైవలాల గురించి చేసే అధ్యయనాన్ని ఆల్గాలజీ/ఫైకాలజీ అంటారు. ఇవి ఆకుపచ్చగా ఉంటాయి. సాధారణంగా వీటిని 'నాచు' అని పిలుస్తారు. ఇవి సాధారణంగా నీటిలో ఆవాసం చేస్తాయి. వీటిలో వివిధ వర్ణాలు కలిగిన శైవలాలు ఉంటాయి.

అవి:
i) క్లోరోఫైసి-ఆకుపచ్చ
ii) ఫియోఫైసి-గోధుమ రంగు
iii) రోడోఫైసి-ఎరుపు రంగు

ఆహారంగా, ఆర్థికంగా ఉపయోగపడే శైవలాలు అనేకం ఉన్నాయి. స్పైరులినా, అల్వా, క్లోరెల్లా, ఫోరిఫైరా, సెనిడెస్మస్, క్లాడోఫోరా మొదలైనవాటిలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి ఏకకణ ప్రోటీన్ల రూపంలో ఆహారంగా ఉపయోగపడుతున్నాయి.

ఎరుపు రంగు శైవలాలైన గ్రాసిల్లేరియా, జిలాడియం నుంచి అగార్-అగార్, లామినేరియా నుంచి అయోడిన్ లాంటి పదార్థాలు లభ్యమవుతున్నాయి. డయాటమ్‌లు ఎరువుగా, వడపోత విధానంలోనూ ఉపయోగపడతాయి.

బి) ఫంగి (శిలీంధ్రాలు): సాధారణంగా వీటిని 'బూజులు' (Mould) అంటారు. శిలీంధ్రాల గురించి చేసే అధ్యయనాన్ని 'మైకాలజీ' అంటారు. శిలీంధ్రాలు సాధారణంగా కొన్ని పూతికాహారులు, మరికొన్ని పరాన్నజీవులు. వీటి కణకవచం కైటిన్‌తో నిర్మితమై ఉంటుంది. శిలీంధ్రాలలో ఆహార పదార్థం గ్లైకోజన్ రూపంలో నిల్వ ఉంటుంది. ఇవి బహుకేంద్రక, ద్వికేంద్రక స్థితుల్లో ఉంటాయి. వీటిలో ప్రత్యుత్పత్తి సిద్ధబీజాల(spores) ద్వారా జరుగుతుంది. సాధారణంగా రొట్టెల మీద పెరిగే శిలీంధ్రం రైజోపస్.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
బయాలజీ

అలెగ్జాండర్ ఫ్లెమింగ్ 1928లో పెన్సీలియం లాంటి శిలీంధ్రాల నుంచి 'పెన్సిలిన్' అనే యాంటీబయాటిక్‌ను ఉత్పత్తి చేశారు. న్యూరోస్పోరా లాంటి శిలీంధ్రాలను జన్యుశాస్త్ర పరిశోధనల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. మొరెల్స్, ట్రఫుల్స్ అనేవి తినదగిన శిలీంధ్రాలు. మష్‌రూం అంటే 'స్పాంజి' అని అర్థం. కొన్ని శిలీంధ్రాల్లో ముఖ్యంగా తినగలిగే వాటిలో పుట్టగొడుగులు ముఖ్యమైనవి. విషపూరితమైన పుట్టగొడుగులను 'టాడ్‌స్టూల్స్' అంటారు. భారతదేశంలో అగారికస్ బైస్పోరస్ (White button Mushroom) అనే తినదగిన పుట్టగొడుగులను సాగు చేస్తున్నారు. పుట్టగొడుగుల విత్తనాలను 'స్పాన్' అంటారు. కొన్ని రకాల శిలీంధ్రాలు మొక్కల్లో కుంకుమ తెగులు, కాటుక తెగులు లాంటివాటిని కలిగిస్తాయి.

2. **బ్రయోఫైటా:** వీటిని సాధారణంగా వృక్షరాజ్య ఉభయచర మొక్కలు అంటారు. వీటి గురించి చేసే అధ్యయనాన్ని 'బ్రయాలజీ' అంటారు. ఇవి ఏక స్థితికంలో ఉండే మొక్కల మాదిరిగా కనిపిస్తాయి. వీటిలో ఉండే వేరు లాంటి నిర్మాణాలను రైజాయిడ్స్, కాండం లాంటి నిర్మాణాలను కాలాయిడ్స్, పత్రాల లాంటి నిర్మాణాలను ఫిల్లాయిడ్స్ అని అంటారు. వీటిలో లివర్ వర్ట్స్, హార్న్‌వర్ట్స్, మాసెస్ అనే మూడు రకాలు ఉన్నాయి. వీటిలోని లైంగిక భాగాలను ఆంథిరీడియం (పురుష ప్రత్యుత్పత్తి భాగం), ఆర్కిగోనియం (స్త్రీ ప్రత్యుత్పత్తి భాగం) అని అంటారు. మాస్ మొక్కలు నేలపై తివాచీల మాదిరిగా కనిపిస్తాయి. మాస్ మొక్కల శైశవ దశను 'ప్రథమ తంతువు' అంటారు.
ఉదా: పాలిట్రైకం, ఫ్యునేరియా, స్ఫాగ్నం. బ్రయోఫైటా. వీటిని మొదటి నేల మొక్కలుగా పేర్కొంటారు.

3. **టెరిడోఫైటా:** సాధారణంగా ఈ రకమైన మొక్కలను అలంకరణ కోసం ఉపయోగిస్తారు. వీటికి సంబంధించిన అధ్యయనాన్ని 'టెరిడాలజీ' అంటారు. వీటిని గార్డెన్‌క్రీపర్స్, గార్డెన్ స్నేక్స్, నాళికాయుత పుష్పించని మొదటి నిజమైన నేల మొక్కలు అని అంటారు. క్లబ్ మాస్, హార్స్‌టెయిల్స్, ఫెర్న్ మొదలైనవి టెరిడోఫైటాకు చెందిన మొక్కలు. వీటిలో భిన్నమైన ప్రసరణ స్తంభాలు ఉంటాయి. టెరిడోఫైటా మొక్కలు అతి తక్కువ భౌగోళిక ప్రాంతాలకు పరిమితమై ఉంటాయి. వీటిలో ప్రత్యుత్పత్తి నిర్మాణాలు అంథిరీడియం, ఆర్కిగోనియం. వీటిలో సంయోగ బీజదశను 'ప్రథమాంకురం' అంటారు. **ఉదా:** టెరిస్, లైకోపోడియం, ఈక్విసిటం.



మాదిరి ప్రశ్నలు

1. శైవలాల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
ఎ) మైకాలజీ బి) ఫైకాలజీ
సి) టెరిడాలజీ డి) పేలినాలజీ
2. కిందివాటిలో ఎరువుగా ఉపయోగపడే శైవలం ఏది?
ఎ) స్పైరోగైరా బి) క్లామిడోమోనాస్
సి) స్పైరులినా డి) డయాటమ్స్
3. 'మొదటి నేల మొక్కలు'గా వేటిని పేర్కొంటారు?
ఎ) టెరిడోఫైటా బి) శైవలాలు
సి) బ్రయోఫైటా డి) జిమ్నోస్పెర్మ్స్
4. 'అయోడిన్' దేని నుంచి లభిస్తుంది?
ఎ) క్లామిడోమోనాస్ బి) క్లాడోఫోరా
సి) లామినేరియా డి) క్లోరెల్లా
5. కిందివాటిలో జీవ ఎరువుగా ఉపయోగపడేవి ఏవి?
ఎ) అజొల్లా బి) రైజోబియం
సి) నీలి ఆకుపచ్చ శైవలాలు
డి) పైవన్నీ
6. 'కెల్ప్స్' అనేవి ఏ వర్గానికి చెందుతాయి?
ఎ) శిలీంధ్రాలు బి) శైవలాలు
సి) బ్యాక్టీరియా డి) బ్రయోఫైటా
7. ఆంథిరీడియం అంటే ఏమిటి?
ఎ) పురుష ప్రత్యుత్పత్తి భాగం
బి) స్త్రీ ప్రత్యుత్పత్తి భాగం
సి) కేసరావళి డి) అండకోశం
8. మొక్కల్లో 'ఫ్రాండ్స్' అనేవి?
ఎ) వేర్లు బి) పత్రాలు
సి) కాండం డి) పుష్పాలు
9. కిందివాటిలో మైకోరైజాలో ఉండేది ఏది?
ఎ) శిలీంధ్రం బి) శైవలం
సి) ఎ, బి డి) నీలి ఆకుపచ్చ శైవలాలు
10. కిందివాటిలో అలంకరణ కోసం పెంచే పుష్పించని మొక్కలు ఏవి?
ఎ) బ్రయోఫైటా బి) శైవలాలు
సి) శిలీంధ్రాలు డి) టెరిడోఫైటా
11. 'అగార్ - అగార్' వేటి నుంచి లభిస్తుంది?
ఎ) గ్రాసిల్లేరియా
బి) క్లామిడోమోనాస్
సి) నీలి ఆకుపచ్చ శైవలాలు
డి) పైవన్నీ
12. వ్యోమగాములు ఆహారం కోసం ఉపయోగించే శైవలం ఏది?
ఎ) క్లోరెల్లా బి) వాల్‌వాక్స్
సి) స్పైరులినా డి) పైవన్నీ
13. పెన్సిలిన్‌ను ఎవరు కనుగొన్నారు?
ఎ) వాక్స్‌మన్ బి) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
సి) వాట్సన్ డి) లివెన్ హక్
14. జన్యుశాస్త్ర ప్రయోగాల్లో వేటిని ఉపయోగిస్తారు?
ఎ) న్యూరోస్పోరా బి) అగారికస్
సి) అజొల్లా డి) రైజోబియం
15. జీవ పరిణామం ప్రకారం పుష్పించని మొక్కల్లో చివరి దశలో ఉండేవి?
ఎ) బ్రయోఫైటా బి) టెరిడోఫైటా
సి) శైవలాలు డి) శిలీంధ్రాలు
16. లైకెన్స్‌లో ఉండేవి?
ఎ) శిలీంధ్రం, శైవలం
బి) శైవలం, బ్రయోఫైటా
సి) శిలీంధ్రం, బ్రయోఫైటా
డి) బ్రయోఫైటా, టెరిడోఫైటా
17. 'వృక్ష రాజ్య తివాచీలు'గా ఏ మొక్కలను పేర్కొంటారు?
ఎ) శైవలాలు బి) శిలీంధ్రాలు
సి) బ్రయోఫైటా డి) టెరిడోఫైటా

సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) సి; 5) డి; 6) బి; 7) ఎ; 8) బి; 9) ఎ; 10) డి; 11) ఎ; 12) ఎ; 13) బి; 14) ఎ; 15) బి; 16) ఎ; 17) సి.

హైదరాబాద్ నగర వాస్తు శిల్పి ఎవరు?

పోటీ పరీక్షల ప్రత్యేకం
తెలంగాణ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. వేయి స్తంభాల గుడి నిర్మాణానికి సంబంధంచని అంశం?
1) ఏకశిల 2) త్రికూఠ శైలి నిర్మాణం
3) నక్షత్ర ఆకారం
4) నల్లని రాతి పనితనం
2. బౌద్ధ మతస్థులకు అభయం ఇస్తున్నట్లుగా ఉన్న మాందాత శిల్పం ఎక్కడ ఉంది?
ఎ) ఏలేశ్వరం బి) జగ్గయ్యపేట
సి) నాగార్జునకొండ డి) బావికొండ
1) ఎ, బి మాత్రమే 2) సి మాత్రమే
3) సి, డి మాత్రమే 4) బి మాత్రమే
3. ఆంధ్రుల గురించి పేర్కొనే అశోకుడి శిలాశాసనం ఏది?
1) 9వ 2) 13వ 3) 6వ 4)10వ
4. శాతవాహనుల నిజమైన రాజ్యస్థాపకుడు?
1) గౌతమీపుత్ర శాతకర్ణి
2) యజ్ఞశ్రీ శాతకర్ణి
3) సిముఖుడు 4) శాతకర్ణి-1
5. 'ట్రాజెడీ ఆఫ్ హైదరాబాద్' గ్రంథ రచయిత?
1) వెల్లోడి 2) కె.ఎం. మున్షీ
3) లాయక్ అలీ 4) జె.ఎన్. చౌదరి
6. కంచి, పొన్న అనే నాట్యగత్తెలు ఏ పాలకుల కాలంలో ప్రసిద్ధి?
1) వెలమ 2) రెడ్డి
3) కాకతీయ 4) పైవన్నీ
7. శాతవాహనుల కాలం నాటి అంతర్జాతీయ నౌకా కేంద్రం?
1) అరికమేడు(పుదుచ్చేరి) 2) బారిగజ
3) మైసోలియా 4) కళ్యాణి
8. ప్రఖ్యాత అమరావతి స్తూపాన్ని నిర్మించిన శాతవాహన రాజు?
1) గౌతమీ పుత్ర శాతకర్ణి
2) యజ్ఞశ్రీ శాతకర్ణి
3) మూడో పులోమావి
4) రెండో పులోమావి
9. కాకతీయుల కాలం నాటి ఉద్యోగుల గురించి పేర్కొన్న రచన ఏది?
1) క్రీడాభిరామం 2) సకల నీతి సమ్మతం
3) సుమతీ శతకం 4) భోగినీ దండకం
10. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో బండెనక బండి కట్టి... అనే గేయం రచించింది ఎవరు?
1) గద్దర్ 2) బండి యాదగిరి
3) దాశరథి 4) దొడ్డి కొమురయ్య
11. శాతవాహనుడి వంశ స్థాపకుడైన శ్రీముఖుడి నాణేలు ఎక్కడ లభించాయి?
1) పెద్ద బంకూరు 2) కొండాపురం
3) ధూళికట్ట 4) కోటి లింగాల
12. కుతుబ్‌షాహీల కాలంలో గోల్కొండ రాజ్యంలో ప్రసిద్ధి చెందిన పరిశ్రమ?
1) వస్త్ర 2) పింగాణీ 3) గాజు 4) వజ్ర
13. 'కలంకారీ' అంటే?
1) చిత్రకళ 2) నాట్యకళ
3) శిల్పకళ 4) లలితకళ
14. 'సుగ్రీవ విజయం' అనే తొలి యక్షగానాన్ని రచించింది?
1) పొన్నగంటి తెలగనార్యుడు
2) కందుకూరి రుద్రకవి
3) సారంగు తమ్మయ్య మంత్రి
4) పిల్లలమర్రి పిన వీరభద్రుడు
15. 'బిద్రి' పాత్రల తయారీలో రాగి, తుత్తునాగాలను ఏ నిష్పత్తిలో ఉపయోగించారు?
1) 1:16 2) 4:15 3) 5:8 4) 2:3
16. ఆర్యసమాజ్ శాఖను హైదరాబాద్‌లో ఎప్పుడు స్థాపించారు?
1) 1892 2) 1893
3) 1884 4) 1895
17. హైదరాబాద్ నగర వాస్తు శిల్పి ఎవరు?
1) షోయబుల్లా ఖాన్
2) మీర్ మొమిన్ అస్త్రాబాదీ
3) సుల్తాన్ కులీ 4) మీర్ ఖాసీం అలీ
18. మూసీనదిపై వంతెనను ఇబ్రహీం కుతుబ్‌షా ఎప్పుడు నిర్మించాడు?
1) 1558 2) 1578
3) 1568 4) 1548
19. 1944లో భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆంధ్ర మహాసభ రెండుగా చీలిపోయింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించినవారు?
1) మాడపాటి హనుమంతరావు
2) బద్దం ఎల్లారెడ్డి
3) రావి నారాయణరెడ్డి
4) కె.వి.రంగారెడ్డి
20. అచ్చ తెలుగు గ్రంథం 'యయాతి చరిత్ర'ను రచించింది?
1) తెలగనార్యుడు 2) కందుకూరి రుద్రకవి
3) గంగాధరుడు 4) సారంగు తమ్మయ్య
21. గోల్కొండ రాజ్యంలో తొలి మసీదు ఏది?
1) మక్కా మసీదు 2) టోలి మసీదు
3) తారామతి మసీదు 4) జామా మసీదు
22. 'బిద్రి' కళకు ప్రసిద్ధి చెందిన కేంద్రాలు ఏవి?
ఎ) బీదర్ బి) హైదరాబాద్ సి) గుల్బర్గా
1) ఎ మాత్రమే 2) ఎ, సి మాత్రమే
3) ఎ, బి 4) ఎ, బి, సి
23. నల్లటి రూపం, అమ్మోనియం క్లోరైడ్, సోడియం క్లోరైడ్‌ల మిశ్రమంతో కూడిన కళ ఏది?
ఎ) కలంకారీ బి) బిద్రి
సి) ఫిలిగ్రి
1) ఎ మాత్రమే 2) ఎ, బి మాత్రమే
3) బి మాత్రమే 4) ఎ, బి, సి
24. 'దక్కన్' చిత్రకళ పితామహుడు?
1) మీర్ సయ్యద్ అలీ 2) అబ్దుల్ సమద్
3) మీర్ మొమిన్ 4) మీర్ హకీం
25. రుద్రమదేవి 'మరణశాసనం' ఏది?
ఎ) చందుపట్ల శాసనం
బి) కందుకూరు శాసనం
సి) మోటుపల్లి శాసనం
1) ఎ మాత్రమే 2) ఎ, బి మాత్రమే
3) బి, సి మాత్రమే 4) ఎ, సి మాత్రమే
26. కింది వాటిలో సరైంది?
ఎ) ఉస్మానియా విశ్వవిద్యాలయ స్థాపన -1918
బి) నిజాం కళాశాల స్థాపన -1887
సి) మహబూబియా కళాశాల స్థాపన-1894
1) ఎ, బి మాత్రమే 2) బి మాత్రమే
3) ఎ, బి, సి మాత్రమే
4) బి, సి మాత్రమే
27. సాలార్‌జంగ్ ప్రవేశపెట్టిన నూతన నాణేలు ఏవి?
ఎ) దినార్ బి) హాలి సిక్కా సి) రూక
1) బి మాత్రమే 2) ఎ, బి మాత్రమే
3) బి, సి మాత్రమే 4) ఎ మాత్రమే
28. కిందివాటిలో సరైంది?
ఎ) 1883లో చందానగర్ రైల్వే సంఘటన
బి) 1849లో వహాబీ ఉద్యమం
సి) 1888లో ముల్కీ ఉద్యమం
1) ఎ మాత్రమే 2) ఎ, సి మాత్రమే
3) బి, సి మాత్రమే 4) పైవన్నీ
29. నిజాం కాలంనాటి 'రెవెన్యూ విధానం' ఏది?
ఎ) మహాకామా - ఇ- నసిరి
బి) జిలాబంది సి) గల్లాబక్ష్
1) ఎ మాత్రమే 2) బి, సి మాత్రమే
3) బి మాత్రమే 4) ఎ, సి మాత్రమే
30. 'సుల్తానిల్ అహదే-వజ్జమాన్ హమియు మిల్లతిరసూలిర్ రహమాన్' అని తమ నాణేలపై ముద్రించిన రాజ్యవంశం ఏది?
ఎ) బీజాపూర్ - ఆదిల్‌షాహీలు
బి) బీదర్ - బరీద్‌షాహీలు
సి) గోల్కొండ - కుతుబ్‌షాహీలు
1) ఎ మాత్రమే 2) సి మాత్రమే
3) బి, సి మాత్రమే 4) ఎ, సి మాత్రమే
31. తెలుగు అక్షరాలతో నాణేలు ముద్రించిన విజయనగర రాజ్యవంశం?
1) సంగమ 2) సాళువ
3) తుళు 4) అరవీటి
32. జాజ్‌నగర్ అంటే ఏ ప్రాంతం?
1) తెలంగాణ 2) పాండ్య - మధురై
3) ఒడిశా - కళింగ
4) హోయసల - ద్వారసముద్రం
33. దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లోని తిరుగుబాట్ల గురించి ప్రస్తావించిన శాసనం ఏది?
1) బయ్యారం 2) కలువచేరు శాసనం
3) ధర్మసాగరం 4) హన్మకొండ శాసనం
34. 'దక్షిణ భారతదేశపు నాణేలు' గ్రంథం రచయిత ఎవరు?
1) ఇలియట్ 2) అబ్దుల్ వాలీ
3) శేర్వాణి 4) రాంప్సన్
35. 'జురిబా హైదరాబాద్' పేరిట నాణేలు ముద్రించింది?
1) మహమ్మద్ కుతుబ్‌షా
2) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
3) అబుల్ హసన్ తానీషా
4) అబ్దుల్లా కుతుబ్‌షా
36. తొలి ఆంధ్ర మహాసభ 1930లో మెదక్ జిల్లాలోని జోగిపేటలో జరిగింది. దీనికి అధ్యక్షత వహించింది ఎవరు?
1) మాడపాటి హనుమంతరావు
2) బూర్గుల రామకృష్ణారావు
3) సురవరం ప్రతాపరెడ్డి
4) కొండా వెంకట రంగారెడ్డి
37. కాకతీయుల కాలంనాటి సాంఘిక పరిస్థితులు, ప్రతాపరుద్రుడి కాలంలోని నర్తకి మాచల్దేవి గురించి వివరాలు అందించే గ్రంథం ఏది?
1) ప్రతాపరుద్ర యశోభూషణం
2) ప్రేమాభిరామం
3) ప్రియాభిరామం 4) క్రీడాభిరామం
38. హైదరాబాద్ అంబేద్కర్‌గా ప్రసిద్ధి చెందింది ఎవరు?
1) భాగ్యరెడ్డి వర్మ 2) బి.ఎస్. వెంకట్రావ్
3) జూలా రంగారావు 4) శ్యాంసుందర్
39. 'హైదరాబాద్ స్వాతంత్ర్య పోరాటం - నా అనుభవాలు, జ్ఞాపకాలు' ఎవరి ఆత్మకథ?
1) రావి నారాయణరెడ్డి
2) స్వామి రామానంద తీర్థ
3) బూర్గుల రామకృష్ణారావు
4) మాడపాటి హనుమంతరావు
40. 'గోల్కొండ' రాజ్యంలో వర్తక వ్యాపారాలకు కేంద్రాలు?
ఎ) ఏలూరు - తివాచీలు
బి) ఓరుగల్లు - రత్న కంబళ్లు
సి) గోల్కొండ - వజ్రాలు
1) ఎ మాత్రమే 2) ఎ, బి మాత్రమే
3) ఎ, బి, సి 4) బి, సి మాత్రమే

సమాధానాలు

1) 1; 2) 4; 3) 2; 4) 4; 5) 3; 6) 2; 7) 1; 8) 4; 9) 2; 10) 2; 11) 4; 12) 4; 13) 1; 14) 2; 15) 1; 16) 1; 17) 2; 18) 3; 19) 3; 20) 1; 21) 3; 22) 3; 23) 3; 24) 4; 25) 1; 26) 1; 27) 1; 28) 2; 29) 3; 30) 1; 31) 4; 32) 3; 33) 2; 34) 1; 35) 4; 36) 3; 37) 4; 38) 2; 39) 2; 40) 3.

రామకేశవ అనే బిరుదున్న శాతవాహన రాజెవరు?

శాతవాహనుల ఆర్థిక విధానం

శాతవాహనుల కాలం నాటి ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. ముఖ్య ఆదాయ వనరు భూమి శిస్తు. పండిన పంటలో 1/6వ వంతు లేదా 18 శాతం భూమి శిస్తు (దేవమేయ) విధించేవారు.

- టాలమి రచించిన 'గైడ్ టు జియోగ్రఫీ', అజ్ఞాత రచయిత రాసిన 'పెరిప్లెస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సి' గ్రంథాల్లో శాతవాహనుల వర్తక, వాణిజ్యాలను వివరించారు. ఈ గ్రంథాల్లో వాడిన పదజాలం..

1. **రజువాహక:** భూమి సర్వే చేసే అధికారి
2. **రజకంబేట:** భూస్వామి
3. **నిష్టి:** సేద్య బానిసలు
4. **ఉదక యంత్రం:** భూమిని దున్నేందుకు ఉపయోగించే సాధనం.
5. **ఘటి యంత్రం:** బావుల నుంచి నీటిని తోడేందుకు ఉపయోగించే సాధనం.

- శాతవాహనులకు అనేక పట్టణాలు, తీరప్రాంతాలు ఉన్నాయని మెగస్తనీస్ తెలిపారు. అద్యాంతిక అనే వర్తక సంఘాలు ప్రముఖ పాత్ర వహించేవని ఇండికా గ్రంథంలో పేర్కొన్నారు.
- ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి కోసం శాతవాహనులు 17 వృత్తి సంఘాలను నెలకొల్పారు. ధాన్యం వ్యాపారులను దమ్మికులని, నూనె వ్యాపారులను తెలపికలని, స్వర్ణకారులను సుహానక అని పిలిచేవారు.
- వృత్తి ఆధారిత ఉపకులాలు కూడా 17 వరకు ఉన్నాయని భట్టిప్రోలు శాసనంలో తెలిపారు. అందులో ముఖ్యమైనవి.

1. **హాలికులు:** సేద్యం చేసే రైతులు
2. **వధకులు:** వడ్రంగులు. వ్యవసాయానికి వాడే పరికరాలు చేసేవారు. వీరికి సమాజంలో గౌరవప్రదమైన స్థానం ఉండేది.
3. **గధికులు :** యోగాచార్యం గ్రంథంలో వీరి ప్రస్తావన ఉంది. ఔషధాలు తయారు చేసేవారు. వీరిని గ్రామాల్లో వైద్యులుగా గుర్తించేవారు. ఆయుర్వేద వైద్యానికి సంబంధించిన మందులు తయారు చేసేవారు.
4. **కొలికులు:** నేతపనివారు. వీరు నేసే వస్త్రాలను 'రోమ్'కు చెందిన రాణులు అమితంగా ఇష్టపడేవారు.
5. **సేలవగదులు:** వీరు శిల్పులు. శాతవాహన కాలంలో వీరికి మంచి గుర్తింపు ఉండేది. రసరత్నాకరం గ్రంథంలో వీరి వివరాలున్నాయి.

- బౌద్ధుల వల్ల ఈ రాజ్యంలో నౌకాకేంద్రాలు అభివృద్ధి చెందాయని హోలెంట్ హోఫ్‌మెన్ జర్మన్ పండితుడు పేర్కొన్నాడు.

రాజులు - వారి బిరుదులు

మొదటి శాతకర్ణి	దక్షిణాపథపతి
యజ్ఞశ్రీ శాతకర్ణి	త్రి సముద్రాధిపతి
రెండో పులోమావి	దక్షిణాపథేశ్వరుడు
గౌతమీపుత్ర శాతకర్ణి	రామకేశవ

ఆర్థికాంశాలు

గుల్మిక	గ్రామపెద్ద
రజవాహక	భూమిని సర్వే చేసే అధికారి
సోపార	ప్రాచీన ఓడరేవు
ఎగుమతులు	సుగంధ ద్రవ్యాలు
ఉషభదాతుడు	యాత్రికులకు, వ్యాపారులకు వసతి కల్పించేవాడు

కవులు - గ్రంథాలు

ఆర్యదేవుడు	చిత్తశుద్ధి
నాగార్జునుడు	దశభూమిక సూత్ర
ఆర్యమంజూశ్రీ	కల్ప సూత్రం

ఇతర అధికారిక పదజాలం

- కటకం: సైన్యాగారం
- స్కందావారం: సైనిక శిబిరం (హతిగుంఫా శాసనంలో ఈ పదం ఉంది)
- గుల్మిక: గ్రామపెద్ద (మ్యాకదోని శాసనంలో ఉంది)
- నిగమ సభ: పట్టణ పాలన (నానాఘాట్, భట్టిప్రోలు శాసనంలో ఉంది)
- గ్రహపతులు: నిగమసభలోని సభ్యులు (ఆదోని శాసనంలో ఉంది)
- మహాతారక: గ్రామ ప్రభువు (గ్రామ పాలకుడు)
- శ్రేణి లేదా గిల్డ్‌లు: బ్యాంకులు
- సార్థవాహనులు: వ్యాపార వర్గం
- త్రప్పగ: విదేశీ నౌకలకు మార్గం చూపే నౌకలు.